ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

# సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

పదవ వార్షిక సంచిక

# ఒక్కటయిన రాజ్యం, పెట్టుబడి: శ్రామికవర్గ పరిస్థితి

*సంచిక : 15* | *తెలుగు & ఇంగ్లీష్* | *మార్చి 2021* | *విరాళం : 25 రూ.*

**విషయసూచిక**


- సంపాదకీయం: సమకాలీన ప్రపంచంలో శ్రమ: శ్రామికులు ఎదుర్కొంటున్న సవాళ్ళు

**భారత రాజ్యం పాత్ర**

- శ్రమ పట్ల మారుతున్న భారత రాజ్య ధృక్పథం అచిన్ చక్రవర్తి
- గ్రామీణ భారతం పయనమెక్కడికి? రాజేశ్వరి ఎస్ రైనా, కేశబ్‌దాస్
- పెట్టుబడిదారీ విధానం–సమ్మిళిత అణచివేత: జాతి, కులం, తెగ, జండర్, వర్గం జన్స్ లర్ష్, అల్పా షా
- వలసలు, అనధికారికత *సుమంగళ దామోదరన్*

***ప్రపంచ విలువ గొలుసులు: శ్రామికులపై ప్రభావం***

- ప్రపంచ ఉత్పత్తి విలువ గొలుసు : శ్రామిక సమస్య *విజయ భాస్కర్*
- అంతర్జాతీయ సరఫరా గొలుసులో పెట్టుబడి సమీకరణ, శ్రామికుల నియంత్రణ *మార్క్ ఆనర్*
- విద్యుచ్ఛక్తి వాహన–సరఫరా గొలుసులలో పని నిర్వహణ *మాధురి సరిపల్లె, విజయ చేబ్రోలు–సుబ్రమణియన్*
- డిజిటల్ రంగంలో కొత్త పుంతలు: పెరుగుతున్న పీస్ వర్క్ ఉమారాణి

***సామాజిక పునరుత్పత్తి, పెట్టుబడి సమీకరణ: సంరక్షణ రంగ కార్మికులు***

- వేతన శ్రమలో తగ్గిపోతున్న మహిళా శ్రామికులు: సామాజిక పునరుత్పత్తి సంక్షోభం సాత్యకి రాయ్
- సంరక్షణ రంగ కార్మికులు, పెట్టుబడి సమీకరణ వ్యూహాలు ప్రవీణ కొడోత్
- ప్రసవిస్తున్న అభద్ర వర్గం: పెట్టుబడికి చేతిలో పరోపకారిత్వం అనిందితా *మజుందార్*

***సామాజిక పునరుత్పత్తి, పెట్టుబడి సమీకరణ: ఆరోగ్య రంగ కార్మికులు***

- ఆరోగ్య రంగంలో శ్రమ, వైవిధ్యం: బాహ్య మరియు అంతర్గత విభేదాలు *రమీలా బిష్త్, షవేత మీనన్*
- ఆశావర్కర్–అందరికీ ఆశాదీపమే, తనకి తాను తప్పు! ఎస్ రామనాథన్, వసుధా చక్రవర్తి
- ఆశావర్కర్లు: పేద మహిళల స్వచ్ఛంధ సేవ ద్వారా భారం తగ్గించుకుంటున్న ప్రభుత్వం  వృందా మార్వా

***అభివృద్ధి ప్రక్రియలో హక్కుల కోసం శ్రామికుల పోరాటాలు***

- క్రమబద్ధమైన అనధికారికత: దుర్గాపూర్ కార్మిక నియమకాలు శ్రీమోయీ ఘోష్
- శక్తిని కోల్పోతున్నాయా? నయా ఉదారవాదంలో కార్మిక సంఘాలు దీపితా చక్రవర్తి
- తమిళనాడులో అనధికారిక కార్మికుల పోరాటాలు: బాధ్యులెవరు? కె కల్పన




*ఫ్యాక్టరీలో కార్మికులు, (ఐ స్టాక్ ఫోటో ట్రాక్5)*

***ప్రత్యేక సంపాదకులు :*** *పద్మిని స్వామినాథన్, ఉమారాణి*
***సంపాదకులు:*** *ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్*
***ప్రచురణ సంస్థ :*** **అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,** 1-2-16/11, బ్లాక్-బి, స్ట్రీట్ నెం.-1, హబ్సిగూడ, హైదరాబాదు-07.

# సంపాదకీయం

# సమకాలీన ప్రపంచంలో శ్రమ: శ్రామికులు ఎదుర్కుంటున్న సవాళ్ళు

**పరిచయం**

2014లో అమిత చాచి 'డెవలప్‌మెంట్ అండ్ చేంజ్' (అభివృద్ధి మరియు మార్పు) అనే అకడమిక్ పత్రికలో ఒక చర్చని ప్రారంభిస్తూ కార్ల్ మార్క్స్ శ్రమ, శ్రామిక ప్రశ్న గురించి చేసిన సూత్రీకరణలో రెండు ముఖ్యమయిన ప్రతిపాదనలని సమకాలీన సందర్భానికి అన్వయించి చూసే ప్రయత్నం చేశారు. మొదటిది, ప్రస్తుత ఉత్పత్తి (ప్రొడక్షన్), పెట్టుబడి సమీకరణ (ఎక్యుములేషన్), సామాజిక పునరుత్పత్తి (సోషల్ రీప్రొడక్షన్) ప్రక్రియల్లో శ్రమ / శ్రామిక శక్తి ఎటువంటి పాత్ర పోషిస్తోంది; రెండవది, పెట్టుబడిదారి వ్యవస్థకి వ్యతిరేక శక్తిగా విముక్తి వైపు తీసుకెళ్లగలిగే సామర్థ్యం శ్రామిక శక్తికింకా మిగిలి ఉందా (పుజీ 899). 20వ శతాబ్దంలో శ్రమ రూపాంతరీకరణ చెందిందనీ, దాని వలన శ్రామిక శక్తికి మానవాళిని విముక్తి చెయ్యగలిగే సామర్థ్యం ప్రశ్నార్థకంగా మారిందనీ వాదించిన కార్ల్ పోలాన్యి రచనలతో ప్రేరణ పొందిన చర్చల సంగతి కూడా తన వ్యాసంలో చాచి ప్రస్తావించారు. ఇవే కాదు, ఉత్పత్తి వ్యవస్థలో వచ్చిన ఫ్రాగ్మెంటేషన్ (ఉత్పత్తి ఒకే చోటకాక అనేక చోట్ల జరగటం) ఫ్లెక్సిబిలైజేషన్ (అంటే సంస్థలు ఉద్యోగుల్ని శాశ్వతంగా తీసుకోకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకోవటం లేదా తీసేయటం ఇష్టమొచ్చిన పని వేళలు కల్పించడం, పనికి ఇంత అని కూలీ ఇవ్వటం) వల్ల వేతనాలు, పనిస్థలాల పరిస్థితుల గురించి పనిస్థలాల్లో బేరసారాలకు, సంప్రదింపులకు పునాది లేకుండా పోయింది. పెట్టుబడిదారుల మధ్య పోటీ పెరిగి పనిని వాళ్ళు ఎక్కడ వేతనాలు తక్కువుంటే అక్కడకి మార్చే విధానం ఊపందుకుంది. వీటన్నిటి మధ్య కార్మికుల వేతనాలు, పని పరిస్థితులు ఇంకా ఇంకా దిగజారే దిశగా పరుగు పందేలు మొదలయ్యాయి.

సమకాలీన పెట్టుబడిదారీ ప్రక్రియల్లో కార్మికులు ఏ స్థాయిలో పని చేస్తున్నారనేది స్పష్టంగా లేదనీ అందువల్ల చరిత్రలో ఇప్పటి వరకూ కార్మికులకు లభించిన పారిశ్రామిక పౌరసత్వం – అంటే కార్మికుల స్థాయి బట్టి వారి సామాజిక హక్కులని కార్మిక చట్టాల ద్వారా వారికి అమర్చటం – ఇప్పుడు అసాధ్యమయిందని పోలాన్యి రచనలను ఇప్పటి సమాజానికి అన్వయించి చూస్తున్న విశ్లేషకులు చెబుతున్నారు. దానివల్ల, ప్రస్తుత సందర్భంలో కార్మిక సమస్యలకి పరిష్కారం, పెట్టుబడి ప్రయోజనాలని ముందుకు తీసుకెళ్లే రాజ్యవ్యవస్థ, కార్మికులకి అప్పుడప్పుడూ సాంఘిక సహాయాన్ని అందించటంతో మాత్రమే సాధ్యపడుతుందని వారి వాదన.

కార్మిక సమస్య గురించి చాచి తన విశ్లేషణలో విశదీకరించిన రెండు పరస్పర విరుద్ధ దృక్పథాల్లో ఇమిడి ఉన్న అనేక విషయాలు, సమస్యలు ఈ సంచికలో కార్మిక సమస్యని తిరిగి చూడటానికి (పునరావలోకించటానికి) మాకు భూమికగా పనికొచ్చాయి. కార్మిక సమస్యని శోధించే పరిశోధనా పద్ధతులనే కాక, అర్థం చేయించే సిద్ధాంత చట్రాలనీ, ప్రాంతం, జండర్, కులం, వర్గం విభేదాలలో వచ్చిన, రాని మార్పులని విశ్లేషించటం దీనికి కీలకం. ఈ సంచికలోని వ్యాసాలని నాలుగు ప్రధాన భాగాల కింద విభజించాము: 1. భారత రాజ్యం, పెట్టుబడి సమీకరణ మరియు శ్రమకి మధ్య గల సంబంధాలు; 2. ప్రపంచ వ్యాప్త మూల్య, విలువల గొలుసులకి, శ్రమకి మధ్య మారుతున్న సంబంధాలు; 3. సామాజిక పునరుత్పత్తికి, పెట్టుబడి సమీకరణకు మధ్య గల సంబంధాలు, ముఖ్యంగా సంరక్షణ, ఆరోగ్య రంగ కార్మికుల విషయంలో; 4. అభివృద్ధి ప్రక్రియలో తమ హక్కుల కోసం కార్మికుల పోరాటాలు. మా ఈ పరిచయ వ్యాసంలో వివిధ వ్యాస కర్తలు చర్చించిన భిన్న విషయాలని, వాటి స్వభావాన్ని నొక్కి చెప్పటమే కాక, ఆయా వ్యాసాల వాదనలు లేవనెత్తే కొత్త ప్రశ్నలని కూడా మీ ముందు పెడతాము. ఇవి భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలకి దారి తీస్తాయని భావిస్తున్నాము.

**1. భారత రాజ్యం, పెట్టుబడి సమీకరణ, శ్రమ**

భారతదేశ పెట్టుబడిదారీ అభివృద్ధి స్వభావంలో ఏ లోపాలు దేశ ఆర్థిక వ్యవస్థలోను, అలాగే శ్రమ నిర్మాణ స్వరూపంలోనూ నిర్మాణాత్మక పరివర్తన తీసుకురాలేక పోవటానికి కారణమయ్యాయి?

2000 సంవత్సరం నుండి ఆర్థిక పెరుగుదల బాగున్నప్పటికీ, క్రమబద్ధమయిన ఉద్యోగాలు తగ్గుతూ వస్తున్నాయి. ఏ రక్షణలేని ఉద్యోగాలు, సంఘటిత, అసంఘటిత రంగాలు రెండిట్లో, బాగా పెరిగాయి. ఈ పరిస్థితి పెరుగుతున్న ఆర్థిక అసమానతకి మరింత తోడ్పడింది. ఆంథోనీ డి కోస్తా మాటల్లో చెప్పాలంటే భారత ఆర్థిక వ్యవస్థ ఒక 'దగ్గరికి నొక్కిన పెట్టుబడిదారీ వ్యవస్థ' (కంప్రెస్డ్), (చరిత్రలో ఆ వ్యవస్థ ఎన్ని దీర్ఘకాలిక మార్పులకి లోనయిందో అవన్నీ త్వరత్వరగా, ఒకదాని పక్కన మరొకటి జరుగుతూ ఉండటం). దీనిలో ఒక పక్క 'ఆదిమ పోగుబడి' (ప్రిమిటివ్ అక్యూములేషన్) ఆగకుండా సాగుతూనే ఉంటుంది; మరోపక్క ప్రపంచ వ్యాప్త పోటీని తట్టుకోవటానికి దేశంలోకి 'శ్రమని తగ్గించే' సాంకేతికతని, అలాగే 'సెజ్ వంటి ఏ నియమాలు అక్కర్లేని ఉత్పత్తి కేంద్రాల' పద్ధతులని దిగుమతి చేసుకోవటం జరుగుతోంది.

ఈ విషయం మీద ఈ సంచికలోని వ్యాసాలు భారత రాజ్య ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి ఎజెండా ఎన్ని రకాల శ్రామిక విధానాలని ఉత్పన్నం చేస్తోందో, వాటి ద్వారా శ్రమ ఎట్లా పెట్టుబడిదారి ఉత్పత్తిలో భాగమవుతోందో పరిశోధిస్తాయి. ఇవి శ్రమలోని వైవిధ్యాన్ని బయటకి తెస్తూనే శ్రమకి, పెట్టుబడికి వున్న వ్యవస్థీకృత సంబంధాల రూపాలపై దృష్టి సారిస్తాయి. ఈ వ్యాసాలు మన ముందుకి తెచ్చే ప్రశ్నలు ఇవి: శ్రామికులని అంచులకి నెట్టేసి, ఏ హక్కులు లేకుండా చేసే ప్రక్రియలో భారత రాజ్య భాగస్వామ్యం ఏ మేరకు వుంది? మన దేశ పారిశ్రామిక రంగంలో అనధికారికత, అసంఘటితత్వం కొనసాగటాన్ని పెట్టుబడిదారీ అభివృద్ధి సరిగ్గా జరక్క పోవటానికి సూచనగా అర్థం చేసుకోవాలా? లేక జరిగిన సఫలీకృత పెట్టుబడిదారీ అభివృద్ధి యొక్క పర్యవసానంగా అర్థం చేసుకోవాలా? ఈ సమస్యల కోసం భారత రాజ్యం ప్రవేశపెట్టిన సంక్షేమ విధానాలు పెట్టుబడిదారీ విధానానికి తన వంతు మద్దతుని కల్పిస్తూనే మరో పక్క కార్మికుల సంఘటిత వ్యక్తీకరణని గొంతెత్తకుండా చేశాయా?

అచిన్ చక్రవర్తి తన వ్యాసంలో ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ "భారత రాజ్యం పాత్ర 'బాధ్యతా యుతమయిన కార్మిక సంఘాలని' (అంటే, కార్మికుల వేతనాల పెంపు మరియు వారి ఇతర సమస్యలని దేశ అభివృద్ధి, ప్రయోజనాల కంటే అప్రధానమయినవిగా పరిగణించేవి) ప్రోత్సహించటం నుండి 'చురుగ్గా శ్రామికుల హక్కులని, అధికారాల్ని తొక్కి పెట్టి', సాంఘిక సంక్షేమ పథకాల్ని పౌరులకు అందచేసేదిగా మారింది' అంటారు. 18వ శతాబ్దపు పెట్టుబడిదారీ దేశాలపై అదనపు శ్రామికుల (సర్‌ప్లస్ లేబర్ అంటే ఆర్థిక రంగంలో వేతనం వున్న పని దొరకని వారు) ని చూసుకోవాల్సిన సంక్షేమ భారం ఉండేది కాదు. వలస పాలనానంతర దేశాలు (పోస్ట్ కొలోనియల్) అదనపు శ్రామికులని ఉత్పత్తి ప్రక్రియలోకి నిర్మాణాత్మకంగా తీసుకురాలేక పోయాయి. దేశంలో ఏ సాంఘిక సంక్షేమ ఏర్పాట్లు లేకపోవటంతో ఈ

శ్రామికులందరూ క్రమబద్ధీకరణ లేని ఆర్థికంలోకి లేదా స్వయం ఉపాధి కార్మికులుగానూ ఆర్థిక రంగంలోకి ప్రవేశించారు.

దేశంలోని శ్రామిక శక్తిలో 92% అసంఘటిత, క్రమబద్దీకరణ చెయ్యని రంగంలో ఉన్నారనే విషయం మనం పరిగణనలోకి తీసుకున్నప్పుడు ఈ విషయాన్ని 'పరిష్కారం వెతకాల్సిన సమస్య'గానో, ఆ శ్రామికుల్ని ఆర్థిక వ్యవస్థ అంచుల్లో వున్న వారిగానో చిత్రీకరించటం సరైందేనా అని రైనా మరియు దాస్ తమ వ్యాసంలో ప్రశ్నిస్తారు. ఇటువంటి చిత్రీకరణ వల్ల రాజ్యం దృష్టిలో అనధికారిక రంగ కార్మికులంటే ఏ నైపుణ్యంలేని వారని, ఆ రంగానికి తనని తాను నడుపుకోవటానికి అవసరమయిన జ్ఞానం ఏ మాత్రం లేదనే భావనలు ప్రబలి పోయినాయి. వ్యాసకర్తల మాటల్లో "అసంఘటిత శ్రమ విధానాలకి, చర్చలకి బయటే ఉండటానికి, అలాగే పెట్టుబడి, శ్రమ, జ్ఞానం మధ్య చలనశీల సంబంధాల్ని కన్పించకుండా చెయ్యటంలో అభివృద్ధి శీల (డెవలప్‌మెంట్ స్టేట్) రాజ్యం, దాని విధానాల బాధ్యత చాలా వుంది. దాని పాత్ర గురించి కష్టమయిన రాజకీయ ప్రశ్నలు లేవనేత్తాల్సిన అవసరం ఎంతయినా వుంది".

'సమాజపు అంచుల' (మార్జిన్స్‌లోకి నెట్టబడిన ప్రజలు) గురించిన మన అవగాహనని లర్ష్, షాల వ్యాసం మూలాల నుండి విడతీసి, దాని లోతుని పెంచుతుంది. పెట్టుబడిదారీ విధానం ప్రపంచ వ్యాప్తంగా సామాజిక విభజనల ద్వారానే విస్తరించిందని, భారత దేశంలో కూడా కులం, తెగ, లింగ విభేదాలని వాడుకుంటూ అది వ్యాప్తి చెందిందని వివరిస్తుంది. వివిధ విభేదాలు కలగలిసి వ్యక్తుల జీవితంలో అనుభవంలోనికి వచ్చే ఈ అణచివేతని వీరు 'కలిసిపోయిన లేదా సమ్మిళిత అణిచివేతగా' (కాంజుగేటెడ్ అప్రెషన్) వర్ణిస్తారు. భారత దేశంలో పెట్టుబడి వలస కార్మికులనే ప్రధానంగా ఉపయోగించు కోవటం, ముఖ్యంగా ఆదివాసీ, దళిత కార్మికుల శ్రమని వాడుకోవడంలో ఉత్పత్తి వ్యయాన్ని తక్కువ చేసే ఉద్దేశమే కాకుండా, దాని ద్వారా స్థానిక శ్రామికుల బలాన్ని కత్తిరించటం, వలస, స్థానిక కార్మికులు కలిసి తమ హక్కుల కోసం పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడకుండా నిలువరించే ఉద్దేశాలు కూడా ఉన్నాయని వివరిస్తారు. అంతేకాక, ఆయా కార్మికులు, వలసదారులయిన కారణంగా స్థానికంగా ప్రభుత్వాలు ఇచ్చే సంక్షేమ ఫలాలని కూడా అందుకోలేరు. కార్మికుల మధ్య విభేదాలకి చాలా పెద్ద చరిత్రే ఉందని చెబుతూ వ్యాసకర్తలు ఇలా అంటారు "ఈ విభేదాలని సూటిగా ఎదిరిస్తూ, అత్యంత అణగారిన వర్గాలకి తమ నిర్ణాయక స్థాయిలో సరయిన ప్రాతినిధ్యం ఇవ్వటం కార్మిక సంస్థల్లో ఇంకా అరుదుగానే జరుగుతోంది".

వలసలు, వలస ప్రజల జీవితాల గురించిన చర్చని ముందుకు తీసుకెళుతూ సుమంగళ దామోదరన్ వ్యాసం గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకి జరుగుతున్న వలసల్లో రెండింటి మధ్య గాఢమయిన సంబంధాలు కొనసాగుతున్న విషయాన్ని ఎత్తి చూపుతుంది. ఢిల్లీలో అనధికారిక ఆర్థికంలోని (ఇన్‌ఫార్మల్ ఎకానమీ) పారిశ్రామిక కార్మికుల జీవితాల గురించి, అలాగే వారికి పని కల్పిస్తున్న పరిశ్రమల గురించి ఆమె సునిశిత పరిశీలనలు ఆర్థిక రంగంలో, వలస కార్మికుల జీవితాల్లో అవి పోషిస్తున్న పాత్రని గుర్తించటానికి భారత రాజ్యం ఎందుకు నిరాకరిస్తోందనే ప్రశ్నని లేవదీస్తాయి. వీటి పట్ల రాజ్యానికుండే నిర్లక్ష్యం క్షేత్ర స్థాయితో ఏ మాత్రం సంబంధం లేని భారత దేశ చిన్న తరహా పరిశ్రమల విధానంలో వ్యక్తమవుతోందని ఆమె అంటారు.

ఎన్ని రకాల శ్రామికులు-క్రమబద్ధ కార్మికులు, తాత్కాలిక కార్మికులు, స్వయం ఉపాధి కార్మికులు, దిన సరి వేతన కార్మికులు, అప్రధాన కార్మికులు, కట్టడిలో వున్న కార్మికులు, స్వేచ్ఛ లేని కార్మికులు – వున్నారు అన్న విషయంపై దృష్టి పెడుతున్న అనేక సమకాలీన పరిశోధనల వలే కాకుండా, ఈ వ్యాసాలు ఆయా శ్రమలకి, పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థతో వున్న సంబంధాల స్వభావాన్ని బయటకి తేవటానికి ప్రయత్నిస్తాయి. ఈ సంబంధాల స్వభావాన్ని స్పష్టంగా వ్యక్తీకరిస్తే తప్ప మనం కార్మిక చట్టాలు, సంఘటిత కార్యక్రమాల ద్వారా శ్రామిక విముక్తిని సాధించవచ్చనే ఒకప్పటి ఎజెండా నుండి ఎంత దూరం కొట్టుకు వచ్చామో అర్థం చేసుకోలేం.

**2. ప్రపంచ వ్యాప్త విలువ గొలుసులు, శ్రామికులు**

ఈ సంచికలోని ప్రపంచ వ్యాప్త విలువ గొలుసులపై వ్యాసాలు – పెట్టుబడికీ, అది శ్రామికులని వినియోగించు కుంటున్న పరిస్థితులకీ మధ్య పెరుగుతున్న వైరుధ్యాన్ని, అలాగే ప్రపంచ పెట్టుబడికీ, స్థానిక పెట్టుబడికీ మధ్య కొనసాగుతున్న అసమాన, ప్రతికూలమయిన సంబంధాలపైన చర్చనీ ముందుకు తీసుకెళ్తాయి. ప్రపంచ వ్యాప్త వస్తు విలువ, ఉత్పత్తి గొలుసులపై జరుగుతున్న అనేక పరిశోధనలు, ఆర్థిక ప్రగతి సాధించిన ప్రపంచ ఉత్తర దేశాల్లో ఉండే కొనుగోలు దారులు, ఆర్థికంగా వెనకున్న ప్రధానంగా దక్షిణాది దేశాల్లో వున్న సరఫరాదారులకి 'సరయిన విధానాలని అవలంభించి, ఈ అంతర్జాతీయ గొలుసుల సంబంధాల్లో పాల్గొని, 'పైకి' ఎగబాకాలని ఏ విధంగా ఉద్బోదిస్తూ వుంటారో వివరంగా బయటకి తెచ్చాయి. ఇలా విలువ గొలుసులో పైకి ఆర్థికంగా ఎగబాకటం ద్వారా శ్రమ, పెట్టుబడి రెండింటికీ లాభం చేకూరుతుందనే భావన చాలా ప్రచారంలోకి వచ్చింది. కానీ ఇటువంటి విలువ గొలుసులకి సంబంధించిన విధాన చర్చలు ఆయా ప్రక్రియలని నడిపించే వర్గ సంబంధాలని, ఒక పారిశ్రామిక గుంపు (క్లస్టర్)లోని కంపెనీల మధ్య, ఆయా గుంపుల మధ్య, కొనుగోలుదారులకి, సరఫరాదారులకి మధ్య వుండే సంబంధాలు, అవి అభివృద్ధి మీద చూపించే ప్రభావాన్ని పూర్తిగా మరుగుపరుస్తాయని ఈ సంచికలోని వ్యాసాలు నిరూపిస్తాయి.

ప్రపంచవ్యాప్త దుస్తుల విలువ గొలుసులలో శ్రామిక సమస్యని పరిశీలించిన విజయభాస్కర్ వీటిల్లో అందరు ఉద్బోధించే 'ఆర్థిక పెంపుదల' జరిగినపట్టికీ, పనిచేసే శ్రామికుల సంక్షేమాన్ని పెంచటానికి అది ఎందుకు సరిపోదో వివరిస్తారు. 'విలువ పెంపుదలలో శ్రామిక వర్గాలకి రావాల్సిన వాటా'ని నిర్ణయించేవి 'కార్మికుల సంఘటిత సంప్రదింపులు, అలాగే ప్రాంతీయ, జాతీయ, సంస్థాగత వ్యవస్థీకృత కార్మిక చట్టాలు, అధికారాలేన' ని ఆయన వాదిస్తారు. ప్రపంచ వ్యాప్త మార్పులతో ప్రభావితమయ్యే దుస్తుల విలువ గొలుసు వల్ల ఒక సెక్టార్‌లోని శ్రామికులు, మరొక సెక్టార్‌లోని శ్రామికులకి వ్యతిరేకంగా, తమ నిమిత్తం లేకుండా పోటీ పడవలసి వస్తుందనీ, దానితో స్థానిక శ్రామికులు విభజింపబడి, అది స్థానిక శ్రామిక మార్కెట్‌ని గాఢంగా, ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందనీ చెప్తారు. ప్రపంచ మార్కెట్ కోసం వస్తువులని తయారు చేయటం, ఉత్పత్తిని నిర్వహించటం, అంతర్జాతీయ రిటైల్ మార్కెట్ పని చేసే ప్రత్యేక తీరు వల్ల కొనుగోలుదారులు, కొనుగోలు చేసే దేశాలకే ఎప్పుడూ పై చెయ్యి ఉంటుంది. అంతేకాక, వారు వస్తు తయారీలో నైతికత గురించి ఎన్ని సూత్రాలు వల్లె వేసినప్పటికీ, తాము కోరుకునే నాణ్యత గల చవక దుస్తుల తయారీ కోసం అవి ఉత్పత్తి చేసే దేశాల్లోని కార్మికుల ఆరోగ్యానికి, అక్కడ పర్యావరణానికి జరిగే నష్టానికి తాము బాధ్యులం కామని తప్పించుకోవటానికి అవకాశం కూడా లభిస్తుంది.

ఈ వాదనల్ని మార్క్ ఆనర్ వ్యాసం మరింత విశదీకరిస్తుంది. బంగ్లాదేశ్, భారత దేశం వంటి దుస్తుల ఎగుమతిలో ముందుండే దేశాల గురించి విస్తృతంగా పరిశోధన చేసిన ఆనర్, ధనిక దేశాల్లోని ద్రవ్య పెట్టుబడి (ఫినాన్సియల్ కాపిటల్) వస్తు సరఫరాదారులని పీల్చి పిప్పి చేస్తే, వాళ్ళు తమ వంతుగా శ్రామికులని పీల్చి పిప్పి చేస్తారని చెప్తూ, దీని వల్ల ప్రపంచ సరఫరా గొలుసులో అట్టడుగున వుండే శ్రామికుల శ్రమ విలువ లాభాల రూపంలో పైపైకి పీల్చబడుతుందని విశ్లేషిస్తారు. ఆనర్ చెప్పేది క్లుప్తంగా చెప్పాలంటే 'పై స్థాయికి అట్టడుగు స్థాయి రాయితీ లిస్తుంది'. భారత దేశం గురించి ఆనర్

***అడ్వయిజరీ బోర్డ్:*** *షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మెల్కొటే, కె.సజయ, సూజీ థారు, వీణా శతృఘ్న, కె.లలిత, గోగు శ్యామల, ఉమ భృగుబండ, మధుమిత సిన్హా, అస్మా రషీద్, కనీజ్ ఫాతీమా.*

***ప్రొడక్షన్:*** *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*

- వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

చెప్పింది ఇక్కడ ప్రాధాన్యత సంతరించుకుంటుంది: 'భారతదేశంలో నేను మాట్లాడిన వస్తు సరఫరాదారులలో 61% మంది తాము కొనుగోలుదారుల ఒత్తిడి భరించలేక ఉత్పత్తి ధర కంటే తక్కువకి సరఫరా చెయ్యటానికి ఒప్పుకున్నామని చెప్పారు'. ఆయా సరఫరాదారులు, కొనుగోలుదారుల నుండి తమకి వచ్చిన వస్తువుల ఆర్డర్లని ఆ ధరకి, ఆ సమయానికి సరఫరా చెయ్యటం కోసం కార్మికులపై విపరీతమయిన వత్తిడి పెట్టి, వారిని సతాయించి, ఇవ్వాల్సిన వేతనం కంటే తక్కువ ఇచ్చి (వారిలో ఎక్కువ మంది స్త్రీలే), అదనపు పని (ఓవర్ టైం) చేయిస్తారు.

దుస్తుల పరిశ్రమకి సంబంధించిన మరొక రెండు ముఖ్యమైన ప్రశ్నలని కూడా ఈ వ్యాసాలు లేవనెత్తుతాయి. ఒకటి, కార్మికుల్ని ఈ ప్రపంచ విలువ గొలుసుల్లోకి లాగే ప్రక్రియలు వారికున్న మార్పు తెచ్చే సామర్థ్యాన్ని ఎలా దెబ్బ తీస్తాయి? రెండు, వారిని ప్రధాన ఉత్పత్తి విభాగానికి రాయితీలు కల్పించేలా ఎలా తయారు చేస్తాయి? ఈ గొలుసులోని అనేక లంకెల్లో (నోడ్) పని చేసే కార్మికులు అట్టడుగు స్థాయిలో వుండటం వల్ల కార్మిక చట్టాల పరిధిలోకి రాకుండా, పూర్తిగా మరుగున పడిపోతారు.

సరఫరా చేసే దేశాల్లోని దుస్తుల పరిశ్రమ నిండా సాధారణంగా దేశం, సమాజం నుండి ఏమీ పొందని కార్మికులు ఉంటే, కొత్తగా రూపుదిద్దుకున్న గిగ్ ఆర్థికం (గిగ్ ఎకానమీ), ఉమారాణి తన వ్యాసంలో నొక్కి చెప్పినట్లు, ఉన్నత విద్య, సాంకేతిక నైపుణ్యం ఉన్న శ్రామికులు, వారు ఇంట్లో నుంచి పీస్‌వర్క్ చేసే (పీస్ రేట్– అంటే పూర్తి చేసిన పని లేదా తయారైన వస్తువుని బట్టి చెల్లింపులు జరగటం) పనితో నిండి ఉంటుంది. వాళ్ళు చేసే రోజువారీ శ్రమ కంటికి కనిపించదు. చేసే పనిపై స్వీయ నియంత్రణ పెట్టుకోవచ్చని, అలాగే ఎంత కష్టపడితే అంత సంపాదించుకోవచ్చని, కావాలంటే ఇంట్లో, లేకుంటే కెఫేలవంటి చోట్ల నుండి కూడా పని చేసుకోవచ్చనే వినసొంపైన నినాదాల కింద దాగి ఉంటుంది. ఈ గిగ్ ఆర్థికం శ్రమ గురించిన చర్చని వ్యక్తుల చుట్టూ తిప్పుతుంది; సామూహిక పోరాటాల నుండి వేరు చేస్తుంది; ఆ పోరాటాలని తక్కువ చేసి చూపిస్తుంది; 'నువ్వు కష్టపడితే సఫలీకృతులవుతావు' అని చాటుతుంది. ఈ చాటింపుల నేపథ్యంలో, మరుగున పడిపోయిన వ్యవస్థీకృత సమస్యల గురించి మనమెలా చర్చించాలి?

కొనుగోలుదారుల చేతుల్లో వుండే ప్రపంచ దుస్తుల విలువల గొలుసులు, గిగ్ ఆర్థికం వంటి విషయాల నుండి పక్కకి జరిగి, సరిపల్లె, సుబ్రమణియంలు రాసిన వ్యాసం ఉత్పత్తిదారుల చేతుల్లో వుండే ప్రపంచ వాహనాల గొలుసు (గ్లోబల్ వెహికల్ చైన్) పైన దృష్టి పెడుతుంది. రాబోతున్న కాలంలో–ఇంజన్‌తో కంబషన్ బేస్డ్ ఇంజన్‌తో పనిచేసే వాహనాల నుండి ఎలక్ట్రిక్ వాహనాలు, కలిసి చేసే ప్రయాణ మార్గాలకు జరగబోయే ఒక అతి పెద్ద మార్పు శ్రామికులని ఏ విధంగా ప్రభావితం చెయ్యబోతోంది? రచయిత్రులు ఇప్పటికే వాహన రంగంలో జరుగుతున్న ఈ వ్యవస్థీకృత మార్పుని, దాని వల్ల రానున్న కాలంలో సాంప్రదాయక సరఫరాదారులపై పడబోతున్న ప్రభావాన్ని వ్యాసంలో చిత్రీకరిస్తారు. ప్రభుత్వ విధానాల ద్వారా మద్దతునిచ్చి సాంప్రదాయిక సరఫరాదారులని రాబోయే మార్పుకు సన్నిద్ధం చెయ్యకపోతే, ఏం పనిలేని వారుగా మారే ప్రమాదం నిజంగా ఉందని హెచ్చరిస్తారు. భాతరదేశ శ్రామికులు ఈ మార్పుతో వెనకబడకుండా ఉండాలంటే, సరయిన విధానాలని తెచ్చి వారిని సాంకేతికంగా సన్నద్ధులని చేయటం తప్ప వేరే మార్గం లేదని అంటారు.

### 3. సామాజిక పునరుత్పత్తి, పెట్టుబడి సమీకరణ: సంరక్షణ రంగ, ఆరోగ్య రంగ కార్మికులు

వేతనం పొందే పని/వేతనం రాని పనుల గురించి, అలాగే ఇళ్లల్లో, పొలాల్లో, కుటుంబ ఆధ్వర్యంలో నడిచే లక్షలాది దుకాణాలు/యూనిట్లలో స్త్రీలు చేసే వేతనం లేని పని, కుటుంబాలని, ఆర్థిక వ్యవస్థలని చౌకగా నడిపించటానికి ఇంధనంగా ఎట్లా పనికొస్తుందనే విషయం గురించి స్త్రీవాదులు (చాలా ఎక్కువగా) పరిశోధనలు చేసి సామాజిక పునరుత్పత్తి పట్ల మన అవగాహనని గణనీయంగా పెంచారు. ఈ వ్యాసం మొదట్లో ఉదహరించిన చాచి వ్యాసంలో, ఆవిడ వేతనం లేని కుటుంబ సంరక్షణ పని (కేర్ వర్క్) గురించి చేసిన వ్యాఖ్య బహుశా మొత్తం ఆర్థిక రంగంలో వేతనాలు లేని పని గురించి అర్థం చేసుకోవటానికి ఉపయోగపడొచ్చు: "1980లలో ఇంటి పనికి వేతనం గురించి జరిగిన చర్చతో పోలిస్తే, ఇప్పటి సంరక్షణ రంగ ఆర్థికం (కేర్ ఎకానమీ) గురించి వచ్చిన అవగాహన సామాజిక పునరుత్పత్తి గురించి మనకి సమగ్ర అవగాహనని అందించే అవకాశం వుంది" (పేజి 911). మరో విధంగా చెప్పాలంటే: ఒక జండర్ వ్యక్తులు ప్రధానంగా వేతనం లేని పని మాత్రమే చేస్తూ ఉండటం, వారిని ఆదాయ మార్గాలపరంగా మాత్రమే కాక, ఉన్నత చదువులు, బయటి పనులు చేసే అవకాశాలు, విశ్రాంతి సమయపరంగా కూడా తీవ్రంగా దెబ్బ కొడుతోంది.

1980లలో జరిగిన చర్చతో పోలిస్తే ఇప్పుడు వేతనాల్లేని పనుల గురించిన మన అవగాహనా విస్తృతి, లోతులని పెంచటానికి అనేక మెరుగయిన మార్గాలు, ప్రమాణాలు అందుబాటులోకి వచ్చాయి. అయితే దీనికి పరిష్కారం మాత్రం కనుచూపు మేరలో కనిపించట్లేదు. శ్రమ గురించి పరిశోధించే ఆర్థిక వేత్తలకీ, స్త్రీవాద ఆర్థిక వేత్తలకీ మధ్య, వేతనం లేని పని, దానికి పెట్టుబడిదారి అభివృద్ధితో వుండే సంబంధాల గురించి చర్చించేటప్పుడు ఎప్పుడూ వుండిన దూరం ఇప్పటికీ తగ్గలేదు. వేతనం లేని/వేతనం తక్కువ ఇచ్చే పనుల సమస్యకి పరిష్కార మార్గాలు పక్కన పెడితే, ఈ సంచికలోని వ్యాసాలు ఇటువంటి శ్రమ – ఇంట్లో జరిగినా, బయట జరిగినా, ప్రపంచ విపణిలో భాగమయినా, స్థానిక విపణిలో పాలుపంచుకున్నా – పెట్టుబడికి నిరంతర సేవ చేసి, దానికి రాయితీలిచ్చే మార్గాల వివరాలని సునిశిత పరిశీలనలతో పాఠకులకి పరిచయం చేస్తాయి.

సాత్యకి రాయ్ తన వ్యాసంలో "స్త్రీలు శ్రమలో పాల్గొనే శాతం (లేబర్ పార్టిసిపేషన్ రేట్) తగ్గటమనేది వ్యవస్థీకృత సమస్య; అది పెట్టుబడి సమీకరణకి, సామాజిక పునరుత్పత్తికి జరుగుతున్న సంఘర్షణ నుండి పుట్టిన సంక్షోభానికి చిహ్నం" అని అర్థం చేయిస్తారు. అది ఎట్లా అర్థం చేసుకోవాలో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం: "ఎవరు వేతనం ఇచ్చే పని చేస్తారు. ఎవరు వేతనం లేని పనిలో మునిగిపోతారు అన్న విషయాన్ని మనం కేవలం ప్రత్యేక ఇంటి స్థాయిలో, అంటే ప్రతి కుటుంబం తమ ఆదాయం, అడ్డంకుల్ని దృష్టిలో పెట్టుకుని తార్కికంగా తమ వ్యక్తిగత స్థాయిలో సముచిత నిర్ణయాలు తీసుకుంటుంది అని అర్థం చేసుకుంటే సరిపోదు. దాన్ని మనం విశాల ప్రక్రియగా అర్థం చేసుకోవాలి: నయా ఉదారవాద హయాంలో పెట్టుబడి సమీకరణ కోసం ఒక పక్క ఉద్యోగ అవకాశాలని తగ్గించి, ఇంకో పక్క సామాజికంగా, సామూహికంగా కల్పించాల్సిన సంరక్షణా ఏర్పాట్లని తగ్గించి, వాటిని ప్రయివేటీకరణ మార్గంలో కుటుంబంపై నెట్టటం వల్ల సామాజిక పునరుత్పత్తి ప్రక్రియలో ఏర్పడే సంక్షోభం, స్త్రీలని బయటి పని నుండి వెనక్కి తగ్గేలా చేస్తుంది".

గృహ కార్మికుల వలసలని అధ్యయనం చేసిన ప్రవీణ కొడోత్ "భారతదేశ వలస విధానం పశ్చిమాసియా, భారత దేశాల్లోని విదేశీ యజమానులు, నియామక ఏజెన్సీలు, ఇతర వ్యాపార సంస్థలతో కుమ్మక్కయ్యి, వారి అవసరాల కోసం పని చేస్తోందని", దాని వల్ల "తమ కుటుంబాల్లో సంరక్షణకు ప్రధాన బాధ్యులయిన ఈ మహిళా కార్మికులు విదేశాలకి వలసవెళ్లి దక్షిణాది అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సంరక్షణ ఏర్పాట్లు ధ్వంసమవు తున్నాయని" మనకి అర్థం చేయిస్తారు. అద్దె గర్భాల వ్యాపారాన్ని నిషేధించి, పరోపకారం కోసం మాత్రమే గర్భం ధరించటానికి అనుమతిస్తూ వచ్చిన కొత్త శాసనాల నేపథ్యంలో కృత్రిమ మాతృత్వంపై అనందితా మజుందార్ రాసిన వ్యాసం, సంరక్షణా రంగంలో మహిళా కార్మికుల గురించి ఒక కొత్త విషయాన్ని చర్చలోకి తెస్తుంది: ఇతరుల కోసం గర్భాలని ధరించే స్త్రీల శ్రమ విలువ ఒక పక్క తక్కువ అవుతున్నప్పటికీ, కృత్రిమ గర్భ పరిశ్రమ మాత్రం బాగా అభివృద్ధి చెందుతోంది.

స్త్రీల శ్రమకి గుర్తింపు, వారి సంపాదన పెరగటానికి క్షేత్ర స్థాయి (సెక్టోరల్) విధానం చాలా అవసరమని ఆర్థికవేత్త మార్టీ చెన్ 1989లో ఎత్తి చూపారు. అనేక అభివృద్ధి చెందే దేశాల్లో ఆర్థిక ప్రగతి కోసం అవలంబించే ప్రధాన స్రవంతి అభివృద్ధి కార్యక్రమాలని, పేదరిక నిర్మూలన కోసం అవలంబించే కార్యక్రమాల నుండి భిన్నంగా రూపొందిస్తారు. ప్రధాన స్రవంతి అభివృద్ధి కార్యక్రమాలని రూపొందించటానికి – వివిధ కార్యకలాపాల్ని ప్రత్యేక ఆర్థిక రంగాలకి కేటాయించి, వాటికి తగినంత బడ్జెట్ని,

ప్రత్యేక మంత్రిత్వ శాఖలు, విభాగాలని కేటాయిస్తారు (పేజి. 1007). ఇటువంటి కీలక రంగాల్లో పనిచేసే స్త్రీలతో కలిసి పని చెయ్యటం ద్వారా స్త్రీలని ఆయా రంగాల కోసం రూపొందించిన సంక్షేమ కార్యక్రమాలతో ముడిపెట్టటమే కాక వారి శ్రమని జాతీయ విధాన రూపకర్తల దృష్టికి తీసుకెళ్ళటానికి వీలవుతుందని ఆవిడ బలంగా వాదించారు. స్త్రీలని తల్లులు, భార్యలు, భర్తపోయిన వాళ్ళు అనే సామాజిక వర్గాల వలే కాక, ఒక ఆర్థిక వర్గంగా అంటే ప్రధానంగా వారిని శ్రామికులుగా తీసుకున్నప్పుడు వారిని ప్రధాన స్రవంతి ప్రభుత్వ విధానాలలో, ఇతర ప్రభుత్వ కార్యకలాపాలలో స్వతంత్ర ప్రతిపత్తి గల ఆర్థిక ఏజెంట్లుగా, ఖాతాదారులుగా పరిగణించే అవకాశం ఏర్పడుతుంది. అలాగే ఆయా రంగాల్లో పని చేసే స్త్రీలని వారు ఎదుర్కునే ఉమ్మడి వ్యవస్థీకృత సమస్యలపైన సమీకరించి, పరిమిత ఆర్థిక లక్ష్యాలతో పాటు వారి సాధికరతని కూడా పెంచే అవకాశం కలుగుతుంది (పై పుస్తకం పే. 1015).

గత మూడు దశాబ్దాలలో ఆర్థిక రంగంలో స్త్రీల పరిస్థితుల్లో జరిగిన మార్పుని ఎత్తి చూపటం కోసం చెన్ వాదనలని ఇక్కడ మేము మళ్ళా వివరంగా చెప్పాము. స్త్రీలు విద్య, ఆరోగ్యం వంటి అనేక కీలక అభివృద్ధి రంగాల్లోకి తీసుకోబడ్డారు. స్త్రీల శ్రమ ఇప్పుడు కేవలం అందరి దృష్టిలోకి రావటమే కాక, ఆయా రంగాలకి వెన్నెముకగా పరిణమించింది. అయితే వారి శ్రమకి లభించిన ఈ గుర్తింపు వల్ల వారి (భౌతిక) పరిస్థితుల్లో మార్పు వచ్చింది కానీ వారి సామాజిక స్థితిలో (శ్రామికులుగా గుర్తింపు, పార్లమెంటు, న్యాయస్థానాలు వంటి నిర్ణయాత్మక అధికారం కేంద్రీకృతమయిన స్థాయిల్లో తగినంత సంఖ్యల్లో ఉండటం) పెద్దగా మార్పు రాలేదు.

ఆరోగ్య రంగ కార్మికుల గురించి ఈ సంచికలో పొందుపరచిన వ్యాసాలు భారత దేశంలో ఆరోగ్య రంగం బాగా అభివృద్ధి చెందిందనీ, అయితే దాని నిర్మాణం, నిర్వహణలో జరిగిన మౌలిక మార్పుల వల్ల రాజ్యం, ప్రయివేటు రంగ ఆరోగ్య సంస్థలు బాగా లాభపడుతున్నాయి తప్ప, ఆరోగ్య సేవలు మాత్రం తీవ్రంగా నష్ట పోతున్నాయనే విషయాన్ని వెలుగులోకి తెస్తాయి. బిస్ట్, మీనన్ తమ వ్యాసంలో ప్రభుత్వ ఆరోగ్య సేవా రంగాన్ని ప్రభుత్వేతర రంగ జోక్యం, దాని మదుపుకి తెరిచిన మార్గం గురించి చర్చిస్తారు. దానిలో భాగంగా ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో, కార్యకలాపాల్లో ప్రభుత్వ-ప్రైయివేటు రంగాల మధ్య భాగస్వామ్యం, ప్రైయివేటు రంగంలో పనిచేసే డాక్టర్లని కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాడుకోవటం, పారామెడికల్ సిబ్బందిని రోజువారీ కార్మికులుగా మార్చటం జరిగాయని చెప్తారు. ప్రభుత్వ ఆరోగ్య రంగానికి అన్ని స్థాయిల్లో ఆర్థిక సహాయం తగ్గినప్పటికీ దానిలో ప్రైయివేటు రంగానికి చోటు కల్పించి, క్రింది స్థాయి ఉద్యోగులు నష్టపోయే మార్పులు జరిగాయి. ఈ వ్యాసం ప్రధానంగా స్త్రీలతో నిండిపోయిన ఈ క్రింది స్థాయి కార్మికుల గురించి వివరంగా చెప్తుంది. 'ఆరోగ్య సేవా రంగంలోని క్రింది స్థాయి అంతా రోజువారి, కాంట్రాక్టు, తాత్కాలిక, సగం రోజు పని చేసే ఆరోగ్య కార్మికులతో నిండి వుంది'. ఇలా అట్టడుగు స్థాయిలో పని చేసే మహిళా ఆరోగ్య కార్మికులలో ముఖ్యమయిన భాగం ఆశా (ఎక్రెడిటేడ్ సోషల్ హెల్త్ యాక్టివిస్టన్స్) కార్మికులు.

రామనాథన్, చక్రవర్తిల వ్యాసం, "ఆరోగ్య వ్యవస్థలో ఆశాల స్థానాన్ని, వారిపై దాని ప్రభావాన్ని, ముఖ్యంగా కోవిడ్ సమయంలో ప్రభావాన్ని గురించి చర్చిస్తుంది; అలాగే, వారిని ఆరోగ్య వ్యవస్థలోకి తీసుకు రావటం వల్ల ఆరోగ్య, పోషక పదార్థాలని అందించే సేవలు ఏ రకంగా ముక్కలయ్యాయో, దాని వల్ల ఆరోగ్య వ్యవస్థలోని ఇతర మహిళా ఆరోగ్య కార్యకర్తల సంప్రదింపుల సామర్థ్యం ఎలా తక్కువయిందో" చర్చిస్తుంది. ఎథ్నోగ్రాఫిక్ పద్ధతిలో మార్చా చేసిన పరిశోధన ఆశాల పనిని ఆరోగ్య విభాగంలో 'స్వచ్ఛంద సేవ'గా (వాలంటరిజం) నిర్వచించటం వల్ల ఆరోగ్య రంగంలో వారి స్థితి 'ఎటూ కానిదిగా మిగిలిపోయిందని' (లిమినాలిటీ) ఎత్తి చూపుతుంది "ఆశాల అస్థిర స్థితిని స్త్రీల 'సహజ సేవా తత్పరత' అనే జండర్ పరమయిన మూస ఆలోచనలో ఇరికించి సమర్థిస్తున్నారు. సమావేశాల్లో వారిని ఆరోగ్య విభాగ వెన్నెముకగా వర్ణిస్తారు. కానీ ఆచరణలో ఇది ఏమాత్రం ప్రతిబింబించదు, పైగా ఈ స్వచ్ఛంద సేవా వాదం వారికి ఆరోగ్య కార్మికులనే గుర్తింపు లేకుండా చేసి, తమ హక్కులని అడిగే అవకాశం లేకుండా చేస్తుంది".

ఈ విషయం గురించిన మూడు వ్యాసాలూ కలిపి భారత రాజ్యం అవలంబించిన చాతుర్య ఆర్థికాన్ని మనకు అర్థం చేయిస్తాయి: స్త్రీలకి క్రమబద్ధమయిన పని కల్పించి వారి సాధికారతని పెంచటం బదులు, వారిని తమ ప్రయోజనాలు త్యాగం చేయించి అభివృద్ధి కోసం పని చేయించటం దీని సారాంశం.

**4. అభివృద్ధి క్రమంలో హక్కుల కోసం శ్రామికుల పోరాటాలు**

ఒక దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడిదారీ అభివృద్ధి నిర్మితమయిన విధానం, ఆ వ్యవస్థలోకి శ్రమ ఇమిడే పద్ధతిని, దానిలో శ్రామికులు పొందే స్థానాన్ని, శాశ్వతం, క్రమబద్ధం, తాత్కాలిక, రోజు కూలి – నిర్ణయిస్తుంది. ఆ స్థానమే శ్రామికులు దేశంలోని పెట్టుబడిని, ఆర్థిక వ్యవస్థనీ తమ భుజాల మీద మోసేటట్లు చెయ్యటమే కాక; ఆ దేశ చట్ట వ్యవస్థ పరిధిలో తమ న్యాయమయిన హక్కుల కోసం పోరాడటానికి అవసరమయ్యే సంఘటిత శక్తి సమీకరణని కూడా ప్రభావితం చేస్తుంది.

శ్రీమోయి ఘోష్ వ్యాసం పారిశ్రామిక రంగ శ్రామికుల నియామకాల్లో 'రాజకీయ కార్మికులపై' – అంటే అధికారంలో వున్న రాజకీయ పార్టీ విధించిన నియమ, నిబంధనల ప్రకారం పరిశ్రమలోకి చేరుతున్న కార్మికులపై దృష్టి సారిస్తుంది. 'అధికారంలో వున్న పార్టీకి, స్థానిక రాజ్య వ్యవస్థకి వుండే సంబంధాలు ఒక కట్టుదిట్టమయిన నిర్మాణాన్ని తయారు చేసి కాపాడుతూ ఉంటాయి. ఉద్యోగాలవసరమయిన స్థానిక శ్రామికులకి, వలస కార్మికులకి ఈ నెట్‌వర్క్ పెట్టే నియమ నిబంధనలు అనుసరించటం తప్ప వేరే మార్గం లేకుండా పోతుంది. మొత్తానికి ఇలా అక్రమంగా చేర్చుకున్న శ్రామికులపై స్వారీ చేసి పోగేసుకున్న రాజకీయ ఆర్థిక పెట్టుబడి అన్నిటినీ నిర్ణయిస్తుంది'.

పశ్చిమ బెంగాల్ నేపథ్యంలో రాసిన దీపిత చక్రవర్తి వ్యాస శీర్షిక 'శక్తిని కోల్పోతున్నాయా? లేక ప్రాసంగికతనా? నయా ఉదారవాదంలో కార్మిక సంఘాలు' వ్యాసం లోని విషయాన్ని తేట తెల్లం చేస్తుంది. సిపిఐ(ఎం) హయాంలో ప్రారంభమయిన కార్మిక సంఘాల పతనం త్రిణమూల్ ప్రభుత్వ కాలంలో కొనసాగటాన్ని ఈ వ్యాసం చర్చిస్తుంది. దీని ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే కార్మిక సంఘాలు శ్రామికుల మీద తమ పట్టు సాధించుకోవటానికి ప్రభుత్వంలో వున్న పార్టీలతో కుమ్మక్కవటం వల్ల, శ్రామికులకు మాత్రమే కాక ఆ రాష్ట్రానికి కూడా తీవ్ర నష్టం జరిగిందనీ, పారిశ్రామిక పెట్టుబడులు రాబట్టడంలో కూడా ఆ రాష్ట్రం విఫలమైందని.

దీనికి విరుద్ధంగా కె.కల్పన రాసిన వ్యాసం "ఆర్థికంగా ఏ శక్తిలేని కార్మికులు తమ హక్కులని, ప్రయోజనాలని కాపాడుకోవటానికి ఏ రకంగా ముందుకెళ్లారో" చర్చిస్తుంది. ఈ వ్యాసం తమిళనాడులోని రెండు


**కృతజ్ఞతలు**

ఈ బ్రాడ్‌షీట్ సంచికని ఎడిట్ చేయమని మమ్మల్ని ఆహ్వానించినందుకు, రచయితలని ఎంచుకోవటంలో మాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినందుకు శ్రీవత్స్, సునీతలకి కృతజ్ఞతలు. ఈ సంచిక కోసం వ్యాసాలని రాసిన రచయితలందరికీ అడగ్గానే ఒప్పుకున్నందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. ఈ రచనలు స్థానిక, అంతర్జాతీయ స్థాయిల్లో శ్రమ సంబంధాలు, ప్రక్రియల గురించిన మా అవగాహనని మెరుగుపరచాయి. అన్ని వ్యాసాలని జాగ్రత్తగా చదివి, శ్రద్ధ, నైపుణ్యంతో వాటిని ఎడిట్ చేసినందుకు కూడా మేము శ్రీవత్స్, సునీతలకు మేం కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. ఈ మొత్తం ప్రక్రియలో వీరితో, అన్వేషితో పని చేయటం మాకు చాలా సంతోషం కలిగించిన విషయం.

**ప్రొ. పద్మిని స్వామినాథన్, డా. ఉమారాణి**

వృత్తిదారుల సమూహాలు చేసిన పోరాటాల గురించి వివరిస్తుంది. రెండూ కూడా సబ్ కాంట్రాక్టింగ్ పద్ధతిలో, అంటే కాంట్రాక్టర్లు తమ ఖర్చులని తగ్గించుకుని, ఏ బాధ్యతా తీసుకోకుండా పని రాబట్టే పద్ధతి ద్వారా, పనిని పొందే సమూహాలు. సంఘటిత పోరాటం ద్వారా వారు కొన్ని సదుపాయాలు పొందినప్పటికీ, క్రమబద్ధం కాని శ్రామికుల భవిష్యత్తు కష్టాలతో నిండి ఉండబోతోందని ఈ వ్యాసం చెబుతుంది. ఎందుకంటే, 'పెట్టుబడితో స్పష్టంగా కుమ్మక్కయిన రాజ్యం అది అన్యాయమయిన నిబంధనలతో శ్రామికులని ఉత్పత్తి సంబంధాలలోకి తీసుకోవటాన్ని ఎక్కడా తిరస్కరించట్లేదు, ఎదుర్కోవడం లేదు'.


ఈ వ్యాసాలన్నీ కలిపి పెట్టుబడిదారీ అభివృద్ధి శ్రామికుల మీద ఆపకుండా జరుపుతున్న వ్యవస్థీకృత హింసని స్పష్టం చేస్తాయి. ఒక పక్క రాజ్యం, కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి నిర్వహించే 'క్రమబద్ధీకరణ లేనితనం' అత్యధిక కార్మికులకి (వీరిలో స్త్రీలు ఎక్కువ), కార్మికులన్న గుర్తింపు లేకుండా చేసి వారికి ఏ సాధికార హక్కులూ లభించకుండా చేస్తోంది; ఇంకోపక్క (వెంచర్, ఫైనాన్స్) పెట్టుబడి భౌగోళికంగా, క్షేత్ర స్థాయిలో పునర్నిర్మాణానికి గురయ్యి, అతి వేగంగా ఫ్యాక్టరీల నుండి దూరమవుతోంది. దీని పర్యవసానంగా, ప్రస్తుత సందర్భంలో శ్రామికులు చేసే శ్రమ చాలా వరకు వివిధ పరిస్థితుల్లో, అనేక ప్రపంచ వ్యాప్త ఏజెన్సీల కోసం, కంటికి కన్పించకుండా లేదా అంతర్జాల వేదికల మీద చేసేదిగా పరిణమిస్తోంది. అయితే ఈ రెండు రకాల శ్రమకి అత్యవసరంగా సమాధానాలు కావాల్సిన ప్రశ్నలు మాత్రం ఒకటే: యజమాని ఎవరు? ఉద్యోగాల నియమ, నిబంధనలు ఏవి? పని స్థలాల్లో సమస్యల పరిష్కారం కోసం శ్రామికులు తమ వ్యక్తిగత స్థాయిలోగానీ లేదా సమూహంగాగానీ బలంగా అడగగలిగే శక్తిని పెంచుకోవడానికి ఎటువంటి రాజకీయ సామర్థ్యాన్ని, స్థలాన్ని లేదా స్థానాన్ని ఏర్పరుచుకోవాలి?


అనువాదం: **ఎ సునీత**

**ఎ సునీత** అన్వేషి రీసెర్చ్ సెంటర్ ఫర్ వుమెన్స్ స్టడీస్‌లో సీనియర్ ఫెలో

**పద్మిని స్వామినాథన్** మద్రాసు ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్, చెన్నయికి డైరెక్టర్‌గా, టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, సెంటర్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా పని చేసారు.
ఈ మెయిల్ pads8484@gmail.com

**ఉమారాణి** జెనీవాలోని ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్‌లో రిసెర్చ్ డిపార్టమెంట్‌లో సీనియర్ ఎకానమిస్టుగాఉన్నారు.
ఈ మెయిల్ amara@ilo.org



# బలహీన కార్మిక వర్గం, బలపడుతున్న సాంఘిక సంక్షేమం: శ్రమ పట్ల మారుతున్న భారత రాజ్య దృక్పథం

■ అచిన్ చక్రవర్తి

**భారతదేశంలో** శ్రామికులపై విధాన చర్చ అంతా శ్రామిక (లేబర్) మార్కెట్ 'మార్పుకు వీలు లేకుండా బిగదీసుకు పోయి, వున్నదనే అంశంపైనే కేంద్రీకరించింది. కానీ వాస్తవ పరిస్థితులని చూసినపుడు, భారతీయ శ్రామిక మార్కెట్ సంస్కరణలను తీసుకువస్తే గణనీయమైన ఆర్థిక ప్రయోజనాలను సాధించవచ్చు అని చెప్పటం తప్పే అవుతుంది. నేను దీన్ని నిరూపించటానికి గతంలో రాసిన వ్యాసంలో (చక్రవర్తి, 2015) "నిరర్థక సిద్ధాంతాన్ని" (ఫ్యుటిలిటీ హైపోథిసిస్) ప్రతిపాదించాను. మరి ఆశించిన ఆర్థిక ప్రయోజనాలకు సరైన పునాదులే లేనప్పుడు, రాజ్యం శ్రామిక మార్కెటుని 'మార్పుకి అనువుగా' (ఫ్లెక్సిబుల్) చేయటానికి కార్మిక చట్టాలను ఎందుకు నీరుగారుస్తున్నట్లు? ఈ రాజకీయ ఆర్థిక ప్రశ్నకు సాధారణంగా, పెరిగిపోతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో, సంఘటిత కార్మిక వర్గం (ఆర్గనైజ్డ్ లేబర్) పోరాడి సాధించుకున్న ప్రయోజనాలను లాగేసుకోవటానికి జాతి రాజ్యాలు (నేషన్ స్టేట్స్) పోటీపడుతున్నాయి, అనే జవాబు లభిస్తుంది. అవి సంఘటిత కార్మిక వర్గ స్థాయిని అసంఘటిత కార్మక వర్గ దుస్థితికి దిగజార్చటానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నాయి కానీ, ఇలా చేయటం తప్పదని, రాజ్యం అదుపులో లేని శక్తుల వల్ల అది బలవంతంగా జరుగుతున్న అనివార్యమైన పరిణామం అనే అర్థం దీనిలో ధ్వనిస్తుంది. పెట్టుబడి అంతర్జాతీయంగా చురుగ్గా వుండి, కార్మికులు సాపేక్షంగా కదలిక లేకుండా వున్న స్థితిలో, కార్మికులకి పెట్టుబడితో బేరసారాలు ఆడే శక్తి తగ్గుతుంది. ప్రభుత్వం 'పెట్టుబడికి అనుకూల' సంకేతాన్ని ఇచ్చేందుకు కార్మిక వర్గాన్ని అదుపుచేయటమనే సులభమైన మార్గాన్ని ఎంచుకుంటుంది (చక్రవర్తి తదితరులు, 2019). అయితే, దీనికి కొంత విరుద్ధంగా, సంఘటిత కార్మిక వర్గాన్ని "మార్పుకి అనువుగా" చేసే ప్రయత్నంతోపాటు, కార్మికులు, ఇతర 'పౌరుల' సంక్షేమాన్ని మెరుగుపరిచే అనేక చట్టాలను కూడా రాజ్యం తీసుకొస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ వ్యాసంలో ప్రధాన స్రవంతి ఇష్టంగా చర్చించే 'బిగదీసుకుపోయిన శ్రామిక మార్కెట్' సమస్యను పక్కనపెట్టి, రాజకీయార్థిక ప్రశ్నను వివరంగా చర్చిస్తాను. కార్మిక వర్గ రాజకీయ బలానికి, రాజ్యం అవలంబించే సంక్షేమ ధోరణికి మధ్య నున్న సంబంధాన్ని ఎలా అర్థం చేసుకోవాలనే విస్తృత నేపథ్యంలో చర్చని కొనసాగిస్తాను.

ఈ క్రింద పేర్కొన్న రెండు చారిత్రక ప్రక్రియల నేపథ్యంలో భారతరాజ్యం గురించి ఒక దృక్పధాన్ని వివరించటమే ఇక్కడ నాఉద్దేశం: 1) ఒకవైపు 'బాధ్యతాయుత ట్రేడ్ యూనియనిజాన్ని' ప్రోత్సహించటం నుండి, కార్మికుల హక్కులను, ప్రయోజనాలను కుదించే వైపు భారతరాజ్యం యొక్క మారుతున్న పాత్ర: 2) మరొకవైపు పౌరులకు అందించే సంక్షేమ చర్యలను విస్తృతం చేయ్యటం. కార్మికవర్గానికి పెట్టుబడిదారులతో బేరమాడే శక్తి తగ్గిపోవటం, భారత రాజ్యం తెచ్చే సంక్షేమ చర్యలు రెండూ కలగలిపి, ఒక విశాల దృష్టితో జరుగుతున్న పరిణామాలని అర్థం చేసుకోవటానికి ఇప్పటివరకు జరిగిన ప్రయత్నాలు చాలా తక్కువ.

**బలమైన కార్మిక సంఘాలు, సామాజిక సంక్షేమం: అందుబాటులో ఉన్న ఆదర్శ నమూనా (నార్మెటివ్ మోడల్)**

ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత కాలంలోనూ, అభివృద్ధి చెందిన పారిశ్రామిక పెట్టుబడిదారీ దేశాలలో, పారిశ్రామిక కార్మిక వర్గ బలానికి, సోషల్ డెమోక్రటిక్ సంక్షేమ రాజ్య పరిపాలన పెరగటానికి మధ్య సంబంధం ఉన్నట్లు చూడవచ్చు. అక్కడి కార్మిక సంఘాలు కేంద్రీకృతంగా, సమన్వయంతో పనిచేస్తూ, కార్మిక వర్గపునాది గల రాజకీయ పార్టీల ద్వారా, ప్రజాస్వామిక రాజకీయ ప్రక్రియను ప్రభావితం చేయటానికి కృషి చేసాయి. ఆ పార్టీలు ఎన్నికల ద్వారా అధికారంలోకి వచ్చి ప్రభుత్వానికి అందుబాటులో ఉన్న సంక్షేమ దృష్టి గల విధానాలను అమలుచేసాయి. 1930లలో తలెత్తి సామాజిక సంక్షేమం కోసం, అందరికీ ఉపాధి కల్పించటానికి, అత్యధిక స్థాయిలో ఖర్చు చేసిన స్వీడన్ దేశ సోషల్ డెమోక్రసీ నమూనా గురించి అందరూ ఒక ఆదర్శంగా చెప్పుకుంటారు (ఎస్పింగ్ ఆండర్సన్, 1990). దీనినే ఇంకో కోణం నుండి చూసినప్పుడు తర్వాతి కాలంలో 'ప్రభుత్వ ఉపసంహరణ' (స్టేట్ విత్‌డ్రాల్) జరిగిన దేశాలలో కార్మిక వర్గం బలహీన పడటం కూడా తెలిసిందే.

మన దేశంలో కూడా ఇటువంటి లంకెను చూడగలమా? 1980ల తరువాత మన దేశంలో కూడా భారత రాజ్యానికి, సంక్షేమ హక్కులతో మారుతున్న సంబంధాలని ఈ రకంగా వివరించ గలమా? ప్రత్యేకించి ఈ శతాబ్దపు మొదటి దశకంలో ప్రవేశపెట్టిన విద్యా హక్కు మొదలైన హక్కుల్లో మారుతున్న రాజ్య దిశానుకూలతని చూడవచ్చా?

భారతదేశంలో సంఘటిత కార్మిక వర్గం నిజానికి ప్రధాన రాజకీయ పార్టీలకు అనుబంధంగా వుండే అధికారిక సంఘాలలోనే సమన్వయ పరచబడి ఉంది. సంఘటితపడిన కార్మికులు, వలస పాలనానంతర కాలంలో (పోస్టు కొలోనియల్), వరుసగా అమలులోకి వచ్చిన అనేక చట్టాల ద్వారా ప్రజాస్వామిక హక్కులను పొందారు. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇది అంత ఎక్కువగా జరగలేదు. అయితే భారతదేశంలో ఎన్నికల రాజకీయ ప్రక్రియలో కార్మిక వర్గ ప్రయోజనాలకు ఎంతమేరకు ప్రాతినిధ్యం లభించింది అనే ప్రశ్నకి స్పష్టమయిన జవాబు లేదు. దానికి తోడు దేశంలో కొంత కాలంగా సంఘటిత కార్మికులు బలహీనపడుతున్న చిహ్నాలు బలంగా కనిపిస్తున్నాయి. ఈ సందర్భంలోనే, యూరప్ దేశాలకి భిన్నంగా, రాజ్యం యొక్క సంక్షేమ పక్షపాతం (పరిమితంగానే అయినప్పటికీ), బలహీనపడిన సంఘటిత కార్మిక వర్గం ఒకేసారి ఉనికిలో వుండే అవకాశం భారతదేశ విషయంలో కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నది.

ఆసక్తికరంగా, సోషల్ డెమోక్రసీని కార్మికవర్గ బలంతో ముడిపెట్టే ఇదే రకమైన వాదన పశ్చిమ బెంగాల్లో వామపక్ష పార్టీల కూటమి అధికారంలోకి వచ్చినప్పుడు వినిపించింది. కూటమికి నాయకత్వం వహిస్తున్న సిపిఐ(ఎం) పార్టీ తనను తాను సోషల్ డెమోక్రటిక్ పార్టీగా అధికారికంగా ఎన్నడూ ప్రకటించుకోనప్పటికీ ఈ విధంగా పోల్చటం జరిగింది.

2011లో అంతమైన ఈ సుదీర్ఘకాల పాలన మొదట్లో రాష్ట్ర ప్రభుత్వం తన విధానపరమైన చర్యలలో కార్మికవర్గ అనుకూల వైఖరిని తీసుకోవటం నిజమే. అయితే ఆ ప్రభుత్వం అలంకారికంగా వల్లించే మార్క్సిస్టు సిద్ధాంతాలకు, ఆచరణలో మధ్య తరగతి ప్రయోజనాలను రక్షించే చర్యలు తీసుకోవటానికీ (నాయకత్వంలో మధ్య తరగతి ఆధిపత్యం ఉండటం దీనికి కారణం కావచ్చు) మధ్య వైరుధ్యం పెరిగిపోతూ పోయి, అది పేద అసంఘటిత కార్మికుల మద్దతును కోల్పోవటానికి దారి తీసింది. జీతాలు పొందే మధ్య తరగతి కార్మిక వర్గంలో ఒక భాగం సమృద్ధి సాధిస్తుండగా, పేద కార్మిక వర్గం హక్కులు, అధికారాలను పొందలేక పోయింది.

సమాఖ్య రిపబ్లిక్ వ్యవస్థలో, ఒక రాష్ట్రంలో అధికారాన్ని నిలబెట్టుకునే తక్షణ లక్ష్యానికీ, సోషలిజమనే సర్వ శ్రేష్ఠ లక్ష్యానికీ మధ్య ఉండే వైరుధ్యం వల్ల ఏర్పడిన పర్యవసానమే ఇది. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి వర్గ ప్రయోజనాలతో రాజీపడాల్సి వచ్చి, వామపక్ష కూటమి తన విధానాలు, పథకాలలో సంక్షేమ రాజ్య దిశ నుండి క్రమంగా పక్కకు కొట్టుకు పోయింది. దీనికి భిన్నంగా, కేరళ రాష్ట్రంలో శ్రామిక మార్కెట్‌లో సంఘటిత రంగానికి చెందిన వారితో సహా విస్తృత సెక్షన్ల కార్మికులు మెరుగైన పని పరిస్థితులు, సామాజిక భద్రత, ప్రయోజనాలను అందుకున్నారు. పటిష్టంగా రూపొందిన సామాజిక భద్రతా (సోషల్ సెక్యూరిటీ) వ్యవస్థను విజయవంతంగా అమలు చేయడం అనేది, అనుకూల రాజకీయ వ్యవస్థ ఉనికిలో ఉండి, ప్రభుత్వానికీ, పౌర బృందాలకూ మధ్య పరస్పర సంబంధాలు బలోపేతం అయినపుడు జరుగుతుంది. ఈ సంబంధాలు అనేక రూపాలను తీసుకోవచ్చు. సామాజిక శాస్త్రవేత్తలు 'ఎంబెడెడ్నెస్" (హెల్లర్, 1996) అంటే 'పొందుపరచబడటం' అని పిలిచే వ్యవస్థపై అది ఆధారపడుతుంది. కేరళలో అటువంటి వ్యవస్థలు, సంబంధాలు ఉనికిలో ఉండటం చేత అక్కడ సామాజిక భద్రత ఒక రాజకీయ హక్కుగా, పౌరుల అధికారంగా విస్తృత అర్థంలో అమలులో వుంది.

సామాజిక భద్రత కోసం డిమాండు పెరుగుతున్నప్పుడు సాంప్రదాయం, రాజకీయాలు దానికి విరుద్ధంగా వెళ్ళటానికి అవకాశం తక్కువగా ఉంటుంది. అయితే ఇతర రాష్ట్రాలలో అది పోషణ సాధనంగా (పేట్రొనేజ్ ఇన్స్ట్రుమెంట్) దిగజార్చబడి ఉండవచ్చు. అలాగే, అనుకూలమైన రాజకీయ వ్యవస్థ లేనప్పుడు ఎటువంటి చట్టాలను తెచ్చినా, వాటి అమలులో వెనుకడుగు వేయటం జరుగుతుంది.

**భారతదేశంలో నేడు సామాజిక సంక్షేమం, కార్మిక సంఘాలు**

రాష్ట్రాల మధ్య తేడాలున్నప్పటికీ, ప్రత్యేకించి సంక్షేమ హక్కులు, సామాజిక భద్రత, కార్మికుల హక్కుల దిశలో భారతదేశంలో జరిగిన మార్పులు పశ్చిమ దేశాల సోషల్ డెమొక్రటిక్ నమూనాతో పోల్చినప్పుడు, ఒక భిన్నమైన తోవని తీసుకున్నాయి.

భారతదేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు గతంలో తమ ఎన్నికల వాహికలుగా పని చేయటం కోసం, రాజకీయంగా శక్తివంతమైన కార్మిక సంఘాలను నెలకొల్పటానికి అనుకూలంగా ఉండేవి. భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ (ఐఎన్‌సి) కి అనుబంధంగా వున్న జాతీయ కార్మిక సంఘాల సమాఖ్యను ప్రారంభంలో ఎన్నికలు బలోపేతం చేశాయి. అయితే ఐఎన్‌సి అనుబంధ కార్మికసంఘాలు హాస్యాస్పదంగా (దురదృష్టవశాత్తు) 'బాధ్యతాయుత కార్మిక సంఘ రాజకీయాలు' అనే తత్వాన్ని అవలంబించాయి, అంటే 'తక్షణ వేతనాల పెరుగుదల వంటి ప్రయోజనాలను దేశ అభివృద్ధికి లోబడి ఉంచాలి' అని అర్థం (మెహతా, 1957). మరొక మాటలో చెప్పాలంటే కార్మిక వర్గ ప్రయోజనాలు వలస పాలనాంతర అభివృద్ధి, జాతి నిర్మాణ ఆకాంక్షలకు లోబడి ఉండాలి అని ఆశించటం జరిగింది.

భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో వ్యవస్థీకృత నిర్మాణ పరిస్థితులు కార్మిక వర్గానికి ఏనాడూ అనుకూలంగా లేవు. సంఘటిత, అసంఘటిత రంగాలు అనే ద్వంద్వత్వం కొనసాగుతూ, సంఘటిత రంగం శ్రమ శక్తిలోని ఒక భాగాన్ని మాత్రమే ఇముడ్చుకోగలగటం, పెద్ద నిరుద్యోగ సైన్యం, తక్కువ వేతనాలు పొందుతున్న అర్థ నిరుద్యోగ సైన్యం ఉనికిలో వుండటం, పట్టణ పారిశ్రామిక కార్మికులు వలస వచ్చిన వారవ్వటం, ఇవన్నీ పెట్టుబడితో తలపడినపుడు కార్మిక వర్గ బలహీనతలకు తోడవుతాయి. ఈ దుర్బల స్థితికి కారణమైన వ్యవస్థీకృత పరిస్థితులను, శ్రమ-పెట్టుబడి మధ్య సంబంధాలను నియంత్రించే సంస్థాగత మార్గాల ద్వారా తగ్గించవచ్చు (చిబ్బర్, 2005). అయితే వాణిజ్య సంస్కరణల అనుకూల వాతావరణంలో అటువంటి మార్గాలు మళ్ళీ మళ్ళీ అణగదొక్కబడ్డాయి. ఫలితంగా చాలా సంవత్సరాలు మనేసర్లోని మారుతీ సుజుకి ఫ్యాక్టరీ, హోండా మోటార్ సైకిల్ స్కూటర్ ఫ్యాక్టరీలలోనూ, ఇతర చోట్ల కూడా పెద్ద ఎత్తున హింసాత్మక సంఘటనలు జరిగాయి. ఆ సంఘటనలు, కార్మికులకు, మేనేజిమెంటుకు మధ్య తగాదాలను పరిష్కరించి, సామరస్యపూర్వక ఒప్పందాలు చేసుకోవటానికి సమిష్టిగా బేరమాడే పరిస్థితిని కల్పించే విషయంలో కార్మిక సంస్థల వైఫల్యాన్ని సూచిస్తాయి.

ఒకవైపు సంఘటిత రంగ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను, అధికారాలను కోల్పోతుండగా, అందుకు విరుద్ధంగా ఈ శతాబ్దపు మొదటి దశకంలో సాంఘిక సంక్షేమ హక్కులు పెరగటం, సామాజిక భద్రతా పథకాలను విస్తరించటం జరిగింది. వ్యక్తుల ప్రవర్తనపైన, సామాజిక సమీకరణాలపైనా, న్యాయ సాధ్యమైన దావాలు వేయటానికి పౌరులకు వీలు కల్పిస్తున్నామని చెపుతూ, అనేక చట్టాలు వచ్చాయి. ఈ చట్టాలలో పొందు పరిచిన హక్కుల భాష కేవలం కార్మికులకే గాక పౌరులందరికీ రాజ్యం, వ్యక్తుల ప్రవర్తనపై దావాలు వేసే హక్కును ఇస్తుంది. ఇది అంతకుముందు 'లక్ష్యాలు' (టార్గెట్లు), 'లబ్దిదారులు' (బెనిఫిషియరీస్) చుట్టు జరిగిన అధికారిక చర్చ నుండీ; పైనుండి రుద్దబడే (పాటర్నలిస్టిక్) ధోరణి నుండి అధికారాన్ని కింద వరకు సంక్రమింపజేసే; డిమాండ్ల ఆధారంగా జరిగే ప్రక్రియకు మార్పులా కన్పిస్తోంది. కింద నుండి వచ్చే హక్కుల ఆధారిత దృక్పథానికి వున్న బలాన్ని కాదనలేం కానీ కేవలం నైతిక వాదనను ముందుకు తేవటం వల్ల ఇటువంటి ఆదర్శ నమూనాలని అమలులోకి తేవటానికి అవసరమైన రాజకీయ హామీ ఏర్పడదు. సమాచార హక్కు చట్టం 2005, మహాత్మ గాంధీ జాతీయగ్రామీణ ఉపాధి హామీచట్టం 2005, పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009. జాతీయ ఆహార భద్రత చట్టం 2013 వంటి ముఖ్యమైన చట్టాలు వచ్చిన నేపథ్యంలో ఇటువంటి ఆదర్శ చట్టాలకీ (నార్మెటివ్ మోడల్స్), రాజకీయాలకీ ఉండే సంక్లిష్ట సంబంధాలని అర్థం చేసుకోగలిగే సందర్భం ఏర్పడింది (చక్రవర్తి, 2019).

2014లో ప్రభుత్వం మారినప్పటి నుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పట్ల ప్రభుత్వ వైఖరిలో తరచుగా జరుగుతున్న మార్పుల వెనుక రాజకీయాల పాత్ర చాల వుంది. మొదటి రెండు సంవత్సరాలు రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం, నిధులను పంపిణీ చేయటంలో జాప్యం జరిగి ఆ తర్వాత, ఆ పథకం 10వ వార్షికోత్సవం సందర్భంగా దానికి గర్వకారణమైన స్థానం ఇవ్వటం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని 'జాతికి గర్వకారణమైన, పండుగలా జరుపుకోవాల్సిన' కార్యక్రమంగా ప్రకటించింది. 2016-2017 సంవత్సరానికి ఆ పథకానికి నిధుల కేటాయింపు గణనీయంగా పెరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం అమలు విషయంలో ఎన్‌డిఏ కంటే యుపిఏ ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపింది అని అనటం తేలికే గానీ అది సరైనది కాదు. ఈ రెండు ప్రభుత్వాలు ఆ పథకం పట్ల అనుసరించిన వైఖరులలో ముఖ్యమైన తేడాలున్నప్పటికీ, యుపిఏ పాలనలోని ఆఖరి రెండు సంవత్సరాలలో ప్రత్యక్ష నగదు బదిలీ పట్ల కనబరిచిన ఉత్సాహం, గ్రామీణ ఉపాధి హామీ పథకం పట్ల కనిపించలేదు. ప్రభుత్వం దానిని గతంలో ఇచ్చిన గర్వకారణమైన స్థానం నుండి కొంత పక్కకు తొలగించింది. 2011-12 సంవత్సరాలలో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు, పని దినాలు రెండూ తగ్గాయి. 2012-13లో అవి కొంత పెరిగాయి కానీ 2010-11 స్థాయి కంటే తక్కువగానే ఉండిపోయాయి.యుపిఏ పాలన మీద సరిగ్గా పనిచేయటంలేదనీ, అవినీతి పెరిగిందనే ఆరోపణలు వచ్చి ప్రజాదరణ తగ్గటంతో, దాని నాయకులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు వల్ల తగినంత రాజకీయ లబ్ది చేకూరదేమోనన్న సందేహాలు తలెత్తాయి. ఆ సంక్షోభాన్నుండి గట్టెక్కటానికి ప్రత్యక్ష నగదు బదిలీ ఆలోచన లాభకరంగా ఉంటుందని భావించారు. ఒకవైపు జనాకర్షక పోటీ రాజకీయాలు, (పాపులిస్టు, కాంపిటీటివ్ పాలిటిక్స్) మరొకవైపు నైతిక సూత్రాలపై ఆధారపడే ఆదర్శ చట్టాలు ఒకే ఒరలో ఇమడక పోవచ్చు అని గ్రామీణ ఉపాధి హామీ పథకం విషయంలో జరిగిన హెచ్చుతగ్గుల పరిణామాలు సూచిస్తాయి. అయితే, అలా ఇమిడినప్పుడు మాత్రం, విధానాలు, పథకాలు ప్రభుత్వాలు మారినప్పటికీ మనగలుగుతాయి.

భారతదేశ అభివృద్ధి గురించిన చర్చల్లో సంక్షేమ హక్కులు పెరగటాన్ని కార్ల్ పోలాన్యి ప్రతిపాదించిన 'డబుల్ మూవ్‌మెంట్ (జోడు కదలికలు)' గా చూడవచ్చు. పోలాన్యి ఈ భావనను, 19వ శతాబ్దం చివర, 20వ శతాబ్దం ఆరంభంలో ఇంగ్లాండులో జరిగిన పరిణామాలను విశ్లేషించడానికి ఉపయోగించాడు. అక్కడ కార్మికవర్గం చైతన్యవంతం కావటం పూర్తయి, కార్మికులు సంఘటితమయి పోరాటాలు చేసిన ఫలితంగా, సర్దుకుపోయే స్వభావం గల రాజ్యం సామాజిక భద్రతను (పైన వివరించిన స్వీడన్ తరహాలో) వ్యవస్థీకృతం చేయటం జరిగింది.

వలస పాలనాంతర పెట్టుబడిదారీ విధానానికి చట్టబద్ధత కల్పించటానికీ, తన ఆదిమ పెట్టుబడి సమీకరణ

విధానపు (ప్రిమిటివ్ ఎక్యూమురేషన్) ప్రభావాలని తగ్గించటానికి భారత రాజ్యం చేసిన ప్రయత్నంగా కూడా దీనిని చూడవచ్చు. (సన్యాల్, 2007). ఆదిమ సమీకరణ ద్వారా పెట్టుబడి వలయంలో ఇముడ్చుకోవటానికి వీలులేని అదనపు జనాభాను (సర్ప్లస్ పాపులేషన్) తయారు చేయటం వలస పాలనాంతర పెట్టుబడిదారీ అభివృద్ధి నమూనా స్వభావం. 18 లేదా 19వ శతాబ్దంలో అదనపు శ్రామిక జనాభాను పట్టించుకుని, వారి బాధ్యతను మోయాల్సిన భారం పెట్టుబడి పైనలేదు. వారిలో ఎక్కువ మంది యుద్ధంలోనో లేదా కరువుకు బలయ్యో చనిపోయారు. కొంతమంది వలస పోయేవాళ్ళు. ఆ తర్వాతి కాలంలో ఈ నిర్లక్ష్యం రాజకీయంగా దుస్సాధ్యమయింది. పెట్టుబడిదారీ ఉత్పత్తిని కొనసాగించిన వలస పాలనాంతర దేశాలలోని రాజకీయ చైతన్యం ప్రగాఢమైన మార్పును తెచ్చింది. ప్రజాస్వామ్యం, పౌర హక్కుల స్పృహ వ్యాప్తి చెంది, అసంఘటిత రంగంలో అత్యధికులుగా వున్న ఈ అదనపు శ్రామికులను, వలస పాలనాంతర రాజ్యాలు నిర్లక్ష్యం చేయటం కష్టసాధ్యమై పోయింది. అందుకే ప్రభుత్వాలు సంక్షేమ చర్యలు, చిన్నతరహా రుణాలు వంటి ఇతర మద్దతు వ్యవస్థలను ఏర్పరచాయి. వాటిని పెట్టుబడివలయం బయట జరుగుబాటు కోసం ఆర్థికాన్ని (సబ్సిస్టెన్స్ ఎకానమీ) సృష్టించే ప్రయత్నాలుగా అర్థం చేసుకోవాలి (సన్యాల్, 2007)

**ముగింపు**

చెప్పాలంటే, వలస పాలనాంతర పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమం కార్మికులందరినీ, 'పోగుబడి ఆర్థికం' (ఎక్యుములేషన్ ఎకానమీ) అని సన్యాల్ పేర్కొన్న దానిలోకి ఇముడ్చుకోలేకపోతున్నది. అదనపు శ్రామికులకు ఎంతమేరకు ఉపాధి కల్పిస్తారు అనేది రాజకీయాల స్వభావం మీద ఆధారపడి ఉంటుంది. భారత రాజ్యం నేడు, 'బతకడానికి అత్యవసరమైన ఆర్థిక వ్యవస్థ' (నీడ్ ఎకానమీ)లో నిండివున్న అదనపు కార్మికుల సమస్యను రాజకీయంగా ఎట్లా పరిష్కరించాలి అనే కీలకమైన సవాలును ఎదుర్కొంటున్నది. సంఘటిత కార్మికవర్గం బలహీన పడటం, దానితోపాటే రాజ్యం హక్కుల పరిభాషను ఉపయోగించి పౌరుల హక్కులు, అధికారాలను మరింతగా గుర్తించటం అనే రెండు పరస్పర విరుద్ధ ప్రక్రియలుండటాన్ని రాజకీయ అనివార్యత అనే కోణం నుండి అర్థం చేసుకోవాలి.


అనువాదం : **ఆశాలత**


**ఆశాలత** ఆక్టివిస్టు, మకామ్ వేదికలో మహిళా రైతుల గురించి అధ్యయనం చేస్తారు

**అచిన్ చక్రవర్తి** కలకత్తాలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్‌కి డైరెక్టర్, ఎకనామిక్స్ ప్రొఫెసర్

ఈ మెయిల్ *achinchak@gmail.com*

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*



# గ్రామీణ భారతం పయనమెక్కడికి? అభివృద్ధిచోదక రాజ్యం-గ్రామీణ శ్రామికుల పట్ల నిర్లక్ష్యం

■ రాజేశ్వరి ఎస్ రైనా, కేశబ్‌దాస్

**సందర్భం**

దేశంలో ఉన్న కార్మికుల మధ్య ఉన్న ముఖ్యమైన విభజన అధికారిక, అనధికారిక కార్మికుల మధ్య. ఈ నేపథ్యంలో గ్రామీణ భారతంలో వ్యవసాయ, వ్యవసాయేతర శ్రామికుల పట్ల ప్రభుత్వాల వైఖరిని పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం. పట్టణాలలో నిర్మాణ రంగం, టూరిజం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాలకు, సేవా రంగాలకూ, ఒక పక్క విపరీతమైన ప్రోత్సాహం ఇస్తూ, గ్రామీణ రంగంలో ఉన్న రంగాలపై అనాసక్తి, తమ అశక్తతను రాజ్యం ప్రకటించిన వైఖరిని పరిశోధకులు చాలా మంది గమనించారు. ఈ వ్యాసంలో దీనికి సంబంధించిన ఒక ఏడు అంశాలు ప్రస్తావిస్తాము. అవి, ఆర్థిక రంగంలో స్థిరీకరణ విధానానికి, ఉత్పత్తిని కేంద్రీకరించే వ్యూహాలకూ ఇక్కడ ఎన్నో వ్యవస్థాగత పరిమితులు ఉన్నాయని చెప్పడం; విధాన మార్పులపై అయిష్టత, పాలనా వ్యవస్థలో (తూర్పు ఆసియా దేశాల్లో లేని విధంగా విపరీతమైన అవినీతి (ఆమ్స్‌డెన్ 2011); రాజ్యం యొక్క నియంత్రణా సామర్థ్యాన్ని, స్థానిక చిన్న పెట్టుబడిదారి వర్గం ఒక వైపు, సామాజిక వ్యవస్థ మరొక పక్క నిర్వీర్యం చెయ్యడం (హారిస్, వైట్ 2014); గ్రామీణ రంగంలోని ఉత్పత్తికి సంబంధించిన సమాచారం కానీ, సమాచారం సేకరించే వ్యవస్థలు సంతృప్తికరంగా లేకపోవడం (దాస్ 2011, రైనా 2015); శ్రమను కేవలం సరుకుగా చూసే అభివృద్ధి ఆర్థిక శాస్త్ర దృక్పథం, ఆవిష్కరణలను కేవలం సాంకేతిక దృష్టిలో చూడడం (రాబిన్సన్ 1962); జ్ఞానాన్ని కళా వస్తువుగానూ, మేధోపర హక్కుల పరిధిలో కుదించడంలాంటి అంశాలు (నెల్సన్ 2008) అసంఘటిత, అనధికారిక కార్మికుల మీద కొనసాగిన వివక్షను ఎలా దారి తీశాయో చర్చిద్దాం. అంటే పని పట్ల పాలకులు తీసుకున్న దృక్పథంలోనే పక్షపాతం ఉండడం అనేక రంగాల్లో ఉన్న శ్రామికుల జీవితాల పట్ల జరిగే నిర్లక్ష్యానికి దారి తీస్తుంది. మన దేశంలో కేంద్రీకృతమైన ప్రణాళికా సంఘం పెట్టినప్పటినుండీ ఇప్పటి దాకా కూడా ప్రజల దగ్గర ఉన్న జ్ఞానాన్ని, వారి నైపుణ్యాలను గుర్తించకుండా, సరుకులను, జ్ఞానాన్ని బయటి నుండి చవకగా అందుబాటులో తెద్దామనే ఉత్సుకత, అనధికారిక రంగం ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని శ్రామికులకు తీవ్రమైన అన్యాయం చేసింది.

భారతదేశంలో అనధికారిక రంగ శ్రామికులు మొత్తం శ్రామికశక్తిలో 92 శాతం మంది ఉంటారు. ఈ రంగం స్థూల ఆర్థిక విలువకు 54 శాతాన్ని చేరుస్తోంది (కాస్ మరియు ఫిక్కి 2017). 'సమృద్ధిగా గ్రామీణ శ్రామికులుండే దేశాల్లో' ప్రధానంగా ఆర్థిక వ్యవస్థ ఎదిగి, జాతీయాభివృద్ధి క్రమం మారే కొద్దీ ఉద్యోగాలు కల్పించటంలో రాజ్యం బాధ్యత ఏమేరకు ఉంటుంది అన్నది పరిష్కరించని సమస్యగానే ఉంది (టామిచ్ మొదలగువారు 1995). అసంఘటిత కార్మికవర్గం అత్యధిక సంఖ్యలో ఉన్నప్పటికీ; లక్షలాది మందికి పనికొచ్చే గ్రామీణ ఉపాధులను సృష్టించి మెరుగైన శక్తి యుక్తులు చూపినప్పటికీ; ఎన్నో అవరోధాలను అధిగమించి, నేర్చుకుని, వేలాది గట్టి ఉత్పత్తి వ్యవస్థలను, వినిమయాలను సృష్టించినప్పటికీ, అభివృద్ధి రంగ నిపుణులు తమ రంగుటద్దాలలోంచి చూసి, ఈ బహుళ జనాభాను (మల్టీట్యూడ్) అనధికారికమనీ, ప్రాధాన్యతలేని మార్జినల్ వర్గమనీ నిర్వచించారు. ఈ అసంఘటిత శ్రామిక వర్గాన్ని "అనధికారికమ"నీ, "అప్రధానమ"నీ (మార్జినల్) వర్ణించడాన్ని ప్రశ్నించిన వారు తక్కువ. పాశ్చాత్య దేశాలలోలా మన ప్రభుత్వం కూడా భారీ ఎత్తున జోక్యం చేసుకుని ఈ అనధికారిక ఆర్థిక వ్యవస్థను, దాని శ్రామిక శక్తిని అధికారిక వ్యవస్థలోనూ, పెట్టుబడి సమీకరణలోనూ, ఆర్థిక వృద్ధిలోనూ కలుపుకు పోతుందనే పగటికలను సజీవంగా ఉంచడానికి ఈ విపరీత నిర్వచనం పనికొచ్చింది (నిగమ్ 2018).

**1. భారతదేశంలో రాజ్యం, కార్మికవర్గం మధ్య సంబంధాలు:**

పెట్టుబడి ప్రధానమైన, ఆధునిక పారిశ్రామికీకరణ వైపు విధానపరంగా చూపిన స్పష్టమైన మొగ్గువల్ల, కనీసం రెండో పంచవర్ష ప్రణాళిక, 1956 పారిశ్రామిక విధానం రూపొందిన నుండీ, గ్రామీణ చేతివృత్తుల పరిశ్రమలు కేవలం బతుకు తెరువు (సబ్సిస్టెన్స్) స్థాయికి నెట్టబడ్డాయి. ఫలితంగా, వారి ఆవిష్కరణలకు (ఇన్నొవేషన్) ప్రోత్సాహంగానీ, పారంపర్యంగా వస్తున్న వారి నైపుణ్యాలని లేక శ్రమాధారిత సాంకేతికతలను విస్తృతం చేసే ప్రయత్నం గానీ లేకుండా పోయాయి. చేతివృత్తుల్లో అనేకం అదృశ్యమవడమో; పెట్టుబడిలో, మార్కెటింగ్‌లో, 'అవసరమయిన సేవల' సౌకర్యం అందించడానికి ప్రభుత్వం ఏం చెయ్యకపోవటం వల్లనో దయనీయ స్థితిలోనో ఉండిపోయాయి. అనధికారికత (చట్టబద్ధమైన, గుర్తింపు పొందిన హోదా లేకపోవడం), అదృశ్యత (ఆర్థిక వ్యవస్థకు వీరు చేసే చేర్పు ఎవరి దృష్టికీ రాకపోవడం) వీటిపై సమగ్ర అధికారిక సమాచారం లేకపోవడం అనే ముద్రలు పడ్డ ఆయా గ్రామీణ సంస్థలు, తమ శ్రామికుల నైపుణ్యాలను మెరుగుపరచలేక పోయాయి. మెరుగైన ప్రతిఫలం, పని ప్రదేశంలో రక్షణ, సామాజిక భద్రత వున్న గౌరవప్రదమైన పని ఇవ్వలేకపోయాయి. దేశంలోని సగంపైగా సూక్ష్మ చిన్న, మధ్య తరహా పారిశ్రామిక సంస్థలు (ఎమ్ఎస్ఎమ్ఇ) గ్రామీణ ప్రాంతాల్లోనే ఉండడం, ఇందులో 95 శాతం యూనిట్లు రిజిస్టరు కాని (అనధికారిక) సూక్ష్మస్థాయి సంస్థలు కావడం అతిపెద్ద సవాలు.

స్వయం సమృద్ధ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కోసం కలలుగన్న గాంధీ దార్శనికతగానీ, దానిని ముందుకు తీసుకెడుతూ దేశంలో గ్రామీణ పారిశ్రామికీకరణ చెయ్యటానికి శ్రమ కేంద్రంగా ఉండే సాంకేతికత అవసరమని చెప్పిన (రెడ్డి 1975) వాదనలు గానీ సమన్యాయం (ఈక్విటబుల్), సమ్మిళితత్వం ఉండే సామాజిక ఆర్థిక వ్యవస్థ నిర్మించాలని చెప్పాయి. ఆయా సంస్థలను మరింత సూక్ష్మంగా, వాస్తవిక దృష్టితో అర్థం చేసుకోవాలని; అధికారిక, అనధికారిక వస్తు, ద్రవ్య మార్పిడి లేని సందర్భాలకు కూడా పనికొచ్చేలా నియమ నిబంధనలు రూపొందించాలని; కొత్త ఆవిష్కరణలు అవలంబించే వివిధ ధోరణుల మధ్య సమన్వయం తీసుకురావాలని; స్థానికంగా, అనధికారికంగా పుట్టే జ్ఞానంలో అంతర్లీనంగా ఉండే విజ్ఞానాన్ని, సాంకేతికతలను గుర్తించి, పరీక్షించాలని; నేర్చుకోవటానికి అవసరమయిన సామాజిక పరిస్థితులను తయారు చేయాలని, రాజ్యానికి అనేక సూచనలు, సిఫార్సులు అందాయి. కానీ, విధాన రూప కల్పనలో కేంద్రీకృత, సాంకేతిక నిపుణులదే పైచేయి కావడం వల్ల, ప్రజల వాస్తవ జీవితాలకు, పారిశ్రామిక అభివృద్ధికి మధ్య సమన్వయం పగటికలగానే మిగిలిపోయింది (దాస్ మరియు రైనా 2020:257).

అలాగే సాంకేతిక అభివృద్ధికి రాజ్యం తీసుకున్న చర్యలు (ఉదాహరణకు, గ్రామీణ సాంకేతిక శాస్త్ర సంస్థల ద్వారా), గ్రామీణ సంస్థలకు అందుబాటులోకి వచ్చి ఆచరణలోకి రావడం చాలా అరుదుగా జరిగింది (దాస్ 2011:222). వ్యవసాయ, వ్యవసాయేతర వ్యవస్థల మధ్య అనుబంధం పెరగటానికి; వివిధ దశల్లో శ్రామికులకు పని దొరకటానికి వివిధ స్థాయిల్లోని సాంకేతికతలు,

నైపుణ్యాలు ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉండాలని కురియన్ (1989) ఒక సరళమైన, సమ్మిళిత పద్ధతిని సూచించారు. కానీ గ్రామీణ అనధికారిక ప్రదేశాల్లో కనపడే విజ్ఞానంలో వివిధ పొరలు ఉంటాయని గుర్తించటానికి వ్యవస్థ సిద్ధపడలేదు. ఈ వ్యవస్థాగత ఉదాసీనత ప్రభావం, స్వయం ఉపాధుల అభివృద్ధి పైనా, చివరికి వాటి ఉనికి పైనా, తీవ్రంగా పడింది. వ్యాపారం క్షీణించి, పని అవకాశాలు తగ్గిపోవడమో, పనిచేసే పరిస్థితులు దుర్భరమవడమో జరిగి, కార్మికశక్తి చిక్కిశల్యమైంది.

#### 4. శ్రమ, అనధికారిక ప్రదేశాలు (డొమెయిన్), నేర్చుకోవటం (లెర్నింగ్)

అనధికారిక, అసంఘటిత శ్రమ పట్ల రాజ్యం ప్రదర్శించే ఉదాసీనతను, అశక్తతను ఇక్కడ మేము ప్రశ్నిస్తున్నాం. సామాన్యంగా కనిపించే రోజువారీ అనధికారిక శ్రమలో దాగున్న నిరంతరం నేర్చుకునే క్రమం, ఆవిష్కరణలకి సంబంధించి కొన్ని ఉదాహరణలతో మొదలుపెడదాం. అస్సాంలో సౌల్కుచి సముదాయంలో పట్టునేత పనైనా (అనురాగ్ మరియు దాస్ 2020), కేరళలో మణప్పురం ఇళ్ళల్లో జరిగే కొబ్బరిపీచు ఉత్పత్తి అయినా (కామత్ 2020), ఉత్పత్తి క్రమంలో మధ్యమధ్యలో అవసరమయ్యే నిర్దిష్టమైన అనధికారిక శ్రమల వల్లనే తుది వస్తువు తయారవుతుంది. సరైన సమయంలో పట్టుకాయల్ని సేకరించడం, వాటిని నూలు తయారు చేసేవారికి, నేత కార్మికులకి పంపిణీ చేయడం, కొబ్బరిపీచును వడకడానికి వాడే మోటారు రాట్నాన్ని మెరుగుపరచడానికి ఇళ్ళల్లో నిరంతరం జరిగే తీవ్రచర్చలు, ప్రయోగాలు వంటి పనులకు ప్రత్యేక నైపుణ్యాలున్న శ్రామికులు, వారికి ఆయా వస్తువుల పట్ల అవగాహన అవసరమవుతాయి. గుజరాత్‌లోని బన్ని గడ్డిభూముల్లో ఇంకుడు బావుల గురించి అక్కడి ప్రజల్లో ఉండే అవగాహన, వారు వాటిపై చేసే శ్రమ వల్ల ఎడతెగని కరువు రోజుల్లో కూడా పశువులకు, మనుషులకు త్రాగునీరు లభిస్తోంది (అగర్వాల్ 2015). ఇటువంటి సామూహిక వ్యవస్థలు, లేక సమిష్టిగా శ్రమించడం, నేర్చుకోవడానికి సంబంధించిన కట్టుబాట్లు (రైనా మరియు దే 2020) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంత్రజోల (విజయనగరం)లో చూడవచ్చు. ఇక్కడ గ్రామస్థులు శ్రమను, వ్యవసాయ సంబంధ జ్ఞానాన్ని (ఆనవాయితీలు, క్రమ పద్ధతిలో చేయడం పట్ల అవగాహన, పిలిస్తే పలికే గుణం, కొన్ని పరిస్థితుల్ని ముందుగా ఊహించడం లేదా వాటికి సిద్ధంగా ఉండడం) ఒకరితో ఒకరు పంచుకుంటారు. మిశ్రమ పంటల పద్ధతిలో చిరుధాన్యాల సాగుద్వారా వ్యవసాయం, పర్యావరణం, పౌష్టికాహారం మధ్య సమన్వయం సాధించుకునేందుకు ఈ సమిష్టితత్వం ఉపయోగపడుతుంది (వాసన్ 2015). విస్తృత స్థాయిలో పంటలు, పశువుల పెంపకం వ్యవస్థలు, వ్యావసాయిక అటవీ పెంపకం, కలపేతర అటవీ ఉత్పత్తులపై ఆధారపడ్డ జీవనోపాధులు – వీటన్నిటిలోనూ సమన్వయం, సహకారపు కట్టుబాట్లతో కూడిన సమిష్టి శ్రమని వివిధ అనధికారిక రూపాల్లో చూడొచ్చు (ఉదా. టింబక్టు కలెక్టివ్ 2018; సింగ్ మొదలగు వారు 2018). ప్రతీ ఉత్పత్తి వ్యవస్థలో స్థానికంగానూ, సీజన్‌లో, సీజన్ల మధ్య ఉండే వైవిధ్యం, విభిన్నత గూర్చి అవగాహన వున్న శ్రామికులనూ, శ్రమలలో వుండే విభిన్నతనూ ఈ ఉదాహరణల్లో మనం చూడొచ్చు.

శ్రమకు, నేర్చుకోవడానికి సంబంధించి పైన పంచుకున్న ఆలోచనలు గ్రాంథిక జ్ఞానానికీ, అనుభవ జ్ఞానానికీ మధ్య నున్న విభజన రేఖను చెరిపేస్తాయి. అనధికారిక శ్రామికులు సాంకేతికంగానూ, సంస్థాగత ఇన్నోవేషన్ పరంగానూ, జ్ఞానాన్ని సృష్టించి, అందిపుచ్చుకుని, ప్రయోగించడం చూస్తే, రాజ్యంతోపాటు పనిచేస్తూ గ్రామీణ శ్రామిక శక్తికి జ్ఞానాన్ని అందించే వృత్తి–ఉద్యోగవర్గ అవసరం లేదనిపిస్తుంది. మూగా పట్టుకాయల మధ్యవర్తికీ, పట్టుపురుగుల పెంపకంలో పాల్గొనే కుటుంబానికీ, నూలు వడికే కుటుంబానికీ ఉన్న విజ్ఞానానికి మనం విలువిస్తే, కొబ్బరిపీచును మోటారు రాట్నంతో వడికే ఇళ్ళల్లోని మహిళల కార్యదక్షతకు మనం విలువిస్తే, అప్పుడు శ్రమవిలువ అంగడిలో అమ్ముడుపోయే సరుకుల వినిమయ విలువలో ఒక చిన్న భాగం మాత్రమే కాదని అర్థమవుతుంది. ఈ ఉదాహరణలో శ్రమ విలువ అనేది శ్రమ, పెట్టుబడి, జ్ఞానం మధ్య నుండే క్రియాశీలక సంబంధాల్లోంచీ, పర్యావరణం, ఉత్పత్తి సాధనాలూ, క్రమాల గూర్చీ, వాటి నాణ్యత గూర్చీ ఉండే సమిష్టి, అనుభవైక జ్ఞానంలోంచీ పుట్టుకొస్తుంది. ఈ అనధికారిక జ్ఞాన సంపదతో శ్రామికులెవరైనా స్వేచ్ఛగా ప్రయోగాలు చేయొచ్చు. దాన్నుంచి నేర్చుకోవచ్చు. దానికి మరింత విలువ చేర్చవచ్చు. దాపరికంలేని భావ మార్పిడి, పరస్పరం తప్పొప్పులు సవరించుకోవడం ఇక్కడ సర్వసాధారణం, వైవిధ్యభరితమైన, అత్యంత చలనశీలమైన ఉత్పత్తి సందర్భాల్లో, అవగాహనతో కూడిన నిర్ణయాలు తీసుకోవడం, అతి తక్కువ సమయంలో విభిన్న రకాల పనులు చేయడం, ఇవన్నీ ఇక్కడ శ్రమ క్రిందకే వస్తాయి. రోజంతానో, ఒక పూటో, తయారైన వస్తువులను బట్టో, పని గంటలనుబట్టో, చేసే శారీరక కష్టానికి ఇంత అని చెల్లిస్తే అమ్ముడయ్యే సరుకు లాంటిది కాదు ఇక్కడి శ్రమ. మనిషితనానికి అది ప్రతిరూపం. దానికో సామాజిక గుర్తింపు, దానికి ఉత్పత్తి వ్యవస్థలో ఒక ప్రత్యేక స్థానం ఉంటాయి. కుల ప్రసక్తిలేని చోట పనిచేయడానికని గ్రామీణ కార్మికులు నగరాలకు వలసపోవడాన్ని సమర్థిస్తూ, వారి పీడిత సామాజిక గుర్తింపు (షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఓబీసీలు, మహిళలు కూడా)ను ఎత్తిచూపవచ్చు (దేశ్ పాండే 2013). అయితే, కార్మికులను నియంత్రించి, ఇష్టమొచ్చినట్టు వాడుకోగలిగినంత కాలం కార్మికుల ఆత్మగౌరవం, అది అనామకత్వం వల్ల వచ్చినా, కొత్త పనికి మారాలన్న వారి నిశ్చయం వల్ల వచ్చినా, పెట్టుబడికి ఏ మాత్రం పట్టదు. అనధికారిక నిమ్న కులాల కార్మికులు పట్టణ ప్రాంత వేతన ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, కోటాలు డిమాండు చేస్తే, అగ్రకుల ప్రయోజనాలతో ముడిపడ్డ అభివృద్ధి చోదక రాజ్యం ఆ వైరుధ్యం పట్ల పెద్దగా ఆందోళన చెందదు. కార్మికులను పౌరులుగా ఆమోదించడం కన్నా భృతులు, రిజర్వేషన్లు ఇస్తూ కార్మికులను 'సరుకులు'గా నియంత్రించడం రాజ్యానికి సులువైన పని.

#### 5. రాజ్యంలో అంతర్భాగం అయిపోయిన జ్ఞానాన్ని ప్రతిఘటించడం

రాజ్యం అనధికారిక కార్మికవర్గాన్ని నైపుణ్యం లేనివారుగా భావించడం మాని, ప్రస్తుతమున్న అనధికారిక జ్ఞానాన్ని, వారి ఇన్నోవేషన్ సామర్థ్యాన్ని, నిరంతర నేర్చుకునే క్రమాలని పునాదిగా చేసుకుని తన జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలి (బసోలె, 2014). కింది స్థాయిలో ఆవిష్కరణ సామర్థ్యాలపై దృష్టి సారించడం, గ్రామీణ పేదలు విలువనిచ్చి, ఉపయోగించుకునే అనేక రకాల అనధికారిక మానవ వనరులను బలోపేతం చేయడం, రాజ్యం చేయగలిగే పనుల్లో కొన్ని (దాస్ మరియు రైనా 2020). రాజ్యం ప్రమేయం ఏమేరకు ఉంటోంది అన్న అంశంపై ఆధారపడి, గ్రామీణ భారతదేశంలో ఆవిష్కరణలు, నేర్చుకునే క్రమాన్ని మూడు వర్గాలుగా చేయవచ్చు (దాస్ అండ్ రైనా 2020). అవి: (1) తక్కువ సాంకేతిక స్థాయి ఉన్న చేతి వృత్తుల్లో, తయారీ సంస్థల్లో ఎప్పుడూ ఆగని అనధికారిక ప్రక్రియలు, (కంటిన్యూవస్ ఇన్‌ఫార్మల్ లెర్నింగ్) పారదర్శకంగా జరిగే జ్ఞానమార్పిడి (ఓపెన్ సోర్స్ నాలెడ్జ్ ఎక్స్ఛేంజ్), నిర్ధారించే ప్రక్రియలు (వాలిడేషన్ ప్రాసెస్), (2) ముఖ్యంగా సూక్ష్మ చిన్న తరహా సంస్థల్లోని అనధికారిక శ్రామికులు, ఉత్పత్తిదారులతో సంఘటిత, అధికారిక శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన నిపుణులు, రాజ్యమూ కాస్త అధికారికంగా చేసే చర్చలు, (3) రాజ్యం, దానికి చెందిన శాస్త్ర సాంకేతిక వ్యవస్థ, పౌరసమాజంతో, అనధికారిక శ్రామికులతో చేసే చర్చల ద్వారా నేర్చుకోవడం. మాతా శిశు సంరక్షణలో వచ్చిన సంస్కరణలు, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో ఎక్రెడిటెడ్ సోషల్ హెల్త్ ఏక్టివిస్ట్ (ఆశా కార్యకర్తల) లను పరిచయం చేయడంలో ఈ మూడో తరహాను చూడవచ్చు (దాస్ 2020). అధికారిక, లేదా అర్ధ అధికారిక వ్యవస్థలో కొన్ని ప్రమాణాలు పాటించి, అనధికారిక శ్రామిక శక్తిని తీసుకోవడంగా ఈ చర్యలను అర్థం చేసుకోవచ్చు. కానీ భారతదేశంలోరి శ్రామికవర్గంలో అత్యధిక జనాభాకు ఈ నమూనా సరిపోదు. దీనికి కారణం పైన వర్ణించిన మొదటి రెండు రకాల నేర్చుకునే మార్గాలను రాజ్యం గుర్తించకపోవడమే.

వ్యవసాయ రంగంలోనూ, తయారీ రంగంలోనూ, అలాగే సౌల్కుచిలో పట్టుకాయల సేకరించడం వంటి అనేక పనుల్లో దోహదం చేస్తూ, విభిన్నత, స్థానిక కట్టుబాట్లు, పరిస్థితులకనుగుణంగా మారే వెసులుబాటు వంటి లక్షణాలున్న ఈ అనధికారిక శ్రామిక వర్గంతో రాజ్యం ఎలాంటి సంబంధం పెట్టుకోవాలి? తన శ్రామిక శక్తిలో అత్యధిక జనాభా అయిన ఈ పౌరుల్లో దాగున్న శ్రమశక్తి, విజ్ఞానాలతో రాజ్యం సంబంధం నెలకొల్పుకోవాలంటే ఒక పెద్ద అడ్డంకి వుంది. ఈ అడ్డంకి డెవలప్‌మెంట్ ఎకనామిక్స్ చేసే సిద్ధాంతీకరణలో ఉంది. ఈ

సిద్ధాంతాలు అభివృద్ధి చెందిన దేశాల అనుభవాల ఆధారంగా చేసినవి. అక్కడ జరిగిన తీవ్రమైన అర్థిక వృద్ధి, సాంకేతిక, పని స్థలాల, జ్ఞానం ఆధారంగా జరిగే ఉత్పత్తి, దాని కోసం జరిగిన క్రమబద్దీకరణ, వేతనాల బిగింపు దాని పర్యవసానంగా పెరిగే నిరుద్యోగం ఈ అనుభవ సారాంశం. శ్రామికులని క్రమబద్ధ శ్రామిక వర్గంగా మార్చి పెట్టుబడి సమకూరే కేంద్రాలకు వారిని తరలించిన కారణంగా (యూరప్‌లో మార్షల్ ప్లాన్ వలె) అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లో (జపాన్‌లో కూడా) శ్రమకు, పెట్టుబడికి మధ్య సంబంధాల్లో అనూహ్యమైన మార్పులు సంభవించాయి. ఈ మార్పులే ఈ అభివృద్ధి ఆర్థిక శాస్త్రానికి (డెవలప్‌మెంట్ ఎకనామిక్స్) ప్రధాన నమూనా. శ్రమ స్వభావం, శ్రమ–పెట్టుబడి సంబంధాల గూర్చి ఈ విధమైన సిద్ధాంతీకరణ, అభివృద్ధి ప్రణాళికలకు కేంద్ర బిందువయింది. అయితే, రాజ్యం ప్రణాళికలు రచించి, పారిశ్రామీకరణలో కీలక పాత్ర పోషించిన దేశాల్లో కీన్స్ చెప్పిన విధానాలని కొంత మేరకు అమలు పరిచారు. ఈ విధానాలనే ఈ రకమైన సిద్ధాంతీకరణ చాలామటుకు అనుసరిస్తుంది (బౌల్స్ మరియు జింటిస్ 1986; అమ్రిక్ మరియు బసురి 1994). సంప్రదాయ/అసంఘటిత/అనధికారిక గ్రామీణ వ్యావసాయిక శ్రమ నుండి, ఆధునిక/సంఘటిత/అధికారిక పారిశ్రామిక రంగ శ్రమకు శ్రామిక వర్గాన్ని తరలించడం, పెట్టుబడిదారీ అభివృద్ధిలో రాజ్యం చురుగ్గా జోక్యం చేసుకోవడం – ఇవి ఆర్థికాభివృద్ధి సిద్ధాంతీకరణలో ముఖ్యాంశాలయ్యాయి (సేన్ 1983; రే 2014). అత్యధిక నిరుద్యోగితకు తోడు, తమ పారిశ్రామిక సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతున్న దేశాలకు ఉద్దేశించిన కీన్స్ సిద్ధాంతాన్ని, 'సమృద్ధిగా గ్రామీణ శ్రామికులుండే దేశాలు'గా గుర్తింపు పొందిన, పరిమిత పారిశ్రామిక సామర్థ్యం కలిగిన భారతదేశంలాంటి ఆర్థిక వ్యవస్థలకు వర్తింపజేయడం (రాజ్యం జోక్యం చేసుకునే స్వభావం, ప్రణాళికా రచనల్లో), అభివృద్ధి శాస్త్రవేత్తలు చేసిన కనికట్టు. కీన్స్ వాద మద్ధతు విధానాన్ని ఉన్నదున్నట్టు ఆమోదిం చేయడం వల్ల విద్యకు అపరిమితమైన డిమాండు పెరిగింది. విద్యార్జన కారణంగా వచ్చే ప్రైవేటు, పబ్లిక్ లాభాలు పెరిగాయి (బౌల్స్ మరియు జింటిస్ 1986). సంపద పెరిగి, అధికారిక ఉద్యోగాల్లో వేతనాలు పెరిగి, లాభాల పంపిణీలోని అసమానతని ప్రశ్నించడం అప్రధానమయి పోయింది (బేల్స్ మరియు జింటిస్, 1988). గ్రామీణ ప్రాంతం తాత్కాలిక మజిలీగా మారింది. గ్రామీణ ప్రజల్లో, ఉత్పత్తి యూనిట్లలో, పర్యావరణ వ్యవస్థలలో దాగున్న శ్రామికుల విజ్ఞాన సంపద, ఏవో కొన్ని జీవనోపాధుల్ని సృష్టించగలిగే వీలు, సులువు కలిగి ఉన్నప్పటికీ, రాజ్యం దృష్టిలో ప్రాధాన్యత కోల్పోయింది. ముందే నిర్ణయించబడిన అభివృద్ధి పథం మరియు నిర్మాణాత్మక మార్పు కోసం ఇప్పుడు ఆచరణయోగ్యం కాని ఆశయాలూ, ప్రణాళికా రచనతో కుస్తీ పడటం జరుగుతోంది.

**ముగింపు**

తమ జీవనోపాధి అవకాశాలను సృష్టించుకోగలిగి, మార్పుకు సిద్ధంగా ఉండే అనధికారిక గ్రామీణ శ్రామిక వర్గం, వారి విజ్ఞాన సంపద పట్ల రాజ్యం ప్రదర్శించే ఉదాసీనతను ఎత్తి చూపడం ఈ వ్యాసం ఉద్దేశ్యం. అనధికారిక శ్రామిక వర్గ నైపుణ్యాలు సృష్టించే సంపద మీద ఆధారపడి అల్ప సంఖ్యాక అధికారిక వర్గం తన అవసరాలు తీర్చుకుంటూ బతుకుతోంది (హ్యారిస్, వైట్ 2014). ఈ మైనారిటీరి వర్గానికి వత్తాసుగా ఏకశిలా సదృశమైన ఒక అభివృద్ధి సిద్ధాంత సమర్ధన ఉంది. వీటి కారణంగా అనధికారిక, అసంఘటిత రంగంలో ఇప్పటికే వున్న అసమానతలు మరింత తీవ్రతరమవుతున్నాయి (పోలాన్యి 1994– పునర్ముద్రణ 2001). అభివృద్ధి చోదకరాజ్య స్వభావం గురించీ; అనధికారిక శ్రమపట్ల దాని నిర్లక్ష్యాన్ని గురించి శ్రమ, పెట్టుబడి, విజ్ఞాన సంపద మధ్యనున్న క్రియాశీలక సంబంధాలను మరుగుపరిచేట్లుగా వున్న దాని కార్యకలాపాల గురించీ వచ్చే బాధాకరమైన ప్రశ్నలను రాజకీయంగానే చర్చించాలి. ఆర్థిక వృద్ధి తప్ప మరేమీ పట్టించుకోనక్కర్లేదని, శ్రమని కేవలం సరుకుగానే చూడాలనే దృక్పథాన్ని వంటపట్టించుకుంది భారత రాజ్యం. ఇటువంటి సమస్యాపూరిత అభివృద్ధి దృక్పథం ప్రభావంతో అనేక రకాల శ్రమలని అప్రధానమయినవిగానూ, అనధికారంతో నిండినవిగానూ పరిగణించి ఆయా శ్రామికులతో సానుకూలంగా వ్యవహరించట్లేదు. ఈ సమస్యని గుర్తించి, చర్చించి, పరిష్కారాలు వెతకాలి.


అనువాదం : **పి చంద్రశేఖర్**


**పి చంద్రశేఖర్** గీతమ్ యూనివర్సిటీలో ఇంగ్లీషు బోధిస్తారు

**రాజేశ్వరి ఎస్ రైనా** స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, శివ్ నాడార్ యూనివర్సిటీలో ప్రొఫెసర్
ఈ మెయిల్ rajeswari.raina@gmail.com

**కేశబ్‌దాస్** గుజరాత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ రిసెర్చ్, అహ్మదాబాద్‌లో ఎకనామిక్స్ ప్రొఫెసర్
ఈ మెయిల్ keshabdas@gmail.com


ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.


Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES
సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

## నిజాం పరిపాలన, ముస్లింలు
### హైదరాబాద్ 'విమోచన' గురించి నిజాలు, కట్టుకథలు

*సంచిక : 1(త్రైమాసికం)* *తెలుగు & ఇంగ్లీష్* *నవంబర్ 2010* *విరాళం : 10 రూ.*

విషయసూచిక
- ఎడిటోరియల్
- చరిత్ర, నిశ్శబ్దాలు *ఎమ్.ఎ.మోయిద్*
- నా శవ పేటికపై ఉత్సవాలా! *ఎం.ఎ.మాజిద్*
- హైదరాబాద్‌పై ఒక ముస్లిం దృక్కోణం *హసనుద్దీన్ అహ్మద్*
- ఆత్మ గౌరవాన్ని దెబ్బకొట్టవద్దు *రఫత్‌సీమా, కనీజ్ ఫాతిమా*
- అర్ధసత్యాలు, అపోహలు *దివికుమార్*
- నిజాలను నీరు గార్చే ప్రయత్నం *శ్రీనివాస్ ఏశాల*
- 'ఒకే నిజాం': రెండు స్ఫురణలు *ఆర్. శ్రీవత్సన్*

H.E.H. Mir Osman Ali Khan
Nizam of Hyderabad


***సంపాదకులు:*** *ఎమ్.ఎ.మోయిద్, ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్*

***అనువాదకులు:*** *కనీజ్ ఫాతిమా, ఎమ్.ఎ.మోయిద్, ఆర్.శ్రీవత్సన్ (ఇంగ్లీష్), ఎ. శ్రీనివాస్, ఎ. సునీత (తెలుగు)*

***అడ్వయిజరీ బోర్డ్:*** *షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమ మెల్కొటె, కె. సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శత్రుఘ్న, డి. వసంత, కె.లలిత, ఎన్. వసుధ, గోగు శ్యామల, వి. ఉష*

***ప్రొడక్షన్:*** *ఏ. శ్రీనివాస్, టి. శ్రీలక్ష్మి*

***ప్రచురణ సంస్థ :*** **అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు -500013.


Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES
సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

## కులం, జనగణన, ప్రజాస్వామ్యం
### భిన్న దృక్పథాలు

*సంచిక : 2(త్రైమాసికం)* *తెలుగు & ఇంగ్లీష్* *జూన్ 2011* *విరాళం : 10 రూ.*

విషయసూచిక
- సంపాదకీయం
- కులం లెక్క తేల్చాల్సిందే
  దుర్గం సుబ్బారావు
- జనగణనలో కులాల్ని లెక్కిస్తే భారత దేశం కుల సమాజంగా మారిపోతుందా ?
  కె.సత్యనారాయణ
- బాక్స్ ఐటమ్‌లలోని సమాచారం వివరణలను అందించినవారు
  కె.వై. రత్నం, తెలుగుఅనువాదం : కె. సజయ
- కుల ప్రాతిపదికపైన జనాభా లెక్కింపు–రాజ్యాంగం రీత్యా అవసరం
  రవివర్మ కుమార్
- కులం, జనగణన: ముందు చూపుతో ఆలోచిద్దాం!
  సొనాల్దే దేశాయి
- జనాభా లెక్కలలో కులగణన ఎందుకుండకూడదు?
  వి.కె.నటరాజ్
- కుల జనగణనను వద్దంటున్న వారి రాజకీయాలు
  సతీష్ దేశ్‌పాండే, మేరీజాన్

*ప్రత్యేక సంపాదకులు : ప్రొ॥జి.కృష్ణారెడ్డి, డా॥కె.వై.రత్నం, ప్రొ॥చెన్న బసవయ్య*

***సంపాదకులు:*** *ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్*

***అడ్వయిజరీ బోర్డ్:*** *షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మేల్కొటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూశీ థారు, వీణా శతృఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.*

***ప్రొడక్షన్:*** *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*

***ప్రచురణ సంస్థ :*** **అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు -500013.

వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

***ఫోటో*** *: అనుపమ్ నాథ్ / ఎ.పి., గార్డియన్, యు.కె., 11-2010-జూన్, సౌజన్యంతో.*


**కృతజ్ఞతలు**

ఆర్. శ్రీవత్సవ్, ఎ.సునీత, ఎమ్.ఎ.మోయిద్, పద్మినీ స్వామినాథన్, ఉమారాణి లకు ఈ వ్యాసంలోని ముఖ్యమైన విషయాల గురించి మాతో జరిపిన ఉపయోగకరమైన చర్చలకు మొత్తం ప్రక్రియలో వారిచ్చిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

**రాజేశ్వరి ఎస్ రైనా, కేశబ్‌దాస్**

# పెట్టుబడిదారీ విధానం–సమ్మిళిత అణచివేత: భారతదేశంలో జాతి, కులం, తెగ, జండర్, వర్గం

■ జన్స్ లర్ష్, అల్పా షా

**బ్లాక్** లైవ్స్ మాటర్ (నల్లవారి ప్రాణాలు విలువైనవి) అనే నినాదంతో ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా జరిగిన నిరసనలు, కనీసం ఇప్పటికైనా జాత్యహంకారం, మైనారిటీలపై అణచివేత వంటి కీలకమైన, అత్యవసర సమస్యలపైకి అందరి దృష్టిని మళ్ళించాయి. జాత్యహంకారం, మైనారిటీలపై అణచివేతలను పెట్టుబడిదారీ విధానపు ప్రాపంచిక చరిత్రలో భాగంగా అర్థం చేసుకోవాలని ఈ వ్యాసంలో చెపుతున్నాం. ఎందుకంటే అవి పెట్టుబడిదారీ విధానంలో వ్యవస్థీకృతంగా జోడించబడివున్నాయి. పెట్టుబడిదారీ విధానం సామాజిక విభజనల ద్వారా విస్తరించింది.

గత కొద్ది సంవత్సరాలుగా మా పరిశోధనలో భారతదేశంలో కులం, తెగ, జండర్ అంతరాలను పెట్టుబడిదారీ విధానం ఏ ప్రక్రియల ద్వారా పటిష్టం చేసిందని వివరించటం పైన కేంద్రీకరించాము(షా, లర్ష్, 2018; లర్ష్, షా 2018, షా, లర్ష్ 2020). 1 ఆధునికీకరణ నుండి ఆశించే పరిణామాలకు విరుద్ధంగా అటు ఆర్థిక అభివృద్ధి కానీ ఇటు నయా ఉదారవాద సంస్కరణలు కానీ కులం, జాతి, జండర్ వివక్షలు అంతం అవటానికి దారి తీయలేదు. అవి నిజానికి కార్మికులపై అణచివేత, దోపిడీల నిర్మూలనకు గీటురాయి. అందుకు విరుద్ధంగా అటువంటి 'తేడా', 'వివక్ష'లు కూడా 'ఆధునీకరించబడ్డాయి'. ఫిలిప్ బూర్జువా మాటలలో చెప్పాలంటే వర్గ దోపిడీ, జాతి వివక్ష ఈ రెండూ 'ఒకదానిపై మరొకటి విస్ఫోటనాత్మక చర్య జరిపి' అవి విడిగా కలిగించే అణచివేత కంటే అనేక రెట్లు ఎక్కువ ప్రభావాన్ని కలిగిస్తాయి. దీనిని ఫిలిప్ (1988, 1989, 1995: 72) 'సమ్మిళిత అణచివేత' అని పిలిచాడు. కులం, తెగ, జాతి, జండర్, వర్గం పరంగా అమలయ్యే సామాజిక అణచివేత, దోపిడీ విడదీయరానివిగా, ఒకే నాణానికి రెండు పార్శ్వాలుగా ఏ విధంగా జోడించబడి ఉన్నాయో ఇక్కడ మేము పరిశీలించాము. అటువంటి 'సమ్మిళిత' అణచివేత శ్రామిక వర్గాలను విభజించి పెట్టుబడిదారీ విధానపు ప్రయోజనాలను నెరవేరుస్తుంది. ఈ పరిస్థితి మారటానికి ఎదురవుతున్న సవాళ్ళను కూడా మేము వివరించాము.

కులం, తెగ, జాతి, వర్గం, జండర్ల మధ్య బలమైన బంధం ఉన్నట్లు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన పరిశోధన, సమాచారం సూచిస్తున్నాయి. భారతదేశంలో సామాజిక అణచివేత, దోపిడీ విడదీయరానివిగా జోడించబడి వున్నాయి అనే విషయం ఇప్పటికే నిరూపించబడింది. 'జనరల్' కేటగిరి (అగ్ర,ఆధిపత్య) కులాలు ఉద్యోగాలలో, ప్రభుత్వ సేవారంగం, ఉన్నత స్థాయి వ్యాపార రంగం, పెట్టుబడి రంగంలో ఆధిపత్యం వహిస్తున్నాయి. ఆ కులాలలో అత్యధికులు కింది స్థాయి అనధికార, భద్రత లేని దినసరి వేతన ఉద్యోగాలనుండి తప్పించుకుంటారు. అయితే ఈ రకమైన పనులపైనినే దళితులు, ఆదివాసులలో అత్యధికులు ఆధారపడి బతుకుతున్నారు2.

ముస్లింలు, ఇతర వెనుకబడిన కులాలలోని అధిక భాగం ప్రజలతోపాటు దళితులు, ఆదివాసులు భారతదేశంలో వున్న ఈ 'శ్రేణీకరించిన అసమానతల' (గ్రేడెడ్ ఇనీక్వాలిటీ) దాడికి గురవుతున్నారు. శ్రామిక విపణిలోనూ, నైపుణ్యాలను పెంచుకునే దగ్గరా వివక్షను అనుభవిస్తున్నారు (ఉదాహరణ: తోరాట్, న్యూమాన్ 2010, దేశ్‌పాండే 2011, కన్నన్ 2018 a). అందుకే ఆధిపత్య కులాలతో కూడిన జనరల్ కేటగిరీకి, మిగిలిన కులాలు, ఆదివాసులకు మధ్య వేతనాలలో విపరీతమైన వ్యత్యాసం ఉండటంలో ఆశ్చర్యమేమీలేదు. ఈ అణగారిన సెక్షన్ల కార్మికులు జనరల్ కేటగిరి కులాల వారి వేతనాలలో సగం కంటే తక్కువ వేతనాలు పొందుతున్నారు. 3

ఇక జండర్ విషయానికి వస్తే భారతదేశంలో పితృస్వామ్య వ్యవస్థ ప్రభావం కారణంగా మహిళలు వేతన శ్రమలో పాల్గొనే నిష్పత్తి చాలా తక్కువగా వుంది. 'కుల' స్త్రీలు, ముస్లిం మహిళలు ప్రధానంగా ఇంటికి పరిమితమై, వేతనాలే లేని సామాజిక పునరుత్పత్తి (సోషల్ రీప్రొడక్షన్) పనికే పరిమితమవుతున్నారు. వేతన పనిలో పాల్గొంటున్న పురుషుల కంటే మహిళలకి తక్కువ వేతనాలు లభిస్తాయి. పైగా ప్రతిరోజు జండర్ పరమైన వివక్షకి, వేధింపులకు గురవుతారు. 4

ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో కులం, తెగకు బదులు 'జాతి', జాతితత్వం' అనేవి జండర్, లైంగికతలతోపాటు అణచివేతకు నిర్మాణ వ్యవస్థలుగా వున్నాయి. అమెరికాలో 'తెల్లజాతి' వారితో పోల్చినప్పుడు 'హిస్పానిక్' ఆఫ్రికన్ అమెరికన్' జాతి ప్రజలు అధ్వాన్నమైన ఉద్యోగాలు చేస్తున్నారని, వారి సామర్థ్యం కంటే తక్కువ స్థాయి పనులు చేస్తున్నారని అక్కడి శ్రామిక విపణుల గణాంకాలు తెలియజేస్తున్నాయి. వారి వేతనాలు కూడా చాలా తక్కువగా ఉంటాయనడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. 5. బ్రిటన్‌లో కూడా ఇదే సరళి కనిపిస్తుంది. అక్కడ 'నల్ల బ్రిటిష్' వారికంటే 'తెల్లబ్రిటిష్' ప్రజలు మంచి ఉద్యోగాలలో వుండే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. 'తెల్లబ్రిటిష్' ప్రజలు నిరుద్యోగులుగా వుండే అవకాశం తక్కువ. వారి ఆదాయాలు కూడా ఇతర ప్రజలకంటే ఎక్కువగానే ఉంటాయి. 6. తెల్లబ్రిటిష్ జాతి మహిళల కంటే మైనారిటీ జాతుల మహిళలలో నిరుద్యోగం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. వారి మధ్య వేతనాలలో కూడా గణనీయమైన తేడా వుంది. 7. ఈ అసమానతలకు చారిత్రక వివక్ష, ఉద్యోగ అర్హతలలో తేడాలు, ఈ రెండూ కారణాలే, వాటితోపాటు పని దొరికే అవకాశాలలో, వేతనాలలో వివక్ష కూడా కొనసాగుతున్నాయి (ఉదాహరణకు, బొరోవ్‌జిక్–మార్టిన్స్ తదితరులు2017, హీత్ మరియు డీస్టాసియో2019. ఈ కారణాల మూలంగానే వివిధ మైనారిటీ జాతుల ప్రజల మధ్య కూడా అనేక వ్యత్యాసాలున్నాయి.

ప్రపంచ స్థాయిలో ఉనికిలో వున్న ఈ సరళి యాధృచ్ఛికమైనది కాదు. ప్రతి దేశ పెట్టుబడిదారీ విధానం పెరిగిన పద్ధతికి, ఆ దేశంలో ఉండే ప్రత్యేక కార్మిక శక్తికున్న సాంస్కృతిక లక్షణాలే ప్రధాన నిర్ణాయక అంశంగా పని చేస్తాయని స్టువర్ట్‌హాల్ (1986), ఆనాసింగ్ (2009) తదితరులు వాదించారు. పెట్టుబడిదారీ విధానపు వివిధ దోపిడి రూపాలు కొనసాగటానికి జాతి, జండర్, జాతీయహోదా తదితర అంతరాల రూపాలు ఉనికిలో ఉండటం చాలా ముఖ్యం (హాల్ 1986:24). పెట్టుబడిదారీ విధానం అటువంటి అంతరాలను కొనసాగించి, అభివృద్ధి చేసి, మెరుగుపరుస్తుంది. 15వ శతాబ్దం చివరి నుండి ఐరోపా శక్తులు ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో జరిపిన జాతి సంహారక అణచివేత, దోపిడీలతోపాటు, జాత్యహంకార సిద్ధాంతాలు కూడా రూపొందాయని ఎటియన్ బలిబార్ (1991) తదితరులు వివరంగా చెప్పారు. అదే విధంగా అణచివేత, దోపిడీ క్రమాలకు జండర్ మరియు సామాజిక పునరుత్పత్తి ఏ విధంగా కేంద్రంగా వుంటాయో ఇతరులు నిరూపించారు. (ఉదాహరణకు, పెడెరిచి 2004, ఫారిస్ 2015, ఫెర్గ్యూసన్, మెక్‌నాలే 2014). వర్గ సంబంధాలు, జాతి, జండర్, లైంగికతల మధ్య సంబంధాలు ఈ రెండూ కూడా సహ నిర్మాణ విభాగాలు

అని డేవిడ్ కామ్‌ఫీల్ట్ వాదించారు. 8 వర్గ దోపిడీ మరియు జాతి, కులం, జండర్, లైంగికత, స్థలం పరంగా జరిగే అణచివేతలు 'పెట్టుబడి సమీకరణ ప్రక్రియ' ఒకదానితో మరొకటి పెనవేసుకుని, విడదీయరాని తీవ్రమైన అణచివేత సంబంధాలను' ఉత్పత్తి చేస్తాయి (లర్ష్, షా 2018:5).

ఈ ప్రక్రియలు కార్మికుల మధ్య మరిన్ని సామాజిక విభజనలు సృష్టించటం ద్వారా జరుగుతాయి. ఉదాహరణకు 19వ శతాబ్దంలో ఫ్రెంచి బూర్జువా వర్గం కార్మిక వర్గాన్ని ఏ విధంగా విభజించిందో బలిబార్ వివరించారు. కార్మిక వర్గంలోని కొన్ని సెక్షన్లను వేరుచేసి, విభజించి 'ప్రమాదరకమైన వర్గాలు'గా, 'భయం సృష్టించేవి'గా ముద్రవేసి, వారికి ఇతరులతో సమాన హక్కులు వుండకూడదని వాదించారనీ; అలాగే ఈరోజు వలస కార్మికులని ఆ స్థానంలో ఉంచి వారికి రాజకీయ హక్కులను, పని స్థలాలలో హక్కులను కాలరాయడం జరుగుతున్నదని కూడా బలిబార్ వివరించారు. అమెరికా అంతర్యుద్ధం తర్వాత పెట్టుబడిదారులు, గతంలో బానిస యజమానులుగా వున్న వారు కలిసి నల్లజాతి ప్రజలను ఆటవికంగా అణచివేయడానికి, రక్తపాతం సృష్టించడానికి, తెల్లజాతి కార్మికులను సమైక్యం చేయటంలో ఏ విధంగా విజయవంతమయ్యారో దుబాయిస్ (1998) (1935) నివేదించారు. జాత్యహంకార స్వభావం గల కార్మిక వర్గాన్ని సృష్టించటంలో భాగంగా నల్లజాతి కార్మికులను ఏ విధంగా 'అజ్ఞానులు', 'దుర్గంధపరులు', 'హీనజాతి' అని ముద్ర వేసి కళంకితులుగా చేసారని వివరించారు (1991:178). మేము ఇంతకు ముందు చెప్పినట్లు (షా, లర్ష్ 2018) భారతదేశంలో దళితులు, ఆదివాసులు, ఇతర సామాజిక సమూహాలపై ముందునుండి కొనసాగుతున్న, మారిన, అణచివేతభరిత సామాజిక సంబంధాలు పెట్టుబడిదారీ విధానపు విస్తరణలో సమగ్ర భాగంగా కొనసాగుతున్నాయి. మూడు అంత: సంబంధమున్న ప్రక్రియల ద్వారా ఇది జరుగుతోంది.

**మొదటిది:** ముందునుండే ఉండిన అధికార అసమానతలు అణగారిన వర్గాలను, ఆధిపత్య సామాజిక వర్గాలు, రాజ్యం అదుపు చేసే ప్రక్రియల ద్వారా, పెట్టుబడిదారీ విధానంలో భాగం కావటానికి దారితీశాయి. దళితులు, ఆదివాసులలో అత్యధికులకు విపరీతమైన చారిత్రక ప్రతికూల పరిస్థితులు, అధికారాలు లేని పరిస్థితులు వారిని ఆధునిక ఆర్థిక వ్యవస్థలోని సామాజిక, ఆర్థిక పిరమిడ్‌లో అట్టడుగున బతికేటట్లు చేసాయి. అదే సమయంలో భూయజమానులు, అగ్రకులాలకు చెందిన సెక్షన్లు, పెట్టుబడిదారీ విధానంలో తమకున్న చారిత్రక, ఆర్థిక, రాజకీయ పరపతిని ఉపయోగించి ఆధిపత్య బృందాలుగా తలెత్తాయి (షా, లర్ష్ 2018: 17–19).

**రెండవది:** భారతదేశంలో అత్యధిక దోపిడీకి గురయ్యే వలస కార్మికులలో ఆదివాసులు, దళితులు ప్రధానమైన భాగంగా తయారయ్యారు (షా, లర్ష్, 2018). ప్రపంచ

**అనుబంధం**

**'ప్రమాదకరమయిన వర్గాలు': అప్పుడు, ఇప్పుడు**

19వ శతాబ్దపు ఫ్రాన్స్‌లో శ్రామిక వర్గాల గురించి బూర్జువా వర్గం జరిపే చర్చల్లో 'ప్రమాదకరమయిన వర్గాలు' లేదా 'అపాయకరమైన వర్గాలు' అన్న వర్ణన కీలక పాత్ర పోషించింది. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతానికి వలస వచ్చి కొత్తగా శ్రామిక వర్గంలో చేరిన పేద వారిని 'మురికి కూపాలు', 'రోగాల పుట్టలు' 'చెడపుట్టిన వాళ్ళని' అనటం; దొంగలు, భిక్షగాళ్ళు, నేరస్థులు, పడుపువృత్తి చేసేవాళ్ళు, గాలికి తిరిగే వాళ్ళు, జూదరులు అని వర్ణించటం చాలా మామూలుగా, జరిగేదని బలిబార్ తదితరులు చెప్పారు (షా & లర్ష్ 2018: 15). వీళ్ళు వ్యక్తులుగా అపాయకారులని, కలిస్తే ఎవరూ ఆపలేని, అదుపు తప్పి ప్రవర్తించే ప్రమాదకరమయిన గుంపు అని వీరంటే బూర్జువా వర్గంలో అపారమైన భీతి వుండేది. (షెవలియే 1981, మల్లని, 1983, షు 2011).

1840లలో ఎచ్ ఏ ఫ్రెజియర్ వంటి వాళ్ళు, వారి పేదరికానికి, వారున్న పరిస్థితులకి ఆయా వర్గాలనే తప్పు పట్టి, ఆ నికృష్ట స్థితి నుండి బయటపడటానికి నైతిక పరివర్తన మాత్రమే పరిష్కారమని చెప్పేవాళ్లు. ఈచర్చలు వారిని ఇలా నెట్టిన పరిస్థితులకి, పెట్టుబడిదారి సంబంధాల వృద్ధికి మధ్య సంబంధాన్ని పూర్తిగా మరుగుపరిచి వాటిని మార్చటానికి పనికొచ్చే రాజకీయ ఎత్తుగడలకి సాధికారత లేకుండా చేశాయి (మల్లని, 1983).

మార్క్స్ కూడా సరయిన శ్రామిక వర్గాన్ని, అదే వర్గంలోని వ్యతిరేక సెక్షన్ల నుండి వేరు చెయ్యటానికి 'భ్రష్ట శ్రామిక వర్గం' (లంపెన్ ప్రోలెటేరియేట్) అన్న పదాన్ని ఉపయోగించి దాదాపు 'అపాయకారమయిన వర్గాలు' అన్న అర్థంలోనే వారిని వర్ణించారు, అందువల్ల కాపిటల్ సంపుటి 1ని 1887 లో మొట్టమొదటిసారి ఇంగ్లీషులోకి అనువదించినప్పుడు, 'అపాయమయిన వర్గాలు' అన్న వర్ణననే ఉపయోగించారు.

19,20,21 శతాబ్దాలలో పెట్టుబడిదారి విధానం ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన క్రమంలో బూర్జువా చర్చా గోష్ఠులలో కూడా మార్పు వచ్చింది. 'అర్హులయిన' శ్రామిక వర్గాల్లోని భాగాలని సమాజంలోకి ఆమోదించి, శ్రామిక శ్రేణిలో అట్టడుగున వుండే 'అపాయకరమయిన వర్గాలని' దూషించటంలో భాగం కమ్మని వీరిని ప్రోత్సహించారు. పైన వ్యాసంలో వివరంగా చర్చించినట్లు, ఎవరు ఆమోదయోగ్యమయిన వాళ్ళు, ఎవరుకారనే ఈ విభజన జాతి (రేస్), కులం, జాతీయత, వలసలు వంటి వాటిపై ఆధారపడుతుంది.

20వ శతాబ్దంలో వామ పక్ష రచయితలు 'అపాయకరమయిన వర్గాలు', 'భ్రష్ట శ్రామిక వర్గం' వర్ణనల అర్థాలని తిరగరాసి, దోపిడీ, పీడనలకి వ్యతిరేకంగా పోరాడి బూర్జువా వర్గానికి అసలయిన ప్రమాదాన్ని తెచ్చే శక్తి ఈ వర్గాలకే ఉందని నొక్కి చెప్పారు. ఫ్రాంజ్ ఫెనో, బ్లాక్ పాంథర్ పార్టీ, ఏమిల్కర్ కెబ్రాల్, వివిధ స్థాయిలలో, జాతి (రేస్) పరంగా అణచబడిన భ్రష్ట శ్రామిక వర్గం రాజకీయంగా ప్రగతిశీల పాత్ర పోషిస్తోందని వాదించారు (మెర్రీ ఫీల్డ్ 2019, వోర్సెలీ 1972). హర్ట్ మరియు నెగ్రి సిద్ధాంతీకరణ ఈ వాదనని మరింత ముందుకు తీసుకువెళ్తుందని షు అభిప్రాయపడ్డారు. 'పొట్ట చేతిలో పట్టుకుని ఊరూరా తిరిగే సంచార సమూహాలు' అసలు సిసలయిన ప్రమాదకర వర్గాలు అంటే, అందరికన్నా ప్రగతిశీల వర్గాలని; ఆధునిక పెట్టుబడిదారీ విధానంలో ఏర్పడిన కొత్త సామ్రాజ్యాలకు (ఎంపైర్) వ్యతిరేకంగా పోరాడగలిగే బహుళత్వ సమూహాలలో (మల్టిట్యూడ్) వీరు ముఖ్యమని అంటారు (హర్ట్ & నెగ్రి 2004 133). నిర్మాణాంతర వాదంలో (పోస్టు స్ట్రక్చరలిస్టు) శ్రామిక వర్గం కాక, నిజమయిన మార్పు తెచ్చే వాళ్ళు పెట్టుబడి దారి సమాజ అంచుల నుండి వస్తారనే ఆలోచన కూడా ఇటువంటిదే (ఉదాహరణకి ఎస్టీవా 1992). పూర్తి భిన్నమయిన దృక్పథం నుండి రాసే గై స్టాండింగ్ కూడా 'ప్రికారియేట్' (ఏ భద్రత లేని ప్రజ) ఎప్పటికయినా ఇటువంటి 'ప్రమాద కరమయిన వర్గంగా మారే అవకాశం లేకపోలేదని వాదిస్తారు(స్టాండింగ్ 2015).

ఈ వివిధ మేధావులు చెప్పిందీ, మమ్మల్ని ఈ 'అపాయకారమయిన వర్గాలు' అన్న వర్ణన వాడటానికి ప్రభావితం చేసిన విషయం ఏమిటంటే, 'ఇతరులుగా' (మనకి చెందని, సంబంధంలేని, ఉండకూడని) చూడబడిన వాళ్ళు, జాతి, కులం పరంగా తీవ్ర దోపిడీకి, పీడనకు గురయ్యే వాళ్ళు కూడా ఆ పీడనకు వ్యతిరేకంగా పోరాడే శక్తిని పొందగలరు; ఇది ఒక ప్రగతిశీల పోరాటం; ప్రగతిశీల పోరాటాలకు పై నుండి రుద్దబడిన జాతి, కులపరమయిన విభజనలని అధిగమించటం కీలకం. మనం 'అపాయకారమయిన వర్గాలు' అన్న వర్ణనని పీడన కొనసాగింపులో భాగంగా వాడుతున్నారని గుర్తిస్తూనే, ఈ వర్గాలు అధికారంలో వున్న వారికి నిజమయిన హాని తలపెట్టగవలనే విషయం కూడా గుర్తించాలి!

**జన్స్ లర్ష్, అల్పా షా**
అనువాదం: **ఎ.సునీత**

వ్యాప్తంగా వలస కార్మికులు సమాజంలో అట్టడుగు స్థాయిలో వుండే అత్యంత కఠినమైన, అతి తక్కువ వేతనాలుండే అత్యంత ప్రమాదకరమైన, అసంఘటిత రంగంలోని అనధికారిక ఉద్యోగాలు, పనులు చేస్తారు. తరుచుగా వారు పనిచేసే దేశంలో వారికి పౌరహక్కులు, కార్మిక హక్కులు నిరాకరించబడతాయి (ఫెర్గ్యూసన్, మెక్‌నాలే 2014), భారతదేశంలో వున్న దాదాపు 10 కోట్ల మంది సీజనల్ వలస కార్మికులు, ప్రధానంగా అత్యంత పేద, దోపిడీకి గురయ్యే ప్రాంతాల నుండి వెళ్లే అంతర్గత వలస కార్మికులు, వీరిని నియోగించి పెట్టుబడిదారులు స్థానిక శ్రామికులను పక్కకు నెట్టివేసి, వారిని చౌకశ్రమగా ఉపయోగిస్తారు. ఆ విధంగా మొత్తం శ్రామిక శక్తిని ముక్కలుగా విడగొడతారు. అత్యధిక గ్రామీణ దళిత, ఆదివాసీ కుటుంబాలకు చెందిన పురుషులు, అధిక శాతం మహిళలు అధ్వాన్నమయిన, కఠినమైన, తీవ్ర అభద్రతతో కూడిన పనులు చేస్తున్నారు. వారికి చాలా తక్కువ వేతనాలు దొరుకుతాయి. ఇతర వెనుకబడిన కులాలు, ముస్లింలలోని పేదలు కూడా అనేక మంది వలస వెళతారు. ఇటుకబట్టీల రంగంలో ఎక్కువగా ఆదివాసులు, దళితులు పనిచేస్తారు. అక్కడ పని పరిస్థితులు అత్యంత దారుణంగా ఉంటాయి. భవన నిర్మాణ కార్మికులలో, వ్యవసాయ కోతలు కోసే కూలీలలో, వస్తువుల తయారీలోని కింది స్థాయి పనులలో దళితులు, ఆదివాసులే అత్యధికం. వారి వేతనాలలో కోత, మధ్యదళారుల దోపిడీ అనేవి చాలా మామూలుగా జరిగే విషయాలు. వారు అత్యధిక దోపిడీకి గురవుతారు. పని ఇచ్చిన యజమానులు వారికీ, వారి కుటుంబ సంరక్షణకు సరిపడే కనీస జీతాలు కూడా చెల్లించరు. వాళ్ళు తమ స్వంత గ్రామాలలో వున్న అతికొద్ది ఆస్తులు, ఇతర కుటుంబ సభ్యుల ఆదాయంపైన కూడా ఆధారపడవలసి ఉంటుంది. సీజను వారీగా వలస వెళ్లే వారు కుటుంబ సమేతంగా వెళతారు. అంతర్జాతీయ వలస కార్మికుల మాదిరిగానే ఇక్కడ కూడా వారు పనిచేసేచోట, పౌరులకు వుండే హక్కులేవీ వుండవు. ప్రభుత్వ ఆహార పంపిణీ వ్యవస్థ, పాఠశాలలు, గృహవసతి వంటి ప్రభుత్వ సేవలు అందుబాటులో వుండవు. వోటింగ్ హక్కులు వుండవు, కార్మిక హక్కులు వుండవు. కోవిడ్-19 సమయంలో జరిగినట్లు యజమానులు ఎటువంటి జవాబుదారీతనం లేకుండా వారిని పని నుండి, నివాసాల నుండి ఎప్పుడైనా వెళ్లగొట్టవచ్చు. ప్రభుత్వం వారిని తన ప్రయోజనాల కోసం నికృష్ట జీవులుగా చూడవచ్చు.

**మూడవది:** సమ్మిళిత అణచివేత అనేది ఈ ప్రక్రియలో భాగమే. దళితులు, ఆదివాసులు, ఇతర మైనారిటీలను నిందించి అవమానించటం అనేది స్వతంత్ర్యం వచ్చిన తర్వాత కొంత వరకు తగ్గింది. రిజర్వేషన్ల ఫలితంగా వారిలో కొంతమంది మంచి ఉద్యోగాలు పొందటానికి వీలు కలిగింది. కులవివక్ష వ్యతిరేక చట్టం కొంత ప్రభావం చూపింది. కానీ అణచివేత, అవమానాలు పూర్తిగా తొలగిపోలేదు. అవి రూపం మారి కొత్త పద్ధతులలో పనిచేస్తూ ఆధునిక వ్యవస్థలో దోపిడీ స్వభావం గల సామాజిక శ్రమ విభజన, అధికారం విస్తరించడానికి వీలు కల్పిస్తున్నాయి. మైనారిటీలను ఇప్పటికీ ఉద్దేశపూర్వకంగా 'ప్రమాదకర వర్గాలు'గా నిందించటం జరుగుతున్నది, అవసరమైతే వారిని హింసాత్మకంగా అణచివేయవచ్చు అనే భావన వ్యాప్తిలో వుంది. మధ్య భారతదేశంలో ఆదివాసీ గ్రామాలను తగులబెట్టి, ఇళ్లను నేల మట్టం చేసి, స్త్రీలను అత్యాచారాలకు గురి చేస్తున్నారు. ఎన్‌కౌంటర్ హత్యలు మరిన్ని రాష్ట్రాలకు విస్తరిస్తున్నాయి. ఆదివాసులు, దళితులు, ముస్లింలను చంపటం, సీజనల్ వలస కార్మికులపై హింసాకాండ క్రమం తప్పకుండా జరుగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. వాళ్ళు రోజువారీగా జాతి, కులపరమైన అవమానాలను భరించాల్సి వస్తున్నది. ఈ వర్గాల మహిళలపై వేధింపులు, అత్యాచారాలు అదుపు లేకుండా కొనసాగుతున్నాయి (షా, లర్ష్ 2018: 29).

దేశవ్యాప్తంగా ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, అగ్రవర్ణ యజమానులు, సాపేక్షంగా తక్కువ కులాలకు చెందిన కార్మికులు ఈ సమ్మిళిత అణచివేతను అమలు చేస్తుండటం కొత్తేమీకాదు. అయితే ఇటీవలి సంవత్సరాలలో దళిత, ఆదివాసీ, మానవ హక్కుల కార్యకర్తలను 'జాతివిద్రోహులు'గా, 'అర్బన్ నక్సల్స్' గా ముద్ర వేసి జైళ్ళల్లో నిర్బంధించటం అనే మరింత దారుణమైన రూపం తీసుకుంది. ఈ విధంగా దళితులను, ఆదివాసులను, ఉద్యమకారులను 'ఇతరులుగా వెలివేయటం', వారిని రెండవ తరగతి పౌరులుగా చూడటానికి వీలు కల్పించి, వారిని సామాజిక ఆర్థిక నిచ్చెన మెట్ల వ్యవస్థలో అట్టడుగున ఉంచుతుంది.

కులం, జాతి, జండర్ సంబంధాలు ఒకే రకమైనవి కావు అనేది నిజమే. కానీ ఈ సామాజిక సంబంధాలలో ఉండే ఉమ్మడి విషయం ఏమిటంటే, ఉనికిలో ఉన్న ఈ సామాజిక విభజనలను పెట్టుబడిదారీ విధానం తన స్వంత అవసరాల కోసం ఉపయోగించుకుంటుంది, కాబట్టి అవి అణచివేత, దోపిడీలను వ్యవస్థీకృతం చేయటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా స్పష్టంగా ముందుకొచ్చిన ఉమ్మడి ధోరణి ఏమిటంటే పెట్టుబడిదారీ విధానం ఒకే రకమైన సజాతీయ కార్మిక వర్గం ఏర్పాటుకు దారి తీయలేదు. అందుకు విరుద్ధంగా అది ఆధిపత్య బృందాలతో, ప్రధానంగా పురుష కార్మిక బృందాలతో జాతీయవాద, జాత్యహంకార, స్త్రీవ్యతిరేకత స్వభావంగల పొత్తులు పెట్టుకుంది. తెల్ల బ్రిటిష్ జాతీయులు, తెల్ల అమెరికన్లు లేదా ఇతర వెనుకబడిన కులాలు, జనరల్ కేటగిరికి చెందిన అగ్రవర్ణ హిందువులు మొదలైన వారితో మైత్రీ సంబంధాలు ఏర్పరుచుకుంది. ఈ బృందాలన్నీ 'ప్రమాదకర వర్గాలు', 'ఇతర వెలివేయబడ్డ' సామాజిక బృందాల నుండి తమ 'అధికారాలను' రక్షించుకోవటానికి అటువంటి పొత్తులలోకి దిగుతాయి. 'ఇతర వెలివేయబడ్డ' సామాజిక బృందాలను అట్టడుగుకు తోసివేయటం, 'కిందికి తొక్కివేయటం' అనేది ఈ పొత్తులకు దిగే కార్మిక బృందాలకున్న అతికొద్ది అదనపు హక్కులను కాపాడటానికేనని వాళ్లకు నూరిపోయటం జరుగుతుంది.

కార్మికులలో ఒక సెక్షన్ను కళంకితులుగా అవమానించి కార్మిక వర్గాన్ని విభజించటం అనే ప్రక్రియకు సుదీర్ఘ చరిత్ర ఉన్నప్పటికీ (బ్రిటిష్ కార్మిక వర్గంలో విభజనలకు సంబంధించి కార్ల్ మార్క్స్ కూడా హెచ్చరించాడు) కార్మిక సంఘాలు అటువంటి విభజనలను ఎదుర్కొని పరిష్కరించటానికి ప్రయత్నించిన సందర్భాలు ఇప్పటికీ చాలా అరుదు. కార్మిక సంఘాలు ఈ సమస్యను పరిష్కరించుకున్నట్లయితే అత్యంత అణచివేతకు, దోపిడీకి గురయ్యే సెక్షన్లకు నిర్ణయాధికారం ఉండే వ్యవస్థలలో సరైన ప్రాతినిధ్యం కల్పించటానికి వీలవుతుంది.

బ్లాక్ లైవ్స్ మాటర్ (నల్ల వారి ప్రాణాలు విలువైనవి)అనే ఉద్యమం చుట్టూ తలెత్తిన వాదోపవాదాలు, చర్చ, నిర్మాణం కార్మిక సంఘాలకు, ఉద్యమాలకు, ఉద్యమకారులకు మైనారిటీలపైన శ్రమ దోపిడీలో భాగంగా జరిగే అణచివేతను ఎదిరించటానికి ఒక మంచి సందర్భమవుతుంది.


అనువాదం: **ఆశాలత**

**ఆశాలత** మకామ్‌లో సభ్యురాలు, వ్యవసాయరంగ చర్చల్లో చురుగ్గా పాల్గొంటారు

**జన్స్ లర్ష్** ఎస్ఓఎఎస్‌లోని లేబర్ అండ్ ఎగ్రేరియన్ స్టడీస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్
ఈ మెయిల్ *j12@soas.ac.uk*

**అల్పా షా** లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ మరియు పొలిటికల్ సైన్స్‌లో అసోసియేట్ ప్రొఫెసర్
ఈ మెయిల్ *a.m.shah@ise.ac.uk*


**నోట్సు:**

1.షా, లర్ష్, తదితరులు (2018) రాసిన పుస్తకం హిందీ అనువాదం కోసం రిఫరెన్సులలో చూడండి

2. 2017-2018లో అగ్రకులాల్లో కేవలం 13.8% మాత్రమే రోజు కూలీలుగా వున్నారు, కాగా దళితులలో 41.2%, ఆదివాసులలో 31.1%, ముస్లింలలో 26.4%, ఇతర వెనుకబడిన కులాలలో 22.9% రోజు కూలీలుగా వున్నారు(గవర్నమెంట్ ఆఫ్ ఇండియా 2019 : ఎ.401-402, ఎ.440)

3. 2017-2018లో దళితులు, ఆదివాసులు, ముస్లింలు, ఇతర వెనుకబడిన కులాల వారి సగటు ఆదాయం అగ్రకులాల ఆదాయంలో వరుసగా 48%, 57%, 66%, 67% వుంది (కన్నన్ 2019). రోజుకి 2 డాలర్లుగా ప్రపంచ బ్యాంకు నిర్ణయించిన పేదరిక సూచిక ప్రకారం దళితులు, ఆదివాసులలో 82% (2009-10), పేదలే (కన్నన్ 2018 ఎ:35)

4. 2017-2018లో మహిళా శ్రామికుల నిష్పత్తి 24% మాత్రమే. 2012లో గ్రామీణ, పట్టణ మహిళా కార్మికుల వేతనాలు పురుషుల వేతనాలలో వరుసగా 68%/60% మాత్రమే (కన్నన్ 2018బి : 12) దళితులు.

ఆదివాసులలో స్త్రీ పురుష సంబంధాలలో అంతరాలు తక్కువ, మహిళలు శ్రమలో పాల్గొనే నిష్పత్తి కూడా ఎక్కువే. రోజు కూలీ చేసే మహిళా కార్మికులపై లైంగిక వేధింపుల వివరాలకు ప్యారీ (2014) చూడండి


5. 2018లో, 41% 'తెల్లజాతివారు' మేనేజిమెంట్, వృత్తి సంబంధ ఉద్యోగాలలో ఉండగా 'నల్లవారి'లో కేవలం 31%, 'హిస్పానిక్‌లాటినో'లలో 24% మాత్రమే వున్నారు. తెల్లవారితో పోలిస్తే 'నల్లజాతి' తదితరులలో రిజిస్టర్ అయిన నిరుద్యోగుల సంఖ్య దాదాపు రెట్టింపు వుంది.(6.5% అండ్ 6.6% ఎగనిస్ట్ 3.5%); 'హిస్పానిక్‌లాటినో' 4.7% నిరుద్యోగులుగా నమోదయ్యారు. 'నల్లజాతి' వారు ఇతర మైనారిటీల సగటు వేతనాలు 'తెల్లవారి' వేతనాలలో 75% గా వున్నాయి. (యు.ఎస్ బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ 2019).


6. బ్రిటన్లో ఉన్నత స్థాయి మేనేజిమెంటు పదవులలో 'తెల్లబ్రిటిష్; వారు (11%) 'నల్ల'వారు 5% గా వున్నారు. కాగా తక్కువ స్థాయి ఉద్యోగాలలో అది విరుద్ధంగా వుంది (10%తెల్లవారు, 16%నల్లవారు). బాంగ్లా దేశ జాతీయుల ఆదాయం 'తెల్లబ్రిటిష్' వారి ఆదాయంలో 44% మాత్రమే వుంది, పాకిస్తానీయులు, నల్ల ఆఫ్రికన్ల ఆదాయం కూడా దాదాపు అంతే వుంది. (గవర్నమెంట్ ఆఫ్ యు.కె) (కార్లెట్ 2017).

7. 2019లో బ్రిటన్లో మొత్తం మీద వేతనాల తేడా 17.3%; పూర్తి కాల ఉద్యోగులలో ఆ తేడా 8.9% (ఆఫీస్ ఆఫ్ నేషనల్ స్టాటిస్టిక్స్) తెల్లబ్రిటిష్ వారితో పోలిస్తే మైనారిటీ జాతులలో మహిళల ఉపాధి శాతం చాలా తక్కువ, బాంగ్లాదేశ్, పాకిస్తానీయుల విషయంలో అది సగం కంటే తక్కువగా వుంది (కార్లేట్ 2017)

8. ఆలోచనలో కూడా ఇది స్వాభావికంగా వుంది అని డేవిడ్ కామ్ పీట్ల్ (2015) సూచన.

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*



# వలసలు, అనధికారికత: అంతర్లీన ప్రక్రియలు

## ■ సుమంగళ దామోదరన్

2020 సంవత్సరం మార్చి నెల 21వ తారీఖున, దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధిస్తున్నట్లు ప్రకటన వచ్చింది. దానికి ప్రతిస్పందనగా, లక్షలాది మంది వలస కార్మికులు ఆ నెలాఖరు నుంచి వారి వారి కుటుంబాలతో పాటు కాలిబాట పట్టారు. తమ పని ప్రాంతాల నుండి సొంత ఊళ్లకు, వేలాది మైళ్ళు సుదీర్ఘ ప్రయాణాలు సాగించటం మొదలు పెట్టారు. ఎప్పుడూ ఏ మాత్రం గుర్తింపుకు నోచుకోని ఈ ప్రజలు ప్రయాణాల్లో ఎదుర్కొన్న ప్రమాదాలు, ఆకలి చావులు; రాష్ట్ర సరిహద్దుల్లో, లేదా రైలు స్టేషన్లలో అనుభవించిన అవమానాలకు సంబంధించిన కథలెన్నో రెండు నెలల పాటు వార్తలయ్యాయి. భారీ వలసలతో కూడుకొన్న సాధక బాధకాల గురించి ఎంతో కొంత తెలిసినప్పటికీ, తినడానికి తిండిలేక చనిపోవాల్సి వస్తుందనే ఆందోళనతో, తమ కుటుంబ సభ్యుల దినసరి అవసరాలని తీర్చలేని నిస్సహాయతతో, కోవిడ్ మహమ్మారి అంటుకుంటుదేమోననే భయంతో, సొంత ఊళ్లల్లో కొంతైనా రక్షణ దొరుకుతుంది అనే ఆశతో వాళ్ళు ఈ వలసలు కొనసాగించారు. ప్రభుత్వం వీరి పట్ల చూపిన నిరాదరణని కొంత మంది తీవ్రంగా ఖండించారు. అయితే మరికొందరు ప్రభుత్వ సహాయం కోసం వేచి ఉండకుండా, వారు ఇటువంటి ప్రమాదకరమైన భారీ వలసలు చేపట్టటం ఒక అహేతుక చర్యగా భావించారు.

మనదేశ జనాభాలో పెద్ద శాతమైన కార్మికులు తమ ఉద్యోగాలను, ఉపాధిని పూర్తిగా కోల్పోవడం అనేది లాక్ డౌన్ మూలాన జరిగిన అతి పెద్ద నష్టం. లేబర్ మార్కెట్లల్లో ఇమిడి ఉన్న అనధికారికతని కూడా లాక్‌డౌన్ మన ముందుకు తెచ్చింది. అంతేకాదు, తక్కువ భద్రతతో కూడిన చిన్న చిన్న ఉద్యోగాలు, వృత్తి పనుల్లో పాల్గొనే కార్మికులే తమ సొంత ఇళ్ల బాటు పడుతున్నారని కూడా స్పష్టం చేసింది. వలసలకు, అనధికారికతకి మధ్య ఉన్న సంబంధాల గురించి సామాజిక శాస్త్రాల్లో పరిశోధనలు, అధ్యయనాలు ఎప్పుడో జరిగాయి. అయితే, వాటి ఫలితాల పట్ల మనకి ఉండాల్సిన పూర్తి అవగాహన మాత్రం భారత దేశంలో కోవిడ్ మహమ్మారి ప్రబలి, దానిని అరికట్టడానికి లాక్ డౌన్ విధించిన ప్రస్తుత పరిస్థితుల్లోనే ఏర్పడిందని చెప్పవచ్చు.

గత రెండు మూడు దశాబ్దాల నుండి, ఉద్యోగాల్లో, వృత్తి పనుల్లో అనధికారికత ప్రబలిపోయి ఉందనీ, అది భారతదేశ ఆర్థిక వ్యవస్థలో లోతుగా పాతుకుపోడానికి వలస ప్రజల జీవితాల్లోని సంక్లిష్టత ఎట్లా సహకరించిదనే అంశాన్ని ఈ వ్యాసం విశ్లేషిస్తుంది. గ్రామాలు, పట్టణాల మధ్య జరిగే వలసలని అర్థం చేసుకోవాలంటే, గ్రామాలకి, పట్టణాలు లేదా నగరాలకి మధ్య ఉన్న సంబంధం గురించి లేదా, ఇంటికీ, పని ప్రాంతానికి మధ్య ఉన్న సంబంధం గురించిన అవగాహన సమగ్రంగా ఉండాలి. వలస కార్మికులు నివసించే గ్రామాలు, వారు వలసలు వచ్చే పట్టణాల పరిస్థితులలో ఎంతో వైవిధ్యం ఉంటుంది. అయితే, రెండింటికీ మధ్య పొత్తు ఉంటుందని కోవిడ్ మహమ్మారి, దానికి కార్మికుల నుండి వచ్చిన ప్రతిస్పందన మనకి స్పష్టం చేసింది. ఒకటి, ఆపద వచ్చినప్పుడు అందరిలో సొంత ఇంటికి వెళ్ళిపోవాలనే తపన; రెండు, వారి ఉద్యోగాల్లో, కూలి పనుల్లో రోజు రోజుకీ పెరిగిపోతున్న అభద్రత. నిజానికి, ఈ రెండు అంశాలు భారతదేశ పని ప్రపంచాన్ని నిర్వచించడమే కాదు, ఈ అనధికారిక ప్రక్రియల్లోనే, గ్రామీణ-పట్టణ సంబంధ బాంధవ్యాలు ముడిపడి ఉన్నాయని స్పష్టం చేస్తున్నాయి. ఈ వ్యాసంలో ఢిల్లీ నగరంలో ఉంటున్న పారిశ్రామిక కార్మికుల గురించిన విశ్లేషణ ఉంది. వలస, వలస కార్మికుల జీవన వాస్తవాలు ప్రస్తుత పని ప్రపంచంలో అనధికారికతకి దోహద పడుతున్నాయని, దీన్ని గ్రామాలు-నగరాలకి మధ్య ఉన్న సంబంధాలు కూడా తీవ్రతరం చేస్తున్నాయని చెప్పటం ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం.

ఢిల్లీ నగరంలో పారిశ్రామిక వాడల్లోనే ఉత్పత్తి ఎక్కువగా జరుగుతుంది. అవి రెండు రకాలు: ఈ నగరాభివృద్ధికి ప్లాన్లు వేసిన మొదటి రోజుల్లో స్థాపించబడిన పాత పారిశ్రామిక వాడలు ఢిల్లీ నగర శుభ్రత, పచ్చదనాన్ని ప్రతిబింబించేటట్లు ఉండే కొత్త పారిశ్రామిక వాడలు. ఈ రెండవ రకంలో భాగమైన కాలుష్య పరిశ్రమల్ని 1990ల నుండి 2000 సంవత్సరం మొదటి వరకు వేరే చోట్లకి తరలించి వాటి స్థానాల్లో ఇంకొన్ని కొత్త పరిశ్రమలని ఏర్పరిచారు. ఢిల్లీ నగరంలో వలసలు, ఉద్యోగాలు, ఉపాధుల మధ్య ఉన్న సంబంధాల మీద చేసిన అధ్యయనం ఈ వ్యాస రచనకు పునాది అయ్యింది.

దీనికోసం వాజీర్పూర్, బదిలీ, పత్పర్ గంజ్ అనే మూడు పారిశ్రామిక ప్రాంతాల్లో నివసించే 300ల మంది పారిశ్రామిక వలస కార్మికులతో చేసిన సర్వే ఫలితాలు, ఈ పారిశ్రామిక ప్రాంతాల చుట్టుపక్కల తాత్కాలికంగా నివాసాలు ఏర్పరుచుకున్న 100 మంది కార్మికులు, కార్మికేతర వ్యక్తులతో మేము జరిపిన ముఖాముఖీ సంభాషణలు తోడ్పడినాయి.

వలసలు, అనధికారికత, ఎట్లా పెనవేసుకుని ఉన్నాయో, గ్రామం-పట్టణం మధ్య ఉన్న సంబంధాలు పారిశ్రామిక కార్మికుల జీవితాలతో ఎట్లా పెనవేసుకుని ఉన్నాయో రెండు ప్రధాన శీర్షికల కింద విభజించాను: (1) కార్మికులకు వారి గ్రామాలతో ఉన్న సంబంధం, (2) పారిశ్రామిక ఉత్పత్తి జరిగే పరిస్థితులు.

### సొంత ఊళ్ళతో సంబంధాలు

మొదటి విషయం, ఢిల్లీలో పనిచేస్తున్న పారిశ్రామిక కార్మికులు అతి పేద వర్గానికి చెంది, భుక్తి కోసం గత్యంతరం లేక, నిరాశతో నగరానికి వలస వచ్చిన వారు కాదు. వారిలో చాలా మందికి గ్రామాలలో ఎంతో కొంత భూమి ఉంది. మరి కొంతమంది భూములున్న కుటుంబాలకి చెందిన వాళ్ళు. వారికున్న భూమి పరిమాణంలో తక్కువ అయినప్పటికీ, ఆ భూమితో ఉన్న సంబంధం వారి అస్తిత్వంలో భాగమయ్యి వారిని సొంత ఊళ్ల వైపు అయిస్కాంతం లాగా పట్టి లాగుతుంది.

రెండవది, వలస వెళ్ళడానికి సాధారణంగా వినిపించే కారణం ఆర్థిక పరిస్థితులు. సొంత ఊళ్లల్లో ఎంతో కొంత పొలం ఉన్న కార్మికులకు కూడా ఇది వర్తిస్తుంది. ఇంతకు ముందు వలసల గురించి జరిగిన పరిశోధనా రచనల్లోనూ, జీవనోపాధుల గురించి వచ్చిన అధ్యయనాల్లోనూ, గ్రామీణ జీవనోపాధులు వ్యవసాయం నుండి వ్యవసాయేతర పనులకు మళ్ళుతున్నాయని స్పష్టం అయింది. కుటుంబాలు ఈ పనులకి మళ్ళి, వ్యవసాయంలో వుండే అస్థిరత, రిస్కుని తగ్గించుకోడానికి చూస్తున్నాయి.

మూడవ విషయం, పారిశ్రామిక కార్మికులు, తమ ఊళ్ళతో మంచి సంబంధాలు ఉన్నవాళ్లు కూడా, పారిశ్రామిక పనుల మీద, ముఖ్యంగా తాము స్వయంగా పాల్గొనే పారిశ్రామిక పనుల మీద ఎంతో ఇష్టం, గౌరవం కలిగి ఉంటారు. మేము చేసిన ముఖాముఖీ సంభాషణల్లో, బట్టలు కుట్టే పనుల్లో ఉన్న వాళ్ళు, స్టీల్ సామాన్ల తయారీలో పనిచేసేవారు, ప్లాస్టిక్ వస్తువుల తయారుచేసే వారు, ఇటువంటి ఇతర చిన్న పాటి పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు వారి పనులు వదులుకొని ఊళ్ళకి వెళ్ళిపోవడానికి సిద్ధంగా లేమని మళ్ళీ మళ్ళీ నొక్కి చెప్పారు.

నాల్గవ విషయం, నగరానికి వలస, గ్రామీణ ప్రజలకు పారిశ్రామిక వృత్తుల్లో పాల్గొనే అవకాశం కల్పించి, వారి, వారి కుటుంబాల జీవన ప్రమాణాలని

మెరుగుపరచటంలో తోడ్పడుతుంది. అందుకే, వలస కార్మికులు పారిశ్రామిక పనుల మూలాన తమకు ఇప్పుడు కలిగే లాభాన్ని, ఎప్పుడో ఒకప్పుడు సొంత ఊళ్లకు తిరిగి వెళ్ళినప్పుడు తమ జీవన శైలి, స్థాయిలో కలగబోయే మార్పులతో నిరంతరం పోల్చుకుంటూ ఉంటారు. నగరం-గ్రామం, లేదా, పని ప్రాంతం-సొంత ఇల్లు మధ్య ఉన్న సంబంధాలు ఒకదానితో మరొకటి ముడిపడి, గ్రామీణ కుటుంబాలని ఆసాంతం ప్రభావితం చేస్తాయి కాబట్టి వారు పారిశ్రామిక కార్మికులైనందుకు గర్వపడతారు.

పరిశ్రమల్లో, లేబర్ మార్కెట్లలో దీర్ఘకాలం పనిచేస్తున్న వలస కార్మికులకి వారి వారి గ్రామాలతో వున్న బంధం; అక్కడ వారికున్న, లేదా కొనుక్కోవాలని ఆశిస్తున్న భూమి, వారిని వారి ఊళ్ళవైపు పట్టి లాగుతుందనీ, అందుకే ఆయా గ్రామాలతో వారు సుదీర్ఘ సంబంధం ఏర్పరుచుకొంటారని పైన పేర్కొన్న నాలుగు అంశాలు సూచిస్తున్నాయి. మేము చేసిన ముఖాముఖీ సంభాషణల్లో ఈ క్రింది మూడు భాగాలు ఈ విశ్లేషణకు అద్దం పడతాయి.

'...బీద కార్మికుడి అసలు సంపద అతనికున్న భూమి. ఏ కొంచెం భూమిలేని వాడి బాధని ఎవరూ అర్థం చేసుకోలేరు. వలస వెళ్లి సంపాదించుకోవాలి అనుకోవడానికి ఒక కారణం భూమి. వలస ఎందుకు వెళ్తారంటే, సంపాదించిన డబ్బుతో, భూమిని సాగు చేసుకోవచ్చు. లేదా, ఇంకా కొంచెం భూమిని కొనుక్కోవచ్చు. లేదా ఉన్న అప్పులు తీర్చుకొని పోగొట్టుకొన్న భూమిని మళ్ళీ పొందవచ్చు. ఇప్పుడు మా శరీరాల్లో బలం ఉంది. కొంత కాలానికి పరిశ్రమల్లో పనిచేయటానికి అవసరమైన శారీరక బలాన్ని కోల్పోతాం. అప్పుడు మాకున్న కాస్త భూమే మాకు దిక్కు, అదే మమ్మల్ని కాపాడుతుంది' (పప్పు లాల్, పత్పర్గంజ్ పారిశ్రామిక ప్రాంతం, ఇతర వివరాలకు దామోదరన్ 2016:178 చూడండి)

"ఎవరైతే తమకున్న భూమినంతా అమ్మేసుకుంటారో వాళ్ళు ఒక ప్రదేశంతో తమకున్న సంబంధాన్ని తమ సొంత చేత్తో తెగతెంపుకున్నట్లే! (అమీర్, 31సం. వజీర్ పూర్ పారిశ్రామిక ప్రాంతం).

'నేను మా ఊరికెళ్ళినప్పుడల్లా అందరూ నన్ను ఎంతో గౌరవంతో చూస్తారు...ఢిల్లీలో ఉన్న ఒక ఫ్యాక్టరీలో పనిచేయడమంటే మా ఊళ్ళో చాలా గొప్ప పని అనే భావన ఉంది. నాకున్న చదువుతో నేను కనుక పొలంలో పనిచేసినట్లయితే, నాకు ఇటువంటి గౌరవం దక్కేది కాదు. నేను ఒక ఫ్యాక్టరీలో, అందులో ఢిల్లీలో ఉన్నదాన్లో పని చేస్తున్నానంటే నిజంగానే గొప్ప విషయం కదా!' (తేజశ్వర్ శర్మ, వజీర్ పూర్ పారిశ్రామిక ప్రాంతం, దామోదరన్, 2016:178).

వలస కార్మికులు నగరం నుంచి గ్రామానికి చాలాసార్లు వెళ్తూ వస్తూ ఉంటారు కానీ ఒక నిర్దిష్టమైన టైమ్ టేబుల్ పాటించరు. దానితో, వాళ్ళని సీజనల్ కార్మికులుగానో లేదా సర్క్యులర్ వలస కార్మికులుగానో విభజించడం కష్టం (ఇతర విశ్లేషణకు దామోదరన్ 2016 చూడండి). గ్రామంలో ఉన్న భూమిపై వారికున్న మమకారం, నగరంలో వారు చేసే పనులమీదున్న గౌరవం, వారి అస్తిత్వాలని, ఆకాంక్షల్ని బలంగా మలుస్తుంది (అయితే, కొవిడ్-19 మహమ్మారి వచ్చి దాన్ని పూర్తిగా తుడిచిపెట్టేసింది). అందుకే పారిశ్రామిక పనులు, వలసల గురించిన అంశాలని మనం ఇంకా క్షుణ్ణంగా ప్రశ్నించాల్సిన సమయం ఆసన్న మయింది. ఇక పారిశ్రామిక వాడల్లో పని పరిస్థితుల గురించిన విశ్లేషణకి వద్దాం.

**ఉత్పత్తి పరిస్థితులు**

ఢిల్లీ నగరంలో ఉన్న ముఖ్య పరిశ్రమలు: రెడీమేడ్ బట్టల తయారీ, కాగితాలు, కాగితాలతో తయారుచేసే వస్తువులు, రబ్బరు, ప్లాస్టిక్ వస్తువులు, స్టీల్ వస్తువులని రూపొందించడం, ఇంజనీరింగ్ రంగానికి సంబంధించిన మెషీన్లు, విద్యుత్ మెషీన్లు, వాటి రిపేర్లకు అవసరమైన ముడిసరుకులు, వాహనాలకు అవసరమైన పనిముట్లు. పాతవైనా, కొత్తవైనా (నగర శుభ్రత, పచ్చదనం కోసం ఏర్పరచినవి కూడా) పరిశ్రమల రూప కల్పనలో, కార్మికుల పనిపరిస్థితుల్లోనూ అంతటా అనధికారికత నిండి ఉందని మేము చేసిన అధ్యయనంలో తేటతెల్లమైంది. దానికి కొన్ని కారణాలు ఇవి.

మొదటిది, అధికారికంగా ఏర్పడిన పారిశ్రామిక సముదాయాలలో కూడా ఉద్యోగాలలో అనధికారికత ఉండటం వల్ల, ప్రతి ఒక పరిశ్రమలోనూ పెద్ద శాతం పనులు అనధికారిక రంగ కార్మికులకు అందుబాటులో ఉంటాయి. క్షేత్రస్థాయిలో జరిగిన మా పరిశోధనలో మా ముందుకు వచ్చిన ఇంకో విషయం, పరిశ్రమ యొక్క వివిధ రంగాలలో నైపుణ్యంతో కూడిన ప్రత్యేక పనులు కొన్ని ఉంటాయి. ఉదాహరణకి, స్టీల్ రోలింగ్ కార్మికుడు స్టీల్ రోలింగ్ విభాగంలోనే పనికోసం చూస్తాడు. బట్టల తయారీ లాంటి ఇతర పరిశ్రమల్లో కూడా చిన్న చిన్న, సామాన్యమైన పనులు చేసే కార్మికులకు కూడా ఇంకో యూనిట్‌లోకి వెళ్ళగలిగే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఈ స్టీల్ రోలింగ్ కార్మికుడి మాటలు ఈ అంశానికి స్పష్టతనిస్తాయి.

'నాకు ఇక్కడ దొరికిన మొట్టమొదటి ఉద్యోగం, సహాయకుడిగా (హెల్పర్). స్టీల్ రోలింగ్ విభాగంతో నాకు కొంత పరిచయం ఉండింది. ఎనిమిది సంవత్సరాలు గడిచాయి. ఇవాళ నేను మేస్త్రీని (మాస్టర్ వర్కర్). హెల్పర్‌గా ఉన్నప్పుడు మెషీన్లు నడపడం నేర్చుకోవాలి, ఆ తర్వాత ఓనర్ నాకు మేస్త్రీ పని అప్పగించారు. అవును, ఒక ఫ్యాక్టరీ నుండి నేను ఇంకోదానికి మారాను. ఎందుకంటే, కొంచెం ఎక్కువ కూలిడబ్బులు సంపాదించుకోవచ్చు అని' (రామ్ సింగ్, 43 సం. వజీర్‌పూర్').

పని పరిస్థితులన్ని చోట్లా అనధికారికత నిండిపోయి ఉంది. ఒక ప్రదేశం అని కాదు, ఒక పరిశ్రమ అని కాదు, అంతటా అదే పరిస్థితి ఉంది. ఇక ఎన్ని రకాల కార్మికులున్నారనే విషయం ఈ విషయాలపై ఆధారపడుతుంది: వారు పనిలో ఎక్కువ కాలం ఉన్నారా? రోజువారీ పనిలోకి వస్తారా (కాజువల్)? వారికిచ్చే వేతనాలు పని కాలాన్ని బట్టా, లేదా ఒక ప్రత్యేక పని కోసమనా? వివిధ పనుల్లో వారి స్థాయి బట్టి వారి వేతనం కూడా మారుతుందా? మొ॥వి. మామూలుగా, ఎక్కువ మంది కార్మికులు పనిచేసే పెద్ద పెద్ద యూనిట్లలో రెగ్యులర్ కార్మికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. రెగ్యులర్ కార్మికులంటే, ఒకే యూనిట్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న వారు. అలాంటి చోట్ల సుమారు 50% మంది కార్మికులు 10 సంవత్సరాల నుండి పని చేస్తున్నారు. కొంతమందైతే 20 సంవత్సరాల పాటు కూడా పనిచేస్తున్నారు. అయినా, వీళ్ళలో చాల మందికి దొరికే వేతనం ఏ మాత్రం నైపుణ్యం లేని శ్రామికుడి నెల జీతంలో సమానం. అంటే 200 -270 రూపాయిల వరకూ ఉంది. కనీస వేతనదారులకు రావాల్సిన ప్రావిడెంట్ ఫండ్ కానీ, ఇఎస్ఐ సౌకర్యాలు కానీ వీళ్ళెవ్వరికి రావడం లేదు. ఇక్కడ రెగ్యులర్ కార్మికులంటే సాధికారిక ఉపాధి చట్రంలో ఉన్నవారు కాదని మాకు స్పష్టంగా తెలిసింది. వీళ్ళ ఉద్యోగాల జారీకి సంబంధించిన పత్రాలు ఏవీ మేనేజిమెంట్ దగ్గర లేవు. అన్ని సంవత్సరాలు నిలకడగా పని చేసినందుకు వాళ్లకు రావాల్సిన ప్రయోజనాల గురించిన వివరాలు కూడా ఏమి రాతపూర్వకంగా లేవు. 'రెగ్యులర్' కార్మికులుగా తమ వద్ద ఎన్ని సంవత్సరాలు పనిచేశారు అని మాత్రమే ఈ ఫ్యాక్టరీలు బహిరంగంగా చెప్పడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక దినసరి కార్మికులైతే ఒక గుంపుగా ఏర్పడి, ఒక ఫ్యాక్టరీ నుండి ఇంకో దాని మధ్య తిరుగుతూ ఉంటారు. అయితే, వీళ్ళలో కూడా చాలామంది ఒకే ఫ్యాక్టరీలో పనిచెయ్యడానికి ఇష్టపడతారు.

రెండవది, తమ యజమానులు తమ పని, వేతనాలకు సంబంధించిన సూత్రాలని ఏ మాత్రం పాటించడం లేదని చాలా మంది కార్మికులకు తెలుసు. అయితే, వాళ్ళు నొక్కి చెప్పిన విషయాలు రెండు: గ్రామాల కంటే, నగరంలోనే జీవన సదుపాయాలు బాగుంటాయని; అంతకంటే ముఖ్యంగా, నగరంలోని పరిశ్రమల్లో ఒక కార్మికుడిగా పని చెయ్యడం మూలాన, ఊళ్లలో తమకు గౌరవం దొరుకుతుందని. ఈ వ్యాసంలో ఇంతకు ముందు చెప్పినట్లు, వారికి ఊరితో, భూమితో ఉన్న సంబంధం వారి వలసల మీదా, నగరవాసులుగా వారు ఏర్పరుచుకున్న అస్తిత్వాల మీద బలమైన ముద్ర వేస్తుంది.

ఢిల్లీ నగర పరిశ్రమల పనులు, ఉద్యోగాలలో ఇమిడి ఉన్న అనధికారికత కార్మికుల జీవన పరిస్థితులతో బలంగా ముడిపడి ఉందని మనకు ఇప్పుడు స్పష్టంగా తెలుస్తోంది. అంతేకాక, వలస వెళ్లాల్సిన పరిస్థితులు, సొంత ఊళ్ళ మీద వాళ్ళకున్న మమత కూడా ఈ అనధికారికతని

ఎంతో కొంత ప్రభావితం చేస్తున్నాయి. ఇంకో విధంగా చెప్పాలంటే, అప్పుడప్పుడూ సొంత ఊళ్లకు వెళ్లాలనే కోరిక, ఫ్యాక్టరీ సముదాయాలలో సరిపడా ఉద్యోగాలు (చాల సాధారణమైనవి అయినప్పటికీ) ఉండటం అనే రెండు అంశాలు జోడై ఈ పరిస్థితిని కొనసాగిస్తున్నాయి. యజమానులు వాటిని తమకు అనుగుణంగా వాడుకుంటున్నారు. ఈ క్రమంలో అనధికారికత, లేబర్ ఖర్చుల్లో తగ్గుదల మరింత కొనసాగుతోంది.

సారాంశం: ఎ) ఢిల్లీ నగర పారిశ్రామిక ప్రాంతాలకు వలస వస్తున్నవారు గ్రామాల్లో నివసించే అతి పేద ప్రజలు కారు. వారిలో చాలామందికి కొద్దిపాటి భూములు ఉన్నాయి. ఆ భూముల అసలు విలువ కన్నా, అది ఊరితో వారి బంధానికి ప్రతీక కాబట్టి వారు దానికి ఎక్కువ విలువ ఇస్తారు. బి) సాగు పనుల కోసం, లేదా ఇంకొంచెం భూమి కొనుక్కోవడం కోసం లేదా అప్పుల్లో చేజారిపోయిన భూమిని తిరిగి పొందడం కోసం వాళ్ళు సొంత ఊళ్లకు పలుసార్లు ప్రయాణాలు చేస్తారు. అనధికారికత పారిశ్రామిక వాడల్లోని వారికి అటువంటి అవకాశం కల్పిస్తోంది. సి) పారిశ్రామిక పునరావాసం, శుభ్రత, పచ్చదనంతో కూడిన కొత్త పరిశ్రమల స్థాపన జరుగుతున్నప్పటికీ, పారిశ్రామిక అభివృద్ధి అట్టడుగు స్థాయిలో కొనసాగడానికి వలస అనే బృహత్తర పరిణామం తోడ్పాటు చాలా ఉంది.[2]

**చివరిమాట: కొవిడ్–19 వెతలు**

పారిశ్రామిక ఉత్పత్తికి సంబంధించిన పరిస్థితులు, కార్మికుల వలసల గురించి ఈ వ్యాసంలో చేసిన విశ్లేషణ దృష్ట్యా ప్రభుత్వ స్పందన గురించి ఆలోచిస్తే, ముఖ్యంగా కొవిడ్–19 మహమ్మారి విజృంభించిన ప్రస్తుత కాలంలో, మనకు నిరాశ తప్ప ఏమీ మిగలదు. వలస కార్మికుల జీవితాలకి సంబంధించిన సత్యాలని గ్రహించకపోవడం ఒక ఎత్తయితే, వారిపట్ల చూపించిన నిరాదరణ (సొంత ఊళ్ళకి వాళ్ళు కాలిబాట పట్టినప్పుడు) ఇంకోటి. ఈ రెండూ చాలవన్నట్లు, వివిధ రాష్ట్రాలలో అతి క్రూరమైన కార్మిక చట్టాలు ప్రవేశపెట్టారు. వలస కార్మికుల భద్రత ప్రభుత్వానికి ఒక పెద్ద గుదిబండ అయినట్లుంది. ఇక పరిశ్రమల్లో జరుగుతున్న ఉత్పత్తి మాటకొస్తే, పెద్ద శాతం పారిశ్రామిక యూనిట్లలో అవసరమైన కట్టడి, పన్నులు తగ్గించడం లాంటి చర్యలు లేవు సరికదా, 'చిన్న', 'మధ్య–తరహా' యూనిట్ల నిర్వచనాల్లోనే మార్పులు చేశారు. ఇవన్నీ, ఇప్పటికే దిగజారుతున్న చిన్న తరహా పరిశ్రమ రంగం ఇంకా పాతాళం లోకి పోవడానికి దోహదం చేస్తాయి. పరిశ్రమల ద్వారా ఉపాధి పొందాలనుకునే వారికున్న ఆశల్ని పూర్తిగా వమ్ము చేస్తాయి. అందుకే ఇప్పుడు పరిశ్రమల్లో ఉద్యోగాలు చేస్తున్న కార్మికులు, వలస కార్మికులు, అంచుల్లోకి నెట్టబడ్డ ఇతర కార్మికులందరూ చిన్న తరహా పరిశ్రమలకు పరిమితమైన పనుల్లోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు.

నోట్స్:

1. అధ్యయనంలో భాగమైన రెండు ప్రాజెక్టులకు రెండు సంస్థల నుండి ఆర్థిక సహాయం లభించింది. (ఐసిఎస్ఎస్ఆర్ (2012–14); శ్రామిక ఇనిషియేటివ్ ఆఫ్ టాటా ట్రస్ట్. దీనిలో కొన్ని విషయాలు కింది ప్రచురణలో లభిస్తాయి. దామోదరన్, ఎస్. 2016. ది షేపింగ్ ఆఫ్ ఇన్‌డస్ట్రియల్ లాండ్‌స్కేప్స్: లైఫ్, వర్క్ అండ్ ఆక్యుపేషన్స్ ఇన్ అండ్ అరౌండ్ ఇన్‌డస్ట్రియల్ ఏరియాస్ ఇన్ ఢిల్లీ. ఇన్ ఎస్. చక్రవర్తి అండ్ ఆర్. నాగెల్ (ఇడ్స్). స్పేస్, ప్లానింగ్ అండ్ ఎవరీ డే కన్‌టెస్టేషన్స్ ఇన్ ఢిల్లీ, స్ప్రింగర్. ఈ వ్యాసంలో పేర్కొన్న విషయాలు, పైన పేర్కొన్న రెండు ప్రాజెక్టుల్లో గమనించిన సమగ్ర ఫలితాలకు సంబంధించినవి మాత్రమే. సూక్ష్మ వివరాలు కాదు.

2. అట్టడుగుకు చేరిన పారిశ్రామిక అభివృద్ధి అనేది తక్కువ ఖర్చు (అంటే తక్కువ వేతనాలు) మీద, ఉత్పత్తుల పెంపుదల కోసం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లాంటి వాటి మీద ఆధారపడి ఉంటుంది. పారిశ్రామిక అభివృద్ధి అగ్ర శిఖరాలకు చేరాలంటే, ఉత్పత్తిని పెంచడం కోసం ఇతర పరిశ్రమలతో పోటీ పడడం, కొత్త యంత్రాలు కొనుగోలు చేయడం లాంటి పనులు చేపట్టాలి.


అనువాదం : **దుగ్గిరాల వసంత**



**దుగ్గిరాల వసంత** ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి విశ్రాంత లింగ్విస్టిక్స్ ప్రొఫెసర్

**సుమంగళ దామోదరన్** ఢిల్లీలోని అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్

ఈ మెయిల్ *sumangala@aud.ac.in*


*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*



# ప్రపంచ ఉత్పత్తి విలువ గొలుసు : శ్రామిక సమస్య

■ విజయ భాస్కర్

నేడు ప్రపంచంలో వస్తు ఉత్పత్తి, వస్తు మారకం రెండూ కూడా, ఒక దేశానికే పరిమితం కాక చాలా వరకు దేశ సరిహద్దులు దాటి పయనిస్తూ కొత్త సమీకరణాలకు దారి తీస్తున్నాయి. ఉత్పత్తి ప్రక్రియల్లో వస్తున్న ఈ మార్పుల ప్రభావం, భౌగోళిక దక్షిణ దేశాల (మూడో ప్రపంచ దేశాలు లేదా అభివృద్ధి చెందుతున్న దేశాలు)పై ఎలా ఉంటుందనే అంశాన్ని అర్థం చేసుకోవటానికి 'ప్రపంచ విలువ గొలుసు' (దీనినే కొద్ది మార్పులతో ప్రపంచ వస్తు గొలుసు, లేదా ప్రపంచ ఉత్పత్తి నెట్ వర్క్ అని కూడా అంటున్నారు) ఒక సైద్ధాంతిక దృష్టికోణాన్ని అందిస్తుంది.

**ప్రపంచ విలువ, వస్తు గొలుసు అంటే ఏమిటి?**

హాప్కిన్స్, వాలెర్ స్టైయిన్‌ల (1986, 159) నిర్వచనం ప్రకారం ఒక పూర్తి తయారైన సరుకుని సృష్టించే శ్రామిక మరియు ఉత్పత్తి ప్రక్రియల అనుసంధానమే, ప్రపంచ విలువ, వస్తు గొలుసు. ఒక వస్తు గొలుసులు తయారవటానికి ముందుగా ఒక సరుకు (కమాడిటీ) తయారీ పూర్తి కావటానికి కావల్సిన వివిధ ఉత్పత్తి ప్రక్రియలు వేరు చేయబడాలి. ఒక్కొక్క ప్రక్రియని, గొలుసులోని ఒక్కొక్క లంకెగా చెప్పచ్చు. అసలు ఈ గొలుసులు ఎలా తయారవుతాయి, ఈ గొలుసు మొత్తానికి లేక ఒక్కొక్క లంకెతో సంబంధం కలిగిన వివిధ వాటాదారులపై ఈ గొలుసు యొక్క ప్రభావం ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవాలంటే ప్రతి ఒక లంకెలోని ఈ క్రింద పేర్కొన్న పలు కోణాలు అర్థం చేసుకోవాలి.

1) లంకె యొక్క భౌగోళిక స్థానం (లొకేషన్)

2) లంకె లోపలికి మరియు లంకె నుండి బయటకు జరిగే సరుకుల కదలిక, దానితో పాటు ఆ కదలికకు ముందు, వెనుక జరిగే కార్యక్రమాలు

3) లంకె లోపలి ఉత్పత్తి సంబంధాలు

4) ఒక ఉత్పత్తి యూనిట్‌కు గల సాంకేతికత మరియు ఉత్పత్తి స్థాయి సామర్థ్యాలతో పాటు ఉత్పత్తిలో అత్యంత ప్రధానమైన ఉత్పత్తి నిర్వహణా ప్రక్రియ (హాప్కిన్స్, వాలెర్ స్టైయిన్ 1986)

కొద్దిపాటి తేడాలతో పైన పేర్కొన్న లాంటి నెట్ వర్కులు, నేడు అధిక సంఖ్యలో అనేక దేశాల సరిహద్దులు దాటి నిర్వహింపబడుతున్నాయి. దీనికి చక్కని ఉదాహరణ 'ఐ ఫోన్'! చైనా ఈ ఫోన్ల ప్రధాన ఉత్పత్తిదారుగా కపపడుతున్నా, నిజానికి ప్రపంచంలోని అనేక దేశాలలో దీనికి సంబంధించిన ముడిసరుకు సరఫరా, విడి భాగాల తయారి, రూపురేఖల తయారి వంటి ప్రక్రియలు జరుగుతుంటాయి. ఇన్ని లంకెల కలయికతోనే ఆఖరుగా ఒక ఐ ఫోన్ తయారీ పూర్తయి దాని విలువ ఏర్పడేది!

**ప్రపంచ విలువ గొలుసు యొక్క భౌగోళిక స్థానాన్ని నిర్ణయించే మౌలిక చోదక శక్తులు!**

సమకాలీన శ్రామిక సమస్యల ఆర్థిక రాజకీయ కోణాలను అర్థం చేసుకోవాలంటే, ఈ నెట్‌వర్కులలోని మూడు అంశాలు బాగా ఉపయోగపడతాయి!

1. ముందుగా చెప్పాలంటే సంపన్న దేశాలలోని, శక్తివంతమైన వర్తకులు, ఉత్పత్తిదారులు, తమ ఉత్పత్తి, సేవలలోని వివిధ శాఖలను విడదీసి, ప్రపంచంలోని వివిధ ప్రదేశాలలో నెలకొల్పగల సామర్థ్యం సంపాదించారు. రవాణా, సమాచార వ్యవస్థలోని సాంకేతిక ప్రగతిని ఉపయోగించుకుంటూ, తక్కువ ఉత్పత్తి వ్యయం చలామణిలో ఉన్న ప్రాంతాలను ఎంచుకోగలరు. ఇందుకుగాను వారికి భౌగోళిక దక్షిణ దేశాలు చాలా అనువుగా కనపడతాయి. ఈ దేశాలలో శ్రామిక ఖర్చులు తక్కువ, పర్యావరణ నిబంధనలు తక్కువ, కాలుష్యపూరిత సాంకేతిక పద్ధతులు వాడి ముడి సరుకును తక్కువ వ్యయంతో వెలికి తీసే అవకాశాలు ఎక్కువ. తద్వారా కాలుష్య నివారణకై అయ్యే ఖర్చులు కూడా మిగులుతాయి.

2. వీరికి తోడ్పడే మరొక అంశం. పంతొమ్మిది వందల ఎనభై దశకం నుండి పరిమిత ఆదాయ ఆర్థిక వ్యవస్థల్లో, మారిన ఆర్థిక విధానాల ద్వారా ప్రవేశ పెట్టబడ్డ సరళీకృత ఆర్థిక విధానాలు. ఎల్పీజీగా ప్రసిద్ధి పొందిన ఈ విధానాలు, సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణను బాగా ప్రోత్సహించాయి. ఆర్థిక స్వయం సమృద్ధి విధానాలు, సమర్థవంతమైన వనరుల కేటాయింపును నిరోధిస్తాయని అభివృద్ధిని ఆటంకపరుస్తాయనే ఒక నమ్మికతో, భౌగోళిక దక్షిణ దేశాలలో చాలా దేశాలు తమ వస్తు వాణిజ్యాన్ని, ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం చేసుకున్నాయి. ఈ తరహా అభివృద్ధి ప్రక్రియని వేగవంతం చెయ్యటానికి, ప్రైవేటు మూలధనానికి ప్రోత్సాహకాలు కూడా కల్పించాయి.

ఈ ధోరణికి ఒక మంచి ఉదాహరణ, భారత ప్రభుత్వం నిర్మహించిన ఆర్థిక సర్వే 2020 నివేదికలోని మొదటి చాప్టర్‌లో పేర్కొన్న విధానంలో కనపడుతుంది. మౌలిక వసతుల కల్పన, పన్ను రాయితీల ప్రకటన వంటి చర్యలతో, ఒక ప్రాంతాన్ని ప్రపంచ విలువ గొలుసులో భాగం లేదా 'లంకె'గా చెయ్యటానికి ప్రయత్నిస్తున్నాయి ప్రభుత్వాలు. ఆర్థిక విధి విధానాలలో ఈ మార్పునకు ప్రత్యేక ఆర్థిక మండళ్ళకు (సెజ్) ప్రోత్సాహం ఇంకో ఉదాహరణ. ఇటీవల కాలంలో సేవా రంగంలోని కొన్ని ఉపరంగాలు కూడా ఈ అంతర్జాతీయ విలువ సముదాయంతో (ట్రాన్స్ నేషనల్ వాల్యూ నెట్‌వర్క్) ముడిపడి అల్లుకుపోతున్నాయి. భారత దేశంలో సాఫ్ట్‌వేర్ సేవలు, బీపీఓలు (బిజినెస్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్) కూడా ఈ మార్పుకు ఉదాహరణలే.

భిన్న రంగాలలో ఉండే విలువ గొలుసులు, భిన్న లక్షణాలు కలిగి ఉంటాయి మరియు ఒకే విలువల గొలుసులోని వేర్వేరు లంకెల మధ్య కూడా పలు భిన్న సంబంధాలు ఉంటాయి. వీటి వలన గొలుసులోని లంకెల మధ్య అనుసంధానం యొక్క గాఢతలో ఒకే దేశంలో అనేక ప్రాంతీయ విభేదాలు ఉంటాయి. ఆర్థిక విధి విధానాల రూపకల్పన జాతీయ స్థాయిలో జరిగినా, కొన్ని రాష్ట్రాలలోని కొన్ని ప్రాంతాలు మాత్రమే ఈ గొలుసుల్లో లంకె ఏర్పరుచుకోగలుగుతాయి. వేర్వేరు ప్రాంతాలలో ఉన్న ఈ లంకెల ద్వారా ఉత్పత్తి అయ్యే 'విలువ' కూడా భిన్నంగానే ఉంటుంది.

**ఈ వ్యూహంలో లోపం ఏమిటి?**

దాదాపు సమాన వనరులు కలిగిన దక్షిణ భౌగోళిక దేశాలు, ఈ ప్రపంచ విలువ గొలుసులోని లాభసాటి లంకెలలో భాగం అవటానికి ఒక దానితో మరొకటి పోటీ పడుతుంటాయి. ఇలా చెయ్యటానికి అవి తరచూ చవకగా దొరికే తమ శ్రామిక శక్తిపై, తేలికగా లభించే ముడి సరుకుపై, బాగా సడలించిన తమ పర్యావరణ నియంత్రణ నియమాలపై ఆధారపడతాయి. కానీ అసలు సమస్య ఇక్కడే పొంచి ఉంది. గొలుసులోని ఒక లంకె గానీ, సంస్థ గానీ తక్కువ నైపుణ్యం, ఎక్కువ శ్రామిక శక్తి అవసరమయ్యే కార్యకలాపాల ద్వారా ప్రపంచ విలువల గొలుసులో భాగం కావాలని ప్రయత్నిస్తే, దక్షిణ భౌగోళిక దేశాలలోని ఇలాంటి లక్షణాలే గల ఇతర (అంటే చవక జీతభత్యాలు చెల్లించే) స్థానాల నుండి పోటీ ఎదురవుతుంది. దీని వలన ధరలు ఇంకా పడిపోతాయి.

ఫలితంగా అట్టడుగు స్థానం కోసం పోటీ మొదలవుతుంది. దీనినే ఆర్థిక శాస్త్ర పరిభాషలో ఇమ్మిసరైజింగ్ గ్రోత్ లేదా తిరోగమన వృద్ధి అనవచ్చు. వివరంగా చెప్పాలంటే, ఈ లంకెలు తమ ఆర్థిక కలాపాలను పెంచుకుంటున్నా, వాటి ఫలితాలు మాత్రం స్వల్పంగానే లభిస్తాయి. దీనికి కారణం తమను పోలిన ఇతర చవక ధర లంకెల నుండి గట్టి పోటీ వలనే. ఈ విధంగా అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోని లంకెలతో పోలిస్తే దక్షిణ భౌగోళిక దేశాల లంకెలు తక్కువ విలువను ఉత్పత్తి చేస్తున్నాయి.

**వాణిజ్య మెరుగుదల (ఎకనామిక్ అప్‌గ్రేడింగ్) దీనికి పరిష్కారమా?**

ప్రపంచీకరణ చెందిన ఉత్పత్తి ప్రక్రియలో వృద్ధి సాధించాలంటే సంస్థలు, విలువల గొలుసులో మరింత లాభసాటి అయిన లంకెలకు మారాల్సి ఉంటుంది. అందుకుగాను వాణిజ్య మెరుగుదల అనేది చాలా ముఖ్యం. అంటే సంస్థలు తమ పనికి అదనపు విలువలు జోడించటం లేదా గొలుసులో అధిక విలువ కలిగిన విభాగానికి మారటం, లేక ఎక్కువ నైపుణ్యం, జ్ఞానం అవసరమయ్యే కార్యకలాపాలు పెంచుకోవటం వంటి చర్యలనే వాణిజ్య మెరుగుదలగా చెప్పుకోవచ్చు.

ఉదాహరణకి, ప్రపంచ వస్త్ర ఉత్పత్తి విలువ గొలుసులో భాగమైన సంస్థలు తమ సొంత బ్రాండ్‌లను ఏర్పరుచుకోవటం ద్వారా ఈ మెరుగుదలకు అవకాశాలు పొందవచ్చు. తమ ఉత్పత్తి ప్రక్రియలను మెరుగైనవిగా తీర్చిదిద్ది, ముడిసరుకు నుండి తుదిసరుకు తయారీ క్రమంలో సామర్థ్యాన్ని పెంపొందించు కోవచ్చు. వస్త్రాలకు రంగులద్దటం, డిజైన్లు ముద్రించటంలో అత్యాధునిక యంత్రాలు వాడటం అనేది పైదానికి ఒక ఉదాహరణ. ఒక సరుకు నాణ్యతను పెంచటం ద్వారా ఆ వస్తువు యొక్క ధరను, విలువను పెంచటం ఇంకొక పద్ధతి, ఉదాహరణకి సేంద్రియ పత్తిని వాడటం, బట్ట యొక్క నాణ్యతను పెంచటం, తుది రూపానికి మెరుగులు దిద్దటం వంటివి. సంస్థలు లేక లంకెలు తమ కార్యకలాపాలను ఎక్కువ విలువ కలిగిన డిజైన్, మార్కెటింగ్ వంటి వాటికి విస్తరించుకోవచ్చు. లేదా బట్టల తయారీకు ఉపయోగపడే యంత్రాలను ఉత్పత్తి చెయ్యటం వంటి భిన్న అనుబంధ పరిశ్రమలో అడుగు పెట్టవచ్చు.

ఒక విలువ గొలుసులో, అధికారం అనేది ఏ విధంగా వికేంద్రీకృతమై ఉన్నదన్న విషయాన్ని అధ్యయనం చెయ్యటం ద్వారా, ప్రస్తుత ఆర్థిక శాస్త్ర సాహిత్యం, దక్షిణ భౌగోళిక దేశాలు, లంకెలలో వాణిజ్య మెరుగుదల సాధించటానికి గల అవకాశాలు మరియు ఆటంకాలను ఎత్తి చూపిస్తుంది.

ఒక ప్రధాన అడ్డంకి, విలువ గొలుసులో శక్తివంతమైన సంస్థలు, ఇతర భాగస్వాములు లేదా లంకెలపై ప్రదర్శించే ఆధిపత్యం. దక్షిణ భౌగోళిక సంస్థలకు, ఈ శక్తిశాలి సంస్థలు కలిగించే ఆటంకాలను బట్టి నిపుణులు వాటిని రెండు రకాలుగా విభజించారు. ఒకటి అంతర్జాతీయ ఉత్పత్తి సంస్థలు. ఇవి తక్కువ పారిశ్రామికీకరణ చెందిన, తక్కువ రాబడి గల దేశాల నుండి ముడి సరుకును, శ్రమ శక్తిని వాడుకోవటం ద్వారా ఉత్పత్తి చోదక వస్తు గొలుసులను (ప్రొడక్షన్ డ్రివెన్ కమాడిటీ చెయిన్స్) సృష్టిస్తాయి. సాంకేతికత, నైపుణ్యాల అవసరం ఎక్కువగా ఉండి భారీ వాణిజ్య స్థాయి ఉన్న రంగాలలో ఈ విధమైన గొలుసులు ఏర్పడతాయి. ఉదా: ఆటోమొబైల్, కంప్యూటర్, విమానాలు, ఎలక్ట్రిక్ యంత్రాల వంటివి.

రెండవ రకం కొనుగోలుదారు చోదక వస్తు గొలుసులు (బయర్ డ్రివెన్ కమాడిటీ చెయిన్స్). వీటిని పెద్ద పెద్ద వర్తకులు, రీటైల్ వ్యాపారులు మరియు ట్రేడింగ్ సంస్థలు నియంత్రిస్తూ ఉంటారు. తక్కువ రాబడి ఆర్థిక వ్యవస్థలలో (లో ఇన్‌కమ్ ఎకానమీలు), విడి భాగాలు కాకుండా పూర్తి తయారైన సరుకును ఉత్పత్తి చేసినప్పుడు, ఈ విలువల గొలుసులు ఏర్పడతాయి. ఇలాంటి సరుకుల డిజైన్లో, పరిశోధనలో లేదా మార్కెటింగ్ విభాగాలలో వాణిజ్య మెరుగుదలకి, కొనుగోలుదారులు అడ్డుగోడలు నిలుపుతారు. ఇక్కడ అగ్రశ్రేణి సంస్థల దగ్గర అసలు సొంత ఉత్పత్తి సదుపాయం ఏదీ ఉండక పోవచ్చు. ఉదాహరణకి, ప్రపంచంలోనే ముందంజలో ఉన్న వస్త్రాల బ్రాండ్ అయిన హెచ్ అండ్ ఎమ్ కంపెనీకి సొంత ఫాక్టరీలు అంటూ ఏవీ లేవు. వారు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న స్వతంత్ర సరఫరా ఫాక్టరీల నుండి వస్త్రాలు సేకరించి అమ్ముతూ ఉంటారు.

ఉత్పత్తి చోదక వస్తు గొలుసులలో సంస్థలు ముడిసరుకు మరియు విడిభాగాల సరఫరాపై పట్టు కలిగి ఉండటం ద్వారా వాణిజ్యాన్ని తమ నియంత్రణలో ఉంచుకుంటారు. అలాగే రీటైల్ రంగంలోకి కూడా తమ లంకెలను విస్తరించుకోగలుగుతారు. అదే కొనుగోలుదారు చోదక వస్తుగొలుసులు డిజైన్, మార్కెటింగ్‌లో ప్రాధాన్యత కలిగి ఉండి డిజైన్, బ్రాండింగ్ వినియోగదారులపై పరిశోధన వంటి విభాగాల ద్వారా పట్టు ఏర్పర్చుకుని ఉత్పత్తిదారులకు, వస్తు సరఫరాదారులకు గొలుసులో పైలంకె ఏర్పరుచుకోవటం, మెరుగుదల పొందటాన్ని కష్టతరం చేస్తాయి.

అయితే వాణిజ్య మెరుగుదలకు ఎలాంటి అడ్డంకులు ఎదురైనా, ఒక లంకె లోని వస్తువు విలువను మెరుగుదల ద్వారా ఏదో రకంగా పెంచగలిగితే, ఆ పెంపుదల కిందకు ప్రవహించి కింది స్థాయి శ్రామికులకు మెరుగైన జీతభత్యాల రూపంలో మారుతుందని.. వాణిజ్య మెరుగుదల సిద్ధాంతం భావిస్తుంది. కానీ ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న ఆర్థికశాస్త్ర పరిశోధనా సాహిత్యం ఈ వాదనను సమర్థించట్లేదు. ఆర్థిక లేదా వాణిజ్య మెరుగుదల ద్వారా లాభాలు కిందకి ప్రవహిస్తాయన్న వాదనకి ఖచ్చితమైన ఆధారాలు లేవు.

**వాణిజ్య మెరుగుదల ఫలితంగా కార్మికుల స్థితిగతులు కూడా వాటంత అవే ఎందుకు మెరుగు పడకపోవచ్చు?**

తక్కువ రాబడి వ్యవస్థలలో, పని మరియు ఉద్యోగాల నాణ్యత, ఆయా వ్యవస్థలు, ప్రపంచ శ్రామిక విభజనలో తాము పోషించే పాత్రను బట్టి నిర్ధారితమౌతాయి. ప్రపంచ వాణిజ్య సంస్థలకు పెరుగుతున్న పోటీ వలన శ్రామికులపై అయ్యే ఖర్చులే కాక నిర్ణీత గడువులు మరియు నాణ్యతా ప్రమాణాలు అందుకునే ఒత్తిడి అధికంగా పెరిగింది. దీని వలన సంస్థలపై శ్రామిక వ్యయం తగ్గించాలనే ఒత్తిడి పెరిగి అవి సామాజిక ఉత్పత్తిని అసంఘటిత రంగానికి మరల్చటమో, బయటవారికి అప్ప చెప్పటమో చేస్తున్నాయి. లేక ఇంట్లోనే ఉత్పత్తి ప్రక్రియ ద్వారా, కుటుంబ సభ్యులనో, తమ చుట్టుపక్కల వారినో శ్రామికులుగా నియోగిస్తాయి. అయితే సంస్థలు లాభసాటి కార్యకలాపాలకు మారి తాము పెట్టిన శ్రామిక వ్యయంపై అధిక రాబడులు పొందుతున్న సందర్భాలలో కూడా ఆ పెరిగిన అదనపు విలువలోని కొంత భాగాన్ని శ్రామికులకు పంచి ఇవ్వటానికి సుముఖత చూపట్లేదు. సూక్ష్మ స్థాయి క్షేత్ర పరిశోధనలు చెప్పేది ఏంటంటే వాణిజ్య మెరుగుదల జరిగినా కూడా అవి శ్రామికుల రాబడిని కానీ స్థితిగతులని కానీ మెరుగుపరచట్లేదు. ఉదాహరణకి భారతదేశ కొబ్బరిపీచు పరిశ్రమలోనే, తమిళనాడులోని పొల్లాచ్చి కొబ్బరిపీచు పరిశ్రమను, కేరళలోని పరిశ్రమలతో పోలిస్తే, పొల్లాచి పరిశ్రమ వాణిజ్య మెరుగుదల ద్వారా ఉన్నత స్థాయి ఉత్పత్తి విలువలు సాధించి కూడా, వాణిజ్య మెరుగుదల చేపట్టని కేరళ కన్నా తమ శ్రామికులకు తక్కువ జీతాలు ఇస్తూ, పని ప్రదేశాల స్థితిగతులలో కూడ తక్కువ స్థాయిలో ఉంది (రామ్మోహన్-సుందరేశన్ 2003).

గత కొన్ని దశాబ్దాలుగా ప్రపంచ విలువ కూడికలో (గ్లోబల్ వాల్యూ అడిషన్) శ్రామికుల వాటా తగ్గిపోవటం అనేది ఒక ప్రపంచ వ్యాప్తంగా ఆధిక్యంలో ఉన్న స్థూల ఆర్థిక శాస్త్ర ధోరణి (డామినెంట్ మాక్రో ట్రెండ్) (ఐ.ఎల్.ఓ – ఓఈసీడీ 2015). దీనినే వివరంగా చెప్పాలంటే, ఒక సంస్థ విలువ గొలుసులో ఉన్నతి సాధించినా, అది శ్రామిక సమస్యలను సరిగా పరిష్కరించలేకపోతోంది. నిజానికి, కొనుగోలుదారు చోదక విలువ గొలుసులు ఉన్న వస్త్ర పరిశ్రమలో కూడా, వినియోగదారులు ఒక వస్తువుపై చెల్లించే తుది ధరలో మొత్తం శ్రామిక వ్యయం ఆరు నుండి ఏడు శాతం మాత్రమే. అయినా కూడా శ్రామికులకు లాభాల వాటా పెరగట్లేదు. విలువ కూడిక వలన ఒనగూడే అదనపు లాభాలు శ్రామిక శ్రేణులకు ఎలా పునఃపంపిణీ చేయబడతాయి అనేది కార్మిక హక్కులు, ప్రయోజనాలను కాపాడే జాతీయ, ప్రాంతీయ వ్యవస్థలను బట్టి, కార్మికుల ఉమ్మడి బేరసారాల స్థాయిని బట్టి మాత్రమే నిర్ణయింపబడతాయి కానీ వాణిజ్య మెరుగుదల వలన కాదు.

ప్రపంచ విలువ గొలుసు అనే భావనను తొలిగా సిద్ధాంతీకరణ చేసినప్పుడు, వాలెర్ స్టైన్ వంటి ప్రపంచ సిద్ధాంతవేత్తలు అందులో శ్రామికుల స్వేచ్ఛా, సాధికారతల గూర్చి స్పష్టంగా చెప్పారు. 'శ్రామిక ప్రక్రియలు' అనే పదానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ ఒక గొలుసులోని పలు లంకెలతో, పలు సంస్థల సంబంధాలు, మరియు ఒక లంకెలోని పలు ఉత్పత్తి ప్రక్రియలతో సంస్థల యొక్క సంబంధాల గూర్చి మన దృష్టికి తెస్తారు. ఒక లంకెలో ఉత్పత్తి అయ్యే విలువను, లాభాలను శ్రామికులు, పారిశ్రామిక వేత్తలు ఏ పద్ధతిలో పంచుకుంటారనే దాని మీదే ఒక పూర్తి గొలుసులోని వివిధ లంకెలలో లాభాల పంపిణీ కూడా ఆధారపడి ఉంటుంది. అయితే తరువాతి కాలంలో ఈ విలువ గొలుసు పదాన్ని ఉపయోగించిన వారు క్రమేపీ పైన చెప్పిన సిద్ధాంతం నుండి దూరం జరిగి కేవలం పలు లంకెల మధ్య సంబంధాలు మరియు లంకెల మధ్య విలువ పంపకం పైనే దృష్టి కేంద్రీకరించారు. లంకెలలో అంతర్గత సంబంధాల ప్రభావం దానిలో శ్రామికుల పై ఏ విధంగా ఉంటుంది అనే ప్రశ్న వారు వేయరు. అలాగే లంకెలోని ధనికులు మరియు శ్రామికుల మధ్య సంబంధాలు, వివిధ లంకెల మధ్య సంబంధాలను ఎలా ప్రభావితం చేస్తాయి అనే ప్రశ్న కూడా విస్మరించారు.

రెండో అంశం, ఒక సంస్థ తక్కువ విలువ కలిగిన పనుల నుండి ఎక్కువ విలువ గల పనికి (నాణ్యత పెంచుకోవటం వంటిది) మారినప్పుడు, అక్కడ ఉన్న కార్మికులంతా ఆ అదనపు విలువకై సమానంగా పాటు పడ్డారని చెప్పలేము.

అలాంటి మార్పుతో లాభపడేది నిపుణత ప్రాధాన్యత గల విభాగాలలో పనిచెయ్యగల సత్తా ఉన్న కార్మికులు. ఉదాహరణకి వస్త్ర ఉత్పత్తి గొలుసులో ఒక సంస్థ కుట్టుపని నుండి డిజైనింగ్ విభాగానికి తమ స్థాయిని మెరుగుపరుచుకున్నప్పుడు, వారు అధిక జీతం చెల్లించైనా, డిజైనింగ్‌లో నైపుణ్యం గల వారిని పెట్టుకుంటారు కానీ తమ దగ్గర పని చేస్తున్న కుట్టుపని వారికి జీతాలు పెంచి వారినే డిజైన్ చెయ్యమని అడగరు కదా. ఇది శ్రామిక శ్రేణుల (లేబర్ మార్కెట్)లో విభజనకి దారి తీస్తుంది. శ్రామిక లోకంలో పెరుగుతున్న అసమానతలు, అత్యధిక నైపుణ్యం గల శ్రామికుల సంపాదనకు, అట్టడుగు స్థాయి శ్రామికుల సంపాదనకు పెరుగుతున్న అగాధం, ఈ పెరుగుతున్న విభజనకు సంకేతంగా నిలుస్తుంది.

**శ్రామిక స్వేచ్ఛా సాధికారతలకు కొత్త అవకాశాలు?**

విలువ గొలుసులో భాగం అవటం ద్వారా శ్రామికులకు అధిక స్వేచ్ఛా సాధికారతలకు అవకాశం ఉంటుందని కొన్ని వాదనలు ఉన్నాయి. ఈ కింది కారణాల వల్ల అలా జరుగుతుందని వారు చెప్తారు. ప్రపంచ గొలుసులతో అనుసంధానం వల్ల కూలీ ధరలు ప్రాంతీయ స్థితిని పట్టి కాక అంతర్జాతీయ ధరలను బట్టి నిర్ణయిస్తారని, శ్రామికులు కూడా తమ నియామకంలో అనుసరించే విధివిధానాలు అంతర్జాతీయ ప్రమాణాలతో సరితూగాలని కోరవచ్చని చెప్తారు. ముఖ్యంగా వివిధ దేశాలలోని, లంకెలలోని శ్రామికులు ఒకే ఆధిపత్య సంస్థకు పని చేస్తున్నప్పుడు వారు అందరూ జట్టుగా కూడి గొలుసులో తమ శ్రమ ద్వారా ఉత్పత్తి అయ్యే లాభాలలో తమకు ఎక్కువ వాటాను డిమాండ్ చేసే అవకాశం కలుగుతుంది.

ముందే చెప్పుకున్న హెచ్ అండ్ ఎమ్ లాంటి అంతర్జాతీయ వస్త్ర సంస్థకు పని చేసే వివిధ ఫ్యాక్టరీ కార్మికులంతా జట్లుగా ఏర్పడి తమ పని స్థితి గతులు మెరుగుపరచమని కోరవచ్చు. ఒకే రంగంలో పని చేసే వివిధ దేశాల కార్మిక యూనియన్లు, శ్రామిక సంస్థలను కూడగట్టి వేర్వేరు లంకెలలోని శ్రామికులందరి మధ్యా సంబంధాలు ఏర్పరిచి వారిని సంఘటితం చేసిన అంతర్జాతీయ పౌర సమాజ సంస్థలు కూడా ఉన్నాయి. ఏషియా ఫ్లోర్ వేజ్ క్యాంపెయిన్ దీనికి ఒక ఉదాహరణ. ఆసియా దేశాలలోని వస్త్ర పరిశ్రమ సంస్థలు ప్రపంచ పోటీలో నిలదొక్కుకోవటానికి వ్యయాలు తగ్గించటం ధ్యేయంగా తమ కార్మికుల జీతభత్యాలు కోతలో పోటీ పడటాన్ని నిరోధించే ఒప్పందమే, ఏషియా ఫ్లోర్ వేజ్ క్యాంపెయిన్. అయితే ప్రతిసారీ, ప్రతిచోటా కార్మికులు తమంత తామే ఇలాంటి అవకాశాన్ని వాడుకుని సంఘటితం అవుతారు అనేదానికి సాక్ష్యాలు తక్కువ. వేర్వేరు దేశాలలోని కార్మికులను కూడగట్టి చైతన్యపరచటం అంత తేలికగా సఫలం అవుతుందని కూడా చెప్పలేం.

**శ్రామిక సమస్యను పర్యావరణ న్యాయ సమస్య నుండి వేరు చెయ్యగలమా?**

ప్రపంచ విలువ గొలుసు యొక్క భౌగోళిక స్థానాన్ని నిర్ణయించటంలో చవకగా దొరికే శ్రామిక శక్తి, తక్కువ ధర గల ముడిసరుకు, అల్ప పర్యావరణ ప్రమాణాల వల్ల తగ్గిన కాలుష్య నియంత్రణా వ్యయం వంటివి దోహదపడతాయని ముందే చెప్పుకున్నాం. వస్త్ర ఉత్పత్తిలో వాడే రంగుల వలన తమిళనాడులోని లంకెలలో, ముఖ్యంగా తిరుప్పూరులో అత్యధిక నీటి కాలుష్యం సంభవించటం తెలిసినదే. పరిశ్రమలకు సహజ వనరులను యధేచ్ఛగా వాడుకునే అవకాశం కల్పించటం అనేది ప్రకృతిని సరుకుగా (కమాడిటీ) చెయ్యటమే అని పొలానియన్ మేధావులు అంటారు. ఈ ప్రక్రియ వలన, ఇంకా బాగా సడలించిన పర్యావరణ నియంత్రణల వల్ల గొలుసు వెలుపలి అనేక మంది జీవనోపాధులు దెబ్బతిన్నాయి. ఈ లంకెలకు దగ్గరగా ఉన్న అనేక మంది రైతులు తాము జీవనోపాధిని కోల్పోయాయని నిరసన వ్యక్తపరిచారు.

విలువ గొలుసులోని శ్రామికులు, తమ జీతాల పెంపు కోసం, మెరుగైన పని ప్రదేశాల కోసం చేసే పోరాటాల వలన ఒక లంకెలోని లాభాల పంపిణీ మెరుగ్గా జరిగే అవకాశం ఉంది. కానీ పర్యావరణ ప్రభావాలను ఎదుర్కొనటానికి ఒక ప్రాంతంలోని వివిధ రంగాల శ్రామికులను సంఘటిత పరచాల్సి ఉంటుంది. ఈ సందర్భంలో ప్రాంతీయ అస్తిత్వాలను ఆధారంగా చేసుకుని సంఘటిత పరచటం తేలిక. అయితే ఇలాంటి పోరాటాల వల్ల పర్యావరణ న్యాయం జరిగి కోల్పోయిన జీవనోపాధి తిరిగి పొందుతారా లేక ఆ గొలుసు కేవలం తమ కార్యకలాపాలను వేరే స్థానానికి బదిలీ చేసి పున: ప్రారంభిస్తుందా అనేది గొలుసులోని మిగతా ఆధిపత్య విభాగ వాటాదారులపై ఆధారపడి ఉంటుంది. ఎక్కువ శాతం స్థానచలనం అనేది జరిగింది కానీ ఆ సంస్థలు మూతపడటం అనేది జరగలేదు.

ఒక ప్రాంతంలో రంగుల అద్దకం పట్ల చాలా వ్యతిరేకత ఎదురయి అది నిషేధించబడితే, అక్కడ నుండి దానిని, తక్కువ వ్యతిరేకత, సడలించిన పర్యావరణ నిబంధనలు ఉన్న చోటికి తరలిస్తారు. దీని వలన అర్థమయ్యేది ఏమిటంటే కార్మికులు వివిధ స్థాయిల్లో సంఘటితం అవ్వాలి. గొలుసులోని వివిధ లంకెలలో, ఇంకా గొలుసు లోపల, వెలుపల ఇలా అన్ని స్థాయిల్లో సంఘటితమై పోరాడాలి.

వాస్తవానికి, ప్రస్తుత పరిస్థితుల్లో మూలధనం మాత్రం చాలా త్వరితగతిన కొత్త లంకెల సృష్టి చేస్తూ అదనపు విలువను పెంచుకుంటూ ఉంటే, శ్రామికులు మాత్రం కొత్త తరహాలో, కొత్త రూపాలలో, భారీ స్థాయిలో సంఘటితం కాలేకపోతున్నారు.

ప్రపంచ వస్తు లేదా విలువ గొలుసు అనేది ప్రస్తుతానికి ప్రపంచ ఉత్పత్తి నెట్ వర్క్‌లో మాత్రమే ప్రాధాన్యత సంతరించుకుంటోంది. అయితే ఈ గొలుసులు, లంకెలు కేవలం ప్రపంచ మార్కెట్లకు మాత్రమే పని చెయ్యాలా అంటే అక్కరలేదు. దేశీయ మార్కెట్ అత్యధికంగా ఉన్న మన లాంటి దేశంలో కేవలం దేశీ వినియోగదారుల కోసం కూడా గొలుసులు సృష్టించవచ్చు.

అయితే, ఇలాంటి దేశీయ విలువల గొలుసుల పర్యవసానాలు శ్రామికులకు ఏమైనా భిన్నంగా ఉంటాయా అంటే లేదు అనే చెప్పాలి. ఒకటే తేడా, ప్రపంచ కార్మికులను సంఘటితపరిచే అవకాశాలు స్వల్పం.

అనువాదం : **సింగరాజు రమాదేవి**

**సింగరాజు రమాదేవి** వరంగల్‌కి చెందిన కథా రచయిత, ఇన్స్యూరెన్స్ రంగంలో పనిచేస్తారు

**విజయ భాస్కర్** మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్, చెన్నైలో ఆర్థిక శాస్త్రంలో ప్రొఫెసర్

ఈ మెయిల్ *vijaybas@gmail.com*

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*

# అంతర్జాతీయ గొలుసులో పెట్టుబడి సమీకరణ, శ్రామికుల నియంత్రణ

■ మార్క్ ఆనర్

గత దశాబ్ద కాలంలో వినియోగదారులకు చవకగా వస్తువులందించే ఇ-కామర్స్ రంగం తీవ్ర లాభాల నార్జించే రంగంగా పరిణమించింది. ఈ లాభార్జన జరిగే ప్రక్రియలను విశ్లేషిస్తుందీ వ్యాసం. మొదట పెట్టుబడిదారుల నుండి కార్మికుల వరకు లంకెలుండే ఈ వస్తు సరఫరా గొలుసులో ఆధిపత్యాన్ని సాధించిన ద్రవ్య పెట్టుబడి ఆ గొలుసులోని పేరుమోసిన బ్రాండ్లపై లాభాల కోసం వత్తిడి తీసుకువస్తుంది. వారు తమ కింది సరఫరా దారులను పిండటం మొదలుపెడతారు. ఆ సరఫరా దారులు తమ కింద పని చేసే కార్మికులనుండి శ్రమ విలువని తక్కువ ఖర్చుతో పీల్చుకోవటం ప్రారంభిస్తారు. ఇదే అంతర్జాతీయ గొలుసుకట్టు సరఫరా వ్యవస్థల ప్రధాన గుణంగా కనిపిస్తుంది (ఆనర్ 2019; గెర్ఫి మొ॥ 1994; సెల్విన్ 2017; స్మిత్ మొ॥ 2018). ఇలా లాభాలను 'పిండుకోవడం' (స్క్వీజింగ్) అనేది అంతర్జాతీయ గొలుసుకట్టు సరఫరా వ్యవస్థలోని (గ్లోబల్ సప్లై చెయిన్) అతి కిందస్థాయిలో వున్న కార్మికుల నుంచి విలువను ఎలా పైకి పీల్చుకోవటం (సకింగ్ అప్) అనే రూపం తీసుకుంటుందో, ఫినాన్సియల్ పెట్టుబడుదారుల లాభాల ముల్లెలు అంతకంతకు ఎలా నింపుతుందో వివరించే ప్రయత్నం చేస్తుంది ఈ వ్యాసం. సరఫరా గొలుసుల వ్యవస్థలో అట్టడుగున వున్న కార్మికులతో పాటు, అసంఘటితంగా వున్న అగ్గువ, చవక కూలీలు తిండి కొనుక్కునే మార్కెట్లపై కూడా ఈ 'పిండుకోవడం', 'పీల్చుకోవటం' అనే 'వ్యూహాలు' ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తున్నాయి అనే విషయాలను ఈ వ్యాసం చర్చిస్తుంది. ప్రధానంగా ఈ వ్యాసం దుస్తుల రంగంలో సాగే ఈ తంతు గురించి మాట్లాడుతుంది. ఈ కార్మికులంతా కూడా దాదాపు యుక్తవయసులో వున్న బడుగు యువతులే (బర్యన్‌తోస్ మొ॥ 2003, బెనెరియా అండ్ రోల్డన్ 1987; మిజ్హాదిరి 2017). దుస్తుల రంగంలో పనిచేస్తున్న కార్మికుల నెలసరి ఖర్చుల కోసం వీరి బంధువులు బయటి ప్రాంతాలలో వలస కూలీలుగా పని చేసి పంపే డబ్బులను కూడా లెక్కలోకి తీసుకుని ఈ విషయంలో లోతుపాతులు చర్చిస్తుంది ఈ వ్యాసం.

**అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ గొలుసుకట్టులో పై అంచెలో పోగయ్యే సంపద మరియు అధికారం**

ఫినాన్సియల్ (ద్రవ్య) సెక్టార్- అది వాటాదారుల ద్వారా కావచ్చు, లేదా ప్రయివేటు ఈక్విటీ కంపెనీల నుంచి కావచ్చు, లేదా ఇతర ఆర్థిక పరికరాల ద్వారా కావచ్చు, అంతర్జాతీయ గొలుసు కట్టు సరఫరా వ్యవస్థ మీద అచంచలమైన అధికారాన్ని, ప్రభావితం చేయగల సత్తాని కలిగి వుంటుంది (వెయిల్, 2014). ఇదే అంతర్జాతీయ దుస్తుల పరిశ్రమలకు చెందిన వ్యాపారస్తుల ఎనలేని సంపదకు ప్రధాన వనరు.

జారా అనే చిల్లర (రీటైల్) దుస్తుల కంపెనీ వ్యవస్థాపకుడు అమన్సియో ఓర్టెగాకు దాదాపు 63.8 అమెరికన్ బిలియన్ డాలర్ల నికర ఆస్తులు వున్నట్టు ఒక అంచనా. ఇది ఒక ఏడాదిలో దుస్తుల ఎగుమతిలో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద దేశం అయిన బంగ్లాదేశ్ సృష్టించే విలువకన్నా రెండింతలు.

ద్రవ్య రంగం మరింత ప్రాముఖ్యతను సంతరించుకున్న ఈ తరుణంలో మనం ఒక వైరుధ్య భరితమైన అభివృద్ధి నడుమ వున్నాం. దశాబ్దాలుగా ఆధునికీకరణ సిద్ధాంత ప్రభావంతో నడిచిన అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీలు (రోస్టోవ్, 1971), ప్రపంచం కొనియాడిన 'ఆసియా పులుల' (హాంకాంగ్, సింగపూర్, సౌత్ కొరియా, తైవాన్) విజయం తర్వాత (హోగార్ట్, 1990) ఆర్థికవృద్ధి కోసం మొదటి అడుగుగా భారీగా దుస్తుల ఎగుమతి చేపట్టమని ఒక దేశం తర్వాత మరో దేశాన్ని విపరీతంగా ప్రోత్సహించాయి. పర్యవసానంగా 1950లో దుస్తులు ఎగుమతి చేసే దేశాల సంఖ్య 4 నుంచి 1990లో (2000ల తొలి నాళ్ళ వరకు) కొన్ని డజన్లు దాటింది. ఈ నమూనా వల్ల అభివృద్ధి మాట దేవుడెరుగు, అతి సామర్థ్య సంక్షోభం (ఓవర్ కెపాసిటీ క్రైసిస్) తలెత్తింది.

ద్రవ్యీకరణ, అతి సామర్థ్యం, ఈ రెండు ధోరణులు కూడా దుస్తుల రంగాన్ని ఒక కొత్త దిశలోకి నెట్టాయి. పెరుగుతున్న లాభాలలో మదుపు దారులు (ఇన్వెస్టర్లు) తమ వాటాని కోరితే, ఇంకో పక్క అతి సామర్థ్యం వల్ల ఈ రంగానికి దుస్తులు విపరీతంగా కొనగలిగే వినియోగదారుల అవసరం అంతకంతకు పెరుగుతూ వచ్చింది. దాంతో ఓ మోస్తరు డిమాండ్‌కు తగ్గట్టుగా ఓ మోస్తరు లాభాలు అన్న నమూనా నుంచి తక్కువ లాభాలు-పెద్ద మొత్తంలో తయారీ అనే నమూనాకు ఈ రంగం బదిలీ కావలసి వచ్చింది. వాల్ మార్ట్ సంస్థ ఈ వ్యూహంలో మంచి పట్టు సాధించి పండిపోయింది. ఎప్పటికప్పుడు తన సరుకు అమ్ముడయిపోతుంటే చాలు తక్కువ గిట్టుబాటు (మార్జిన్) తో కూడా మంచి లాభాలే సంపాదించవచ్చని దశాబ్దాల క్రితమే ఆ సంస్థ అర్థం చేసుకుంది. 2015-2019 మధ్య కాలంలో వాల్ మార్ట్ నికర లాభాలు 2.82 శాతం. అయినా కూడా ఈ ఐదేళ్ళ కాలంలో మొత్తం ఆదాయంలో దాదాపు 2.5 ట్రిలియన్ అమెరికన్ డాలర్లను సృష్టించ గలిగింది. 59.8 బిలియన్ల అమెరికన్ డాలర్లను తన నికర లాభాలుగా పోగేసుకుంది ఆ సంస్థ. ఇంత ఆదాయం వల్ల (రాబడి రేటు ఆర్ ఓ ఆర్ కాదు) వాల్‌మార్ట్ స్టాకు ధరలు భారీగా పెరగటంతో, 163 బిలియన్ల అమెరికన్ డాలర్ల సమిష్టి నికర ఆస్తులతో వాల్టన్ కుటుంబం ప్రపంచంలోనే అత్యంత ధనవంత కుటుంబంగా ఎదిగింది. ఈ నమూనా తర్కంలోకి బలవంతంగా లాగబడ్డ మూడో అంచెలో వుండే వ్యాపారస్తులను కూడా వాల్‌మార్ట్ చాకచక్యంగా 'పిండుకోగలిగింది'. ఈ వ్యాపారస్తులు కూడా పెద్ద మొత్తంలో తమ సరుకులను తక్కువ గిట్టుబాటు ధరకే అమ్ముకోవడంతో పాటు వాల్‌మార్ట్‌కు సుంకం కూడా చెల్లించారు. ఒకవేళ అమ్మకాలు తగ్గినట్టయితే వెంటనే అందుకు అనుగుణంగా తమ ఉత్పత్తుల ధరలు కూడా తగ్గించాల్సి వచ్చేది. తద్వారా గిట్టుబాటు కూడా మరింత తగ్గిపోయేది. ఈ నమూనా ఫలితంగా అమెరికాలో 1980, 1990లలో చాలా మంది మూడో అంచె వ్యాపారస్తులు తమ ఉత్పత్తిని గణనీయంగా తగ్గించుకోవాల్సిన పరిస్థితికి నెట్టివేయబడ్డారు. పైగా ఉత్పత్తి చేయలేక చేతులెత్తేసి, తక్కువ వేతనాలు వుండే బంగ్లాదేశ్ లాంటి దేశాలకి ఉత్పత్తిని అవుట్ సోర్స్ చెయ్యాల్సి వచ్చింది.

పెద్ద మొత్తంలో సరుకు ఉత్పత్తి, తక్కువ గిట్టుబాటుకు అమ్మకాలు - అనే నమూనా ఫలితమే ఫ్యాషన్లలో నానాటికి వచ్చే కొత్త ధోరణులు కూడా (ఫాస్ట్ ఫాషన్). రోజుకో ఫ్యాషన్ మారుతున్న ఈ కాలంలో వినియోగదారులను ప్రతి ఏటా మరిన్ని కొత్త దుస్తులు కొనేందుకు సన్నద్ధం చేయడమే ఈ నమూనా వ్యూహం. ఈ నమూనాలో బాగా పేరు సంపాదించింది హెచ్ అండ్ ఎమ్ (హెన్స్ అండ్ మోయిటెజ్) అనే సంస్థ. 2015 నుండి 2019 వరకు ఈ సంస్థ ఏటా 8.01 శాతం (సగటున) లాభాల బాటలో నడిచింది. మొత్తం ఆదాయంలో 1.02 ట్రిలియన్ల అమెరికన్ డాలర్లను సృష్టించింది. అంటే ఈ సంస్థ 82 బిలియన్ల అమెరికన్ డాలర్ల నికర లాభాలను తన ఖాతాలో పోగేసిందని అర్థం. ఈ క్రమంలో హెచ్ అండ్ ఎమ్ సంస్థ అధినేత, ప్రధాన వాటాదారుడు అయిన స్టీఫెన్ పెర్సన్ నికర ఆస్తులు 19 బిలియన్ అమెరికన్ డాలర్లు అయ్యాయి.

పెద్ద మొత్తంలో సరుకు ఉత్పత్తి, తక్కువ గిట్టుబాటుకు అమ్మకాలు–అనే నమూనాను మరో మెట్టుపైకి తీసుకువెళ్ళింది మాత్రం అమెజాన్ అనే సంస్థ. ఈ సంస్థ సిఇఓ అయిన జెఫ్ బెజోస్ ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడయిపోయాడు. ఐదేళ్ళ పాటు తన కంపెనీ సగటు లాభం కేవలం 2.87 శాతం వున్నప్పటికీ కూడా ఈ ఫలితాలు సాధించాడు జెఫ్ బెజోస్. పెద్ద మొత్తంలో ఆర్డర్లు వున్న ఫలితంగా గణనీయమైన నికర లాభాలు వచ్చాయి. అలా 2015–2019 మధ్య కాలంలో 27.7 బిలియన్ అమెరికన్ డాలర్ల నికర లాభం గడించింది ఈ సంస్థ.

కొల్లగొట్టే ధరలతో జెఫ్ బిజోస్ ఒక దీర్ఘకాలిక వ్యూహానికి సంసిద్ధమవుతున్నాడు. ఇన్వెస్టర్లు కూడా ఇతనికి తోడయ్యారు. కొన్ని వస్తువుల ధరలను విపరీతంగా తగ్గించడం, లేదా వాటి ఉత్పత్తి ధరకన్నా తక్కువ ధరలో వాటిని విక్రయించేందుకు సిద్ధపడటం ఈ నమూనాలో ప్రధాన వ్యూహం. ఆ విధంగా తన వ్యాపార రంగంలో వున్న తన పోటీదారులను, ప్రత్యర్థులనూ తుడిచిపెట్టేసే వ్యూహానికి దిగింది అమెజాన్. ఇందులో బలహీన ప్రత్యర్థి లేదా పోటీదారుడే మొదటి లక్ష్యం. ఆన్‌లైన్ పుస్తక విక్రయాలలో తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించేందుకు అమెజాన్ ఒక పథకాన్ని పన్నింది. దీని పేరే గజెల్ ప్రాజెక్ట్. గజెల్ అంటే జింక అని అర్థం. చిరుతపులి ఎలాగయితే జింకల గుంపులో మొదట బలహీనమైన జింకను తన వేటకు ఎంచుకుంటుందో అదే తరహాలో అమెజాన్ తన పుస్తక విక్రయ వ్యూహాన్ని రంగం మీదకు తెచ్చిందనమాట. ఇక ఒక పోటీదారుడి తర్వాత మరో పోటీదారుడిని వేటాడి ఖతం చేయడమే తరువాయి (స్టోన్, 2013).

వాల్‌మార్ట్ అవలంబించిన కాంక్రీట్ అంగడి నమూనా మాదిరిగానే, అమెజాన్ నమూనాలో కూడా మూడో అంచె వ్యాపారస్తులు తన వస్తువులు అమ్ముకునేందుకు అమెజాన్ సంస్థకు సుంకం చెల్లించాల్సి వుంటుంది. అలా చెల్లించిన తర్వాతే అమెజాన్ సంస్థ తన విశాలమైన వినియోగదారుల ఖజానాను వివిధ వ్యాపారస్తులకు అందుబాటులోకి తెస్తుంది. అలా 'పెద్ద మొత్తంలో వస్తువుల ఉత్పత్తి, తక్కువ గిట్టుబాటు నమూనా'లో చిన్నా చితకా వ్యాపారస్తులు కూడా భాగస్వాములవుతారనమాట. ఒకే రకం వస్తువులు అమ్మే వేర్వేరు వ్యాపారస్తులను ఒకే వేదిక మీద కూర్చోబెట్టి అమ్ముకోండని చోద్యం చూస్తుంటుంది అమెజాన్. ఈ రకంగా కూడా ఆయా వ్యాపారస్తులు తమతమ వస్తువుల ధరలను పోటీ తట్టుకోలేక భారీగా తగ్గించేందుకు నెట్టివేస్తుందన్నమాట. అమెజాన్ స్వంత దుస్తుల బ్రాండ్లతో కూడా ఈ వ్యాపారస్తులు మరింతగా పోటీపడాల్సి రావడం మనం చూడవచ్చు. తన వ్యాపారస్తుల పూర్తి వివరాలను తన గుప్పిట్లో వుంచుకుంటుంది అమెజాన్ సంస్థ. అంటే వ్యాపారస్తుల అమ్మకాలు, లావాదేవీలు అన్నీ కూడా అమెజాన్ కనుసన్నల్లోనే జరుగుతాయి. ఆ సమాచారం అంతా అమెజాన్ చాలా చాకచక్యంగా తన దగ్గర భద్రపరుకుంటుంది. ఈ సమాచారమే అమెజాన్ ఖజానా. ఇక ఈ సమాచారం ఆధారంగా ఏ సరుకు ఎక్కువ అమ్ముడవుతోంది, ఏది తక్కువ ధరకే లభ్యమవుతుంది, ఏ ప్రాంతంలోని ఏ రకమైన వస్తువులకు గిరాకీ వుంది లాంటి సమాచారాన్ని తన విశ్లేషణలకు ఉపయోగించుకుని తన వ్యాపారాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరచుకునే వ్యూహాలను చాలా అలవోకగా రచించుకోగలుగుతుంది. అలా తన పోటీదారులను గుర్తించి వారిని వేటాడేందుకు సిద్ధం అవుతుంది.

వ్యాపారంలో నిలబడాలంటే ఎంత వీలయితే అంత తక్కువ ధరలను పెట్టడమొక్కటే వ్యాపారస్తుల ఎదుట వున్న ఏకైక మార్గం. ఇలా చేయాలంటే సహజంగానే మరింత తక్కువ ఖర్చులో, తక్కువ కూలీకి పనిచేసే కార్మికులతో ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఇలాంటి వాతావరణం వుండే దేశాలను వెతుక్కోవాలి. సరఫరాదారులను అమెజాన్ 'పిండు'కుంటే, ఆ సరఫరాదారులు తిరిగి కూలీలను, కార్మికులను 'పిండుకుంటా'రన్నమాట.

భారీ ఉత్పత్తి మరియు తక్కువ గిట్టుబాటు, త్వరగా మారే ఫ్యాషన్ ధోరణులు, ఆన్ లైన్ విక్రయ వేదికలు, ఈ మూడు పద్ధతులను 'పాటించడం' లోనే ఈ బడా కంపెనీల మనుగడ వుంది. పైగా ఈ బడా కంపెనీలు ఒక ప్రత్యేక వస్తువును కొనే వినియోగదారులను రాత్రికి రాత్రే పెంచేయగలవు, తగ్గించనూ గలవు. ఈ ఆట అంతా తమ చెప్పుచేతుల్లోనే వుంచుకుంటారు. అలా సరఫరా గొలుసులో తమకు ఎప్పుడు అవసరమనుకుంటే అప్పుడు ఆటంకాలను, అవరోధాలను, సంక్షోభాలను సృష్టించగలుగుతారనమాట.

**కార్మికులను పిండుకోవడం, విలువను పీల్చుకోవటం**


అంతర్జాతీయ గొలుసుకట్టు సరఫరా వ్యవస్థలో అట్టడుగున వున్న కార్మికులను అనేక మార్గాల్లో పిండుకుంటుంటారు. అతి తక్కువ వేతనాలు, ఎక్కువ పని గంటలు, అమానవీయ ఉత్పత్తి లక్ష్యాలు, ఇలా చాలా రకాలుగా ఇది జరుగుతుంది. దుస్తుల ఎగుమతి కంపెనీలలో పనిచేసే కార్మికుల వేతనాలు వారి కనీస జీవిత అవసరాలలో సగం శాతం తీర్చుకునేందుకు కూడా సరిపోనంత తక్కువగా వుంటాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. కొద్ది దేశాల్లో ఇచ్చే వేతనాలతో ఇది కేవలం 14 శాతం మాత్రమే. (డబ్ల్యూ ఆర్ సి, 2013) ఈ వేతనాల్లో కోత నేరుగా మహిళా కార్మికులపైనే ఎక్కువ ప్రభావం చూపుతుంది (బర్యన్ తోస్, డోలన్ అండ్ టాలోటైర్, 2003; మిజ్జాదిరి, 2017). అనేక రకాల అసహజ పద్ధతుల్లో వేతనాలను చాలా తక్కువ స్థాయిలో వుంచుతుంటారు.

స్థానికంగా అడ్డాలపైన ఉండే అసంఘటిత కార్మికుల దుస్థితి, కార్మికులని సరఫరా చేసే దళారీ మేస్త్రీ వ్యవస్థ, కార్మిక విపణిలో వుండే ఇతర లొసుగులు, ప్రతికూలతలు కూడా దీనికి కారణాలే. ఇక కార్మికులు తమ హక్కుల కోసం సంఘటితం కాకుండా వుంచేందుకు సంస్థాగతమైన ఎన్నో నియమ నిబంధనలను తుంగలో తొక్కుతుంటారు (ఆనర్, 2020 బి). కార్మికులను సరఫరా చేసే మేస్త్రీలు కూడా కార్మికుల అనిశ్చితిని, అభద్రతను ఆసరా చేసుకుని దోపిడి చేసేవారే. ఫలానా పనికి ఇంత కూలీ అనో, లేదా ఇంటి నుంచే పనిచేయవచ్చని అలాంటి పనులను పురమాయించడం వేతనాల్లో కోత విధించడం ద్వారానే వీరికి మరింత సులువు అవుతుంది (ఆనర్, 2020 బి; మిజ్జాదిరి, 2017; వెయిగో, 2016).


ఇలా పిండుకోవడం, పీల్చుకోవడం అనేది కేవలం కర్మాగారాల్లో పనిచేసే కార్మికుల దగ్గరో, ఇంటి దగ్గరే దుస్తులను తయారు చేసే కూలీల దగ్గరో ఆగిపోదు. వీధి వ్యాపారస్తులు కూడా ఈ సరఫరా గొలుసుకు పై అంచెలో వున్న వారు మరిన్ని లాభాలు గడించేందుకు తమ వంతు దోహదపడుతుంటారు. ఎలాగంటే, తక్కువ వేతనం, కూలీకి పనిచేసే కార్మికులు తమ దినవెచ్చాలు, ఇతర తిండి ఏ సూపర్ మార్కెట్‌కో వెళ్ళి కొనుక్కోరు. తమ బస్తీల్లో వుండే వీధి దుకాణాదారుల దగ్గరే కొంటుంటారు. ఈ దుకాణాల్లో దిన వెచ్చాలు, పచారీ, తిండి కూడా చాలా తక్కువ ధరలకే దొరుకుతుంటుంది. ఈ కారణంగా కనీస జీవిత అవసరాలను తీర్చుకునేందుకు కూడా తక్కువ డబ్బులే అవసరం అవుతాయి. ఆ రకంగా జీవన ప్రమాణాల ధర కూడా పడిపోతుంది. అందుకే వీరికి తక్కువ వేతనాలు ఇచ్చినా 'సరిపోతుంటుంది', లేదా వీరి నుంచి వ్యతిరేకత ఎదురు కాదు. సరఫరాదారులు శ్రామికులకి తక్కువ వేతనాలిస్తే, కొనుగోలుదారులు ఈ సరఫరాదారుల నుంచి తక్కువ మొత్తంలో వస్తువులని కొనుగోలు చెయ్యొచ్చు, ఇన్వెస్టర్లకి రాబడి ఎక్కువ అవుతుంది. అలా సరఫరా గొలుసు అట్టడుగున వున్న ఈ కూలీల వేతనాల కోత, పై అంచెలో వున్న వారికి మరిన్ని లాభాలను ముల్లెలో వేస్తుంది.

ఇక బయటి ప్రాంతాల్లో పని, కూలి, ఉపాధి, ఉద్యోగం కోసం వలస వెళ్ళిన వారు తమ ఆదాయంలో కొంత భాగం ఇంటికి పంపుతుంటారు. ఇలా ఈ కార్మికులు తమ ఇళ్ళకు పంపే ఈ సొమ్ము గురించి కూడా మనం మాట్లాడితే ఈ చర్చ సమగ్రమవుతుంది. 2018లో ప్రపంచ వ్యాప్తంగా వలస కార్మికులు తమ ఇళ్ళకు పంపిన మొత్తం 482 బిలియన్ల అమెరికన్ డాలర్లు. 2019లో ఒక్క బంగ్లాదేశ్‌లోనే దుస్తుల పరిశ్రమలో పనిచేసే దాదాపు 40 లక్షల మంది కార్మికులు, కూలీలు 5 బిలియన్ల అమెరికన్ డాలర్ల కన్నా తక్కువ వార్షిక వేతనం పొందితే, ఆ దేశానికి ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వలస కార్మికులు తమ తమ ఇళ్ళకు పంపిన డబ్బు మొత్తం 18 బిలియన్ల అమెరికన్ డాలర్లు, బంగ్లాదేశ్ దుస్తుల పరిశ్రమలలో పనిచేసే మూడో వంతు కార్మికులు, కూలీలు (అంటే దాదాపు 10 లక్షల మంది) తమ కుటుంబ సభ్యులయిన వలస కార్మికుల నుంచి డబ్బులు పొందారు. ఈ డబ్బుల వల్లే తక్కువ వేతనం వచ్చినప్పటికీ జీవనాన్ని నెట్టుకు రాగలిగారు. వలస కార్మికులకూ, స్థానిక కార్మికులకూ ఉన్న ఈ లంకె ఈ సరఫరా వ్యవస్థలో తక్కువ వేతనాలని అర్థం చేసుకోవటానికి చాలా కీలకం. ఇందువల్లే సరఫరాదారులు తమ దగ్గర పనిచేసే కార్మికులకు,


**ఫిగర్ 1. కార్మిక నియంత్రణ, పెట్టుబడి సమీకరణ, పిండుకోవడం, పీల్చుకోవడం**




**ఫిగర్ 2. కిందటి సంవత్సరంలో, ఉత్పత్తి ఖర్చుకన్నా తక్కువ ధరకి అర్డర్లు మీరు తీసుకున్నారా?**





**ఫిగర్ 3. ఉత్పత్తి టార్గెట్లు అందుకోలేక పోయినందువల్ల కలిగిన పర్యవసానాలు**



కూలీలకు తక్కువ వేతనాలు ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. ఇదే తతంగాన్ని కొనుగోలు దారులు కూడా పాటించి బ్రతుకు గడవటానికి అవసరమైన వేతనాలకన్నా తక్కువకి చెల్లింపులను నిర్ధారిస్తారు. మెక్సికో ఇందుకు ఒక మంచి ఉదాహరణ. అక్కడ కంపెనీల్లో వలస కార్మికులున్న కుటుంబాలను, సముదాయాలనే పనిలో పెట్టుకునేందుకు ఆసక్తి చూపుతారు. అప్పుడు ఒక ఎంత తక్కువ వేతనాలు ఇచ్చినా కిమ్మనకుండా కార్మికులు సర్దుకుపోతారన్నమాట (కాలిన్స్, 2006). ఆ ప్రకారంగా వలస కార్మికులు పంపే మొత్తం కారణంగా సరఫరాదారులకు తమ కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల్లో భారీగా మిగులుతాయి. ఇవే ఈ వ్యవస్థలో పై అంచెలో వున్న వారికి అదనపు సంపదను సృష్టిస్తాయి.

అంతర్జాతీయ వ్యవస్థలు, ఆయా ప్రభుత్వాలు తీసుకున్న అనేక నిర్ణయాల ఫలితమే ఈ ధోరణులకు కారణం. అమెరికాలో క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ను అత్యంత దారుణంగా తగ్గించేసింది రొనాల్డ్ రీగన్ ప్రభుత్వం (ఫారూహర్, 2017). పైగా ఆంటీ ట్రస్ట్ చట్టానికి కూడా సవరణలు చేసింది (డేయన్, 2020). ఈ రెండు నిర్ణయాల వల్ల ఫినాన్సియలైజేషన్‌కు, కార్పొరేట్ల ఏకీకరణకు మార్గం సులువు అయ్యింది. ఆ తర్వాతి కాలంలో ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ కేంద్రంగా నడిచిన నయా ఉదారవాద సంస్కరణలను అన్ని ప్రభుత్వాలూ అమలు చేసాయి. డబ్ల్యుటిఓ కూడా వాణిజ్యాన్ని సరళీకరించి చైనా, వియత్నాం లాంటి దేశాలకు కూడా సభ్యత్వం ఇచ్చింది (జెరెఫీ అండ్ ఫ్రెడ్రిక్, 2010). ఐఎమ్ఎఫ్ తానిచ్చే అప్పులపై పెట్టిన షరతులు, కొత్త నిబంధనల వల్ల కూడా శ్రామిక విపణిలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. దోపిడీకి వ్యతిరేకంగా పోరాడలేనంతగా శ్రామికవర్గాన్ని బలహీన పరిచాయి ఈ సరళీకరణలు. శ్రామికుల, కార్మికుల శ్రమ, వేతనాల్లో పీల్చుకోవటాన్ని, పిండుకోవడాన్ని (పేజీ నెం.25లోని ఫిగర్ 1 చూడండి).

**ఫిగర్ 4.**




**కార్మిక హక్కుల ఉల్లంఘనలు ▬ ధరలు, యుఎస్ డాలర్లు/స్క్వేర్ మీటర్ ▬ ,(#347)**

బంగ్లాదేశ్, భారతదేశంలో సరఫరాదారులను కొనుగోలుదారులు ఎలా పిండుకుంటారు, సరఫరాదారులు కార్మికులను, కూలీలను ఎలా పిండుకుంటారు అన్న విషయాలను నేను పరిశోధించి రాసాను (ఆనర్, 2020 బి).

ఉదాహరణకు, భారతదేశంలో 61 శాతం మంది సరఫరాదారులు తమపై కొనుగోలు దారులు చాలా వత్తిడి తెచ్చారని, ఆ వత్తిడి వల్లే తాము ఉత్పత్తి ఖర్చుకన్నా చాలా తక్కువ ధరలకు పని ఒప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు (పేజీ.25లోని ఫిగల్ 2 చూడండి).

తమపై వచ్చిన ఈ వత్తిడిని తట్టుకునేందుకు ఈ సరఫరాదారులు తమ కార్మికులకు, కూలీలకు తక్కువ వేతనాలు చెల్లించారు. దాదాపు 96 శాతం మంది మహిళా కార్మికులు తమకొచ్చే జీతాలు కనీస అవసరాలు తీరేలా లేవని తెలిపారు. ఇలా పిండుకోవడం, పీల్చుకోవడం వల్ల పని వత్తిడి చాలా పెరగడమే కాకుండా, పని వేళలు కూడా పెరిగాయి. పైగా చాలాసార్లు ఆ అదనపు పనివేళలకు అదనపు వేతనమేమీ ఇవ్వరు. ఇక అనుకున్న సమయానికి అనుకున్నట్టు లక్ష్యాలు చేరుకోకపోతే తిట్లు, శాపనార్థాలు షరామామూలే. గంటకు ఇంత పని చేయాలన్న లక్ష్యం వుంటుంది. అలా చేయనందుకు 64 శాతం మంది మహిళలు తిట్లు తినాల్సి వచ్చిందని చెప్పారు (పేజీ.25లోని ఫిగల్ 3 చూడండి).

బంగ్లాదేశ్‌లో తగ్గిన ధరలకు, తరుగుతున్న కార్మికుల హక్కులకూ మధ్య సంబంధం చూడవచ్చు. కార్మికులకు సంఘాలు పెట్టుకునే హక్కులు క్రమంగా తగ్గుముఖం పట్టాయి (పేజీ.25లోని ఫిగల్ 4 చూడండి).

కోవిడ్–19 విశ్వమారి వల్ల ఈ ప్రతికూల ప్రభావాలు మరింత తీవ్రతరం అయ్యాయి. సరఫరాదారులపైనా కార్మికుల, కూలీల పైనా ఇది ఘోరమైన ప్రభావం చూపింది. కోవిడ్ వల్ల భౌగోళిక ఉత్తర దేశాలలోని వారికున్న రిటెయిల్ వ్యాపారస్తులు తమ దుకాణాలను మూసివేసుకోక తప్పలేదు. అయితే సరఫరా గొలుసుపై ఆధిపత్యంతో అప్పటికే వచ్చివున్న ఆర్డర్లను, తమ సరఫరాదారులకు ఏ మాత్రం సొమ్ము చెల్లించకుండా రద్దు చేసుకోగలిగారు. దీని ఫలితంగా సరఫరాదారులు తమ కార్యకలాపాలను పాక్షికంగానో, లేదా పూర్తిగానో తక్షణం ఆపివేయాల్సి వచ్చింది. దీని కారణంగా కోట్లాది కార్మికులు, కూలీలు పనులు కోల్పోయారు, ఆదాయం కోల్పోయారు. ఇంకొంత మంది కార్మికులు, కూలీలు ఎలాంటి పరిహారం, వేతనం అందకుండా పనులనుంచి తొలగించబడ్డారు (ఆనర్, 2020 బి).

**ముగింపు**

బ్రాండ్లు, సరఫరాదారులు, కార్మికుల మధ్య తీవ్రమైన అధికార అసమానతల ప్రభావం అంతర్జాతీయ దుస్తుల సరఫరా గొలుసులపైన విపరీతంగా వుంటుంది. ఈ సరఫరా గొలుసు వ్యవస్థలకు ఆయా ప్రభుత్వాల విధానపరమైన మద్దతు, సహకారం వుంటుంది. దుస్తుల ఉత్పత్తిలో భారీ వృద్ధి, నైసర్గిక విస్తారాన్ని ఈ ప్రభుత్వాలన్నీ ప్రోత్సహిస్తాయి. పైగా ఈ వ్యవస్థలకు ద్రవ్యరంగం దన్నుగా నిలబడుతుంది. ఆ కారణంగానే కంపెనీలతో భారీ ఉత్పత్తి చేయించి, అధిక లాభాలు గడించేలా చేసి అందులోంచి తన వాటా దండుకోగలుగుతుంది ద్రవ్య రంగం. ఈ నమూనా ఫలితంగా కార్మికులు మరింత పతనావస్థలోకి కూరుకు పోతున్నారు. ఈ కార్మికుల్లో చాలా మంది బడుగు కుటుంబాలకు చెందిన యువతులే కావడం గమనార్హం. తక్కువ వేతనాలు, ఎక్కువ పని గంటలు, ఎక్కువ ఉత్పత్తి చేయాలన్న లక్ష్యాలు, అదనపు గంటలు పనిచేయడం, చేయకపోతే తిట్లు తినడం, ఇవన్నీ ఈ నమూనా కుక్కమూతిపిందెలే. అంతర్జాతీయ దుస్తుల సరఫరా గొలుసులోని ప్రతి దశలోనూ ఈ పరిస్థితులను మెరుగుపరచడం తక్షణ అవసరం. ఇందుకు కింది స్థాయి నుంచి కార్మికులను సంఘటితం చేయడం, సరఫరాదారులు కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేసేలా చూడటం అత్యంత అవసరం. కార్మికులకు జీవితావసరాలకు సరిపడిన న్యాయమైన వేతనాన్ని అందించేలా సరఫరాదారులపై వత్తిడి తీసుకురావడం, దీనితో పాటు, కార్మికులకు వేతనం ఇచ్చేటట్లు తమ ధరలను సవరించుకోవాలని బ్రాండ్లపైన కూడా వత్తిడి తేవడం, సుస్థిర అభివృద్ధిని నాశనం చేసే విధానాలకు స్వస్తి చెప్పి దానికి భరోసా ఇచ్చే విధంగా ఆర్థిక రంగంలో వ్యవస్థాగత మార్పులు చేర్పులు చేయడం చాలా కీలకం. అంతిమంగా ఇవన్నీ స్థూల వ్యవస్థను ప్రభావితం చేయగల జాతీయ, అంతర్జాతీయ నియమ నిబంధనలలో పరివర్తన తెచ్చేలా వుండాలి.

అనువాదం : **అనంతు చింతలపల్లి**


**అనంతు చింతలపల్లి** స్వతంత్ర జర్నలిస్టు

**మార్క్ ఆనర్** పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్శిటీలో లేబర్ మరియు ఎంప్లాయిమెంట్ రిలేషన్స్‌లో ప్రొఫెసర్

ఈ మెయిల్ *msa10@psu.edu*


*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్ షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*

# విద్యుచ్ఛక్తి వాహన-సరఫరా గొలుసులలో పని నిర్వహణ: భారతదేశ పరిశీలన

■ మాధురి సరిపల్లె, విజయ చేబ్రోలు- సుబ్రమణియన్

డిజిటల్ విప్లవం మొదలయ్యాక ప్రయాణ సౌకర్యాల విషయంలో ప్రాధాన్యతలు మారుతూ ఉండడం వల్ల ప్రపంచ వాహన రంగం ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థల్లో ఎన్నో మార్పులు సంభవిస్తున్నాయి. అదనంగా, వాతావరణ మార్పులు, భద్రతా సమస్యలు, వేగంగా జరుగుతున్న పట్టణీకరణ వల్ల ఈ మార్పులు ఇంకా వేగవంతం అవుతున్నాయి (నీతి ఆయోగ్ 2018). రవాణా నమూనాలో జరగబోయే మార్పుల వలన క్రమక్రమంగా సాంప్రదాయ కంబషన్ ఇంజన్‌తో నడిచే వాహనాల నుంచి విద్యుచ్ఛక్తితో నడిచే వాహనాలు, కలిసి ప్రయాణాల దిశగా రవాణా రంగంలో ప్రాధాన్యతలు మారిపోతాయి. అవి ఈ పరిశ్రమ నిర్మాణ వ్యవస్థని మౌలికంగా మార్చివేస్తాయి. సరఫరాదారులు, విడిభాగాల తయారీదారులు, సమీకరణదారులు (అసెంబ్లర్లు), డీలర్లు, ఫైనాన్సర్లు మరియు కస్టమర్లు అనే వర్టికల్ నమూనా నుంచి వాటాదారుల (స్టేక్ హోల్డర్స్) తో కూడిన ఒక పరస్పర ఆధారిత నెట్‌వర్క్ నమూనాకి పరిశ్రమ మారుతుంది.

పరిశ్రమలోని వాటాదారులతో జరిపిన ఇంటర్వ్యూలు, ఇప్పటి వరకూ జరిపిన అధ్యయనాల ఆధారంగా రాసిన ఈ వ్యాసం పైన చెప్పిన మార్పుల వల్ల భారతీయ వాహన రంగంలో పని నిర్వహణ ఎలా ప్రభావితం అవబోతోందో అన్వేషిస్తుంది. ప్రత్యేకంగా, కొత్త నైపుణ్యాలు మరియు కొత్త ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి కేంద్రీకరిస్తుంది. ఇందులో మూడు విస్తృత అంశాలని పరిశీలిస్తుంది. మొదటిది, సంప్రదాయ వాహన సరఫరా గొలుసుతో కొత్తగా వస్తున్న సరఫరా గొలుసుని పోల్చి, రానున్న మార్పు ఆ గొలుసులోని వివిధ సంస్థల మధ్య సంబంధాలనెట్లా ప్రభావితం చేసుందో చూస్తుంది. రెండు, రాబోయే విద్యుచ్ఛక్తి వాహనాలు ఈ రంగంలోని శ్రమ, నైపుణ్యాలకుండే గిరాకీని ఎలా ప్రభావితం చేయబోతున్నాయో విశ్లేషిస్తుంది. మూడు, ఆటోమోటివ్ రంగంలో ఉన్న అసంఘటిత కార్మికుల ఉపాధి అవకాశాలకి ఎదురవబోయే సమస్యల దృష్ట్యా, ఈ మార్పులని సులభతరం చేయడానికి ప్రభుత్వ విధానాలు పోషించవలసిన పాత్ర గురించి చర్చిస్తుంది.

వ్యాసంలో ఐదు భాగాలున్నాయి. మొదటి భాగం, విద్యుచ్ఛక్తి వాహనాల పరిశ్రమ పరిణామ క్రమాన్ని, అది ప్రపంచ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్ళని వివరిస్తుంది. రెండవ భాగం, కంబషన్ మరియు విద్యుత్ వాహనాల సరఫరా గొలుసు వ్యవస్థలలో ఉన్న తేడాలను విశ్లేషిస్తుంది. మూడవ భాగం, భారత దేశంలో అటువంటి మార్పుకి ఎంత భిన్నమైన నైపుణ్యతలు కావాల్సి ఉంటాయో విశదీకరిస్తుంది. నాలుగవ భాగం, ఈ మార్పులపై కోవిడ్19 యొక్క ప్రభావాన్ని చర్చిస్తుంది. ఐదవ భాగం, ఆటోమొబైల్ రంగంలో పనిని పునర్ వ్యవస్థీకరించడానికి అవసరమైన సహకారాన్ని అందించడంలో ప్రభుత్వ విధానం యొక్క కీలక పాత్రని తెలుపుతుంది.

**1. నేపథ్యం**

ఆటోమొబైల్ పరిశ్రమ వ్యవస్థీకృతమైన ఉత్పత్తిదారుల సరఫరా గొలుసు వ్యవస్థకి పేరొందింది. ఈ వ్యవస్థ అన్నిచోట్ల నుండి ఉత్తమ పని పద్ధతులని అవలంబించటం వల్ల ప్రపంచ మార్కెట్ల డిమాండ్లని సమన్వయించ గలుగుతుంది. సాంప్రదాయక సరఫరా గొలుసు మొదటి శ్రేణి నుండి మూడవ శ్రేణి వరకు సరఫరాదారుల నెట్‌వర్క్ పై ఆధారపడి ఉంటుంది. వీళ్ళు సాంకేతికంగా పై స్థాయి పనులే కాకుండా చిన్న చిన్న పనులు, బాగుచేయటం వంటి పనుల్లో కూడా పాల్గొంటారు. ఇందులో పైస్థాయి వ్యవస్థీకృత సరఫరాదారు సరఫరా వ్యవస్థలోని వివిధ స్థాయిలలో పనులను మిగిలిన వారికి కేటాయిస్తారు. విద్యుచ్ఛక్తి వాహనాల రాక ఈ సోపాన క్రమాన్ని తెగ్గొట్టి, సరఫరా గొలుసులో ఉన్న వివిధ వాటాదారుల మధ్య కొత్త ఒప్పంద సంబంధాలని, కొత్త నియంత్రణా పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా, సాంప్రదాయక ఉత్పత్తిదారుల సరఫరా గొలుసు నమూనా లేదా వ్యవస్థని విచ్ఛిన్నం చేస్తుంది. పిస్టన్లు మరియు ఇంధన ఇంజెక్టర్లు వంటి భాగాలు వాడుక నుండి మాయమవుతాయి కనుక కొత్త విడిభాగాలకి, కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. హైబ్రిడ్ల నుంచి ప్లగ్ ఇన్ హైబ్రిడ్లకు (పిహెచ్ఇవి) బాటరీ ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు (బిఇవిఎస్) ఫ్యూయల్ సెల్ ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు (ఎఫ్‌సిఇవిఎస్) క్రమంగా ఒక్కో దేశం మారిపోవడం వలన దశల వారీగా కంబషన్ ఇంజన్ల నుంచి ఎలక్ట్రిక్ వాహనాలకు మార్పు జరుగుతుంది.

ఎలక్ట్రిక్ వాహనాల భారీ ఉత్పత్తికి ఎన్నో సవాళ్లు ఉన్నాయి: బాటరీ ఖర్చు, ఛార్జింగ్‌కి అయ్యే సమయం, డ్రైవింగ్ పరిధి, మౌలిక సదుపాయాలు, రీచార్జి స్టేషన్ల ప్రామాణీకరణ, అధిక ప్రారంభ పెట్టుబడుల వ్యయం వంటివి. అంతేకాక ఉత్పత్తికి అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానం వల్ల ఎలక్ట్రిక్ వాహనాల ధర ఎక్కువ. వినియోగదారుడి దృష్టి నుండి చూసినపుడు గ్రిడ్ కనెక్టివిటీ, ఛార్జింగ్ స్టేషన్లు, బ్యాటరీని రవాణా చేయడం లేక తీసుకెళ్లడం వంటి మౌలిక సదుపాయాలకి సంబంధించిన సవాళ్లు కూడా అనేకం. ఇవన్నీకాక, ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలో కాలుష్యం విద్యుదుత్పత్తి పద్ధతులపై ఆధారపడి ఉంటుంది. (అఖావన్-రేజాయ్ తదితరులు 2015, సు మరియు ఇతరులు 2011, పీటర్ కూపర్ మరియు ఇతరులు 2019). ఈ సవాళ్ళ నేపథ్యంలో ఈ సాంకేతిక పరిజ్ఞానం విస్తరించటానికి ప్రభుత్వ నియంత్రణ పోషించే పాత్ర కీలకమవుతుంది. భారతదేశంలో ఈ సాంకేతిక పరిజ్ఞానం అవలంబనకి సంబంధించి 2040-2050 భారీ మార్పు జరుగుతుందని పరిశ్రమ వర్గాల అంచనా (బ్లూమ్బెర్గ్ ఎలక్ట్రిక్ వెహికల్ ఔట్‌లుక్ 2019).

ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలో అమెరికా, చైనా, జపాన్, నెదర్లాండ్స్ మరియు నార్వే అగ్రస్థానంలో ఉన్నాయి. సాంకేతిక పురోగతి విషయంలో జపాన్, దక్షిణ కొరియా మరియు జర్మనీ ముందంజలో ఉన్నాయి. ఆసియాలో వాహనాల ఉత్పత్తిదారులు లేరనే చెప్పచ్చు. ట్యూరి(2019) ప్రకారం ఎలక్ట్రిక్ వాహనాల కూర్పు ప్రస్తుతం కేవలం మూడు దేశాల్లో జరుగుతోంది: స్లోవేకియా, టర్కీ మరియు మెక్సికో. అయితే అక్కడ శ్రామిక ఖర్చులు పెరిగే కొద్దీ, తక్కువ శ్రామిక ఖర్చులు, అధిక నైపుణ్యం గల ఆర్థిక వ్యవస్థలు కలిగిన ఇండియా వంటి దేశాలకి, అనుకూల పరిస్థితులు నెలకొని, సాంకేతిక సామర్థ్యాలు అభివృద్ధి చెందితే, కొంత ఉత్పత్తి అవుట్ సోర్స్ అయ్యే అవకాశం ఉంది.


**II. సరఫరా గొలుసు విచ్ఛిన్నం: కంబషన్ వర్సెస్ ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమలు**

సరఫరా గొలుసులో కీలక పాత్రధారులు

సాంప్రదాయ వాహన పరిశ్రమలో ఉత్పత్తి ప్రధానంగా ఆరు భాగాలుగా సాగుతుంది: ఇంజన్, సస్పెన్షన్, ట్రాన్స్మిషన్, షీట్ మెటల్, విద్యుత్ పరికరాలు మరియు


టైర్లు, స్టీల్, అల్యూమినియం, రబ్బర్, ఎలక్ట్రికల్ మరియు ఇతర ఉత్పత్తిదారుల చోదక పరిశ్రమలతో ఇవి విస్తారమైన అమరికలను ఏర్పర్చుకుంటాయి. ఇంజన్, పవర్ ట్రెయిన్ తయారు చేసే ఉత్పత్తిదారులు విలువ సృష్టించటంలో ప్రధాన పాత్ర వహించి, వాహన ఉత్పత్తి గొలుసుపై ఆధిపత్యం కలిగిఉంటారు. శ్రమని చూస్తే, వాహన కూర్పు (అసెంబ్లీ) పనిలో సరఫరా గొలుసు ఎక్కువగా ఒప్పంద (కాంట్రాక్టు) కార్మికులపై ఆధారపడి ఉందని ఫిగర్ 1 సూచిస్తుంది. ప్రత్యక్ష ఉపాధిలో క్రమబద్ధ మరియు ఒప్పంద కార్మికులు ఇద్దరూ ఉంటారు. వాహన పరిశ్రమలో దాదాపు 30% ఉపాధి ఇక్కడే ఉంటుంది. 70% ఉపాధి పరోక్షంగా అంటే, వాహన ఫైనాన్స్ మరియు భీమా, రిపేర్, సర్వీస్ స్టేషన్ల నిర్వహణ, వాహన మరియు కంపోనెంట్ డీలర్లు, డ్రైవర్లు, క్లీనర్లు వంటి వారితో నిండిన వినియోగదారుని సేవలకు సంబంధించింది (పిళ్లబ్యుసి, 2013)

**ఫిగర్ 1. సాంప్రదాయ ఆటోమోటివ్ సరఫరా గొలుసు:**




ఆధారం: ఫీల్డు సర్వేలోని ఇంటర్వ్యూల ఆధారంగా

**ఫిగర్ 2. విద్యుచ్ఛక్తి వాహనాల సరఫరా గొలుసు**




ఎలక్ట్రిక్ వాహన సరఫరా గొలుసు క్లిష్టమైనది ఎందుకంటే దీనిలో పరస్పర అనుసంధానంతో పని చేసే అనేక పాత్రధారులుంటారు. సాంప్రదాయ కంబషన్ ఆధారిత వాహనాల కంటే విద్యుచ్ఛక్తితో నడిచే వాహనాల తయారీ తక్కువ క్లిష్టతతో కూడుకుంది. అవి అసెంబుల్ చేయడానికి 30% తక్కువ సమయం పడుతుంది. అందువల్ల దీని ఉత్పత్తికి శ్రామిక శక్తి అవసరాలు తక్కువ ఉండచ్చు. దీని పర్యవసానంగా ప్రపంచ వాహన ఉత్పత్తి నెట్వర్క్, కార్మిక డిమాండ్ యొక్క పునర్నిర్మాణం జరగవచ్చు. అయితే వీటి విలువ గొలుసు ఇంకా సంక్లిష్టమైనది. ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమలో విలువ సృష్టి వాహన పూర్తి ధరలో 35-40% అయిన బాటరీ విభాగ ఉత్పత్తిలోనే ఉంటుంది. ప్రస్తుతం ఇది లిథియం వంటి ముడి సరుకు అందుబాటులో ఉన్న చైనా వంటి కొన్ని దేశాల ఆధిపత్యంలో ఉంది. మోటార్లు, కంట్రోలర్లు, దీనితోపాటు ఛాసిస్ మరియు బాడీ ఇంకా ఇతర ఎలక్ట్రిక్ భాగాలు ముఖ్యమైనవి. ఎలక్ట్రిక్ వాహనాలు తక్కువ కదిలే భాగాలు కలిగి ఉంటాయి. కనుక ఇప్పటికే ఉన్న భాగాలలో కొన్నింటి అవసరం ఉండదు. ఉదాహరణకి ఇంధన ట్యాంకులకి బదులుగా దానంతటదే పని చేసే బ్రేకులు వస్తాయి. మెకానికల్‌గా పని చేసే వాహన అంతర్గత క్రమాన్ని, ఎలక్ట్రానిక్ వ్యవస్థలకి మార్చడం వల్ల కొత్తగా అవసరమయ్యే హార్డ్‌వేర్ (మెషిన్ భాగం) సాఫ్ట్‌వేర్ (దాన్ని నడపటానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం) రిమోట్ డయాగ్నస్టిక్ (దూరం నుండి ఈ వాహనాల్లో వచ్చే సమస్యలను గర్తించటం). వంటి ప్రత్యేక సామర్థ్యాలకి డిమాండ్ ఏర్పడుతుంది (మసైరో మరియు ఇతరులు, 2017). ఎలక్ట్రిక్ వాహనాల సరఫరా గొలుసుని ప్రధానంగా ఇలా వర్గీకరించవచ్చు (ఫిగర్ 2 చూడండి).

1. డిజిటల్/ఎలక్ట్రానిక్స్: ఇందులో ఇంధన సెల్స్, బాటరీ ప్యాక్‌తో కూడిన బాటరీ మేనేజ్‌మెంట్ సిస్టం ఉంటుంది. ఇవే కాక, ఇతర ఎలక్ట్రానిక్ భాగాలు, డాష్‌బోర్డు, వాహన నియంత్రణ విభాగం, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (సాఫ్ట్‌వేర్, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతో కలిపిన పరికరం: ఇది ఇతర పరికరాలతో సమాచారాన్ని పంచుకోగలదు) అలాగే క్లౌడ్ సేవలు (అనేక మంది ఇంటర్నెట్ వినియోగదారులు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉపయోగించుకో గలిగే సమాచార సేవలు)

2. వాహన మోటార్ ఉత్పత్తి, బాడీ మరియు చాసిస్‌తో కూడిన వాహన అసెంబ్లీ

3. విద్యుచ్ఛక్తిని సేవగా అందించటం: దీనిలో విద్యుచ్ఛక్తి గ్రిడ్ సదుపాయం; ఛార్జింగ్ సదుపాయాలు, విద్యుచ్ఛక్తిని సమకూర్చటం ఉంటాయి.

ఇందులో ప్రతి ఒక దానికి స్వంత సరఫరా గొలుసు ఉండటమే కాక, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ పరిశ్రమలకి, ఇంధన రంగానికి అనుసంధానమయి ఉంటాయి. క్రింది చదవబోయే భాగం సరఫరా గొలుసు యొక్క ప్రతి విభాగంలో అవసరమైన కీలక నైపుణ్యాలను, భారతదేశంలో ప్రతి విభాగం యొక్క ప్రస్తుత స్థితిని విశ్లేషిస్తుంది.

*ఉపాధిపై, శ్రామికుల ఆవశ్యకతపై ప్రభావం: ద్వి చక్ర, మూడు చక్రాల విద్యుచ్ఛక్తి వాహనాలు*

ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలో పెరుగుదల వల్ల అదనపు ఉద్యోగాల సంఖ్య పెరుగుతుందని ఎన్నో అధ్యయనాలు అంచనా వేస్తున్నాయి. ఈ సంఖ్య 2030 నుండి 2050 కల్లా 8,50,000 నుంచి రెండు మిలియన్లకు పెరగబోతోందనీ, ఇంకా పరిశ్రమకి కావాల్సిన పని నైపుణ్యాలలో మార్పు రాబోతుందని అంచనా. పాశ్చాత్య దేశాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి భారతదేశంలో వృద్ధి పథం భిన్నంగా ఉండబోతుంది. మొత్తం ఆటోమొబైల్ పరిశ్రమలో 79% భాగంగా ఉన్న ద్విచక్ర వాహన పరిశ్రమలోనే ఉపాధి అవకాశాలు ఉంటాయి. 2005లో ఆటోమోటివ్ మిషన్ ప్లాన్‌లో భాగంగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల ఉత్పత్తికి లభించిన

ప్రోత్సాహకాలతో భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ప్రయత్నం మొదలయ్యింది. 2011లో ఈ ప్లాన్‌ని ఉపసంహరించుకున్నారు, మళ్ళీ 2015 లో  ఫేమ్ (ఫాస్టర్ ఆడాప్షన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆఫ్ హైబ్రిడ్ అండ్ ఎలక్ట్రిక్ వెహికిల్స్) విధానాన్ని ప్రారంభించారు.

భారతదేశంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల మార్కెట్ ధరల విషయంలో చాలా త్వరగా స్పందించే స్వభావం కలిగింది కాబట్టి, తయారీదారులు కిలోమీటర్ ప్రాతిపదికన బ్యాటరీలని లీజుకి ఇవ్వడం, చార్జర్‌తోపాటు నిర్మితమైన ట్రాలీలు ఉండి సులభంగా తీసుకెళ్ళ గలిగే బ్యాటరీలతో రూపొందించడం వంటి వ్యాపార నమూనాలపై దృష్టి సారిస్తున్నారు. ఐతే, ప్రస్తుతం ఉన్న వ్యాపార నమూనాలు, దానికి తోడు ప్రభుత్వ అస్పష్ట వైఖరి వల్ల ఇప్పటికే ఉన్న ద్విచక్ర వాహన వ్యాపారస్తులకు భారీ ఎత్తున ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి చేయడానికి ప్రోత్సాహకాలు లేవు. తమ మార్కెట్ వాటాని తామే కబళించుకునే అవకాశం కూడా లేక పోలేదు. త్రిచక్ర వాహన విభాగంలో లెడ్ఆసిడ్ నుంచి లిథియం అయాన్‌తో నడిచే బ్యాటరీలకు మార్చబడాల్సిన బ్యాటరీతో నడిచే వాహనాలు ఒక మిలియన్ ఉన్నాయి. వీటిని మార్చే ప్రాజెక్ట్ ఎలక్ట్రిక్ వాహనాలకు భారీ డిమాండ్‌ని సృష్టించగలదు. అలాగే కొత్త వాళ్ళని పరిశ్రమలో రావడానికి కూడా ప్రోత్సహించే అవకాశాలున్నాయి.

## III. **సరఫరా గొలుసులో నైపుణ్యాల రేఖా చిత్రం**

*ఎ. బాటరీ తయారీ మరియు బాటరీ మానేజ్‌మెంట్ సిస్టమ్*

విలువ గొలుసులో ఇంధన సెల్స్‌కి బాధ్యులైన బాటరీ తయారీదారుడిదే అసలు అదిపత్యం. బాటరీ పైన శ్రేణిలో, దాని పనితీరుని బాటరీలో ఉండే ఎలక్ట్రానిక్స్‌ని నియంత్రించే బిఎమ్ఎస్ మరియు పవర్ ట్రైన్ లేదా ఎలక్ట్రిక్ మోటార్‌లోకి ప్రవహించే విద్యుచ్ఛక్తిని నిర్దేశించే వెహికల్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. బాటరీకి ప్రధాన వనరు చైనా కాబట్టి ఇండియాకి దాన్ని స్థానీకరణ చేసే అవకాశం లేదు. భారతీయ కంపెనీలు బాటరీ ప్యాక్ మీద దృష్టి నిలిపాయి కానీ వీటిలో తయారీదారుల మధ్య చాలా తేడాలు ఉన్నాయి. దీనిలో ప్రామాణీకరణ చేసేందుకు అవకాశం ఉంది. బాటరీ ప్యాక్‌లో మొత్తం బాటరీ మాడ్యూల్ మరియు దాన్ని నియంత్రించే బిఎమ్‌స్‌తోపాటు ఇతర సిస్టమ్‌లు ఉంటాయి. బాటరీ ప్యాక్ నమూనాని అది పనిచేసే కాలం, దాని పనితీరుని మెరుగుపరిచే విధంగా రూపొందిచవచ్చు. ఉదాహరణకి టెస్లా ఆటోమొబైల్ కంపెనీ తయారు చేసే బాటరీ ప్యాక్ వినూత్నంగా ఉంటుంది. అది ఫ్లాట్ బాటరీ సాంకేతికతని ఉపయోగిస్తుంది. దీని సరఫరాదారులు, తయారీదారులకి మధ్య తెగ్గొట్టలేని సంబంధం ఉంది. బాటరీ ప్యాక్ ప్రామాణికమవుతున్న కొద్దీ దాన్ని చవకగా తయారు చెయ్యటం వీలుపడి, నెమ్మదిగా ఉపాధి పెరిగే అవకాశాలు ఉంటాయి. ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్స్ మొ॥ రంగాలలో ఉన్న అవకాశాలని బట్టి అంచనా వేస్తే, భారత దేశంలో వీటిని వాహన రంగంతో అనుసంధానం చేసి ఎలక్ట్రిక్ ఇండక్షన్ మోటార్ విభాగంలో నైపుణ్యాలని కల్పించి పెంచవచ్చు. వాహన నియంత్రణ యూనిట్‌ని నిర్వహించ గలిగే నైపుణ్యాలకు కూడా డిమాండ్ ఉండబోతుంది. ఐటి మరియు కంప్యూటింగ్ విభాగాల్లో ఈ నైపుణ్యాలు లభ్యం కావచ్చు. ఇప్పటికైతే కెపిఐటి వంటి కొత్త సరఫరాదారులు ఇంజనీరింగ్ డిజైన్ సామర్థ్యాలతో విలువ గొలుసులో పై స్థాయిలోకి చేరారు.

*బి. వాహన తయారీ*

ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి కదిలే భాగాల అవసరం తక్కువ. మొత్తంగా అవసరమయ్యే భాగాలూ తక్కువే కానీ వాటి ఎలక్ట్రిక్ ఎలక్ట్రానిక్ భాగాల మరమ్మత్తు, నిర్వహణ కోసం నైపుణ్యం ఉన్న మానవ వనరులు అవసరం. ఎలక్ట్రిక్ భాగాలకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ని తీర్చడానికి అవసరమైన సామర్థ్యం, ఉత్పత్తి స్థాయిని పెంచడానికి ఈ విభాగంలో భారతదేశంలో ఇటీవలి కాలంలో అనేక కంపెనీల విలీనాలు జరిగాయి. అలాగే పెద్ద కంపెనీలు చిన్న కంపెనీలను కొనేసుకోవటం జరిగింది. కాంస్టార్ ఆటోమోటివ్ టెక్నాలజీస్ మరియు సోనా బిఎల్‌వి వంటి కొత్త సరఫరాదారులు ఎలక్ట్రిక్ మోటార్లు, ఎలక్ట్రిక్ ఆక్సిల్స్ తయారీలో గణనీయమైన సామర్థ్యాలను సాధించాయి. 2019లో సోనా బిఎల్‌వి సంస్థ కాంస్టార్‌ని కొనడంతో ఆ రెండూ విలీనం అయ్యాయి. 1990లో స్థాపించబడిన వారాక్ గ్రూప్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా లైటింగ్ సిస్టంలని, పవర్ ట్రైన్ విభాగాలని, ఎలక్ట్రిక్ మరియు ఎలక్ట్రానిక్ కూర్పులని, పాలిమర్ ఆధారిత వాహన ఉత్పత్తులను సరఫరా చేస్తోంది (ఎకనమిక్ టైమ్స్).

సి. సేవగా విద్యుచ్ఛక్తి

ఈ రంగంలో విలువ గొలుసులోని విద్యుచ్ఛక్తి ప్రొవైడర్లు, విద్యుచ్ఛక్తి మౌలిక సదుపాయాలు,  ఛార్జింగ్ స్టేషన్లు ఉంటాయి. భారతదేశంలో ప్రస్తుతం 80,000 పెట్రోల్ స్టేషన్లు ఉండగా కేవలం 500 ఛార్జింగ్ స్టేషన్లు ఉన్నాయి. దీన్నిబట్టి ఈ రంగంలో ఉపాధి కల్పనకు ఎంత అవకాశం ఉందో తెలుస్తుంది. ఇందులో ప్రధాన భాగస్వాములుగా వాహన తయారీ రంగంలో ఉన్న ప్రైవేట్ సంస్థలు ఉంటే, ప్రభుత్వ రంగంలో ఉన్నవి ఎన్‌టిపిసి (ఛార్జింగ్ మౌలిక సదుపాయం), బిహెచ్ఇఎల్ (బ్యాటరీ సాంకేతికత), విద్యుత్ మంత్రిత్వ శాఖ. ప్రైవేట్ రంగంలో టాటా పవర్ మరియు ఓలా సంస్థలు ఉన్నాయి.

*డి. ఉపాధిలో అవసరం అయ్యే మార్పులు*

ఆటోమోటివ్ పరిశ్రమలో ఎలక్ట్రిక్ వాహనల తయారీకి కొత్త సరఫరా గొలుసులు తయారవడంతో, చిన్న, మధ్య తరహా సాంప్రదాయ వాహన అనుబంధ కంపెనీలను ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కోసం సిద్ధం చేయడానికి చేయూతనిచ్చే అవసరం ఏర్పడుతుంది. సాంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసిఈ) ఆధారిత పరిశ్రమవలే కాక ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమలో తక్కువ నైపుణ్యం గల ఉద్యోగాలకి అవకాశం తక్కువ. ఇదే కాక మరమ్మత్తులు, నిర్వహణ విభాగాల్లో ఉన్న ఎస్ఎమ్ఈలకు కూడా డిమాండ్ తగ్గుతుంది. టేబుల్ 1లో చూపిన విధంగా ఈ పరిశ్రమలో కొత్త నైపుణ్య అవసరాలు చాలా మటుకు ఎక్కువ నైపుణ్యం గల శ్రామికులకే ఉంటాయి. ఏదేమైనా ప్రపంచ వ్యాప్తంగా కొత్త నైపుణ్యాల కోసం డిమాండు, దాని సరఫరా వైపు మార్పు జరగబోతోంది. అలాగే వాహన రంగంలో ఉపాధి అవకాశాల కల్పనలో కొత్త నెత్తురు రాబోతోంది.

## IV. *కోవిడ్ యొక్క ప్రభావం:*

ప్రపంచ ఆటోమోటివ్ పరిశ్రమ తక్కువ డిమాండ్ వల్ల తయారీ మరియు సరఫరా గొలుసులలో తీవ్ర అంతరాయాలు ఎదుర్కొంటోంది. కోవిడ్19 ప్రభావంతో ఇది మరింత తీవ్రతరమయ్యింది. కార్ల అమ్మకాలు మరియు రిజిస్ట్రేషన్లలో ప్రపంచ వ్యాప్తంగా తగ్గుదల ఉంటే, ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ వాటా మాత్రం యూరోప్‌లో పెరుగుతూనే ఉంది. బాటరీతో నడిచే

| పనిరంగం | నిపుణత ఉన్నపని | పాక్షిక నిపుణత | నిపుణత లేనిపని | ఉద్యోగ పని వర్ణన |
|---|---|---|---|---|
| బ్యాటరీలపై పరిశోధన | | | | కెమిస్టులు, మెటీరియల్ సైంటిస్టులు |
| అటోమెబైల్ సాంకేతిక అభివృద్ధి, డిజైన్ | | | | ఇంజనీర్లు, సాఫ్ట్‌వేర్ డెవలపర్లు, ఇండస్ట్రియల్ డిజైనర్ |
| యంత్రాల తయారీ | | | | అసెంబ్లర్లు, మెషీనిస్టులు, ప్రొడక్షన్ మేనేజర్లు |
| వాహన మెయింటెనెన్స్ | | | | ఆటోమెబైల్ సర్వీసు టెక్నిషియన్లు, మెకానిక్‌లు |
| మౌలిక సదుపాయాల అభివృద్ధి | | | | పట్టణ, ప్రాంతీయ ప్రణాళికలు తయారుచేసేవారు, విద్యుచ్ఛక్తి లైన్లను ఇన్‌స్టాల్ చేసి, రిపేరు చేసేవారు, ఎలక్ట్రిషియన్లు |
| సేల్స్, సపోర్టు | | | | రీటెయిల్ సేల్స్‌మన్, కస్టమర్ సర్వీస్ ప్రతినిధులు |

టేబుల్ 1 ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలో ఉండే ఉద్యోగాలు
మూలం : ఎనాలసిస్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికిల్ ఇండస్ట్రీ, ఇంటర్నేషనల్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ కౌన్సిల్, 2013, పే.23

వాహనాల (బిఇవి) అమ్మకాలు ఇంగ్లడ్, ఇటలీ, ఫ్రాన్స్‌లో 30-50% పెరిగాయి (ఇంటర్‌నేషనల్ ట్రాన్స్‌పోర్ట్ ఓఇసిడి ఫోరమ్ 2020). సరఫరా గొలుసులో అంతరాయం, తక్కువ ఇంధన ధరల వల్ల ఎలక్ట్రిక్ వాహనాల స్వల్పకాలిక అవకాశాలు ప్రభావితం అవుతాయి, కానీ దీర్ఘకాలికంగా చూస్తే సాంకేతికతలో పురోగతి, నికెల్, కోబాల్ట్ వంటి కొత్త ఖనిజ వనరుల లభ్యత, కొత్త కాలుష్య విధానాల వల్ల ఎదగబోతోంది. భారతదేశంలో 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఆటోమొబైల్ పరిశ్రమ 15% క్షీణించింది (SIAM2020). ఇందులో అత్యంత దెబ్బ తిన్నది వాణిజ్య వాహన విభాగం (-29%), ఆ తరువాత ద్విచక్ర వాహనాలు మరియు పాసింజర్ కార్లు (-18%) మరియు త్రిచక్ర వాహనాలు (-9%). కోవిడ్ కారణంగా మార్చ్ 2020 అత్యంత అధ్వాన్నంగా ఉండింది. మార్చ్ 2019తో పోలిస్తే 39% క్షీణించింది.

డిమాండ్ మరియు సరఫరా రెండూ దెబ్బ తినడం వల్ల ఆ షాక్ నుంచి పరిశ్రమ కోలుకోవడానికి పరిశ్రమకి చాలా సమయం పడుతుంది. ఐతే భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల్లో 20% పెరుగుదల ఉన్నట్టు సొసైటీ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్ మ్యానుఫ్యాక్చరర్లు (ఎస్ఎమ్ఇవి) విడుదల చేసిన డేటా తెలుపుతుంది; అందులో 1,52,000 ద్విచక్రవాహనాలు. వీటిలో ఎక్కువ రిజిస్ట్రేషన్ అవసరం లేని తక్కువ వేగం గల ఎలక్ట్రిక్ స్కూటర్లు, 3400 కార్లు, 600 బస్సులు ఉన్నాయి. అసంఘటిత రంగమైన ఎలక్ట్రిక్ రిక్షాలు ఈ వృద్ధిలో భాగం కావు. ఇవి 2019-2020 ఆర్థిక సంవత్సరంలో 90000 యూనిట్లు అమ్ముడయ్యాయి. కోవిడ్ ప్రభావం జీవన శైలిలో మార్పులని వేగవంతం చేయడమే కాకుండా, శుభ్రంగా ఉండి, తక్కువ దూరాలకు తక్కువ ఖరీదు చేసే ప్రత్యామ్నాయ రవాణ సౌకర్యాలని ఎంచుకోవడంలో తోడ్పడింది.

### V. విధానాల పాత్ర మరియు సమస్యలు

భారత ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా', 'లోకల్ ఫర్ వోకల్' వంటి నినాదాలతో పరిశోధకులను, ఆవిష్కర్తలను, పరిశ్రమను విద్యుచ్ఛక్తి వాహనాల తయారీకి మద్దతివ్వమని ఒత్తిడి చేస్తున్నా ప్రస్తుత సవాళ్ళను అధిగమించడానికి స్పష్టమైన విధానాలు మరియు ప్రోత్సాహకాల అవసరం ఎంతో ఉంది. (ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్, ఇంక్ 42, ఆటో టెక్ రివ్యూ, 2020). ప్రత్యామ్నాయ సాంకేతికతలైన సోడియం అయాన్ లేదా అల్యూమినియం అయాన్ సెల్స్‌పైన భారతదేశంలో మరియు ప్రపంచ వ్యాప్తంగా పరిశోధనలు జరుగుతున్నాయి, కానీ ఇవేవి వాస్తవ ప్రపంచంలో విస్తృతంగా పరీక్షించబడలేదు. రిలయన్స్ ఇండస్ట్రీస్, సుజుకి, తోషిబా మరియు డెన్సోలతో కలిసి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఎక్సైడ్ ఇండస్ట్రీస్ లాంటి సంస్థలు భారతదేశంలో బ్యాటరీ టెక్నాలజీలో పెట్టుబడులు పెట్టడానికి ప్రణాళికల్ని ప్రకటించాయి.

ఎలక్ట్రిక్ వాహన సాంకేతికత మరియు విస్తరణ కోడి మరియు గుడ్డు చందంగా కన్పిస్తోంది. ముందు వాహనాలు తయారు చేయాలా లేక దానికి సంబంధించిన మౌలిక సదుపాయాలు తయారు చేయాలా అనే విధాన గందరగోళం ఉంది. ఏ విధమైన వాహనాలను కొనుగోలు చేస్తున్నారో గమనిస్తే పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్ల అవసరం పడే అద్దె వాహనాలు, వాణిజ్య వాహనాల కోసం డిమాండ్ సృష్టించడానికి ఒక స్పష్టమైన విధాన ఆవశ్యకత ఉంది. అయితే ద్విచక్ర వాహనాలకు మరియు చిన్న కార్లకు డిమాండ్ మరియు సప్లై రెండు వైపులా ప్రోత్సహించడానికి ఒక రెండు ధోరణుల విధానం అవసరం. ప్రత్యేకించి వినియోగదారులకి ఇచ్చే ఆర్థిక రాయితీల వల్ల ఎలక్ట్రిక్ వాహనాల వైపు డిమాండ్ మారుతుంది. రిసెర్చ్ మరియు రిడెవలప్‌మెంట్ కోసం తయారీదారుకిచ్చే ప్రోత్సాహకాలు వినూత్న మోడళ్లను తయారు చేయడానికి పురికొల్పుతాయి. తద్వారా భారత దేశంలో ఎలక్ట్రిక్ వాహన ప్రయాణం మొదలవ్వడానికి తోడ్పడుతాయి. చాలా దేశాల్లో ఈ పరిశ్రమకి ఆర్థిక సహాయం ప్రత్యక్ష రాయితీల రూపంలో ఉంది. నీతి ఆయోగ్ నివేదిక భారతదేశంలో కార్బన్ క్రెడిట్లు లేదా కూపన్ల రూపంలో రాయితీలు ఇవ్వాలని, వాల్యూ ఆడెడ్ గొలుసు మరియు వాహన వినియోగం ఆధారంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీకయ్యే దిగుమతి సుంకాలు తగ్గించాలని, అలాగే జిఎస్‌టిలో కూడా రాయితీ ఇవ్వాలని సూచించింది. దీనిలో విజయం పరిశోధనా లాబులు, ఓఇఎమ్‌లు, స్టార్ట్ అప్స్, బాటరీ తయారీదారుల నుంచి మౌలిక సదుపాయాల డెవలపర్లు వరకు అనేక మంది వాటాదారుల మీద ఆధారపడి ఉంటుంది, కాబట్టి సరఫరా గొలుసులో ఉన్న కీలక భాగస్వాములని లక్ష్యంగా చేసుకుని నిర్దిష్ట విధానాలు రూపొందించటం తప్పనిసరి (జిఎస్‌టి, 2018).

అనువాదం: **దీప్తి సిర్లా**


**దీప్తి సిర్లా** అన్వేషిలో వలసలపై జరుగుతున్న అధ్యయనంలో రిసర్చ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు

**మాధురి సరిపల్లె, విజయ చేబ్రోలు-సుబ్రమణియన్**

ఐఎఫ్ఎమ్ఆర్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్, క్రియా యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్లు

ఈ మెయిల్ *madhuri.saripalle@krea.edu.in*

ఈ మెయిల్ *vijaya.s@ifmr.ac.in*


ISSN 2278-3423


Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

వ్యవసాయ సంబంధాలపై సుదీర్ఘ చర్చ

సంచిక : 13* తెలుగు & ఇంగ్లీష్ మార్చి 2018 విరాళం : 25 రూ.

విషయసూచిక
- సంపాదకీయం
- భారతదేశ వ్యవసాయ రంగంలో పరిణామ క్రమం : మన దగ్గరనున్న సమాచారం ఏం చెప్తుంది? అమిత్ బసోలే, దీపాంకర్ బసు
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ గ్రామాల్లో సమకాలీన వ్యవసాయ పరిస్థితులు ఆర్.వి.రమణ మూర్తి
- భూమా? శ్రమా? గ్రామీణ భారత దేశంలో దళితుల చారిత్రక సంఘర్షణ ఎస్.ఎ. విద్యాసాగర్
- రైతాంగ సమస్య అప్పుడూ-ఇప్పుడూ హెన్రీ బెర్న్‌స్టీన్
- పెట్టుబడి, పెట్టుబడేతర విలువ: కల్యాణ్ సన్యాల్
- ప్రపంచీకరణ-వ్యవసాయక సమస్య అక్రమ్ లోధీ, క్రిస్టొబెల్ కే


ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

భాష, ప్రాంతం, జన సముదాయాలు

సంచిక : 8&9 (త్రైమాసికం) తెలుగు & ఇంగ్లీష్ డిసెంబర్ 2014 విరాళం : 50 రూ.

విషయసూచిక
సంపాదకీయం
ప్రాంతం
ఇదీ నా గొడవ కాళోజి
గుర్తింపును నిర్మించుకునే క్రమంలో జూపాక సుభద్ర
ఉద్యమానికి ఊపిరైన భాష సంగిశెట్టి శ్రీనివాస్
తెలంగాణా, తెలుగు సినిమా భాషా రాజకీయాలు సత్యప్రకాశ్ ఎలవర్తి, వంశీ వేమిరెడ్డి
రాజకీయాలు
దళితులు ఇంగ్లీష్ కంచ ఐలయ్య


స్థానిక రైల్వే సైన్ బోర్డు

# డిజిటల్ రంగంలో కొత్త పుంతలు: పెరుగుతున్న పీస్ వర్క్

■ ఉమారాణి

2000 సంవత్సరం నుండి డిజిటల్ సాంకేతికత బాగా వృద్ధి చెంది, క్లౌడ్ సదుపాయం, ఇతర కంప్యూటింగ్ సేవలు అందుబాటులోకి వచ్చిన సందర్భంలో, సాంకేతిక నిపుణులు ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడి నుండయినా పనిని చేయించుకోగలిగే డిజిటల్ లేబర్ ప్లాట్‌ఫామ్ కొత్త వ్యాపార నమూనాలని ప్రవేశపెట్టారు. వీటిని రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి, ఆన్ లైన్ అంటే వెబ్ ప్లాట్‌ఫామ్‌లు. వీటిలో పని ఆన్‌లైన్‌లోనే చెయ్యాలి. పనుల్ని ఒక బృందానికి కానీ, వ్యక్తులకి గానీ ఇస్తారు. వారు (పరస్పర పోటీ వున్న) కంప్యూటర్ ప్రోగ్రాముల ద్వారా లేదా సాఫ్ట్‌వేర్ వేదికల ద్వారా స్వంతంగా పని చేయొచ్చు. రెండవది ఒకే స్థలం నుండి నడిచే ప్లాట్‌ఫాములు. వాటిలో పనంతా టాక్సీలు నడిపే శ్రామికులు, ఇళ్ళకి డెలివరీలు చేసే శ్రామికులు చేస్తారు. గత కొన్నేళ్లలో అందరి దృష్టికి వచ్చి బాగా ప్రజాదరణ పొందిన ఊబర్, ఓలా లేదా స్విగ్గి ఈ రెండో వ్యాపార నమూనాని అందరికీ తెలిసేలా చేశాయి. కాని ఇతర ఆన్‌లైన్ వేదికలు పెద్దగా ఎవరికీ తెలియవు. ఇవి పనిని వివిధ ప్రాంతాలకి పంపించే (అవుట్ సోర్సింగ్) ప్రక్రియలకి సరికొత్త వ్యక్తీకరణ.

2017లో అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ఐఎల్ఓ) ప్రపంచ వ్యాప్తంగా 2350 మంది శ్రామికులపై జరిపిన సర్వే ఆధారంగా రాసిన ఈ వ్యాసం సూక్ష్మ స్థాయి పనులని (మైక్రో టాస్క్) చేసే డిజిటల్ ప్లాట్‌ఫాముల మీద దృష్టి పెడుతుంది. ఈ ప్లాట్‌ఫాములు ప్రపంచ వ్యాప్తంగా, పెద్ద స్థాయిలో, అనువయిన (ఫ్లెక్సిబుల్) శ్రామిక శక్తిని వ్యాపార రంగానికి అందుబాటులో ఉంచుతాయి. సాంప్రదాయ పద్ధతుల్లో నడిచిన ఉద్యోగి – యజమాని సంబంధాలని పునర్ వ్యవస్థీకరించి, ఆయా పనులని శ్రామికులు 'స్వతంత్ర కాంట్రాక్టర్'గా లేదా 'స్వయం ఉపాధి కార్మికుడిగా' చేపట్టేటట్లు చేస్తాయి. పనిని ఇప్పుడు డిమాండ్ బట్టి చెయ్యటమే కాక, శ్రామిక ప్రక్రియలకి కూడా 'జస్ట్ ఇన్ టైం' (ముందే తయారుచేసి గోడౌన్‌లో పెట్టకుండా, ఎప్పుడు డిమాండ్ వస్తే అప్పుడు వస్తువులని కూర్చి కొనుగోలు దారులకి సరఫరా చేసే పారిశ్రామిక పద్ధతి) పద్ధతిని అమలు చేస్తాయి (వల్లస్ 2019 పే.49). పనికిచ్చే పరిహారం ఎన్ని భాగాల పని (పీస్ వర్క్) చేసావన్న లెక్క మీద ఆధారపడుతుంది. శ్రామికులని 'స్వతంత్ర కాంట్రాక్టరు' అంటే, తన శ్రమని తానే కాంట్రాక్టు చేసుకున్న వ్యక్తిగా నిర్వచిస్తారు. వారు తన పరికరాలని తానే సమకూర్చుకోవాలి. కానీ ఏ విధమయిన శ్రామిక లేదా సామాజిక రక్షణలు వీరికి లభించవు (స్టాన్ఫర్డ్ 2017, ద్రహోకుపిల్ & ఫేబో 2016)

**కనిపించని శ్రమ**

2005 లో అమెజాన్ కంపెనీ తాను అమ్మే వస్తువుల్ని కొనుగోలుదారులు వెతికినప్పుడు కనిపించటానికి వీలుగా తన కేటలాగ్ (వస్తు జాబితా) ని తయారు చేయటానికి కష్టపడింది. ఒకే వస్తువుని పలు సరఫరాదార్లు సరఫరా చెయ్యటం వల్ల అది పలు మార్లు జాబితాలో చేర్చబడింది. అంతర్గతంగా ఒక వెబ్‌సైటు తయారు చేసి, కంపెనీలో పని చేసే ఉద్యోగుల్ని సరయిన జాబితా తయారు చేసే పనిలో పెట్టింది. వారు తమ ఖాళీ సమయంలో (అంటే వేతనం లేని పని) జాబితాలో పలుమార్లు చేర్చబడిన వస్తువులని వేరు చేసి తీసెయ్యాలన్న మాట. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి పురోగామి సాంకేతిక పరిజ్ఞానం వాడినప్పటికీ ఈ పని సాధ్యపడకపోవటం వల్ల ఒక అంతర్గత వెబ్‌సైటు తయారు చేసి మానవ తెలివిని వాడవలసిన పరిస్థితి ఏర్పడింది (ఇరానీ 2015). కంపెనీ తయారుచేసిన ఈ సాంకేతిక పరికరం ఎంత త్వరగా, సమర్థవంతంగా ఈ పనిని పూర్తి చేసిందంటే, అమెజాన్ యజమాని జెఫ్ బెజోస్ దీన్ని అమెజాన్ మెకానికల్ టర్క్ (ఎఎమ్‌టి) అనే ఒక డిజిటల్ శ్రామిక వేదికగా ప్రవేశపెట్టాడు. దీని ద్వారా అనేక వ్యాపారాలకి తమ చిన్న డేటా ప్రాసెసింగ్ పనులని ప్రపంచ వ్యాప్తంగా వున్న కార్మికులకి పంచి పెట్టి, చవకగా చేయించటానికి అవకాశం ఏర్పడింది (స్లిబెర్మన్ 2015).

సాంకేతిక పురోగతి వల్ల శ్రామికులు పని కోల్పోవాల్సిన అవసరం లేదు; అయితే అది పని నిర్వహణా పద్ధతులని పునర్ వ్యవస్థీకరించటానికి దారి తీస్తుంది. ప్రస్తుతం జరుగుతున్న డిజిటల్ మార్పులు, కంప్యూటర్ స్క్రీన్ వెనుక పని చేసే శ్రామికులని మన దృష్టి నుండి మాయం చేస్తున్నాయి. ముఖ్యంగా అనేక సామాజిక మాధ్యమాల్లో, వెబ్ సైట్లలో, ఇతర అంతర్జాల వేదికల్లో వినిమయదారులు లేదా ప్రేక్షకులు పోస్టు చేసే కంటెంట్ ని (వీడియోలు, ఆడియోలు, ఇతర పోస్టులు) మోడరేట్ (తీవ్రతని తగ్గించటం) చేసే పని వీటిల్లో ప్రధానమైంది. ఈ పనంతా భారత దేశంలో, ఫిలిప్పైన్స్‌లో వున్న డిజిటల్ శ్రామిక వేదికల్లోనూ, కాల్ సెంటర్లలోనూ జరుగుతుంది. 2018లో యూ ట్యూబ్ అధిపతి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ద్వారా (మెషీన్ల తెలివి), అల్గోరిథిమ్ (ప్రోగ్రాముల నియంత్రణ) ద్వారా వినిమయ దారులు అప్ లోడ్ చేసే బూతు చిత్రాలు, యుద్ధ సంబంధిత ఫోటోలు, ద్వేషపూరిత ప్రసంగాలూ కనుక్కుని తీసేయగలమని చెప్పారు. ఆయన చెప్పిందేమిటంటే ఇది పూర్తిగా 100% సాధ్యంకాదని; అందువల్ల ఈ కంటెంట్‌ని పరీక్షించి, దాన్ని తీసెయ్యాలా, వద్దా అన్న నిర్ణయాన్ని మనుషులు తీసుకోవాలని. ఇలా ఈ నిర్ణయాల్లో మనుషులున్నారనే విషయాన్ని మరుగుపరచటం ఈ కంటెంట్ మోడరేషన్ రంగంలో సర్వ సాధారణం. ఈ రంగంలో పని చేసే శ్రామికులందరు తమ పని గురించి ఎవరితో చెప్పమనే ఒప్పందంపై సంతకం చెయ్యాలి. ఆ పని, పని పరిస్థితులు రెండూ కూడా ఈ శ్రామికులని తీవ్ర మానసిక వత్తిడికి గురిచేస్తాయి.

మనుషులవసరం లేని యాంత్రీకరణ (ఆటోమేషన్) శ్రామికులని అదృశ్యం చేయటమే కాక వారిని నైపుణ్యం లేని వారుగా మారుస్తుంది. ఈ సూక్ష్మ పనుల డిజిటల్ శ్రామిక ప్లాట్‌ఫాముల్లో చెయ్యాల్సిన పనులు సరళమయినవి, మెదడు ఉపయోగించనవసరం లేనివి, నైపుణ్యం అక్కర్లేనివి, పదే పదే చేయాల్సినవి. 2017లో ఇటువంటి డిజిటల్ శ్రామిక వేదికల్లో, కంటెంట్ మోడరేషన్ రంగంలో పని చేసే శ్రామికులని అంతర్జాతీయ శ్రామిక సంస్థ ఇంటర్వ్యూ చేసినప్పుడు వీళ్లల్లో చాలా మంది అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి వచ్చిన బాగా చదువుకున్న వాళ్ళనీ, ఇంజనీరింగ్, సైన్సెస్, టెక్నాలజీ, మెడిసిన్ చేసిన గ్రాడ్యుయేట్లు, లేదా పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఎక్కువనీ తెలిసింది. పట్టణ ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో చాలా డబ్బు పెట్టి చదువుకున్న వీళ్ళు వారి నైపుణ్యాలని ఈ రంగం సరిగా ఉపయోగించుకోకపోవటం వల్ల నష్ట పోవటమే కాకుండా వాటిని పోగొట్టుకునే ప్రమాదంలో వున్నారు. ఆయా ప్రభుత్వాలు వీరి నైపుణ్యాలని సరిగ్గా ఉపయోగించుకునే ప్రయత్నాలు చెయ్యకుండా, ప్రయివేటు సంస్థలు డిజిటల్ రంగంలో వుండే సూక్ష్మ (చిన్న చిన్న) పనుల కోసం వీరిని ఉపయోగించుకోవటానికి శిక్షణ ఇవ్వటాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఈ రకమయిన పరిణామాలు ఎటువంటి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దారి తీస్తాయి, అవి దేశ ఆర్థికానికి, సమాజానికి దీర్ఘకాలిక ప్రయోజనాలని అందించగలవా అన్న మౌలిక ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

**ఆల్గోరిథిమ్‌తో నిర్వహించబడుతున్న పని ప్రక్రియలు**

పూర్తి చేసిన పనిని బట్టి వేతనం చెల్లించే పీస్ రేట్ పద్ధతితో పాటు, డిజిటల్ సాంకేతికతలో పురోగతి వల్ల

మొత్తం పని ప్రక్రియలని దూరం నుండి అల్గోరిథమ్ ద్వారా నిర్వహించి, నియంత్రించే అవకాశం ఏర్పడింది. ఇది కేవలం డిజిటల్ శ్రామిక రంగానికి పరిమితం కాలేదు. టాక్సీ సర్వీసులు, డెలివరీ సర్వీసుల్లో కూడా అల్గోరిథమ్ బాస్‌గా అవతరించింది. ఈ సూక్ష్మ పనుల డిజిటల్ శ్రామిక వేదికల్లో శ్రామికులకు లభించే రేటింగ్స్ బట్టి అల్గోరిథమ్ వాళ్లకి పనిని కేటాయిస్తుంది. ఆ రేటింగ్స్ గనుక ఒక పరిమితి క్రిందికి పడిపోతే ఆ శ్రామికులకి పని కేటాయించబడదు. వాళ్ళ ఎకౌంట్ కూడా తీసివేయబడ్డానికి ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎన్ని రేటింగ్స్ వచ్చాయో దాన్ని బట్టి వారి పనిని పర్యవేక్షించి, విలువ కట్టే విధంగా అల్గోరిథమ్‌ని తయారుచేసి (ప్రోగ్రామ్ చేసి) పెడతారు. ఉదాహరణకి ఈ సూక్ష్మ పనుల వేదికల్లో ఒక పనిని ముగ్గురు శ్రామికులకు పంచారనుకుందాం. వాళ్లలో ఇద్దరు చేసిన పనికి ఒక ఫలితం, మిగిలిన ఒకరు చేసిన పనికి మరొక ఫలితం వస్తే గనుక, ఆ ఒక్కరు చేసింది సరయిందయినా కూడా, అల్గోరిథమ్ దాన్ని ఒప్పుకోదు.

ఎందుకంటే, అల్గోరిథమ్ ఒక రకమయిన ఫలితాలనే అర్థం చేసుకునేలా ప్రోగ్రామ్ చెయ్యబడుతుంది, పని ప్రక్రియల్లో తేడాలని అది అర్థం చేసుకోలేదు. ఈ రకంగా ఆయా పనులని బాగా పూర్తి చేసినప్పటికీ, వేరే రకంగా చేస్తే, దాని ప్రోగ్రాం ప్రకారం చెల్లదు కాబట్టి, ఆ శ్రమ తిరస్కారానికి గురయ్యే అవకాశం చాలా వుంది. అంతేకాక, ఈ డిజిటల్ ప్లాట్‌ఫాములో శ్రామికులకు, వారితో పని చేయించుకుంటున్న యజమానులకు ప్రత్యక్ష సంబంధం ఉండదు. చేసిన పని తిసర్కరించబడినప్పుడు ఆ శ్రామికులకి ఎందుకలా అయిందని తెలుసుకోవటానికి, అడగటానికి ఏ వివాద పరిష్కార వేదిక అందుబాటులో ఉండదు. వారప్పటికే దాని కోసం కేటాయించిన సమయానికి, చేసిన పనికి పరిహారం ఉండదు. ఆ తిరస్కారం వల్ల వారి రేటింగ్స్ ప్రభావితమయ్యి, ముందు ముందు పని దొరికే అవకాశాలు దెబ్బ తింటాయి. అంటే శ్రామికులకు పని, ఆదాయం దొరకటానికి రేటింగ్స్ కీలకమయినప్పటికీ, వాటిలో న్యాయబద్ధత, పారదర్శకత లోపించాయి. అంతేకాక శ్రామికులకు వివాద పరిష్కార వేదికలకు వెళ్లే అవకాశాలు పరిమితం.

**శ్రామికులకొచ్చిన అవకాశాలు, వారి ముందున్న సవాళ్లు**

ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాలకు ఈ సూక్ష్మ పనుల డిజిటల్ శ్రామిక వేదికలు, ప్రపంచంలో నాలుగు మూలలలో వున్న శ్రామికుల శ్రమని ఉపయోగించుకోవటం ద్వారా ఖర్చులు తగ్గించుకుని, సామర్థ్యాన్ని పెంచుకుని, సంస్థాగత ఆచరణ స్థాయిని పెంచుకోవటానికి చాలా అవకాశాలు కల్పించాయి. ఇవి సఫలీకృతం కావటానికి కారణం లాభాలను పట్టించుకోకుండా దీనిలో వెంచర్ పెట్టుబడిదారులు మదుపు పెట్టటం. ఇవి అభివృద్ధి చెందుతున్న దేశాలలోని శ్రామికులకు తమ వీలు ప్రకారం పని చేసుకోవటానికి, కొంత ఆదాయం సంపాదించుకోవటానికి అవకాశం కల్పిస్తాయి. ఆ రకంగా స్త్రీలు, దివ్యాంగులు, యువత, వలస వచ్చిన వాళ్ళు, ప్రత్యేక నైపుణ్యం లేని వారికి శ్రామిక మార్కెట్‌లో ప్రవేశం కల్పిస్తాయి.

ఉదాహరణకి భౌతికంగా బయటికి వెళ్లి పని చెయ్యలేని ఇంటి సంరక్షణ బాధ్యతలున్న స్త్రీలు ఇంటి నుండి పని చేసుకోవచ్చు. ఎంత పెద్ద చదువులు చదివినా స్త్రీలు మాత్రమే ఇంటి పనులు, పిల్లల సంరక్షణ చెయ్యాలనే లింగ పరమయిన దృక్పథం ప్రబలంగా వున్న భారతదేశం వంటి దేశాలలో, చదువుకున్న స్త్రీలకి ఈ రకమయిన డిజిటల్ ప్లాట్‌ఫాములు వేతనమిచ్చే పనిలో కొనసాగటానికి ఒక ప్రేరణగా పనికొస్తున్నాయి. అయితే, ఇటువంటి వేదికల్లో పని శ్రామికులకు అనేక సవాళ్ళని కూడా సృష్టించింది.

వాటిలో కింద పేర్కొన్నవి కొన్ని

**'ఉద్యోగి' హోదా**

అల్గోరిథమ్ నియంత్రించే పని చేస్తూ, దానితో 'ఉద్యోగి' గా సంబంధం ఏర్పర్చుకున్నప్పటికీ ఈ వేదికల్లో పని చేసే శ్రామికులు 'స్వయం ఉపాధి' చేసుకునే వారిగాను, 'స్వతంత్ర కాంట్రాక్టర్లు' గాను వర్గీకరించబడతారు. టాక్సీ, డెలివరీ సర్వీసులను సమకూర్చే యాప్‌లల్లో కూడా శ్రామికుల పరిస్థితి ఇదే. శ్రామికులకు అందించాల్సిన వివిధ సంరక్షణల బాధ్యత తమ మీద లేకుండా వారి మీదే తోసెయ్యటానికి ఈ వ్యూహం బాగా పనికొస్తుంది. ఇది వారి ఆదాయ భద్రతని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. కోవిడ్ 19 విశ్వమారి ఈ శ్రామికులకు 'ఉద్యోగి' అనే గుర్తింపు లేదా హోదా లేకపోవటం వల్ల ఏ సామాజిక భద్రత, అనారోగ్య సంబంధిత సెలవలు లేకుండా పోయి ఎట్లా వారు తీవ్ర ప్రమాదంలో పడగలరో తేటతెల్లం చేసింది.

**పనిలో క్రమబద్ధత**

సంప్రదాయ వస్తూత్పత్తి వ్యవస్థలో ఇంటి నుండి చేసే పీస్ రేట్ పని డిజిటల్ ప్లాట్‌ఫాములలో చేసే పీస్ వర్క్ ఒకే రకంగా కనిపించినప్పటికీ, వీటి మధ్య ఒక మౌలికమయిన తేడా వుంది. ఇంటి నుండి పని చేసే వారికి మధ్యవర్తుల ద్వారా నిరంతరాయంగా పని దొరుకుతుంది, వాళ్ళు పని కోసం వెతుక్కోవాల్సిన, తిరగాల్సిన అవసరం ఉండదు. దీనికి పూర్తి భిన్నంగా, డిజిటల్ రంగంలో శ్రామికులు తమ పనిని తామే వెతుక్కోవాలి. దాని కోసం చాలా సమయాన్ని వెచ్చించి తమ "ప్రొఫైల్"ని నిర్మించుకోవాలి. ఇదంతా జీతం లేని పనే. అంతర్జాతీయ శ్రామిక సంస్థ 2017లో చేసిన సర్వేలో తెలిసిందేమిటంటే ఈ శ్రామికులు ఒక గంట 'పని' చేస్తే, ఆ గంట పనిని వెతుక్కోవడానికి 20 నిమిషాలు వెచ్చిస్తారని.

ఈ వేదికల అంతర్జాతీయ స్వభావం, అంటే పని చేసే వాళ్ళు అభివృద్ధి చెందుతున్న దేశాల్లో, పని తీసుకునే వాళ్ళు అభివృద్ధి చెందిన దేశాల్లో ఉండటం వల్ల శ్రామికులు పని తీసుకునే వారి సమయం, పని విభజనలని అనుసరించాలి (బి నీల్ 2018). దీనితో అధిక శాతం కార్మికులు ఎక్కువ పని గంటలు పని చెయ్యాల్సి వస్తుంది. మా సర్వేలో 56% మంది శ్రామికులు రాత్రంతా (10 నుండి 5 వరకు) పని చేస్తున్నారని, 44% మంది వారంలో ఏడు రోజులూ పని చేస్తున్నారని తెలిసింది (ఉమా & ఫెరర్, 2021). పని కోసం నిరంతర వెతుకులాట, పని తీవ్రతకి తోడయ్యి, వీరి జీవితాల్లో పనికి, వ్యక్తిగత జీవితానికి మధ్య వుండే రేఖ చెరిగిపోతోంది. వీలున్నప్పుడు పనిచెయ్యొచ్చు అనే నమూనాపై ఆధారపడి తాము పని చేస్తామని బాకా ఊదుకునే ఈ డిజిటల్ వేదికలు వాస్తవానికి తమ పని షెడ్యూల్ పైన శ్రామికులకు స్వీయ నియంత్రణ, స్వయం ప్రతిపత్తిని ఇవ్వవు. అంతే కాదు, ఈ ప్లాట్‌ఫాములు ప్రపంచంలో కొన్ని పనుల నుండి కొన్ని ప్రాంతాల్లోని శ్రామికులని బయట ఉంచుతాయి. దీని వల్ల శ్రామికులకు అన్నిసార్లూ పని కూడా దొరకదు.

**తగ్గిన ఆదాయాలు**

క్రమబద్ధంగా దొరకని పని శ్రామికుల సంపాదనపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా ఈ పనే వాళ్లకి అదే ప్రధాన ఆదాయ వనరు అయినప్పుడు, ఈ వేదికల మీద పని చేసే శ్రామికుల సంపాదనని, ఇవే పనుల్ని బయట చేసే శ్రామికుల ఆదాయంతో పోల్చినపుడు, వీళ్ళు దాదాపు 62% తక్కువ సంపాదిస్తున్నారని తెలిసింది. అంతేకాక, ఎవరేం పని చెయ్యొచ్చు అన్న దాని గురించి రకరకాల పరిమితులుండటం వల్ల వివిధ దేశాల్లో పని చేసే శ్రామికుల ఆదాయాల్లో తీవ్ర భేదాలున్నాయి.

అంతర్జాతీయ శ్రామిక సంస్థ అమెజాన్ మెకానికల్ టర్క్ ప్లాట్‌ఫామ్‌ని (ఏఎమ్‌టి) పరీక్షించినప్పుడు సాధారణ భారతీయ శ్రామికుల కంటే సాధారణ అమెరికన్ శ్రామికులు రెండున్నర రెట్లు ఎక్కువ ఆదాయం పొందుతున్నారని తెలిసింది. ఇవే రకమయిన భేదాలు ఇతర ప్లాట్‌ఫామ్‌లలో ఇతర పరిశోధకులు గమనించారు (బీరెపూట్ & లాంగ్ట్రస్ 2015; గాల్పెరిన్ & గ్రెప్పి 2017). అదనంగా, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోని శ్రామికులు తమకి చెల్లింపులు చాలా తక్కువని, అన్యాయంగా ఉన్నాయని; అంతే కాక డబ్బు రూపంలో కాక తమకి గిఫ్ట్ కూపన్ల రూపంలో చెల్లిస్తారని; వాటిని తాము అన్నిసార్లు వాడుకోలేక పోతున్నామని, దాని వల్ల తమ ఆదాయం, సమయం రెండూ నష్టపోతున్నామని చెప్పారు. డబ్బు వచ్చినప్పుడు కూడా, కన్పించని మధ్యవర్తి పేపాల్‌కి చెయ్యాల్సిన చెల్లింపుల వల్ల, ప్లాట్‌ఫామ్‌లో పేర్కొన్న దాని కంటే తక్కువ పొందుతున్నారు.

**సామాజిక భద్రత లేకపోవటం**

అన్ని దేశాల్లోని డిజిటల్ ప్లాట్‌ఫామ్ శ్రామికులకు సామాజిక భద్రత లేకపోవటం పెద్ద సమస్య. కోవిడ్ 19

విశ్వమారి వల్ల వీళ్ళకే కాక, టాక్సీ, డెలివరీ సేవలు అందించే యాప్‌లతో పని చేసే శ్రామికులకు కూడా అదనపు ప్రమాదాల్ని సృష్టించింది. అందరు శ్రామికులకీ బలహీనమయిన సామాజిక భద్రతే ఉంటుంది. కానీ కంటెంట్ మోడరేషన్‌లో పని చేసే శ్రామికులకు ఆరోగ్యపరమయిన, వృత్తి సంబంధిత ప్రమాదాలు కొంచెం ఎక్కువ.

**ఉద్యోగ సంఘాల కొరత**

ఈ శ్రామికులు ప్రపంచంలో వివిధ ప్రాంతాలలో చెదిరి పోయి ఉండటం వల్ల, ఒకరితో ఒకరు పనుల కోసం పోటీ పడటం వల్ల, వారినందరినీ ఒక దగ్గరికి తీసుకురావటం పెద్ద సవాలుగా పరిణమించింది. వీరిలో ఉద్యోగ సంఘాలలో వున్న వాళ్ళు 4% కంటే మించి లేరు. అయితే ఈ శ్రామికులు సామాజిక మాధ్యమాలు, ఇతర మాధ్యమాల ద్వారా తమ అనుభవాలని పంచుకుని, తమ సమస్యలని – బాగా డబ్బొచ్చే పనులనెలా సంపాదించాలి, తిరస్కారాలని ఎలా తట్టుకోవాలి–చర్చించి సలహాలు పొందుతుంటారు. ఇవి సమాచారాన్ని పంచుకోవటానికి బాగా పనికొస్తాయి కానీ పని పరిస్థితులని గురించిన చర్చ మాత్రం అరుదు.

సంఘాలలో చేరే వాళ్ళ శాతం తక్కువున్నప్పటికీ, పని పరిస్థితులని మెరుగుపరచటానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. వీటిల్లో ఏఎమ్‌టి ప్లాట్‌ఫామ్‌పై ఖాతాదారులు పోస్టు చేసిన పనులని శ్రామికులు రేటింగ్ చెయ్యగలిగే అవకాశం కల్పించే టర్కోప్టికాన్; శ్రామికులకు కనీస వేతనాలు అందించాలని ఏ ఎం టి పై వత్తిడి పెట్టె డైన మో గైడ్‌లైన్స్ ఫర్ అకడమిక్ రిక్వెస్టర్లు; ఐ జి మెటల్ అనే జర్మన్ కార్మిక సంఘం ప్రారంభించిన ఫెయిర్ క్రౌడ్ వర్క్. ఆర్గ్ న్యాయమయిన పని కోసం పాటించాల్సిన సూత్రాలు రూపొందించింది; ఆస్ట్రియన్ చేంబర్ ఆఫ్ లేబర్, స్వీడిష్ వైట్ కాలర్ సంఘం యూనియన్; జర్మన్ క్రౌడ్ సోర్సింగ్ ప్లాట్‌ఫామ్ ప్రారంభించిన స్వచ్ఛంద క్రౌడ్ సోర్సింగ్ కోడ్ ఆఫ్ కండక్ట్ కూడా వీటిలో ఉన్నాయి. కొన్ని ప్రధాన డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ కలిసి జర్మన్ ఐ జి మెటల్ సహకారంతో శ్రామికులు తమ సమస్యలని నివేదించటానికి ఒక 'ఓంబుడ్స్ ఆఫీస్' కూడా స్థాపించాయి.

**ముందుకెళ్లే మార్గం**

ఈ సూక్ష్మ పనుల డిజిటల్ శ్రామిక వేదికల నేపథ్యంలో చర్చించిన సమస్యలు, సవాళ్లు ఇతర వెబ్ ఆధారిత ప్లాట్ ఫామ్‌లలో (పోటీ వున్నవి, పోటీ లేనివి రెండూ కూడా), ఒకే స్థలంలో పని చేసే ప్లాట్‌ఫామ్ (అవి టాక్సీ, డెలివరీ ప్లాట్‌ఫామ్) లో కూడా ఉండేవే. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ శ్రామికుల ఉద్యోగ స్థితి గురించి చర్చ జరిగి, కొంత మంది న్యాయస్థానాలకు వెళ్ళటం వల్ల కొన్ని నిర్ణయాలు న్యాయస్థానాల నుండి వెలువడ్డాయి. దీనితో ఈ శ్రామికుల వర్గీకరణ గురించి అనేక దేశాల్లో భిన్న నిర్ణయాలు వెలువడ్డాయి. కొన్ని దేశాలు వీరిని 'ఉద్యోగులు'గా గుర్తించాయి (ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, అమెరికా లోని కాలిఫోర్నియా రాష్ట్రం) కొన్ని వీరిని 'మధ్యమ వర్గం'గా గుర్తించి (యునైటెడ్ కింగ్‌డమ్) వారికివ్వాల్సిన శ్రామిక, సామాజిక భద్రతలని అందేలా చేశాయి. మరికొన్ని దేశాలు పని పరిస్థితులలో కొన్ని సమస్యలని పరిష్కరించే ప్రయత్నాలు చేశాయి.


ఉదాహరణకి, న్యూజీలాండ్, ఆస్ట్రేలియా ప్రభుత్వాలు వీరికి చట్టపరమయిన హక్కులు వుండాలని సూత్రీకరించాయి. దీని వల్ల ఉద్యోగ హోదా ఎటువంటిదయినా వృత్తిపరమయిన భద్రత, ఆరోగ్య భద్రత లభిస్తుంది. బ్రెజిల్‌లో ఒక న్యాయస్థానం ఇచ్చిన నిర్ణయం ఆరోగ్య, సంరక్షణ చట్టాలని వీరికి అమలయ్యేలా చేసింది. దక్షిణ అమెరికా దేశాలు, అలాగే ఇండోనేషియా, మలేషియా దేశాలు ఈ రంగంలో వుండే శ్రామికులకి అందాల్సిన సామాజిక భద్రత రుసుము, ఇతర పన్నుల్ని కంపెనీల నుండి డిజిటల్ మార్గం ద్వారా కత్తిరిస్తున్నాయి. దీని వల్ల శ్రామికుల భద్రతకి రక్షణ ఏర్పడింది. అయితే భారతదేశం మాత్రం ఈ మధ్య ఒక అడుగు వెనక్కి వేసి తాను ఏ బాధ్యత తీసుకోవటానికి సిద్ధంగా లేనని అంటోంది. వివిధ దేశాల్లో ఇన్ని భిన్న రకాల ప్రమాణాలున్న నేపథ్యంలో ఈ శ్రామికుల సమస్యల గురించి అంతర్జాతీయ స్థాయిలో న్యాయపరమయిన సమన్వయం, నియంత్రణ ఉండాలనే అభిప్రాయం ప్రబలుతోంది.


అనువాదం : **ఎ సునీత**

**ఎ సునీత** అన్వేషి రీసెర్చ్ సెంటర్ ఫర్ వుమన్స్ స్టడీస్‌లో సీనియర్ ఫెలో

**ఉమారాణి** అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ఇఎల్ఓ) రిసెర్చ్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ ఆర్థిక వేత్త
ఈ మెయిల్ *amara@ilo.org*

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*



# వేతన శ్రమలో తగ్గిపోతున్న మహిళా శ్రామికులు: సామాజిక పునరుత్పత్తి సంక్షోభం

■ **సాత్యకి రాయ్**

2012 నుంచి భారత దేశంలో తీవ్రంగా పతనం చెందుతున్న శ్రామిక శక్తి యొక్క వేతన శ్రమలో పాల్గొనే రేటు (లేబర్ పార్టిసిపేషన్ రేట్) పెరుగుతున్న శ్రామిక వర్గ అధైర్యాన్ని, నిరుత్సాహాన్ని వ్యక్తపరుస్తోంది. ప్రధానంగా దీర్ఘకాలిక వ్యవసాయ సంక్షోభాన్ని, దానితోపాటు, నైపుణ్యం కల, నైపుణ్యం లేని శ్రామికులిద్దరికీ క్షీణిస్తున్న వ్యవసాయేతర రంగ ఉపాధి అవకాశాల గురించి ఇది తెలియపరుస్తుంది. జాతీయ గణాంక కార్యాలయ నివేదిక చెప్పేదేంటంటే, స్త్రీలు వేతన శ్రమలో పాల్గొనే రేటు, ప్రత్యేకించి 15-29 సంవత్సరాల మధ్య వయస్సు కల గ్రామీణ మహిళలలో, ప్రధానంగా తగ్గుతోంది (లేబర్ ఫోర్స్ సర్వే వార్షిక నివేదిక, పేజి. 3). 2005-12 మధ్య కాలంలో (యూజువల్ ప్రిన్సిపల్ మరియు సబ్సిడియరి స్టేటస్ ఆధారంగా తయారు చేసిన) ఈ నివేదిక 15.7 శాతం తగ్గుబాటును గుర్తించింది. అంతకంటే ఎక్కువ వయసున్న వారిని కూడా కలిపినపుడు, తగ్గుబాటు రేటు కొద్దిగా తగ్గి 13.6 శాతంగా ఉంది. ఈ రెండు వయో పరిమితి సమూహాల్లో ఉన్న గ్రామీణ స్త్రీల వేతన శ్రమలో పాల్గొనే రేటు, 2012-18 మధ్య కాలంలో మరింత తగ్గి 11.2 శాతానికి పడిపోయింది. ఇదే సమయంలో 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గల పట్టణ ప్రాంత పురుషుల శ్రమలో పాల్గొనే రేటు నిలకడగా చెప్పుకోదగిన స్థాయిలో ఉంది. సాధారణంగా, స్త్రీల వేతన శ్రమలో పాల్గొనే రేటు, అధిక నెలసరి ఆదాయం ఉన్న కుటుంబాలతో పోల్చినపుడు తక్కువ ఆదాయ కుటుంబాలలో ఎక్కువగా ఉంటుంది. తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలలో కూడా ఇది చురుకుగా తగ్గిపోవడం వలన, ఈ రెండు సమూహాల మధ్య వేతన శ్రమలో పాల్గొనే రేటు విషయంలో సాధారణంగా కనిపించే వ్యత్యాసం ఈ కాలంలో తగ్గింది.

స్త్రీలు వేతన శ్రమలో పాల్గొనే రేటు ఈ విధంగా పడిపోవటాన్ని కింది విధంగా వ్యాఖ్యాతలు అర్థం చేయిస్తున్నారు. (1) యువతులు వేతన శ్రమలో పాల్గొనటం కంటే, విద్యాభ్యాసానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. (2) కుటుంబ ఆదాయం పెరిగినప్పుడు, స్త్రీల వేతన శ్రమ నుంచి బయటికి రావటం పట్ల మొగ్గు చూపారు. (3) మహిళల పనిని అర్థం చేసుకోవటంలో, నిర్వచనరీత్యా, ఆచరణరీత్యా సమస్యలుండటం వల్ల సర్వేలు సరిగా వారి పనిని అంచనా వేయట్లేదు (4) మామూలు మాటలలో చెప్పాలంటే మహిళలకి ఉపాధి అవకాశాలు క్షీణిస్తున్నాయి. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) (కాప్సాస్ మొ. వారు2014) చేసిన సమగ్రమైన అధ్యయనం ఈ అంశాలన్నీ ఒక దానిని ఒకటి (పరస్పరం) ప్రభావితం చేశాయని ధృవీకరించింది. స్త్రీల వేతన శ్రమలో  పాల్గొనే రేటు తగ్గుదలలో 62 శాతం తగ్గుతున్న ఉపాధి అవకాశాల వలన అనీ, 38 శాతం కుటుంబ ఆదాయం పెరగటం, విద్యా సంస్థలలో నమోదు పెరగటం వంటి కారణాల వల్ల అని గుర్తించింది. అయితే, కుటుంబ ఆదాయం పెరగటం, మహిళలు వేతన శ్రమలో పాల్గొనటాన్ని తగ్గించటంలో ప్రధాన పాత్ర వహించిందనే వాదనకి ఆధారాలు లేవు. ఎందుకంటే 2012-18 మధ్య కాలంలో, భారత దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పనిచేసే క్రమబద్ధ కార్మికుల వాస్తవ వేతనాలు (రియల్ వేజెస్) క్షీణించాయి కాబట్టి. భారతదేశంలో స్త్రీల వేతన శ్రమలో పాల్గొనే రేటు క్షీణించటం. వ్యవస్థీకృత విషయమనీ, అది సంపద కూడబెట్టే వ్యవస్థకు, సామాజిక పునరుత్పత్తికీ మధ్య జరిగే సంఘర్షణ వలన వచ్చే సంక్షోభాన్ని చూపిస్తోందనీ ఈ వ్యాసం సూచిస్తుంది. ఎవరు వేతనంతో కూడిన పని చేస్తారు ఎవరు వేతనం లేని పనికి పరిమితం అవుతారన్న విషయాన్ని కేవలం వ్యక్తిగత కుటుంబ స్థాయిలో ఆదాయం, అవరోధాలని బట్టి తీసుకునే నిర్ణయాలకి పరిమితం చేసి చూడలేము. పెట్టుబడి సమీకరణాన్ని పెంచుకోవటానికి  నయా ఉదారవాద వ్యవస్థ ఒకవైపు ఉపాధి అవకాశాలని తగ్గించి మరోవైపు సామాజిక, సామూహిక అవసరాలని ప్రైవేటీకరించినపుడు, పుట్టే సామాజిక పునరుత్పత్తి సంక్షోభ ఫలితమే ఇది.

**సామాజిక పునరుత్పత్తి: వేతనంతో కూడిన, వేతనం లేని పనులు**

శ్రామిక మార్కెట్‌లో స్త్రీలు పాల్గొనటానికి, ఇంట్లో స్త్రీలు ఎంత వేతనంతో కూడిన, వేతనం లేని పని చేస్తారోనన్న అంశాలకీ, ఉత్పత్తి-సామాజిక పునరుత్పత్తుల గతిశీలతకు (డైనమిక్స్) మధ్య ప్రత్యక్ష సంబంధం ఉంది. ఒక స్థాయిలో ఇది శ్రామిక మార్కెట్ స్వభావంపైన, వేతనంతో కూడిన పని లభ్యత పైన, రోజువారీగా లభ్యమయ్యే భౌతిక పునరుత్పత్తి సౌకర్యాలపైన (తిండి, ఇల్లు, నీరు, పిలల్ని చూసుకునే సంరక్షణ, ఆరోగ్య సౌకర్యాలు మొ॥వి) ఆధారపడి ఉంటుంది. వ్యవస్థ స్థాయిలో మహిళా శ్రామిక శక్తిని చేర్చుకోవటం, పక్కన పట్టటం అన్న ప్రక్రియలు రెండూ పెట్టుబడి సమీకరణకున్న ప్రత్యేక అవసరాలపైన ఆధారపడి ఉంటాయి. ఎవరిష్టమయింది వారెంచుకుంటారు అనే ఎంపిక సిద్ధాంతానికి దూరదృష్టి లోపించటం వలన, ఈ ప్రక్రియకుండే జండర్ స్వభావాన్ని అర్థం చేసుకోలేక, స్త్రీలు వేతన శ్రమ నుండి దూరమవటాన్ని కేవలం కుటుంబ స్థాయిలో తీసుకునే నిర్ణయాలపై  ఆధారపడిందిగా భావిస్తుంది.

ఉత్పత్తి, జీవనోపాధి సాధనాలపై యాజమాన్యపు హక్కున్న వర్గం, తమ శ్రామిక శక్తిని అమ్ముకోవటానికి సంసిద్ధులైన శ్రామిక వర్గంతో సంబంధాలు ఏర్పరుచుకోవటం ద్వారా, పెట్టుబడిదారీ వ్యవస్థ ఉనికిలోకి వస్తుంది. శ్రామికులు, పెట్టుబడిదారులకున్న భిన్న ప్రయోజనాల వలన, నిరంతర ఘర్షణ అనివార్యమైనప్పటికీ,[2] ఉత్పత్తిని కొనసాగించటానికి పెట్టుబడికి శ్రామికులు అవసరం. ఈ వ్యవస్థ కొనసాగటానికి శ్రామికులు కూడా నిరంతరాయంగా తయారవుతూ లేదా  ఉత్పత్తి అవుతూ, సరఫరా చేయబడుతూ ఉండే ప్రక్రియ అవసరం. సాధారణంగా ఆర్థికశాస్త్రం, ప్రత్యేకించి రాజకీయ, ఆర్థికశాస్త్రం ఈ శ్రామికుల సరఫరాను ఒక సహజ ప్రక్రియగా చూస్తుంది. ప్రస్తుతం పని చేస్తున్న శ్రామికులు ముసలి వారవటం, వారి మరణం వలన ఏర్పడిన ఖాళీలు, కొత్తతరం శ్రామికులతో సహజంగా పూరింపబడతాయని భావిస్తుంది. మనిషిగా చేసే శ్రమకీ, శ్రామికశక్తిని వస్తువులాగా విక్రయం చేసే  శ్రామికుడి మధ్య భూమి, ఆకాశానికున్న తేడా ఉంది. జనాభా స్వభావం ఎంత మంది  కొత్త వ్యకులు పుడుతారనే విషయాన్ని నిర్ణయిస్తుంది కానీ వారిని శ్రామికశక్తిగా తయారు చెయ్యటం సమాజం పనే. శ్రమను విక్రయించటం మానవ స్వభావానికి సహజ సిద్ధమైన విషయం కాదు. అది మనుషులు బలవంతంగా ఉత్పత్తి సాధనాల నుంచి పరాయీకరణకి  గురయినప్పుడు తప్పనిసరయి ఎంచుకునే మార్గం. అందువలన మనుషులు శ్రామిక శక్తిగా మారటం కూడా సహజమైన ప్రక్రియా కాదు; అలాగే ప్రోత్సాహకాలను, శ్రామికులను వినియోగించుకొని వస్తూత్పత్తి చేసే పెట్టుబడిదారీ ప్రక్రియల ద్వారా కూడా సాధ్యపడదు. నిజానికి శ్రామికశక్తి పెట్టుబడికి చెందని ప్రదేశంలో, అంటే బంధుత్వ ఆధారితమైన కుటుంబ వ్యవస్థలో

ఏర్పడుతుంది. ఇదే పెట్టుబడిదారీ వ్యవస్థలో మిగిలిన వస్తువుల లాగా ఉత్పత్తి చేయబడినట్లయితే, దీని భౌతిక ఆధారం నాశనం చేయబడి, కుటుంబం, స్వేచ్ఛ, స్వయం ప్రతిపత్తి కలిగి ఎవరి వైఫల్యాలకి వారే బాధ్యులయిన వ్యక్తుల సముదాయం అనే వాదన బలపడి ఉండేది. అంతకంటే ముఖ్యమైన విషయం ఏంటంటే శారీరకమైన సంతానోత్పత్తి ప్రక్రియ ద్వారా జరిగి, ఎదుగుదల, సంరక్షణ వంటి కార్యకలాపాలలో రూపొందే శ్రమశక్తి యొక్క ఉత్పత్తి, కుటుంబ వ్యవస్థలో వేతనం లేని మహిళల శ్రమకు వ్యవస్థీకృతంగా కేటాయించబడింది.

కుటుంబంలో శ్రమ విభజన మరియు వేతనం ఉన్న, వేతనం లేని పనుల పంపిణీకీ, స్త్రీ, పురుషుల మధ్య సంతానోత్పత్తి ప్రక్రియకు సంబంధించిన జీవ సంబంధమైన తేడాలకీ, పరస్పర సంబంధం ఉన్నట్లు అందరూ చూస్తారు. నిజానికి, పెట్టుబడిదారీ వ్యవస్థలో అమ్మే వస్తువుల ఉత్పత్తికి అవసరమైన వేతన కార్మికుల సరఫరా, అమ్మకానికి కుదరని సేవలను, వస్తువులను; అంటే అనుత్పాదక సేవలను ఉత్పత్తి చేసే కుటుంబ శ్రమపైన ఆధారపడి ఉంటుంది. కార్మికులని పునరుత్పత్తి చేసే అతి ముఖ్యమైన ప్రక్రియను తమ నియంత్రణలో ఉంచుకోవటం కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ మహిళలపైన, వారి శరీరాలపైన, వారు ఎంపిక చేసుకునే పనిపైన నియంత్రణ కలిగి ఉంచుకుంటుందనే విషయం సాధారణంగా చర్చలోకి రాదు. అంటే, మహిళల శ్రమపైన పురుషుల నియంత్రణ, చరిత్రకందని జెండర్ స్వరూపం కలిగి ఉండే పితృస్వామ్యపు కొనసాగింపు కాదు. పెట్టుబడిదారి వ్యవస్థలో ఇటువంటి ఆధిపత్యానికి, శ్రమకి ఉండే మౌలికమైన సంబంధం పెట్టుబడికి తనను తాను పునరుత్పత్తి చేసుకోవటానికి కూడా అత్యవసరం. ఈ ప్రక్రియలోనే శ్రమశక్తిని నిరాఘాటంగా ఉత్పత్తి చేయటం కోసం కుటుంబానికుండే పితృస్వామ్య రూపం పున్నిర్మించబడింది. కాబట్టి కుటుంబంలో పురుషుల ఆధిక్యతను సమర్థించటం పెట్టుబడి సమీకరణకు అత్యావశ్యకం. భౌతికమైన పునరుత్పత్తికి, కుటుంబంలో వ్యక్తులు వస్తువుల ఉత్పత్తి వినియోగం చేయటం అవసరం. అయితే, శ్రమ మొత్తంగా పునరుత్పత్తి చెందటం, శ్రామికులు కాని జనాభా పోషణ, తరాలను భర్తీ చేయటం, ఇవన్నీ విశాల సామాజిక పునరుత్పత్తిలో భాగాలవుతాయి (వోగెల్, 2013).

కుటుంబంలో మహిళలు చేసే వేతనం లేని పని ద్వారా తక్కువ ఖర్చులో విలువ ఉత్పన్నం అయి ఆ ప్రయోజనం ప్రైవేట్ (కుటుంబ స్థాయి) రంగం నుండి, పబ్లిక్ రంగానికి (సామాజిక స్థాయికి) బదిలీ అవుతుంది. శరీరపుష్టి ఉన్న మనుషులను ఉత్పత్తి చేయటం ద్వారా పెట్టుబడిదారు అయిన యజమానికి మిగులు సమకూర్చు కోవటానికి దోహదం చేస్తుంది. అందువలన వేతనంతో కూడిన, వేతనం లేని పని మధ్య ఉండే సంతులనం ప్రాముఖ్యతను సంతరించుకుని, ఉత్పత్తికీ, సామాజిక పునరుత్పత్తికీ మధ్య ఉండే గమనశీల శక్తుల ద్వారా వ్యక్తీకరించబడుతుంది. ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే, వేతనం లేని పని శ్రమ శక్తినీ, తద్వారా మిగులును సాధించగలిగినప్పుడే గుర్తింపు పొందుతుంది. ఆ విధంగా జరగనప్పుడు, పెట్టుబడిదారి వ్యవస్థలో వేతనం లేని పనికి అర్థం లేదు. మరో మాటలో చెప్పాలంటే, అణచివేతకు, పరాయీకరణకు గురవుతున్న కుటుంబంలోని ఇంటిపని, వేతన ఉపాధి రూపంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు ఉపయోగపడినప్పుడే దానికి గుర్తింపు లభిస్తుంది. దీనికి మంచి ఉదాహరణ ఇద్దరు సంపాదించే కుటుంబాల్లో 'పని మనిషిని పెట్టుకోవటం' లేదా ఇంటి పనికి ఎవరినైనా పెట్టుకోవాలా అనే నిర్ణయం, అలా నియమించే వ్యక్తికివ్వాల్సిన వేతనాన్ని,ఇంట్లో వ్యక్తి సంపాదిస్తే వచ్చే వేతనంతో పోల్చుకుని మిగులు కన్పించినపుడే, తీసుకోవటం జరుగుతుంది. అప్పటి వరకు ఆ పనికి కుటుంబాలు 'విలువ'నివ్వవు.

**పెట్టుబడి సమీకరణ, సామాజిక పునరుత్పత్తి**

భావోద్వేగాలతో కూడుకుని, భౌతికంగా చేయాల్సిన వేతనం లేని ఇంటిపనిని (ఇదేపైన చెప్పిన పునరుత్పత్తి ప్రక్రియ) నిర్మాణ పరంగా వేతనం వచ్చే 'ఉత్పాదక' పనికి లోబడి ఉండేటట్లు చేసే ప్రక్రియ ఇంటిపని విభజనని, అలాగే స్త్రీలని సమాజం మొత్తానికి అవసరమయ్యే ఆర్థిక కలాపాలలో చేర్చుకోవటాన్ని, పక్కన పెట్టటాన్ని, అన్నిటినీ నిర్ణయిస్తుంది. ఈ ప్రక్రియ సమాజంలో సంపదను కూడగట్టే ప్రత్యేక విధానంతో సంబంధం కలిగి ఉంటుంది. పెట్టుబడి సమీకరణ సూత్రాలు అనే భావన కంటే పెట్టుబడి సమీకరణ విధానంగా దీన్ని అర్థం చేసుకోవటం ఉపయోగకరం. (అగ్లియెటా 2000) ఉత్పత్తి, వినియోగ రంగాలలో అచ్చమైన మిగులు విలువ ఉత్పన్నమయ్యే సూత్రాలను, ప్రమాణాలను మార్చకుండా, వాటి సాపేక్ష విలువను పెంచే సామాజిక పరివర్తనను ఇది నిర్వచిస్తుంది. తగిన వ్యవస్థలు, సామాజిక ప్రమాణాల ద్వారా ఉత్పత్తి, వినియోగాల మధ్య సమతుల్యాన్ని వ్యక్తీకరిస్తుంది. ఇంకో రకంగా చెప్పాలంటే పెట్టుబడి సమీకరణ విధానం, సామాజిక పునరుత్పత్తి ప్రక్రియను, తన అవసరాలకు అనుగుణంగా నిర్దేశించుకుటుంది కానీ మరిన్ని పరిష్కారాలు కోరే కొత్త వైరుధ్యాలకి కూడా దారి తీస్తుంది.

పందొమ్మిదవ శతాబ్దంలో ఉదారవాద పెట్టుబడి ఒక పక్క పారిశ్రామికంగా శ్రామికుల దోపిడీ పైనా, మరొక పక్క వలస ప్రాంతాల సంపదని స్వాధీనం చేసుకోవటం పైనా ఆధారపడింది. ఐరోపా దేశాల్లో ఇది ప్రధానంగా చవకగా దొరికే శ్రమపైన, ముఖ్యంగా మహిళలు, పిల్లల శ్రమపైన ఆధారపడి, మానవత్వం లేని దోపిడీకి పాలు పడటం వల్ల, సామాజిక పునరుత్పత్తికి నిజమైన ప్రమాదంగా పరిణమించింది. శ్రామికుల కుటుంబాలు మనగలగటమే అసాధ్యంగా పరిణమించింది. ఈ ధోరణిని గమనించిన అప్పటి రచయితలు, సామాజిక విశ్లేషకులు పారిశ్రామికీకరణ పై ఆధారపడిన ఆధునికతని విమర్శకు గురి చేసారు. వివిధ ఐరోపా దేశాల్లో మధ్య తరగతి, ఉన్నత వర్గాలు, శ్రామిక వర్గ కుటుంబ వ్యవస్థ క్రమంగా అదృశ్యం అవుతుందనే భయాన్ని వ్యక్తీకరించటంతో, కార్మిక రక్షణ చట్టాల ద్వారా స్త్రీల, పిల్లల శ్రమ వినియోగం పైన నియంత్రణ మొదలయ్యింది. పెట్టుబడిదారులు కేవలం లాభాపేక్షతో చేసే హద్దులు లేని దోపిడీని నివారించి, కొన్ని నిబంధనల ద్వారా శ్రామికుల లభ్యత నిరంతరాయంగా ఉండేటట్లు చూసి, పెట్టుబడిదారీ వర్గం మొత్తానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు సమకూర్చటం దీని ఉద్దేశం. దీనివలన మహిళలను వాళ్ళు పాల్గొనే ఆర్థిక సంబంధాలు, కార్యకలాపాల నుంచి ఇంటి పనికి పరిమితమయ్యే పరిస్థితికి తెచ్చి, కుటుంబం నుంచి పని ప్రదేశాన్ని వేరుచేసిన విక్టోరియన్ కాలం నాటి బూర్జువా సాంస్కృతిక నమూనాను సమాజం మొత్తానికి పనికొచ్చే నమూనాగా అందలం ఎక్కించే ప్రయత్నం జరిగింది (నాన్సీ ఫ్రేజర్ 2017). మహిళలను వేతనంతో కూడిన పని నుండి దూరం చేయటం సామాజిక పునరుత్పత్తిని స్థిరీకరించటానికి ప్రామాణికమయ్యింది. అయితే, వేతనాలు తక్కువ స్థాయిలో ఉండటం వలన, ఈ నిర్భంధ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగలేదు.

ఇరవయ్యవ శతాబ్దంలో, తీవ్ర మాంద్యం ((గ్రేట్ డిప్రెషన్) తరువాత ఫోర్డిజమ్ (పెద్ద ఫ్యాక్టరీలలో, పెద్ద స్థాయిలో, కొన్ని కంపెనీలు అసెంబ్లీ లైను పద్ధతిలో మెషిన్ల ద్వారా వినియోగ వస్తువులన్ని ఉత్పత్తి చేసే ప్రక్రియ) పారిశ్రామిక నిర్వహణలో మార్పు తెచ్చి ఉత్పత్తి ప్రక్రియలో మార్పు తెస్తే, సామాజిక పునరుత్పత్తి సంక్షోభానికి స్పందనగా, కీనీషియన్ సంక్షేమ విధానాలు వచ్చి పెట్టుబడి సమీకరణ విధానంలో మార్పు వచ్చింది. సాధారణ పునరుత్పత్తిని ప్రజా (పబ్లిక్) బాధ్యతగా గుర్తించటంలో భాగంగా 'కుటుంబ వేతనం' (కేవలం తనని తాను పోషించుకోవటానికి అవసరమయ్యే వేతనం కాక, కుటుంబాన్ని పోషించే వేతనాన్ని పురుష కార్మికులకి మాత్రమే చెల్లించే విధానం) అనే భావనని ప్రోత్సహించటం సామాజిక పునరుత్పత్తిని రాజ్యం పాక్షికంగా తనలో భాగం చేసుకోవటమే. ఈ ప్రక్రియలో అవలంబించిన పెట్టుబడి సమీకరణ విధానం, భారీ ఉత్పత్తికీ, కుటుంబ స్థాయి వినియోగానికీ మధ్య సంబంధం ఏర్పాటు చేయటం ద్వారా ఉత్పత్తికీ, వినియోగానికీ మధ్య సమతౌల్యాన్ని సాధించే ప్రయత్నం చేసింది. అయితే, దీనిలో మహిళలు క్రియాశీలమైన శ్రమశక్తి నుంచి తొలగించబడితే, రాజ్య రక్షిత పాలనలో, 'పురుష కార్మికుడు', శ్రామిక వర్గానికి చిహ్నంగా మారాడు.

ప్రస్తుతం పెట్టుబడి సమీకరణ పూర్తిగా మార్కెట్ ఆధారితంగా మారటంతో, సామాజిక సంక్షేమ ప్రయోజనాలు కోతకు గురై, శ్రామిక మార్కెట్ సరళీకరణ పేరుతో, సంఘటిత కార్మికుల స్థానంలో అసంఘటిత, రక్షణ లేని శ్రామికులు నియమించబడుతూ, కుటుంబ వేతనం ప్రస్తావన కూడ కనిపించటం లేదు. ప్రపంచ వ్యాప్తంగా, వస్తువుల ధరలో శ్రమ శక్తి వాటా తగ్గిపోవటం, పెట్టుబడిదార్లు, శ్రామిక వేతనాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు ఉత్పత్తిని బదిలీ చేయటం ద్వారా పెద్ద


ఎత్తున లాభాలు సంపాదించటం ప్రబలిన వాస్తవాలు. దీని ఫలితంగా అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలలో తగ్గిన డిమాండుని, కొంత మేరకు శ్రామికులకిచ్చే తక్కువ వడ్డీ వినియోగరుణాల ద్వారా పూరించుకునే ప్రయత్నం జరుగుతోంది. శ్రామిక వర్గాన్ని కూడా ఈ ఉచ్చులోకి లాగి లాభాలను సమకూర్చుకునే ప్రయత్నం జరుగుతోంది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో డిమాండు స్థాన భ్రంశం చెందే అవకాశాలు, తలసరి ఆదాయం తక్కువగా  ఉండటం వలన ఫినాన్సియలైజేషన్‌కి అవకాశం తక్కువ.[7] అంతేకాకుండా, ఫినాన్సియలైజేషన్ లాభాలను, ఉత్పాదకతను పెంచే పెట్టుబడిని, ఉపాధి అవకాశాలను విడదీస్తుంది. వస్తూత్పత్తి చేసే పరిశ్రమలలో, ముఖ్యంగా శ్రామికులు ఎక్కువగా ఉండే రంగాలైన ఆహార తయారీ పరిశ్రమ, వస్త్ర పరిశ్రమ, తోలు పరిశ్రమలలో ఈ పరిస్థితి, మహిళల ఉపాధి అవకాశాలను తగ్గిస్తుంది. ఉన్నత మధ్య తరగతిలో రెండు సంపాదనలున్న కుటుంబాలు వేతనం లేని ఇంటి పనిని, వలస వచ్చిన కుటుంబాల వారిని తక్కువ వేతనాలకు నియమించుకోవటం ద్వారా, పనితోపాటు, సామాజిక పునరుత్పత్తి సంక్షోభాన్ని కూడా శ్రామిక వర్గానికి చెందిన పేద కుటుంబాలకు బదిలీ చేస్తున్నాయి. పేద కుటుంబాలు ఈ పని చేయలేవు. ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. వేతనాలు, పునరుత్పత్తికి కావల్సిన సామాజిక వ్యయాల స్థాయి కంటే తక్కువగా ఉంటున్నాయి. ప్రైవేటీకరణ వలన ఆరోగ్యం, విద్య, శిశు సంరక్షణ, ఆహారం, శక్తి (ఇంధనం) అన్నీ మార్కెటు పరం చేయడం వలన, బతుకులు వెళ్ళదీయటానికి వేతనం లేని పనులపైన ఆధారపడ్డం తప్పటం లేదు. స్త్రీలను వేతన శ్రమ నుంచి వేరు చేయటం అన్నది శ్రామికుల ఆదాయాన్ని తగ్గింటటమే కాక  శ్రమ మరియు ప్రకృతుల యొక్క పునరుత్పత్తి వ్యయాన్ని తీవ్రంగా తగ్గించటంపై ఆధారపడిన పెట్టుబడి సమీకరణ సృష్టిస్తున్న తీవ్రమైన సామాజిక పునరుత్పత్తి సంక్షోభానికి సూచిక.


అనువాదం: **పి మాధవి**

**పి మాధవి** ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత కామర్స్ అధ్యాపకులు

**సాత్యకి రాయ్** ఢిల్లీలోని ఇన్స్టిట్యూట్ ఫర్ స్టడీస్ ఇన్ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్‌లో అసోసియేట్ ప్రొఫెసర్.
ఈ మెయిల్ *satyaki.sat@gmail.com*

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*



# సంరక్షణ రంగ కార్మికులు, పెట్టుబడి సమీకరణ వ్యూహాలు

■ ప్రవీణ కొడోత్

గత రెండు దశాబ్దాలలో దక్షిణాది దేశాల (అభివృద్ధి చెందుతున్న దేశాల) నుండి సంపన్న దేశాలకు ఉద్యోగ నిమిత్తం వలస వెళ్లే గృహ కార్మికులపై గణనీయమైన పరిశోధన జరిగింది. ఇంటి పని ఉద్యోగంగా పరిణమించడం, దాని విలువ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భాగం కావడం, దేశాల మధ్య అసమానతలు పెరగడం వంటి అంశాలు ఈ పరిశోధనలో బయట పడ్డాయి. పని కోసం ఇల్లు దాటి బయటకు వచ్చే స్త్రీల సంఖ్య ఎక్కువ కావడం, సంపన్న దేశాలలో వయస్సు పైబడిన వారి సంఖ్య పెరగడం, వారిని ఇంటి వద్ద కనిపెట్టుకు చూసే వారి సంఖ్య తగ్గడం పైన పేర్కొన్న వలసలకు ముఖ్య కారణాలు. పెద్ద వారిని ఇంటి వద్దే ఉండి చూసుకునే పనికి అభివృద్ధి చెందుతున్న దేశాల నుండి పేద వర్గ స్త్రీలు ఎక్కువగా వలస రావడం జరిగింది. రేచల్ పెరీనస్ ఫిలిప్పినో వలస గృహ కార్మికులపై చేసిన పరిశోధన ఆధారంగా, ఆర్లీ హొషైల్డ్ 'ప్రపంచ సంరక్షణ గొలుసు' అనే సిద్ధాంతాన్ని రూపొందించింది. దీని ప్రకారం యజమానులు తమ వద్ద పని చేసే స్త్రీల శ్రమకు మించిన విలువను దోచుకుంటున్నారు. వలసల కారణంగా స్త్రీల స్వంత ఊర్లలో సంరక్షణ ఏర్పాట్లు (లోకల్ కేర్ చెయిన్స్) విచ్ఛిన్నమై, సంరక్షణ కొరత ఏర్పడుతోంది. పెరీనస్ విశ్లేషణ ప్రకారం, మహిళా కార్మికుల వలసల కారణంగా సామాజిక పునరుత్పత్తి రంగంలో వర్గ శ్రేణి ఏర్పడుతుంది. స్త్రీ ఇల్లు వదలి బయట పని చెయ్యడం వలన ఏర్పడిన ఖాళీని ఆమె దగ్గర బంధువులు కుటుంబాన్ని ఆదుకునే క్రమంలో పూరిస్తారు. ఇది వీలవనప్పుడు, తమకన్నా పేదవారైన స్త్రీలను అతి తక్కువ వేతనాలకు పనిలో పెట్టుకోవడం జరుగుతుంది.

ఇసాక్ సేన్, దేవి, హొషైల్డ్ (2008). ప్రపంచపు ఉత్తరాది అభివృద్ధి చెందిన దేశాలలోని ఇళ్ళ యజమానులు తమ దగ్గర పని చేసే స్త్రీల శ్రమకు తగిన ఫలితం చెల్లించకుండా ఎలా దోచుకుంటారో ఈ విధంగా వివరించారు. ఇంట్లో స్త్రీ చేసే పనికి ఎప్పుడూ విలువ కట్టకపోవడంతో, అది విలువల గొలుసు బయట ఉండిపోయి బాహ్యీకరించడానికి (ఎక్స్టర్నలైజింగ్) అనుకూలంగా ఉంటుంది. యజమానులు తమ వద్ద పని చేసే మహిళల శ్రమకు విలువ కట్టే సమయంలో ఆమె ఇంటి వద్ద వదలి వచ్చిన పనికి "సున్నా" విలువ ఇవ్వడంతో, ఆమె స్వంత కుటుంబ సంరక్షణలో ఏర్పడిన లోపాలు, వాటిని భర్తీ చేయడానికి అవుతున్న ఖర్చు లెక్కలోకి రాదు. దీనిని ఒక విధంగా భౌగోళిక ఉత్తర దేశాల (అభివృద్ధి చెందిన దేశాల) ఇళ్ళ యజమానులకు వలస కార్మికులు ఇచ్చే 'సబ్సిడీ'గా భావించవచ్చు. అయితే ఇది ఇష్టపూర్వకంగా, తెలిసి ఇచ్చే రాయితీ కాకపోవడం వలన, స్త్రీల శ్రమ దోపిడీగా పరిగణించవచ్చు.

"సంరక్షణ" అనే పదంలో ఆరోగ్య పరిరక్షణ, శరీర సామర్థ్యత పెంచడం, శరీరాన్ని బలంగా ఉంచడం వంటి అంశాలన్నీ కూడి ఉంటాయి. సంరక్షణ జరగాలంటే రెండు రకాలైన పనులు నిర్వహించాలి. ఒకటి పోషక రక్షణ గురించి చేయవలసిన పనులు, రెండవది శరీర పరిశుభ్రత గురించి చేయవలసిన పనులు. రెండవ రకమైన పని తక్కువ రకమైనదిగా పరిగణించబడుతుంది. వీటిని ఎక్కువగా వలస గృహ కార్మికులు, నల్ల జాతీయులు చేయడం గమనించవచ్చు. ప్రపంచ సంరక్షణ గొలుసు (ప్రసగొ) విశ్లేషణ, విశ్వమంతా పరచుకున్న అధికారం, సంపద, ఆరోగ్య పరిరక్షణలోని అసమానతలు వలస కార్మిక వ్యవస్థ ద్వారా ఎలా బలోపేతమవుతున్నాయో అందరి దృష్టికి తెచ్చింది. వలస గృహ కార్మికులు, ఏ జాతి, దేశం, వర్గానికి చెందినవారైనా, వారి స్వంత ప్రభుత్వ వైఖరులు, ఆయా దేశాల వలస విధానాలు, వలసలను వ్యాపారంగా మార్చే మధ్యవర్తుల వలన ఆయా సమానతలు ఇంకా లోతుగా వేళ్లూనడం, ఈ విశ్లేషణలో బహిర్గతమయింది. అయితే ఈ సిద్ధాంతం 'సంరక్షణ'కి స్త్రీని ప్రతిరూపం చేసి పని విభజనలో లింగ వివక్షను స్థిరపరిచిందనే విమర్శలు వచ్చాయి (ఏట్స్ పెరీనస్ 2012, నడసెన్ 2017). ఈ విశ్లేషణలో ఇంకొక లోపాన్ని ఇంగ్లండ్ (2006) ఎత్తి చూపారు. ప్రసగొ ప్రకారం ఈ వలసలలో ప్రత్యేకత వారు స్వంత ఇంటి వద్ద సంరక్షణ భారాన్ని, పిల్లల సంరక్షణను కూడా వదిలివేయడం. కానీ ఈ రంగంలోనే కాదు, వలస మహిళలు ఏ పని కోసం ఇల్లు వదిలినప్పటికీ, వారి స్వంత ఇంటిలో సంరక్షణ ఏర్పాట్లు మాత్రమే కాక, మొత్తంగా ప్రపంచపు దక్షిణ దేశాలలోని సంరక్షణ ఏర్పాట్లకి తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది.

ప్రసగొ విశ్లేషణ ఫిలిప్పైన్ వంటి దేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. భారత దేశానికి భిన్నంగా అక్కడి ప్రభుత్వాలు వలసలను సానుకూల దృష్టితో చూడడం, వలసలను ప్రోత్సహించటం గమనించవచ్చు. పశ్చిమాసియా దేశాలకు వలసల పట్ల భారతదేశం రక్షణవాద విధానాన్ని (ప్రొటెక్షనిజమ్) అనుసరిస్తూ వచ్చింది. ఈ మధ్య కాలంలో పశ్చిమాసియా దేశాలలో గృహ కార్మికులకు డిమాండు పెరిగింది. దీనికి ఒక కారణం అక్కడ ఎక్కువ మంది స్త్రీలు ఉద్యోగాల్లోకి ప్రవేశించటం. ఆ దేశాలలో పెరుగుతున్న జాతీయవాదం వలన ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో ఇతర దేశాల ఉద్యోగులను నియంత్రించి, తమ దేశాలలోని మహిళలకు అవకాశాలు ఎక్కువ కల్పించటం, అలాగే ఇక్కడి దేశాలలో వయస్సు మళ్లిన వారి సంఖ్య అధికం కావటం (తయాహ్ అండ్ అస్సాఫ్ 2018) కూడా కారణాలే.

పశ్చిమాసియా దేశాలలో 'కఫాలా' విధానం ప్రకారం వలస కార్మికులకు ఎప్పటికీ 'తాత్కాలిక నివాసి' హోదా మాత్రమే దక్కుతుంది. ఆదేశంలోని కార్మిక చట్టాల పరిధిలోకి వలస గృహ కార్మికులు రారు. దీనికి ముఖ్య కారణం ఈ వలస కార్మికుల పని చేసే స్థలం 'ఇల్లు' కావటమే. భారత దేశంలో పాతుకు పోయిన పితృస్వామ్య విధానాల చట్రంలో ఇరుక్కుపోయిన గృహ కార్మికుల శ్రమ విలువ చాలా అల్పంగా ఉంటుంది. నా పరిశోధనల ఆధారంగా (కొడోత్ 2020) రాసిన ఈ వ్యాసం, భారతదేశ వలస విధానం ఏ విధంగా వలసదేశాల యజమానుల ఆస్తులను కాపాడుతుందో, ఇప్పటికే ఉన్న ధన, అధికార అసమానతలు పెరగడానికి ఏ విధంగా ఊతం ఇస్తుందో, వలస వ్యాపార మధ్యవర్తుల జేబులు ఏ విధంగా నింపుతుందో స్పష్టం చేస్తుంది. వలస గృహ కార్మికుల స్వంత దేశాల పరిస్థితులు, వలసవెళ్లే దేశాల నియమ నిబంధనలు రెండూ కూడా సంక్లిష్టమయినవనీ, అమూర్త ప్రపంచ సంరక్షణ గొలుసు కట్టు వ్యవస్థ సిద్ధాంత సరిహద్దులు దాటిపోయి దాని పరిధిలో ఒదగవని ఈ వ్యాసం వివరిస్తుంది.

**కఫాలా వ్యవస్థ మరియు భారతదేశ వలస విధి విధానాలు**

కఫాలా వ్యవస్థ వలస గృహ కార్మికుల శ్రమని దోచుకోవడానికి విధాన నిర్దేశం చేస్తుంది. దీని ప్రకారం వలస కార్మికుల నివాస హక్కు వారి ప్రాయోజకుల (స్పాన్సర్లు) పై ఆధారపడి ఉంటుంది. అంటే కార్మికులకు ఏదైనా సమస్య వస్తే కొత్త చోట పని చూసుకునే అవకాశం ఉండదు. యజమానికి మాత్రం పనివారు నచ్చకపోతే వారిని వెంటనే తిప్పి పంపే హక్కు ఉంటుంది. కఫాలా నియమాల ప్రకారం, వలస గృహ కార్మికుల ప్రయాణ ఖర్చులు, నియామక సంస్థ (రిక్రూట్మెంట్ ఏజెన్సీ)కు చెల్లించవలసిన మొత్తం అన్ని ప్రాయోజకులు అంటే యజమానులు భరించాలి. అయితే

ఈ విధానంలోని ప్రయోజనాలేవీ వలస కార్మికుల దాకా రావు. అవి మధ్య దళారుల వద్దే ఆగిపోతాయి. ఇవన్నీ పట్టని యజమానులకు తమ డబ్బు ఖర్చు పెట్టి, పనివారిని రప్పించుకున్నామనే అధికార భావన ఉంటుంది. తమ పెట్టుబడికి తగిన శ్రమను రాబట్టుకోవడం వీరు తమ హక్కుగా భావిస్తారు. కార్మికుల పాస్‌పోర్టులను బలవంతంగా జప్తు చేసుకుని తమ వద్దే ఉంచుకుంటారు. తమ ఇళ్లలో పనిచేసే వారిని బయట వారితో మాట్లాడనివ్వరు. తమ ఖర్చుకి తగిన ప్రతిఫలం రాబట్టాలన్న భావన దీనికి ముఖ్య కారణం. అందుకోసం పనివాళ్లు ఎట్టి పరిస్థితులలోనూ పని విడిచిపెట్టకూడదు, దేశం విడిచి పారిపోకూడదు అన్న లక్ష్యంతో వారిని చాలా కట్టడిలో ఉంచుతారు.

ప్రాయోజకులు కార్మికుల ప్రయాణానికి ఇచ్చిన ఖర్చులు మధ్య దళారులు మింగేయడం వలన, కార్మికులు తమ ప్రయాణ ఖర్చులు స్వంతగా భరించవలసి ఉంటుంది. ఇంత డబ్బు ఖర్చు చేశాక, పని చేసే చోట పరిస్థితులు ఎంత కఠినంగా  ఉన్నా, అమానవీయంగా ఉన్నా, వలస కార్మికులు వెంటనే వెనక్కు తిరిగి రావడానికి ఇష్టపడరు. హింస భరించలేని సమయాల్లో పారిపోయి, అనధికారికంగా ఇతర చోట్ల పని వెతుక్కుంటారు. చట్టబద్ధమైన అంగీకార పత్రాలు లేకుండా ఇంకా ప్రమాదకరమైన పరిస్థితుల్లో పని చేస్తుంటారు. దక్షిణ భారతదేశం నుండి వలస వెళ్లే మహిళలకు మధ్య తూర్పు ప్రాంతాల్లో బంధు మిత్రుల బలగం ఎక్కువే. ఈ పరిచయాలు వాడుకుని వారు పనులు వెదుక్కుంటారు. అయితే చట్టం నుండి దాక్కుని పని చేయవలసి వస్తుంది. ఇంటికి వెనక్కు పంపుతారనే భయం నీడలా వారిని ఎప్పుడూ వెన్నంటే ఉంటుంది. ప్రస్తుతం భారతదేశ విధి విధానాలు వలస కార్మికులను రక్షించాలంటే, వారి వలసలను నియంత్రించాల్సి ఉంటుందనే సూత్రంపైనే పని చేస్తున్నాయి. వలస దేశాలలో పని చేస్తున్న వారికి రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో ఏ విధివిధాన రూపకల్పనా జరగలేదు. వలసలను నిరోధించే చట్టాలపై ఎక్కువగా దృష్టిపెడితే, చట్ట పరిధి బయట జరిగే వలసలు ఎక్కువయ్యే అవకాశాలు ఉన్నాయి. మధ్యవర్తుల జోక్యం పెరిగి, ఖర్చులు కూడా ఎక్కువయ్యి, వలస దేశాలలో ఇరుక్కుపోయి, ఇంటికి వెనక్కురాలేని పరిస్థితులు అధికంగా చూడాల్సి రావచ్చు. శ్రమకు తగిన ప్రతిఫలం లేక, నైపుణ్యం పెంచుకునే అవకాశం (సమయం, డబ్బు) లేక, శారీరక శ్రమ ఎక్కువగా ఉండే పనులకే కార్మికుల అవకాశాలు పరిమితమవుతున్నాయి. దక్షిణ భారతంలోని ఆంధ్రప్రదేశ్ నుండి వలస వెళ్లే స్త్రీలు అధిక శాతం నిరక్షరాస్యులే. కేరళ రాష్ట్రం నుండి వెళ్లే వారి పరిస్థితి కొంచెం మెరుగు. ప్రభుత్వ నియంత్రణలు భారతదేశ కార్మికుల ఉద్యోగావకాశాలు, సరైన వేతనం దొరికే వీలుని తక్కువ చేశాయి. ఒకే రకమైన పని చేస్తున్న ఫిలిప్పైన్ మహిళల వేతనంతో పోలిస్తే భారతదేశ కార్మికుల వేతనం తక్కువ.

పైపెచ్చు వలసదేశాలలో పనిచేస్తున్న తమ కార్మికులకు రక్షణ కల్పించడానికి భారతదేశం అయిష్టత కనపరచడంతో కార్మికుల జీవితాలలో అనధికారిక నెట్‌వర్క్ జోక్యం ఎక్కువైంది. పని కల్పించే క్రమంలో కార్మికుల వద్ద నుండి డబ్బు గుంజడం, అవకాశం దొరికితే వీరిని లైంగికంగా వేధించడం వంటివి ఈ అనధికారిక జోక్యంలో అధికం కావటం చూడవచ్చు.

పైన పేర్కొన్న అంశాలను గమనిస్తే భారతదేశ విధి విధానాలు వలస దేశాల పెట్టుబడిదార్ల ఆస్తులను కాపాడుతూ, వారికి లాభాలు కూడబెడుతున్నాయంటే అతిశయోక్తి కాదు. గత రెండు దశాబ్దాలుగా భారతదేశంలో పెరుగుతున్న పిడి జాతీయవాదం, పితృస్వామ్య ధోరణుల వలన, వలస మహిళా కార్మికులపై ఆంక్షలు పెరిగాయి. ఇటువంటి పిడివాద ధోరణుల ప్రభావంతో వలస గృహ కార్మికులకు జరుగుతున్న అన్యాయాలు, వారి శ్రమ దోపిడీలని శ్రామిక హక్కుల అతిక్రమణ క్రింద చూడడం మానివేసి, వారికి జరుగుతున్న అన్యాయాలు మన జాతి, సమాజాలకు మచ్చ తెస్తున్నాయని, వారిపైనే అభియోగం వేయడం జరుగుతోంది. 2014లో భారతదేశం వలస విధివిధానాలలో చేసిన మార్పులు, పరోక్షంగా పశ్చిమాసియా దేశాల పెట్టుబడి సమీకరణ వ్యూహాలని ఏ విధంగా బలపరుస్తున్నాయో అర్థం అవుతుంది. అంతకు పూర్వం బాహాటంగా రక్షణవాద విధానం ప్రదర్శించిన భారతదేశం క్రమేపీ ఒక సందిగ్ధ ధోరణి నవలంబించి పశ్చిమాశియా దేశాలలో గృహ కార్మికులకు పెరుగుతున్న డిమాండును పూరించటానికి పూనుకుంది. ఇదే సంవత్సరంలో భారతదేశం అనేక పశ్చిమాసియా దేశాలతో ప్రవాస ఒప్పందాలు కుదుర్చుకుంది. మునుపు వలసలను ప్రోత్సహించినట్టు కనిపించడం కూడా ప్రతిష్టకు భంగమని భావించిన ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు 2018 నుండి నాటకీయంగా తమ వైఖరిని మార్చుకున్నాయి. ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాపార ప్రయోజనాల కోసం వలసలను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషించాయి.

పశ్చిమాసియా దేశాలతో భారతదేశానికి గణనీయమైన లావాదేవీలు ఉన్నాయి. ఈ వ్యాపార సంబంధాలను పశ్చిమాసియా దేశాలు స్వలాభం కోసం ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వాడుకోవడం మనం చూడవచ్చు. ఉదాహరణకు, సౌదీ అరేబియా భారతదేశం నుండి వచ్చే ఏ వలస కార్మిక కాంట్రాక్టును ఆమోదించాలన్నా, బదులుగా వారు అడిగిన సంఖ్యలో గృహకార్మికులను వలస పంపాలనే షరతు విధించింది. ఇటువంటి నిబంధనల ఒత్తిడికి, స్వంత దేశ పెట్టుబడిదార్ల ప్రయోజనాలను కూడా పరిరక్షించాలనే  ఉద్దేశ్యంతో, భారత ప్రభుత్వం వలస గృహ కార్మికులను కేవలం పావులుగా ఉపయోగిస్తోంది. కార్మికుల అవసరాలు, రక్షణ పూర్తిగా పక్కకు పెట్టి, స్వదేశీ మరియు విదేశీ పెట్టుబడిదార్లకు వెన్నుకాస్తూ, భారత ప్రభుత్వం వలస విధి విధానాలు రూపొందించడం గమనార్హం.

**స్వదేశాలలో సామాజిక సంరక్షణ విచ్ఛిన్నం**

ప్రపంచ సంరక్షణ గొలుసు సిద్ధాంత నిర్మాణంలో "సంరక్షణ" సిద్ధాంతాన్ని సార్వజనీనం చేసి, దాని పునాదిని భౌగోళిక ఉత్తర దేశాలలో 'కుటుంబం' గురించిన అవగాహనపై వేయడం జరిగింది. అంటే కుటుంబం, దాని ప్రయోజనాలు, పరిరక్షణ వంటి అంశాలు ఏకపక్షంగా ఒకే సమాజ చరిత్ర ఆధారంగా చిత్రీకరించడం జరిగింది. భౌగోళిక దక్షిణ దేశాల సమాజాల చరిత్ర, అక్కడి సిద్ధాంతాలు, వాటి నేపథ్యాలకు "ప్రసగా" నిర్మాణంలో స్థానం లేదు (రఘు రామ్, 2012).

కేరళ నుండి మధ్య తూర్పు దేశాలకు వలస వెడుతున్న ఆరోగ్య కార్యకర్తలను విశ్లేషించిన ఇసాక్‌సెన్, దేవి, హొచ్‌షైల్డ్ (2008: 73) ప్రస్తావించిన కొన్ని ముఖ్య అంశాలు: కుటుంబం, దేశం వదిలిపెట్టి తమ కుటుంబాల అవసరాలు తీర్చటం కోసం స్త్రీలు కష్టపడుతుంటే, ఇళ్లలో వారి కుటుంబ సభ్యులు స్వలాభాపేక్ష చట్రంలో ఇరుక్కుపోయి వారి కష్టాన్ని వ్యర్థం చేస్తున్నారు. చుట్టూ ఉన్న సమాజంలో సంఘీభావన తగ్గి, అంతా ఎవరికి వారే అన్నట్టుగా ప్రవర్తిస్తూ, సమాజంలో, సహజంగా ఏర్పడిన సంరక్షణ గొలుసుని చిన్నాభిన్నం చేస్తున్నారు. శ్రీలంక, ఫిలిప్పైన్స్, లాట్వియా, ఉక్రైన్ మరియు భారతదేశం వంటి మూడవ ప్రపంచ దేశాలలో ఒక్కసారిగా సమాజంలోని తల్లులు, అమ్మమ్మలు, నాన్నమ్మలు, కూతుళ్లు, పిన్ని, పెద్దమ్మలు మాయమయ్యారు. వీరి అదృశ్యంతో అభివృద్ధి చెందుతున్న మూడవ ప్రపంచ దేశాలలో సహజ సంరక్షణ చక్రాలు విరిగి, అభిమానాలు, భావోద్వేగాలు నిండిన ప్రపంచం ఖాళీ అయిపోయింది (పైన పేర్కొన్న రచన). ఇటువంటి వాదనలు భౌగోళిక దక్షిణ దేశాలలో వాస్తవ సమాజ నిర్మాణాలను అస్పష్టం చేసి, అక్కడి సమాజాలలో సాధారణంగా ఒక విశాలమైన సంఘీభావం ఉన్నట్టు భ్రమ కల్పిస్తాయి. వాస్తవానికి ఆ దేశాల సమాజ నిర్మాణాలు జాతి, కుల, మత విభజనలు ఉండే లింగ వ్యవస్థ వల్ల చీల్చబడే ఉన్నాయి. ఇంగ్లండ్(2006) విశ్లేషణ ప్రకారం హొచ్‌షైల్డ్ వివరణలో తల్లులు పనికోసం వలస వెళ్లడం వలన సంరక్షణ లోపించి పిల్లలు చెడిపోతున్నారనే వాదనకు ఎక్కడా ఆధారం చూపించలేదు. తల్లి, పిల్లలతో కలిసి లేని ఖాళీని ఆమె సంపాదించే డబ్బుతో పూరించాలనే బేరమార్పిడి సాపత్యం ఒక అసంబద్ధ వాదన అని తేలిపోతుంది. అయితే స్వంత కుటుంబాలలోను, సమాజంలోను పేరుకున్న పితృస్వామ్య భావజాలం వలన, స్త్రీలు కష్టపడి సంపాదించిన డబ్బు కుటుంబ అవసరాలకు కాకుండా కుటుంబంలోని పురుషుల వ్యసనాలకు, జల్సాలకు ఖర్చు అయినపుడు, ఆమె పడిన శ్రమంతా నీరుగారి పోతుంది.

ఇప్పుడు వలసల వలన కుటుంబాలలో వస్తున్న మార్పులను వివరంగా పరిశీలిద్దాం. బలంగా నాటుకున్న పితృస్వామ్య రాజకీయాలు కుటుంబంలోని పురుషులకు స్త్రీల శ్రమ శక్తిని దోచుకుని దానిని సద్వినియోగం కాకుండా చేసే అవకాశం ఇస్తున్నాయి. వలస మహిళల

పిల్లల సంరక్షణ, ఇంటి వద్ద  ఉన్న తండ్రిపై కాకుండా బంధు వర్గంలోని ఇతర స్త్రీలపై పడుతుంది. సాధారణంగా వీరు గృహ కార్మికుల అక్కగాని, చెల్లెలు లేదా తల్లి కావచ్చు, లేదా భర్త కుటుంబంలోని ఇతర స్త్రీలు కావచ్చు. వీరికెవరికయినా ఈ బాధ్యత అదనపు బరువే అన్న విషయం మనం గమనించాలి. కొన్ని సందర్భాలలో తండ్రి స్వయంగా బాధ్యత చేపట్టినపుడు, ఆ భారం కుటుంబంలోని ఆడపిల్లలపై పడుతుంది. వారి చదువులు, ఆటలు దీనితో శాశ్వతంగా మూత పడవచ్చు లేదా వాటికి కేటాయించే సమయం కుదించుకుపోవచ్చు. ఇంకొన్ని సందర్భాలలో పురుషులు వివాహేతర సంబంధాలు పెట్టుకుని ఇంట్లోని పిల్లలను నిర్లక్ష్యం చేయడం కూడా జరుగుతుంది. లేదా భార్య కష్టపడి సంపాదించిన డబ్బుని ఇంటి వద్ద భర్త విలాసాలకు ఖర్చు పెట్టడం కూడా చూడవచ్చు.

మగవారి వివాహేతర సంబంధాలతో సామాజిక చట్రానికి ఏమీ నష్టం వాటిల్లదు. అయితే కుటుంబ శ్రేయస్సు కోసం వలస వెళ్లిన స్త్రీలు, తమ సహజ సరిహద్దులు దాటి బయటకు వెళ్లినందుకు, సమాజ కట్టుబాట్లను ఉల్లంఘించారనే నిందను మోయాల్సి ఉంటుంది. కేరళ రాష్ట్రంలో వలస వెళ్లిన నర్సుల స్థితిగతులను విశ్లేషించిన వాల్డన్ రాబర్ట్స్ (2012), వాళ్ళు వెనక్కు వచ్చాక స్వంత సమాజంలో ఎదుర్కొనే అవమానాలు, భరించే నిందలు, సామాజిక ఆంక్షలు ప్రపంచ సంరక్షణ గొలుసు సిద్ధాంతం (ప్రసగొ) తమ విశ్లేషణలో భాగంగా పరిగణించాలని వాదించింది. వలస వలన ఈ మహిళలు రోజువారి పితృస్వామ్య పర్యవేక్షణ నుండి బయటపడినా, వారు చేపట్టిన పనుల వలన, అంటే ఇంట్లో పని వారిగా లేదా రోగులకు సేవ చేసే నర్సులుగా చేసే పనుల వలన వారి ప్రతి చర్య లైంగిక సూక్ష్మదర్శిని కిందకు రావడం చూడవచ్చు. అనేక సందర్భాలలో వలస గృహ కార్మికులను సెక్స్ వర్కర్లతో పోల్చడం, విదేశాలలో, పరాయి ఇళ్ళల్లో పని చేయడం అంటే వేశ్యావృత్తి చేపట్టడం అనే భావనలు, మహిళా కార్మికుల ఉనికి, ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టడంగా చూడాలి. ఈ కార్మికులలో ఎక్కువ శాతం చరిత్రలో అణగారిన జాతుల, సమాజాల స్త్రీలే కనిపిస్తుంటారు. వీరిపై మోపే అభియోగాల బరువు, వీరి స్వంత ఇళ్లలో, సమాజాలలో వీరికి ఉన్న స్థానంపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు కేరళ రాష్ట్రం నుండి వలస వెళ్లే మహిళా కార్మికుల పరిస్థితి తీసుకుంటే, వారు ఎక్కువగా ఒంటరి మహిళలు అయి ఉంటారు. అంటే భర్త నుండి విడిగా ఉన్నవారు, భర్తను కోల్పోయిన వితంతువులు వంటి వారు. వీరిపై సమాజం ఆపాదించిన కళంకం వారి కుటుంబాలకు, వారు నివసించే సమాజాలకు పాకుతుంది. సాధారణంగా వీరు ఇతర వెనుకబడిన కులాలకు చెందిన వారై ఉంటారు. ఇంటిని నడిపేది మగవాడు కావడం వలన, స్త్రీ కష్టపడి సంపాదించి కుటుంబాన్ని ఆదుకున్నా, వారు చేసే పని కుటుంబ గౌరవానికి మచ్చ తెస్తుంది. దీనికి భిన్నంగా ఆంధ్ర రాష్ట్రంలో వలస కూలీలుగా వెళ్లే ఆడవారు ఎక్కువ శాతం పెళ్లైన మహిళలే. ఆర్థిక ఇబ్బందుల వలన వీరు బయటకు వెళ్లి పని చెయ్యడం కుటుంబాలకు, సమాజాలకు (ముఖ్యంగా అందులోని పురుషులకు) సమ్మతమే. అయితే సమాజ కట్టుబాట్లకు వ్యతిరేకంగా ఆడవాళ్లు ఇల్లు వదిలి పని చేస్తున్నారనే నింద ఇతర కులాలకు చెందిన వారు వేస్తుంటారు. ఇక్కడ కూడా వలస మహిళా కార్మికులు ఎక్కువగా వెనకబడిన కులాలకు, షెడ్యూల్డ్ కులాలకు చెందినవారు. కేరళ రాష్ట్రంలో అక్షరాస్యత ఎక్కువ, ఆడవాళ్లు పెళ్లి చేసుకునే వయస్సు కూడా ఆంధ్ర రాష్ట్రంలోని ఆడపిల్లలతో పోలిస్తే ఎక్కువ. అయినా కూడా బయటకు వెళ్లి పని చేస్తున్న వారిపై నిందారోపణలు ఎక్కువ. దీనికి కారణం అక్కడి సమాజంలోని వలస మహిళా కార్మికులు, ఇతర స్త్రీల స్థితిగతుల మధ్య ఉండే అంతరాలు ఎక్కువగా ఉండడం. ఇప్పటి వరకు వివరించిన అంశాలను చూస్తే రెండు భిన్న ప్రాంతాలలోని (ఆంధ్ర, కేరళ) వలస మహిళలు, వేర్వేరు కారణాల వలన వారి ఆర్థిక సామర్థ్యాన్ని సామాజిక గౌరవంగా మార్చుకోవడంలో విఫలం అయ్యారు. భారత దేశంలో ప్రభుత్వ విధి విధానాలు, సామాజిక ఆంక్షలు, వలస గృహ కార్మికులపై అదనపు భారాన్ని మోపాయి. పని వెదుక్కోవడం మొదలుకొని, నైపుణ్యం పెంచుకోవడానికి పొందే శిక్షణ, తమను తాము రక్షించుకోవడానికి చేపట్టే చర్యలు, అన్నింటిలోనూ స్త్రీలు సవాళ్లు ఎదుర్కొన్నారు. మధ్యవర్తులు, దళారులకు లంచాలు ఇచ్చుకోవడం, శ్రమకు తగిన వేతనాన్ని డిమాండు చెయ్యలేకపోవడం స్త్రీలు మోసే భారంలో భాగమే. చిట్టచివరగా చెప్పవలసిన ముఖ్య విషయం ఏమిటంటే సామాజిక ఆంక్షలు, విధి విధానాల నిబంధనల వలన, వలస మహిళా కార్మికులు తమ శ్రమకు తగిన ఫలితాన్ని పొందలేకపోతున్నారు.

కరుడుగట్టిన పితృస్వామ్య భావజాలం, ప్రభుత్వ విధి విధానాలను, సామాజిక కట్టుబాట్లను ప్రభావితం చేసి, వలస ఉద్యోగాల వలన కుటుంబాలకు కలిగే ప్రయోజనాలను దెబ్బతీసి, సామాజిక సంబంధాలను విచ్ఛిన్నం చేస్తోంది. స్త్రీలు స్వేచ్ఛగా పని వెదుక్కోవడానికి ప్రభుత్వ విధానాలు అడ్డంపడితే, పనిచేసే చోట రక్షణ పొందడానికి అదే ప్రభుత్వ విధానాల వైఫల్యం కారణమవుతోంది. వీటన్నిటి మధ్య ఇరుక్కున్న మహిళా గృహ కార్మికులు ఒక కఠినమైన దారిలో నడవాల్సి వస్తోంది. ఇన్ని ఇబ్బందుల మధ్య వారి శ్రమకు తగిన ప్రతి ఫలం  పొందడం అసాధ్యం అవుతోంది.


అనువాదం :**శ్యామ సుందరి**


**శ్యామ సుందరి** దస్తకార్ ఆంధ్రలో పాలసీ అడ్వొకసీ విభాగానికి కో ఆర్డినేటర్

**ప్రవీణ కొడోత్** సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్, త్రివేండ్రంలో అధ్యాపకులు

ఈ మెయిల్ *pkodoth@gmail.com*

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*



# ప్రసవిస్తున్న అభద్ర వర్గం: పెట్టుబడి చేతిలో పరోపకారిత్వం

■ అనిందితా మజుందార్

కోవిడ్-19 కాలంలో ఐ.వి.ఎఫ్ దవాఖానాలలో అద్దె గర్భాల (కమర్షియల్ సరోగేట్) 'శ్రమ'తో, పిల్లల్ని కనలేని అమ్మానాన్నల నుంచి దూరంగా జన్మించిన పసి కందుల ఊహా చిత్రాలు కళ్ళల్లో మెదిలినపుడు, కనిపించకుండా పోయేది ఒకే ఒక వ్యక్తి. ఆ పుట్టుకలలో దవాఖానాల డాక్టర్లు, ఐ.వి.ఎఫ్ స్పెషలిస్టుల కృషి, లాక్‌డౌన్ సందర్భంలో పిల్లల కోసం తపించిపోయిన అమ్మా నాన్నల వేదన గురించిన ప్రస్తావనే ఉంటుంది కానీ వారికోసం గర్భం ధరించే స్త్రీ (సరోగేట్) ప్రస్తావన ఎక్కడా ఉండదు. అవును! ఎవరైనా ఆమెను ఎందుకు తలుచుకోవాలి? ప్రస్తుతం దేశం, ప్రపంచంలో నడుస్తున్న సంక్షోభంలో 'అత్యవసర సేవ' అనే పదాన్ని తీసిపారేసి కొత్త తరహా 'సేవల్ని' రూపొందిస్తున్నాం. అయితే 'ఇతరుల కోసం గర్భం ధరించటం' (సరోగసీ) అత్యవసర సేవ కోవలోకి రాదు. అంతే కాకుండా, ఈ మధ్య కొత్తగా వచ్చిన చట్టాలలో కూడా, ఇతరుల కోసం గర్భాన్ని ఇచ్చే స్త్రీని, ఆమె 'శ్రమ', అస్తిత్వాల నుంచి వేరు చేసే పద్ధతి (2019లో వచ్చిన సరోగసీ చట్టం) ఒకటి రూపుదిద్దుకుంది. 'అద్దె గర్భం' అనే సేవను చట్ట విరుద్ధం చేసి, దాని స్థానంలో, దగ్గరి చుట్టాలలో డబ్బు ఆశించకుండా 'పరోపకార బుద్ధి' (ఆల్ట్రూయిజం)తో గర్భాన్ని ధరించే స్త్రీల సేవల్ని ప్రోత్సహిస్తోంది.

2016 'ఇతరుల కోసం గర్భం చట్టం' (సరోగసీ చట్టం) ప్రతిపాదనపై 2017 ఆగస్టులో విస్తృతంగా చర్చలు జరిపిన పార్లమెంటరీ కమిటీ కొన్ని ముఖ్యమైన సవరణల్ని సూచించింది. ఇది 2015 నాటి ఎ.ఆర్.టి (అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ) చట్టం నుంచి పూర్తి కొత్త దారిపట్టింది. డబ్బు కోసం గర్భాన్ని అద్దెకిచ్చే ఆచరణను నిషేధించాలనే రాజ్య లక్ష్యం ఇందులో ప్రధానం. 2019లో ఈ బిల్లు దాదాపు చట్టంగా రూపొందే సందర్భంలో రాజ్యసభ బిల్లుని ఆమోదించే ముందు మరింత పబ్లిక్ చర్చ అవసరమని భావించింది. పార్లమెంటరీ కమిటీ వివిధ ప్రాంతాలకు వెళ్ళి ప్రత్యేకంగా మీటింగులలో అద్దె గర్భ నిషేధం గురించి అభిప్రాయాలను సేకరించింది.

ఈ బిల్లు ప్రకారం పరోపకార బుద్ధితో గర్భం ధరించటానికి, అంటే దగ్గరి చుట్టాలలో ఎవరైనా స్త్రీలు ఇతరుల కోసం బిడ్డను కనటానికి, ముందుకు రావాలి! పరోపకార (లేదా ధార్మిక) గుణం అన్న ఈ కొత్త సూత్రం కారణంగా, పునరుత్పత్తి శ్రమను నెత్తికెత్తుకునే స్త్రీల శ్రమ విలువ ఏ విధంగా దిగజారి పోయిందో చూపించడమే ఈ వ్యాసం ఉద్దేశం. డబ్బు కోసం గర్భాన్ని అద్దెకివ్వటంలోనే ఎంతో దోపిడి ఉంది. తల్లి తనాన్ని శ్రమగా చేయటం (పాండే 2014) కంటికి కనిపించని శ్రమే (సమ 2012) కాక, సిగ్గు, లజ్జ, మర్యాద, గౌరవం అనే సంప్రదాయ భావాలు ఇమిడి ఉన్న శ్రమ దోపిడి (మజుందార్ 2018). వాస్తవానికొస్తే, ఇటువంటి సందర్భంలో జరిగేది ఒక తాత్కాలిక ఒప్పందం. గర్భం అద్దెకిచ్చే స్త్రీకి ఆ ఒప్పందం అమలులో ఉన్న కాలంలో, అంటే ఐ.వి.ఎఫ్ జరిగే క్రమంలో వైద్యపరమైన దాడుల నుండి ఏవిధమైన ఆరోగ్య రక్షణా ఉండని ఒప్పందం. ఒక అమానవీయ ప్రపంచీకరణలో కార్మిక 'శ్రమ' ఏవిధంగా రక్షణలేనిదియి (ప్రికారిటీ) బలహీనపడుతుందో, ఆ విధమైన అభద్రత నెదుర్కొనే స్వభావం 'అద్దె గర్భం' సంతరించుకుంటుంది (స్టాండింగ్ 2011).

తాత్కాలిక పని ఒప్పందాల (కాంట్రాక్ట్ లేబర్)లో నిరుద్యోగ అభద్రతను (ప్రికారిటీ) గుర్తించాడు స్టాండింగ్. గర్భం, కాన్పుల చుట్టూ నిబంధనల చట్రాల్ని బిగించి నిరుపేద స్త్రీలను అద్దె గర్భాలుగా వినియోగించే క్రమంలో కూడా అటువంటి ఆర్థిక అభద్రతలే ఉంటాయి. ఇతరుల కోసం గర్భాన్ని ధరించే విషయం చుట్టూ అల్లుకుని ఉన్న వ్యాపార లక్షణాల్ని (ట్రేడింగ్) నిషేధించేందుకు రూపొందించిన 'పరోపకారిత్వ గర్భం' నియమాల్లో కూడా దాత-క్లయింటు సంబంధం, అందులోని అభద్రతల్ని సజీవంగా ఉంచటం కనిపిస్తుంది. 2019లో రూపొందించిన 'ఇతరుల కోసం గర్భం బిల్లు' పేద స్త్రీలను అద్దె గర్భాలుగా వినియోగించుకునేందుకు విదేశాలలో స్థిరపడ్డ పిల్లలు లేని జంటలు పూనుకోవటాన్ని నిషేధించి, దాని స్థానంలో భారతీయ జంటలు దగ్గరి చుట్టాలు, కుటుంబం అనే సంబంధాలని వాడుకోవాలని చెప్పింది. ఆవిధంగా పరోపకారిత్వం అనే సూత్రం గర్భాన్ని అమ్ముకోవటం, కొనుక్కోవటంలోని వ్యాపార లక్షణాల్ని తొలగించి, వాటిస్థానంలో దగ్గరి వాళ్ళకి, చుట్టాలకి, 'గర్భ దానం' చేయటానికి సాధికారత కలిపిస్తుంది. సంతాన సాఫల్యం, అద్దె గర్భాలు రెంటినీ నియంత్రించే అంతకు ముందు చట్టం (అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ) 2019 చట్టంతో దాదాపు కనుమరుగైపోయింది. ఈ చట్టం ఈ రంగంలోని వ్యాపార లక్షణాలను నియంత్రించి కుటుంబ విలువల్ని ప్రోత్సహిస్తుంది.

ఎ.ఆర్.టి బిల్లు 'సంతాన లేమి' సమస్యను పరిష్కరించేది (ఐసిఎమ్ఆర్ పేజి 3). అయితే 2019 'ఇతరుల కోసం గర్భం' చట్టం స్పష్టంగా వ్యాపారం, కుటుంబం రెండింటీని వేరు వేరుగా ఉంచి భారతీయ సంప్రదాయంలో కుటుంబం ఎట్లా ఉండాలో నిర్దేశించేదిగా ఉంటుంది. 2008, 2011లలో అద్దె గర్భం నియంత్రణ గురించి రూపొందించిన చట్టాలు ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ అంటే టెస్టుట్యూబ్‌లలో సంతానోత్పత్తికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే పరిశ్రమ యొక్క నియంత్రణ గురించి ప్రతిపాదించినవి. ఎందువల్లనంటే, 'ఇతరుల కోసం గర్భం' పూర్తిగా సాంకేతిక జ్ఞానానికి లోబడి ఉండే ప్రక్రియ. గర్భం ధరించే స్త్రీ కూడా సాంకేతిక జ్ఞానానికి లొంగి నడుచుకోవాలి. అయితే ఈ సాంకేతిక జ్ఞానాన్ని ఉపయోగించుకున్న సంతాన సాఫల్య పరిశ్రమ అంతర్జాతీయ పరిశ్రమగా ఎదిగి, విదేశీ క్లయింట్లతో విపరీతమైన లాభాలని సంపాదించింది. మన దేశంలో గర్భాలను విదేశీ క్లయింటులకు అమ్మే కార్యక్రమం నిషేధించేంత వరకు అది కొనసాగింది. ఇప్పటికీ ఈ పరిశ్రమ సాంకేతిక జ్ఞానం (టెక్నాలజీ) అందించే భారీ పరిశ్రమగా కొనసాగుతూ, సంతానం లేని జంటల కోర్కెలను తీర్చేందుకు ముందుకొచ్చిన వ్యక్తుల అండం, బీజకణాలు కొనుగోలు చేసే వ్యాపారంగా వర్ధిల్లుతోంది. ఈ నేపథ్యంలో 'ధార్మికత' లేదా 'పరోపకారిత్వం' అద్దెకి గర్భాన్నిచ్చే స్త్రీల శరీరాలలో మాత్రమే ఇమిడి ఉంటుందా అనే ప్రశ్న వేసుకోవాలి? పెట్టుబడితో లావాదేవీలున్న సందర్భంలో పరోపకారిత్వానికి అర్థం ఏముంటుంది?

### *ఐ.వి.ఎఫ్ పరిశ్రమలో పరోకారిత్వం-అభద్రతతో కూడిన శ్రమ*

*2017* ఎ.ఆర్.టి బిల్లులో ఐ.వి.ఫ్ పరిశ్రమలో ఉన్న ఆర్థిక అంశాలు స్పష్టంగా కనిపించేవి: ఎ.ఆర్.టి కేంద్రాలను, దాతల అండం, వీర్యం సేకరించే జెనటిక్ బ్యాంకులను నియంత్రించేందుకు; వాటిని పర్యవేక్షించేందుకు రాష్ట్రాలలో, జాతీయస్థాయిలో సలహాదార్ల బోర్డులకు మద్దతుగా నియోగించిన ప్రభుత్వ నిధులను కేటాయించే కార్యక్రమం; ఎ.ఆర్.టి దవాఖానాలలో అవకతవకలు జరిగితే నిరోధించటానికి 'భీమా' నందించటం. సంతానలేమిని సమర్థవంతంగా పరిష్కరించే సాధనం ఎ.ఆర్.టి. అయితే, దానికి పునాది అయిన పెద్ద పెట్టుబడి గురించి మాట్లాడే వాళ్ళ సంఖ్య అతి తక్కువ (కదీర్, రెడ్డి 2010). ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ నుండి ఇతరుల కోసం గర్భాలని ధరించటాన్ని వేరు చేయటం, అలాగే వ్యాపారం నుండి పరోపకారిత్వాల వైపు తిరిగిన చర్చ పెట్టుబడికి లాభం చేకూర్చేవి. నిపుణులు, అద్దె గర్భాల ఏజెంట్లు, ఇతరుల కోసం గర్భాన్నిచ్చే స్త్రీలు చాలా మంది డబ్బుతో కొనుక్కునే గర్భాల పద్ధతిని నిషేధించటం గురించి ప్రభుత్వానికి విజ్ఞాపనలు అందించి, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించేందుకు

ప్రయత్నించారు. ప్రభుత్వం పట్టించుకో పోయేటప్పటికి, కనీసం కొన్ని మార్పులైనా చేయాలని కొంత మంది ఆశించారు. ఆ చిన్నమార్పులలో కనీసం 'ఇతరుల కోసం గర్భం' అన్న విషయాన్ని చుట్టరికంతో ముడిపెట్టకూడదని అడిగారు. పరోపకారత్వం ఊహించుకోవాలంటే చుట్టరికాలు, పరస్పర సంబంధ బాంధవ్యాలకు పెద్దపీట వేయాల్సి ఉంటుంది. ఈ పరోపకార గర్భధారణ ప్రత్యేకంగా రెండు దృక్పథాలలో ఆలోచనకి అందుతుంది. ఒకటి, ఒక నిస్వార్థ తల్లి, సంతానానికి నోచుకోని దంపతులకు బిడ్డను కని బహుమతిగా ఇవ్వటం; రెండు, అద్దె గర్భాన్ని పరోపకారంగా మతం పేరిట ఆమోదయోగ్యం చేయటం.

బిడ్డని కని బహూకరించడం అనే సిద్ధాంతం అద్దె గర్భం ఏర్పాటులో పునాదిరాయిగా ఉంటుంది. పరోపకారానికి, ధార్మికతకు స్థానమే లేని సందర్భంలో అద్దె గర్భం ఆ సంబంధాన్ని బహుమతుల బాంధవ్యంగా ఎత్తి చూపటంలో ప్రముఖ పాత్ర వహించి (బోర్డో1977) దానికి ఒక కృత్రిమమైన ధార్మిక రంగు పూస్తుంది. పరస్పర సన్నిహిత సంబంధాల్ని వ్యాపారపరం చేసే అద్దె గర్భాల సిద్ధాంతాలకు ఒక పవిత్రతను, ఆమోదాన్ని కలుగజేసి, దానిలో ఉన్న మచ్చను తొలిగించే ప్రయత్నం అది (కానెల్ 1990; లెవీన్ 2003; టెమాన్ 2008).

అయినా అంతర్జాతీయ నేపథ్యంలో చూసినపుడు ఈ బహుమతి సంబంధాలకు అర్థం కల్పించటం కష్టం. మానవ శాస్త్రరీత్యా మన దేశంలో ఆచరణను విశ్లేషిస్తే అద్దెకి గర్భం ఇచ్చే స్త్రీని, ఆమె గర్భంలో బిడ్డ నుండి, బిడ్డను కొనుక్కునే దంపతుల నుంచి దూరం చేయటానికి పునరుత్పత్తి కేంద్రాలు, నిపుణులూ ఈ బహుమతి సిద్ధాంతాల్ని బాగా వినియోగిస్తారు. గర్భమివ్వటం ఆమె విధిగా చూపిస్తారు. (పాండే 2011; రాగోన్ 1996; పోరా 2010). మన దేశంలో డబ్బుల కోసం తన గర్భాన్ని అద్దెకిచ్చే స్త్రీ తన కుటుంబం బతుకును నిలబెట్టటానికి బిడ్డ అనే బహుమతిని వేరేవారికి ఇచ్చి, బతుకు కోసం బతుకునిస్తుంది (లైఫ్ ఫర్ లైఫ్, వోరా 2013). తమ బతుకును నిలబెట్టినందుకు, జీవితాంతం బిడ్డను కొనుకున్న దంపతులకి రుణపడి ఉండేలా బిడ్డ బహుమతి సూత్రం పని చేస్తుంది. వాళ్ళ దయనీయమైన జీవితాలనుంచీ, దుర్భరమైన చాకిరీ నుంచీ విముక్తినిచ్చిన విదేశీ దంపతులను ఆపద్బాంధవుల కింద పరిగణించే గర్భాలని అద్దెకిచ్చిన స్త్రీలు ఎంతో మంది ఉన్నారు (పాండే 2011).

ఇతరుల కోసం గర్భాలనిచ్చే స్త్రీల గురించి, ఈ పరిశ్రమ గురించి, పరిశోధన చేసిన అమ్రితా పాండే (2014) మాటల్లో 'అద్దె గర్భ పరిశ్రమ విదేశీ ఖాతాదారులకు ఈ సేవని భారత దేశం ప్రపంచానికి అందచేస్తున్న దాతృత్వంగా ప్రచారం చేసి, ఈ సేవల్ని కొనుగోలు చేసే విదేశీయులకి వారొక పుణ్యకార్యం చేస్తున్నారని, గర్భం ధరించే స్త్రీల పట్ల వారికే విధమైన బాధ్యతలు ఉండక్కర్లేదని నమ్మిస్తుంది. ఆయా స్త్రీలని, వారినీ కార్యానికి ఎంచుకోవటమే వారి అదృష్టమనీ, భారతీయ, విదేశీ గర్భ కొనుగోలుదారులని దైవదూతలుగా భావించేటట్లు చేస్తుంది'. ఈ రకమైన మిథ్యను ప్రచారం చేయటానికి కృష్ణ భగవానుడి కథను చాలా ఉపయోగిస్తారని రాస్తారు పాండే. అద్దె గర్భాల స్త్రీలు ఒక మహత్తర కార్యాన్ని, పుణ్యకార్యాన్ని చేస్తున్నారని, వాళ్ళే దేవదూతలని నమ్మించటానికి కూడా ఈ పురాణాలు పనికొస్తాయి. ఆసక్తికరమైన విషయమేమిటంటే అదే సందర్భంలో ఈ కృష్ణుడి కథలో సంతాన సాఫల్య కేంద్రాలలోని నిపుణులు కూడా 'సంతాన దేవుళ్ళ'యితారు. ప్రాపంచిక కోరికలకి దూరంగా ఉంటూ ప్రాపంచిక వినియోగానికి బాగా ఉపయోగడే దైవత్వాన్ని రూపొందించటం ద్వారా పూర్తి భౌతిక విషయమైన పారిశ్రామిక మాతృత్వం సాధ్యమవుతోంది.

ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చి సంస్థ ప్రతినిధులు కృష్ణ భగవానుని పుట్టుక పురాణాన్ని, పైన పేర్కొన్న 'గర్భ దానం' సిద్ధాంతాన్ని పదేపదే అనేక బహిరంగ చర్చల్లో ప్రస్తావించి, దాని ద్వారా 'ప్రత్యేక భారతీయ గర్భం' ఒకటి ఉన్నదనీ, దాన్ని పునరుద్ధరించటంతో పాశ్చాత్య పరిజ్ఞానానికి ప్రత్యుత్తరం కనుక్కున్నామనే భావాలు వ్యక్తం చేయటం పరిపాటి అని నేను 2015లో రాసిన రచనలో పేర్కొన్నాను. నిజానికి, ఇది పాశ్చాత్య పరిజ్ఞానాన్ని గానీ, దాని ఊహా చిత్రాలని తిప్పి కొట్టటానికి పనికిరాదు కానీ 'మన' పురాణాల్లో భారతీయ గర్భమంటే 'మోసే సంచి'గా పురాణ కాలం నుండి సిద్ధాంతీకరించబడిందని చెప్పటానికి పనికివస్తుంది. మొదట్లో అటువంటి ఊహాచిత్రాలు విదేశీయులను ఆకర్షించటానికి పనికొచ్చినా, రానురానూ, మన రాజ్యం భారతీయ గర్భాన్ని 'జాతీయం' చేయటానికి ప్రస్తుతం బాగా పనికొస్తున్నాయి.

2018లో పార్లమెంటు 'ఇతరుల కోసం గర్భం' గురించి బిల్లు చేసినపుడు, అందులో 'పరోపకారం కోసం గర్భాన్ని' మన దేశంలో దంపతులకి మాత్రమే పరిమితం చేసి, ఎక్కువ శాతం కొనుగోలుదార్లు అయిన విదేశీయులకు, విదేశాలలో ఉండే భారతీయులకు, ప్రవాసీయులకు అది అందుబాటులో లేకుండా ఆంక్షలు విధించింది. జాతీయ మహిళా కమీషన్ చైర్‌పర్సన్ భారతీయ గర్భాలు అద్దెలకు లభ్యమయ్యే ప్రసక్తే లేదని, విదేశీయులకు ఏమాత్రం అందులో ప్రవేశం లేదని మరీ నొక్కి చెప్పింది. ఈ వాదనకు కేంద్ర బిందువు, విదేశీయులకు అందుబాటులో లేని 'జాతీయ గర్భం' అన్న భావన.

అందుకే పరోపకారం అనేది కుటుంబానికి మాత్రమే పరిమితం లేదా మన జాతి రాజ్య సరిహద్దులకే పరిమితం. నా పరిశోధనలో తెలిసిందేమిటంటే జాతీయ విధానాల గురించిన చర్చల్లో (డిస్కోర్స్) 'పరోపకారం కోసం అద్దె గర్భం' చట్టం ఆచరణలో కొచ్చేటప్పటి 'గర్భం దాల్చటానికి, బంధువుల్లో ఎవరు సరైన వాళ్ళు' 'ఎవరు పనికిరాని వాళ్ళు' అని తేల్చుకునే స్థాయికి రూపాంతరం చెందుతుంది. నేను ఐ.వి.ఎఫ్ కేంద్రాల నిపుణులు, డాక్టర్లతో మాట్లాడినప్పుడు, వాళ్ళు అద్దె గర్భాన్ని కోరివచ్చిన దంపతులకు ఒక రకంగా గర్భం ధరించటానికి ఎవరు సరైన వాళ్ళు అని నిర్ణయించే 'పెళ్ళి పెద్దల' పాత్ర వహిస్తారని స్పష్టమయింది. ఎవరు తగిన వాళ్ళు అని నిర్ణయించటంలో 'అందం', 'బీజం' దానం చేసే వారు ఏ నేపథ్యం నుంచి వచ్చిన వాళ్ళు, వాళ్ళ విద్య, కుటుంబ నేపథ్యం వంటి అంశాలకు చాలా ప్రాముఖ్యతనివ్వటం జరుగుతుంది. ఏదేమైనా చుట్టాలలో 'పరోపకారం కోసం' గర్భాన్ని ధరించే స్త్రీని వెతికే సమయంలో ఐ.వి.ఎఫ్ నిపుణులు ఒక రకమైన జన్యు సూత్రాలను (జీన్ సూత్రాస్) ప్రయోగించి, ఉత్తర భారత దేశ వివాహ వ్యవస్థలోని బహుమతి ఆచారాన్ని పదిలంగా కాపాడే గర్భాలను (ధరించే స్త్రీలని) వెతికిపట్టుకుంటారు. (మజుందార్ 2017).

అయినా, కొన్నిసార్లు కుటుంబాలలో ఇతరుల కోసం గర్భాలు ధరించే స్త్రీలు దొరకకపోవచ్చు. దగ్గరి చుట్టాలలో ఎవరూ ఒప్పుకోకపోవచ్చు. ఇచ్చి పుచ్చుకోవటాలు పని చేయకపోవచ్చు. ఒక నిపుణుడు చెప్పిన మాటల్లో 'ఇతరుల కోసం గర్భం బిల్లు' గురించి 'ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రిసెర్చ్' ప్రభుత్వానికి ఇచ్చిన పిటిషన్లో వాళ్ళు 'పరోపకార గర్భం సూత్రాన్ని ఆమోదించినా, మరీ ప్రత్యేకంగా చుట్టాలకు మాత్రమే పరిమితం చేస్తే అంగీకరించం' అని స్పష్టం చేసారు. దానిలో రెండు అర్థాలున్నాయి. ఐ.వి.ఎఫ్ కేంద్రాలు గుట్టుచప్పుడు కాకుండా అద్దె గర్భాన్ని వినియోగించి, సేవలందించే కార్యక్రమాలను కమర్షియల్ సరోగసీని ఎప్పటిలానే కొనసాగించవచ్చు. నియోగించిన స్త్రీలకు ఇంతకు ముందు అడిగిన డబ్బుకంటే తక్కువ రేటు ఇవ్వవచ్చని ఇంకొక అర్థం. పెట్టుబడి ఎక్కడ ఉండాలో అక్కడే ఉంటుంది. ఇతరుల కోసం గర్భాలనిచ్చిన స్త్రీలకు మిగిలేది అభద్రత (ప్రికారిటీ) మాత్రమే!

పరోపకారం (ధార్మిక గుణం) కోసం గర్భం అన్న భావన చివరికి అద్దె గర్భ పరిశ్రమ సృష్టించే దోపిడీకి తోడ్పడుతుంది. ఎందుకంటే మొత్తం వ్యవస్థలో దగ్గరి సంబంధాల పేరిట వ్యాపారానికి అందమైన రంగులు పుయ్యటమే ఈ మొత్తం కార్యక్రమం సాధించేది. పునరుత్పత్తి ప్రక్రియలో న్యాయం, హక్కుల గురించి లోతుగా అర్థం చేసుకోవాలంటే, 'ఇతరుల కోసం గర్భం' విషయంలో ఏది బహిష్కరిస్తున్నారన్నది-అద్దె గర్భం-మాత్రమే కాక, దేన్ని బహిష్కరించట్లేదో-పరోపకారిత్వాన్ని-కూడా చూడాలి. ఎందుకంటే రెండూ ఒకే నాణానికి బొమ్మా-బొరుసూ మరి!

అనువాదం: **కె లలిత**

**కె లలిత** ప్రముఖ స్త్రీవాద మేధావి, పరిశోధకురాలు

**అనిందితా మజుందార్** డిపార్ట్‌మెంట్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్
ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్‌లో
అసిస్టెంట్ ప్రొఫెసర్
ఈ మెయిల్ *anindita@la.iith.ac.in*

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*

# ఆరోగ్య రంగంలో శ్రమ, వైవిధ్యం: బాహ్యా మరియు అంతర్గత విభేదాలు

■ రమీలా బిష్త్, షవేత మీనన్

ఆరోగ్య రంగంలో పనిచేసే శ్రామికుల పరిస్థితి సాధారణంగా వారి సప్లై–డిమాండ్‌కి అనుగుణంగా ఉంటుంది. ఆశ్చర్యంగా నైసర్గిక కారణాలు కూడా ఆరోగ్య శ్రామికులు ఎక్కడ ఎంతమంది పనిచేస్తారో నిర్ణయిస్తాయి (షెఫ్లర్ 2012). దిగువ మరియు మధ్య–ఆదాయపు దేశాల్లో, హెల్త్ వర్కర్లకు ఎలాంటి శిక్షణ ఇవ్వాలన్న దాని మీదే కాకుండా, హెల్త్ వర్కర్ల సంఖ్యను ఎలా పెంచాలో అని కూడా ఒక చింతన జరుగుతోంది. కానీ ఉద్యోగావకాశాలు ఎక్కువగా పెరగక పోవడం చేత వీరిలో నిరుద్యోగం, ఇంకా శ్రామిక వనరుల నిరర్థకత పెరిగే అవకాశం ఉంది. అసలు ముందు వీరి సంఖ్యపై కానీ, వీరిలో ఎన్ని రకాల హెల్త్ వర్కర్లు ఉన్నారన్న విషయంపై కానీ నమ్మదగ్గ గణాంకాలు కూడా లేవు

హెల్త్ వర్కర్ల స్రవంతిలో గత దశాబ్దం నుండి చాలా ముఖ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాలంలో మెడికల్ వృత్తిలో ఆరోగ్య శ్రామికుల పాత్రలలో కూడా చాలా మార్పులొచ్చాయి. క్షీణించిన ప్రభుత్వ పాత్ర వల్ల, ప్రయివేటు రంగానికి అంతా వదిలి వేయడం వల్ల, దేశంలో సాధారణ ప్రజలకు వైద్య సేవలే అందుబాటులో లేకుండా పోయాయి. ఆసుపత్రి వైద్యం కొరకు పెరిగిన ప్రత్యక్ష ఖర్చులే కాక, జేబు నుండి పెట్టుకునే పరోక్ష ఖర్చుల మీద ప్రశ్నలు తలెత్తాయి. ఈ మార్పులన్నీ దేశంలో 1991 సంవత్సరంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల తర్వాతనే తలెత్తడం గమనార్హం. అన్ని వస్తువుల సేవల అందుబాటు మరియు వాటి ధరలను నిర్ణయించేది మార్కెటు శక్తులని చెప్పే ఆర్థిక సంస్కరణల తాత్వికతలో ఇది భాగం కూడా (ఫోస్టర్ 2019)

దేశ వృద్ధి రేటు ఎక్కువ అవాలంటే, ధరలు, పన్నులు తక్కువ అవ్వాలనీ, అది జరగాలంటే ప్రభుత్వ ఖర్చులు తగ్గించాలనీ, అందుకు సబ్సిడీలను కుదించాలనీ సూచించే విధానంలో భాగంగానే ఆరోగ్యశాఖ మీద పెట్టే ప్రభుత్వ పెట్టుబడి తగ్గడం జరిగింది (పీవోడీ 1996). ప్రభుత్వ వైద్య శాఖ మీద పెట్టే ఖర్చులో 80 శాతం జీతాలకే పోవడం, దాని మీద బడ్జెటు పెంచక పోవడం వల్ల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వ రంగం ద్వారా ఆరోగ్య సేవలు అందించడం సాధ్యం కాదేమో అనే అభిప్రాయం బలంగా రావడం మొదలైంది. ఇది ఆరోగ్య రంగం మీద ప్రభుత్వ ఖర్చును మరింత తగ్గించడానికి లైసెన్స్ ఇచ్చినట్లయింది (బాసు 2011). ఏదో మేరకు ప్రభుత్వం స్థానంలో నాన్ గవర్నమెంటల్ సంస్థలను వాడాలని, తక్కువ బడ్జెట్‌లో పూర్తి జీతాలివ్వకుండా, ఈ సంస్థలతో వైద్య సేవలందించాలనీ నిర్ణయించారు.

ఈ కొత్త విధానంలో ప్రయివేటు పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆహ్వానించడం మరొక ముఖ్యమైన పార్శ్వం. దీనికి సమాంతరంగా వైద్య ఉప శ్రామికులను, డాక్టర్లనూ, కాంట్రాక్ట్ బేసిస్ మీద తీసుకుని, రెగ్యులర్ స్టాఫ్‌ను క్రమేణా వేగంగా తగ్గించారు. మరొక పక్క పబ్లిక్–ప్రయివేట్ భాగస్వామ్యం పేరున కొత్త ఆసుపత్రులను పట్టుకొచ్చారు. మరోపక్క ఈ నయా ఉదారవాద విధానంలో వైద్య విధానంలో కొత్త ప్రమాణాలు, కొత్త వాణిజ్య ఒప్పందాలు ప్రయివేటు సంస్థలోలాగా ప్రభుత్వ రంగాలలో కూడా పాటించడం మొదలైంది (వాబో 2009). ఈ ప్రమాణాలు సరిగ్గా పాటించలేని ప్రభుత్వ ఆసుపత్రుల కన్నా ప్రయివేటు ఆసుపత్రులే శరణ్యం అనే భావన కలిగించి ప్రయివేటు ఆరోగ్య విధానానికి దారులు వేశారు (రమన్, బ్యోర్క్ మాన్ 2009).

ప్రభుత్వ మరియు ప్రయివేటు ఆసుపత్రులల్లో వైద్య సిబ్బంది మధ్య పర్మనెంట్, టెంపరరీ వర్కర్లనే విభజన జరిగింది. శాశ్వత ప్రాతిపదికన నియామకాలు జరగడంలో జాప్యం ఉన్న కారణంగా టెంపరరీ అపాయింట్‌మెంట్లలో కాంట్రాక్ట్ స్టాఫ్‌ను నియమించడం ముందు మొదలు పెట్టారు. కాంట్రాక్ట్ స్టాఫ్‌లో ఎన్నో రకాల వర్కర్లు తయారయ్యారు. దీనిలో ముందే నిర్ణయించిన ఫిక్సుడు కాంట్రాక్టు ప్రాతిపదిక మీద ఆసుపత్రి డైరెక్టుగా జీతాలిచ్చే ఉద్యోగులు, రోజువారీ కూలీ చొప్పున ఆసుపత్రి యాజమాన్యం నియమించే కార్మికులు, ఆసుపత్రి కొన్ని సేవలను అవుట్ సోర్సు చేస్తూ బయట ఉండే ప్రయివేటు సంస్థలకు అప్పచెప్పే క్రమంలో ఆయా సంస్థల్లో ఉన్న ప్రయివేటు కార్మికులు, ఇంకా కొంత మంది కాంట్రాక్టర్ల ద్వారా పరోక్షంగా ఆసుపత్రులలోనే పనిచేసే కార్మికులు వంటి రకాల వైద్య కార్మికులు ఉన్నారు. ఇందువల్ల ఆసుపత్రులలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ, మధ్య దళారుల ద్వారా నియమించబడే సంక్లిష్ట వర్గంగా ఆరోగ్య రంగంలో కార్మిక వర్గం ఉంది ఈ రోజు (త్రిసియా 2016).

ఈ కాంట్రాక్ట్ విధాన పర్యవసానం ప్రజారోగ్యంపై వివిధ స్థాయిల్లో ప్రభావం చూపింది. కార్మికుల జీతాలకు చిల్లు పొడిచింది. అస్తవ్యస్తమైన పని పరిస్థితులు, ఉద్యోగ అభద్రత అనేవి ఈ అసంఘటిత కార్మిక రంగంలో ముఖ్యమైన లక్షణాలుగా పరిణమించాయి. ప్రతి స్థాయిలో తక్కువ ఖర్చుకు నియమించుకునే ధోరణి వల్ల ప్రతి స్థాయిలో తీవ్రమైన నాణ్యతా లోపం ఏర్పడి ఆరోగ్య సేవల ప్రమాణాలు నిజానికి తీవ్రంగా క్షీణిస్తున్నాయి. డబ్బులు పెట్టినా భద్రంగా రోగ నివారణ అవుతుందని గుండెమీద చేయి వేసుకుని నిద్రించే రోజులు లేకుండా పోయాయి (బారు 2016) ప్రయివేటు ఆసుపత్రుల్లో కనీస అర్హతలు లేని వారందరినీ పారా మెడికల్స్ పేరు మీద పెట్టుకోవటంతో నాణ్యతలు చాలాసార్లు తీవ్రంగా పడిపోతున్నాయి. చండీగర్‌లో జరిగిన ఒక అధ్యయనంలో పర్మినెంట్ కార్మికులతో పోలిస్తే కాంట్రాక్ట్ కార్మికులకు వారి పని, ఇచ్చే వేతనాలు, ఏమాత్రం భద్రతలేని వారి ఉద్యోగాల పట్ల తీవ్రమైన అసంతృప్తి ఉందని తేలింది. కార్మికుల పరిస్థితుల్లో బాగుపడకపోతే వైద్యంలో నాణ్యత పెరగదని ఈ అధ్యయనం చెప్పింది (దీక్షిత్, గోయల్, శర్మ 2017). ఇలాంటి పరిశీలనలే ముంబయిలో టిబి నియంత్రణలో పని చేసే కాంట్రాక్టు కార్మికుల మీద జరిగిన అధ్యయనం కూడా చేసింది (బిష్త్ 2020).

అసంఘటిత కార్మిక వర్గం ఆరోగ్య రంగంలో పెరుగుతుండడం అందరి దృష్టికి వచ్చినా, హెల్త్ కేర్ రంగంలో కార్మికులను నియమించే విధానంలో వచ్చిన మరొక మార్పు ఏమిటంటే, ఫ్లెక్సిబుల్ కార్మిక విధానం అంటే అవసరమైనప్పుడు పిలవడం, ఇష్టమొచ్చిన పనివేళలు కల్పించడం, పనికింత అని కూలీ ఇవ్వడం. ఈ రకమైన దోపిడి ద్వారా ఆరోగ్య రంగంలో కార్మికులకి అత్యంత దౌర్భాగ్యమైన జీతాలు, పని పరిస్థితులు ఉన్నాయని అధ్యయనాలు తెలుపుతున్నాయి. అతి హీనమైన స్థితిలోని కార్మికులు గ్రామ స్థాయిలో, వాడలలో పనిచేసే కమ్యూనిటి హెల్త్ వర్కర్లు, తరువాత ఆశా వర్కర్లు, వీరిలో అత్యధికులు స్త్రీలే. 1970లో గ్రామస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించడానికి రూపొందించిన సాంఘిక, ఆరోగ్య కార్యకర్తలు ఈ రోజు ప్రయివేటు ఆసుపత్రులలో ప్రాథమికమే కాక అన్ని రకాలైన సేవలందించే కార్యకర్తలుగా రూపాంతరం చెందారు (బిష్త్ 2020).

ఆరోగ్య రంగ శ్రామిక శక్తి సమాజంలో స్త్రీలు, పురుషుల మధ్య ఉన్న అసమాన స్థాయిని ప్రతిబింబిస్తుంది. హెల్త్

వర్కర్లు మొత్తం సంఖ్యలో స్త్రీలదే సింహభాగం కానీ వీరిలో నర్సులు, ఆయాలు ఎక్కువ భాగం. డాక్టర్లలో స్త్రీలు తక్కువ. ఈ స్థాయిలో ఒక పురుషుడికి ఐదుగురు స్త్రీలు పని చేస్తుంటే, పై స్థాయిలో, ప్రతి ఒక మహిళా డాక్టరుకు ఐదుగురు పురుషులు డాక్టర్లుగా ఉన్నారు (ఆనంద్, ఫాన్ 2016). ప్రపంచ ఆరోగ్య సంస్థ చేసిన రిపోర్టులోనూ, ప్రపంచంలో ఆరోగ్యంలో స్త్రీలు అనే మరో నివేదికలోనూ హెల్త్ వర్కర్లలో స్త్రీ, పురుష విభేదాలేకాక, కుల, వర్గ విభేదాలు పనిచేసే తీరు కూడా ప్రస్తావనకు వచ్చింది.

అలోపతి డాక్టర్లలో పురుషాధిక్యత అత్యధికం. ఇండియాలో 25 వేల మంది శస్త్ర చికిత్స చేసే డాక్టర్లలో, 700 మంది మాత్రమే మహిళలు. స్త్రీల సంఖ్య కేంద్రీకృతం అయింది. స్పెషాలిటీలు ప్రసూతి, పిల్లల వైద్యం, చర్మ మరియు మానసిక వైద్య విభాగాలలో మాత్రమే (జైక్ 2018). ఆర్థోపెడిక్స్ కార్డియాలజీ, ఎనస్తీషియా వంటి విభాగాల్లో స్త్రీలు చాలా తక్కువ.

ప్రయివేటు ఆసుపత్రులలో పనిచేసే నర్సులు ప్రధానంగా కాంట్రాక్ట్ వర్కర్లే. ఈసంస్థలు ఎలాంటి శ్రామిక చట్టాల పరిధిలోకి రాకుండా, ఏడాది నిండకుండా పనిలో నుండి తీసివేసి మళ్ళీ స్వల్ప వ్యవధిలో పునర్ నియమించి, వారిని శాశ్వత కార్మికులు కాకుండా చూసుకుంటాయి. అందరు నర్సులూ స్వల్పకాల కార్మికులు కావడం వల్ల, వారి మార్కెట్లో నర్సుల సప్లై ఎప్పుడూ నిండుగా ఉంటుంది. దీని వల్ల తక్కువ వేతనాలు ఇచ్చి ఆసుపత్రి యజమానులు అధిక లాభాలు దండుకోవచ్చు. మరొక పక్క ఎలాంటి భద్రత లేని నర్సులతో ఊడిగం చేయించుకోవచ్చు.

ఆరోగ్య రంగంలో క్రింద స్థాయిల విషయానికొస్తే, అందులో 56 వేల పురుష శ్రామికులుంటే 2 లక్షల 20 వేల మంది మహిళా కార్మికులు కానీ హెల్త్ అసిస్టెంట్లలో, 14,267 మంది స్త్రీలు మరియు 12,267 మంది పురుషులు ఉన్నారు. వీరు పర్యవేక్షణా మరియు సహాయ విభాగాలలో ఉంటారు.

హెల్త్ అసిస్టెంట్లలో జండర్ విభజన కొంత తక్కువగా ఉంటుంది. అయితే, ఇక్కడ కూడా, సూపర్‌వైజర్ కాడర్లోనే అందరూ ఉన్నప్పటికీ, స్త్రీలు ఎక్కువ మందిని సూపర్‌వైజర్ చేయాల్సి ఉంటుంది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ, స్వల్ప తేడాలను పక్కన పెడితే, ఎక్కువ భాగంగా ఉన్న మహిళా హెల్త్ వర్కర్లందరూ, వారి విధి నిర్వహణలో చాలా ఎక్కువ పనులు చేస్తూ, పనికి తక్కువ జీతం తీసుకునేవారే. వీరిలో చాలా మంది కింది కులాలు, వర్గాల నుండి వచ్చిన వారు. ఆధిపత్య కులాల నుండి వచ్చిన వారు ఇంటి బయట ఈ పనులు చెయ్యరు. క్రింది స్థాయి హెల్త్ వర్కర్ల పనికి తక్కువ విలువనివ్వటం సర్వసాధారణం.

ఆరోగ్య రంగం రాష్ట్రాల పరిధిలోకి రావడం వల్ల, వివిధ రాష్ట్రాల్లో పని చేస్తోన్న ఆరోగ్య కార్మికుల జీతభత్యాల్లో కొన్ని భేదాలున్నాయి కేరళలో ఆశాలకి 2000 రూపాయల గౌరవ వేతనంతో పాటు అదనంగా 4500 రూపాయిల ఇన్సెంటివ్ ఇవ్వడం జరుగుతోంది. ఆశా వర్కర్లల యూనియన్ కూడా కేరళలో పటిష్టంగా పనిచేస్తోంది. మిగిలిన రాష్ట్రాల్లో ఇది అరుదు. అలాగే అక్కడి అంగన్ వాడి కార్మికులకు పదివేల రూపాయిల గౌరవ వేతనం లభిస్తోంది. అదే మహారాష్ట్రలో 7 వేల రూపాయలు, హర్యానాలో అత్యధికంగా 11,400 రూపాయలుగా ఉంది. అంగన్ వాడి హెల్పర్లకు దీనిలో సగం మాత్రమే వస్తుంది, వారు వారానికి ఆరు రోజులు పూర్తిగా పని చేసినప్పటికీ. వీరందరు హెల్త్ వర్కర్ల గణాంకాల్లోకి కూడా రారు.

అలాగే మార్కెట్ ఆధారిత పునర్వ్యవస్థీకరణలో, హెల్త్ వర్కర్లలో అధిక శాతం రెగ్యులర్ కార్మికుల స్థాయి నుండి కిందికి జారిపోయారు. ఇది వీరి జీవన ప్రమాణాల మీదే కాక, వీరి సాంకేతిక సామర్థ్యం మీద కూడా దుష్ప్రభావం చూపుతోంది. మహిళలు ఎంత మంది వస్తున్నా, వారికి సామర్థ్యం పెంచుకునే అవకాశాలు కూడా రావట్లేదు. ఆరోగ్య రంగం ఒక దిక్కుమాలిన రంగంగా తయారయింది. ఈ రంగంలో సామర్థ్యం, జీతభత్యాలు పెంచి కార్మికుల మధ్య అంతర్గత విభజన తగ్గించి, మెరుగైన ఆరోగ్యం అందించే రంగంగా దీన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. సేవాపేక్ష లేని లాభార్జన ఆరోగ్య రంగాన్ని నరకప్రాయం చేస్తుందనడానికి సందేహించక్కరలేదు. కానీ కేవలం దాని గురించి బాధ పడుతూ ప్రభుత్వ ఆరోగ్య రంగంలోని తీవ్ర లోపాలని బాగు చేయకపోతే, ముఖ్యంగా తగినంత జీతాలు, సామర్థ్యం, నైపుణ్యం ఉన్న ఆరోగ్య కార్మికులని పెంచకపోతే, ఈ బాధంతా బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది!



అనువాదం: **ఆర్ వి రమణ మూర్తి**

**ఆర్ వి రమణ మూర్తి** స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ప్రొఫెసర్

**రమీలా బిష్త్** ది సెంటర్ ఫర్ సోషల్ మెడిసిన్ అండ్ కమ్యూనిటీ హెల్త్, జెఎన్‌యులో ప్రొఫెసర్

**షవేత మీనన్** సెంటర్ ఫర్ పబ్లిక్ హెల్త్ ఎండ్ హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేషన్, ఎటర్నల్ యూనివర్శిటి, బారు సాహెబ్, హిమాచల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్


*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*




**హెల్త్ కార్మికుల వైవిధ్యభరిత జీవితానుభవాలు: కొన్ని మచ్చుతునకలు**

గుజరాత్‌లో చేసిన ఒక అధ్యయనంలో తెలిసిన విషయాలు: ఒకటి, ప్రయివేటు ఆసుపత్రులలో ఎక్కువ మంది నర్సులు ఎస్.సి, ఎస్.టి సమూహాల్లోని తక్కువ ఆర్థిక వర్గం నుండి వచ్చిన చిన్న వయసు వారే. రెండవది, ప్రభుత్వాసుపత్రుల్లోని నర్సుల జీతాలు ప్రయివేటు ఆసుపత్రుల నర్సుల జీతాలకంటే 105 శాతం ఎక్కువ. క్వాలిఫికేషన్లలో తేడాలు లేనప్పటికీ ప్రయివేటు ఆసుపత్రుల నర్సులకూ, ప్రభుత్వాసుపత్రులలో టెంపరరీ నర్సులకూ కనీస వేతనాలు కూడా అందడం లేదు (సెత్ 2017).

మణిపూర్‌లో ఆశా వర్కర్లకు అతి తక్కువ గౌరవ వేతనాలు ఇవ్వడం వల్ల, దీనిపై వారి భర్తల నుండి వచ్చిన అసంతృప్తి కారణంగా వీరు తమ ఉద్యోగాలు ఒదులుకుంటున్నారు. ఆశా వర్కర్ల గౌరవ వేతనాలు చాలా తక్కువ ఉన్నప్పటికీ వారు కూడా ఏదో రోజు ఏఎన్ఎమ్‌లు అవుతారనే ఆశతో ఉద్యోగం చేస్తున్నారు. ఈ విధమైన వివక్ష క్రింది స్థాయి ఉద్యోగుల మీద తీవ్రంగా ఉంది. విధి నిర్వహణలో వారు కుటుంబాలను సైతం నిర్లక్ష్యం చేస్తున్నారనే అపనిందని నిరంతరం మోయాల్సి వస్తుంది (సిప్రిల్ మొ॥ 2015).

ఎంత చదువుకున్నా, డాక్టర్లయినా మహిళలను ఒక పని చేసే కార్మికురాలిగా, వారి కుటుంబాలు, సమాజం గుర్తించడం లేదు. పైగా పని ప్రదేశంలో హింస, వివక్ష చవిచూడాల్సొస్తోంది. తోటి సహోద్యోగుల నుండే కాక, పేషెంట్ల నుండి కూడా కొన్నిసార్లు లైంగిక దాడులు జరుపుతున్న సందర్భాలున్నాయి (దేవస్థలి, రెగె 2012).

# ఆశావర్కర్-అందరికీ ఆశాదీపమే, తనకి తాను తప్ప!

■ ఎస్ రామనాథన్, వసుధా చక్రవర్తి

ప్రజారోగ్య వ్యవస్థకు అత్యున్నత ప్రాధాన్యమిస్తూ ఒక "నిర్మాణాత్మకమైన మార్పు" సాధించడమే లక్ష్యంగా 2005వ సంవత్సరంలో ప్రారంభింపబడిన కార్యక్రమం 'జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్' (ఎన్ఆర్‌హెచ్ఎమ్). ఆరోగ్యంపై చేసే వ్యయాన్ని పెంచుతామని ఇది వాగ్దానం చేసింది. ఆరోగ్య కార్యక్రమాల్లో ప్రజల ప్రాధాన్యాని పెంచింది. అందరూ మహిళలే ఉండే అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ ఆక్టివిస్టుల (ఆశా) ల నియామకం కూడా ఇందులో భాగమే. నిజానికి, ఎన్ఆర్‌హెచ్ఎమ్ 1991 నుంచి భారతదేశ అభివృద్ధి నమూనాలో చోటుచేసుకున్న ఆధునిక ఉదారవాద భావాలకు విరుద్ధంగా తీసుకున్న చర్య (బారు, మోహన్ 2018). అయితే, కాలం గడిచేకొద్దీ దీనిపై నయా ఉదారవాద సిద్ధాంత ప్రభావం బలపడింది. ప్రజారోగ్యం మీద చేసే వ్యయం పెరగకపోగా దాన్ని ప్రైవేటుపరం చేసే చర్యలు ఊపందుకొన్నాయి (సేన్ గుప్తా 2018).

ఈ నేపథ్యంలో, ఆరోగ్య వ్యవస్థలో ఆశా వర్కర్‌ల స్థానం, వారి మీద దాని ప్రభావం, ప్రత్యేకించి కోవిడ్-19 కాలంలో వారి మీద ప్రభావాన్ని పరిశీలించటం ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశ్యం. అలాగే, ఆశా వర్కర్ల నియామకం వల్ల ఆరోగ్య మరియు పోషణ (న్యూట్రిషన్) సంబంధిత సేవలేమైనా విచ్ఛిన్నమయ్యాయా; దాని వల్ల ఫ్రంట్‌లైన్ మహిళా ఆరోగ్య కార్మికుల బేరమాడే శక్తి ఏమేరకు తగ్గింది అన్న విషయాలని కూడా పరిశీలిస్తుంది.

**ఆరోగ్య వ్యవస్థలో ఆశావర్కర్‌ల స్థాయి, వారి పని, వ్యక్తిగత జీవితం మీద దాని ప్రభావం**

ఆశావర్కర్లు, ప్రజలకు మరియు ఆరోగ్య వ్యవస్థకు మధ్య అనుసంధానంగా పనిచేసే కార్యకర్తలు. వివిధ సమూహాలు, సంస్థలు మరియు ఆరోగ్య శాఖాధికారులతో కూడిన ఒక 'కఠినమైన ఎంపిక ప్రక్రియ'[6] ద్వారా వీరు నియమింపబడతారు. వీరి ఎంపిక ప్రక్రియ గురించిన సమాచారం దొరుకుతుంది కానీ వీరు ఎవరి అజమాయిషీలో పనిచేస్తారు అన్న విషయంలో మాత్రం స్పష్టత లేదు. ఆశావర్కర్‌ల పాత్ర మాత్రం క్రమేణా పరిణామం చెందుతూ వచ్చింది. ఆరోగ్యరంగానికి సంబంధించిన సాంకేతిక సేవలు మరియు సామాజిక రక్షణ విధులను నిర్వర్తించటం వారి పని యిప్పుడు మాత్రం, ఆరోగ్య రంగానికి సంబంధించిన దాదాపు ప్రతి ఒక్క పనినీ ఆశావర్కర్లు చేస్తున్నారు. సామాజిక స్థాయికి విస్తరించిన ఆరోగ్య వ్యవస్థ ప్రతిరూపంగా వారిని చూడవచ్చు (రొయల్ క్వామే 2014).

వివిధ రకాల పనులను చేసినందుకుగాను వారికి నగదు ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఇలా ప్రోత్సాహకాలు లభించే పనుల సంఖ్య 2005లో ఆరు ఉంటే, క్రమంగా పెరుగుతూ 2017లో ముప్ఫై ఎనిమిదికి చేరింది (వేద్ మొ॥ 2019). ఆస్పత్రుల్లో కాన్పులు జరిగేలా చూడటం వంటి పనులకు ఎక్కువ నగదు ప్రోత్సాహకం లభిస్తుండగా మిగతా పనులకు తక్కువగా లభిస్తుంది. ఈ ప్రోత్సాహకాలు ఆరోగ్యరంగ ప్రాధాన్యతలని కూడా ప్రతిబింబిస్తాయి. టీకామందులు వేసే పనికి వెయ్యిరూపాయల ప్రోత్సాహకం అయితే, కుష్టువ్యాధి నిర్ధారణకు రెండొందల యాభై రూపాయలు యిస్తారు. [12] ఆరోగ్య రంగంలోని మరే ఉద్యోగికీ యిలా పనితీరు ఆధారంగా జీతాలు యిచ్చే వ్యవస్థ లేదు. ఈ ప్రక్రియ, ప్రజారోగ్యంలో మార్కెట్ నియమాలను ఉపయోగించుకుంటూ డబ్బుకు ఆరోగ్య సేవల్ని అందించే ప్రయత్నంగా కనబడుతుంది.

ఉదాహరణకు, ఆస్పత్రిలో కాన్పు (ఇన్స్టిట్యూషనల్ డెలివరి) చేయించినందుకు లభించే ప్రోత్సాహకం పొందాలంటే, ఒక ఆశావర్కర్, గర్భిణిని ఆ మేరకు ఒప్పించడమో లేదా ఆమెతో పాటుగా ఉండటమో చేయాల్సి ఉంటుంది. యింకో రకంగా చెప్పాలంటే, ప్రోత్సాహకం పొందడానికి ఆశావర్కర్ చాలా శ్రమించాల్సి ఉంటుంది. యిలా, పనుల సంఖ్య ఎక్కువైనప్పటికీ ఆమె కొన్నింటిని మాత్రమే పూర్తి చేయగలుగుతుంది. అందువల్ల ఆమె సంపాదన కూడా పరిమితంగానే ఉంటుంది. చిన్నచిన్న మొత్తాలు లభించే పనులు కాకుండా ఎక్కువ మొత్తంలో ప్రోత్సాహకం లభించే పనులు చేయడానికి ఆశావర్కర్‌లు పోటీపడతారని చెప్పే నివేదికలున్నాయి. రోజువారీ మరియు ఇతర సాధారణ కార్యకలాపాల ద్వారా ఆశావర్కర్లు నెలకు సగటున మూడు నుంచి నాలుగు వేల రూపాయల వరకు సంపాదిస్తున్నారు (పైన పేర్కొన్న రచన) అయితే, ఈ ప్రోత్సాహకాలు ఆలస్యంగా అందడం పరిపాటి.

ఆశావర్కర్లు కరడుగట్టిన పితృస్వామిక వ్యవస్థలో పనిచేయాల్సి ఉండటం కూడా వారి మీద ఎంతో ప్రభావాన్ని చూపిస్తోంది. యింటి బాధ్యతలను, వృత్తిసంబంధ బాధ్యతలను రెంటినీ సమన్వయం చేసుకోవాలి (సప్రి, రిచర్డ్స్ మొ॥ 2015; పాలా మొ॥ 2011). తమ తమ సమూహాల నుండి ప్రోత్సాహం కరువవడం, అవమానాలు ఎదురవడం జరుగుతూ ఉంటుంది. ఒక్కోసారి ఆరోగ్య వ్యవస్థ యొక్క వైఫల్యాలకు వీరినే బాధ్యుల్ని చేస్తుంటారు (భాటియా 2014; దాస్ గుప్తా మొ॥ 2017). వీటన్నింటికీ తోడు యితర ఆరోగ్య కార్యకర్తల నుంచి, వ్యక్తుల నుంచి లైంగిక వేధింపులు కూడా ఎదురవుతుంటాయి (దాస్ గుప్తా మొ॥ 2017).

ఈ విధంగా ఆశావర్కర్లు: 1) వ్యక్తిగత స్థాయిలో, సాధ్యమైనంత ఎక్కువ సంపాదించడానికి తపన పడుతూ యింటి బాధ్యతలను, ఉద్యోగ బాధ్యతలను సమన్వయం చేసుకోవడంలో (స్వామినాథన్ 2015). 2) సామాజిక

**కోవిడ్-19 మహమ్మారిని ఎదుర్కొనడంలో ఫ్రంట్‌లైన్ కార్మికుల పాత్ర**

**ఏఎన్ఎం**

ఆశావర్కర్ నిర్వహించే సర్వేలు మరియు పరీక్షలను పర్యవేక్షించడం

నిర్ధారిత కేసులకు మరియు అనుమానితులకు చికిత్స లభించేలా చేయడం.

ఆరోగ్య కేంద్రాల్లో రోజువారీ/ముఖ్యమైన ఆరోగ్య సేవల్ని అందించడం

**అంగన్వాడీ వర్కర్**

గర్భిణీలు, బాలింత మహిళలు, పిల్లలు, కుటుంబాలు, పెన్షనర్లు మరియు వితంతువులకు రేషన్ పంపిణీ చేయడం

కొన్ని రాష్ట్రాల్లో, ముసలివారు మరియు అనాథల కోసం ఏర్పాటు చేసిన కిచెన్లలో సహాయకారిగా ఉండటం

**ఆశావర్కర్**

అనుమానితుల సమాచారం కోసం యింటింటి సర్వే చేపట్టడం

వలస కార్మికుల గురించి సర్వే చేయడం

వలస వచ్చిన వారిని మరియు యితరుల్ని కోవిడ్-19 పరీక్ష చేయించుకునేలా కౌన్సిలింగ్ నిర్వహించడం

హోం క్వారంటైన్‌లో ఉన్న వారి యిళ్లకు వెళ్ళి పర్యవేక్షించడం

కోవిడ్-19 పై అవగాహనను పెంపొందించడం

గర్భిణీల గురించి, పిల్లల టీకాలకు సంబంధించి అలాగే యితర తీవ్ర వ్యాధులతో బాధపడే వారి గురించిన సమాచారాన్ని సేకరించడం

అప్పుడే పుట్టిన పిల్లల కవసరమయ్యే సంరక్షణా సేవల్ని వారి యింటివద్దనే అందించడం; మహిళల్ని ఆసుపత్రికి తీసుకెళ్ళడంలో తోడుగా ఉండటం.

స్థాయిలో – సంబంధాలు నెరవుతూ వ్యక్తులకు ఆరోగ్య సేవలు అందేలా చూడ్డంలో మరియు 3) ఆరోగ్య వ్యవస్థ స్థాయిలో – వారివారి బాధ్యతలను నెరవేరుస్తూ ఆశించిన లక్ష్యాలను సాధించడం అనే క్రమంలో నిరంతరమైన ఒత్తిడిని భరిస్తున్నారు. ఒక క్రమమైన ఆదాయం లేకపోవడం, సమాజం నుంచి మద్దతు కొరవడడం, యింకా, తమ సమస్యలు విన్నవించుకోవడానికి, పరిష్కరించుకోవడానికి సరైన యంత్రాంగం లేకపోవడం వంటి అంశాలన్నీ వారిపై ఒత్తిడిని పెంచుతున్నాయి.

**ఆశావర్కర్లపై కోవిడ్-19 కలుగజేస్తున్న ఒత్తిడి**

కోవిడ్-19 మహమ్మారి వల్ల ప్రస్తుతం నెలకొని వున్న పరిస్థితి ఆశావర్కర్ల మీద ఒత్తిడి పెరగడానికి కారణమయ్యింది. దీనికితోడు ఆరోగ్య వ్యవస్థ నుంచి వారికి రావాల్సిన దానికంటే తక్కువ మద్దతు లభించింది.

దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ కోవిడ్‌ని ఎదుర్కోవటానికి చేపట్టిన కమ్యూనిటీ ఆరోగ్య కార్యక్రమాల్లో ఆశావర్కర్ల సేవలు వినియోగించుకున్నారు. యింటింటి సర్వేలు, తనిఖీలు చేపట్టడం దగ్గర్నుంచి అనుమానితుల్ని ఆరోగ్య కేంద్రాలకు చేర్చడం, పాజిటివ్ వచ్చిన వారిని మరియు లక్షణాలున్న వారిని ఇంటింటికెళ్ళి చూడటం, స్థానిక క్వారంటైన్ కేంద్రాలకు సహాయకారిగా ఉండటం మరియు వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని చేరవేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి పనులన్నీ వీళ్ళు చేశారు.

ఈ కోవిడ్-19 మహమ్మారిని ఎదుర్కొనే ప్రక్రియలో పనిచేసిన ముగ్గురు ఫ్రంట్‌లైన్ కార్మికుల్లో ఆశావర్కర్‌లే ఎంతో వైవిధమైన పాత్ర పోషించారు. పోషణ, ఆరోగ్య సంబంధ విధుల్లో ఉండే అంగన్వాడీలు మరియు ఏఎన్ఎంలకు వారి వారి రంగాల్లో నిర్దేశించబడిన ఖచ్చితమైన విధులున్నాయి. సమూహ స్థాయిలో కోవిడ్-19ని సమర్థవంతంగా ఎదుర్కోవటానికి ప్రాథమికంగా ఆశావర్కర్ల మీదే ఆధారపడుతున్నారు. దేశం కోసం, సమాజం కోసం ఒక 'ఉన్నతమైన' కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారని వారికి పదే పదే చెపుతున్నారు. కానీ ఇది కేవలం పనికి లింగపరమైన అస్తిత్వాన్ని ఆపాదించడమే అవుతుంది (ఐఎల్ఓ 2017). మరొక విషయం ఏమిటంటే, వ్యవస్థలో భాగం కాకపోవడం, ప్రత్యేక ప్రోత్సాహకాలు లభించకపోవటం అటుంచితే, అసలు కోవిడ్ సంక్షోభ ప్రారంభంలో వీరు ఏ పనులని తిరస్కరించగల స్థితిలో కూడా లేరు.

ఫిబ్రవరి 2020 నుంచి ఆశావర్కర్లు కోవిడ్-19 విధులను నిర్వర్తిస్తున్నారు. అయితే, మీడియా వీరి సమస్యల్ని, యిబ్బందుల్ని వెలుగులోకి తెచ్చిన తర్వాత మాత్రమే, అంటే ఏప్రిల్ 2020లో మాత్రమే, కేంద్ర ఆరోగ్యశాఖ స్పందించి జనవరి నుంచి జూన్ వరకు నెల వెయ్యి రూపాయల చొప్పున అదనపు నగదు ప్రోత్సాహకాన్ని అందించాల్సిందిగా రాష్ట్రాలను ఆదేశించింది. అంటే, ఎంతో ప్రాణాంతమైన పరిస్థితుల్లో పనిచేసినా ఆశావర్కర్లకు రోజుకి లభించిన మొత్తం కేవలం ముప్ఫై రూపాయలు.

**కోవిడ్-19 కాలంలో ఆశావర్కర్లు ఎదుర్కొన్న కష్టాలు, ఒత్తిళ్ళు మరియు యిబ్బందులు వారి మాటల్లోనే**

*ప్రతికూల వాతావరణంలో పని చేయడం*

సహాయనిరాకరణ, దుర్భాషలాడే ప్రవర్తన ఎదుర్కున్నామని, 'ఈ మహమ్మారి ప్రజల్లో ఒక రకమైన భయాన్ని, అపనమ్మకాన్నీ కలుగజేసింది' అని ఒక ఆశావర్కర్ తెలిపింది. ఆశావర్కర్లు సమాచార సేకరణ కోసం వెళ్ళినపుడు నిరాకరించడం, దుర్భాషలాడటం, వారిచ్చే సూచనలను, సలహాలనూ పాటించకపోవడం వంటి సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని రాష్ట్రాల్లో, వైరస్ సోకుతుందన్న భయంతో తమ చుట్టుపక్కలి వ్యక్తులే తమను యిళ్ళల్లోకి రానివ్వలేదని కొందరు ఆశావర్కర్లు తెలిపారు.

'మేము సమాచార సేకరణకు వెళ్ళి ఏవైనా లక్షణాలు ఉన్నాయా అని అడిగినప్పుడు మమ్మల్ని తిడుతూ ఒకే విషయం అడగడానికి రోజు వస్తారెందుకు అంటూ ప్రశ్నిస్తారు' – ఒక ఆశా కార్యకర్త, ఉత్తర్‌ప్రదేశ్.

'బాగా పరిచయం ఉన్నవాళ్ళు కూడా మమ్మల్ని వాళ్ళ యిళ్ళల్లోకి రానీయరు. వాళ్ళతో కనీసం సరిగా మాట్లాడే పరిస్థితే లేనపుడు యిక వైరస్ గురించిన సమాచారం యివ్వడం గానీ, వాళ్ళ ప్రవర్తనని గమనించడం గానీ ఎలా వీలవుతుంది' –ఒక ఆశా కార్యకర్త, బీహార్

కొన్ని సందర్భాల్లో ఆశావర్కర్లు తమ సొంత కుటుంబాలనుంచే ప్రతికూలత ఎదుర్కొన్నారు. వీరు చేసే పనుల పట్ల, తద్వారా దానివల్ల తమ కుటుంబాలకి పొంచి ఉన్న ప్రమాదం పట్ల వాళ్ళు సంతోషంగా లేరు.

'మా యింట్లోని పెద్దవాళ్ళు వారికి మేము వైరస్ అంటిస్తున్నామని గట్టిగా మందలిస్తున్నారు' –ఒక ఆశా కార్యకర్త, ఝార్ఖండ్.

*వ్యక్తిగత రక్షణ కిట్లు (పి పి ఇ కిట్లు) మరియు భద్రత లేకపోవడం*

ఆశావర్కర్లు చేసే పనులను 'తక్కువ అపాయం ఉండే పనులు'గా వర్గీకరించడం (ఎమ్‌జీహెచ్ఎఫ్‌డబ్ల్యు ఇచ్చిన గైడ్‌లైన్స్ 2020) వల్ల మూడు పొరల మాస్కులు మరియు గ్లోవ్స్‌ని పిపిఇ గా వాడమని సూచించారు. ఈ సర్వే చేపట్టిన అయిదు రాష్ట్రాలలో దాదాపు 50 శాతం మంది ఫ్రంట్‌లైన్ కార్మికులు పిపిఇ కిట్లు పొందినట్లు తెలిపారు. ఈ పిపిఇ కిట్ల అందుబాటులోనూ, పంపిణీలోనూ తేడాలున్నాయి. ఏఎన్ఎంలకూ, ఆరోగ్య కేంద్రాలు మరియు చెక్‌పోస్ట్‌లలో పనిచేసే వారికీ కిట్ల పంపిణీలో ప్రాధాన్యం లభించింది. తగినన్ని కిట్లు అందుబాటులో లేకపోవడం వల్ల, పంపిణీలో అవకతవకల వల్ల చాల మంది ఆశావర్కర్లు యింట్లో తయారు చేసిన మాస్కులని, దుపట్టా, స్కార్ఫ్ లేదా చేతి రుమాళ్ళని మొహాన్ని కవర్ చేసుకునేందుకు వాడామని తెలిపారు.

'మొదట్లో ఒకసారి మాస్కులిచ్చారు; యిప్పుడు మాకు యింట్లో తయారు చేసిన మాస్కులే ఉన్నాయి. గ్లోవ్స్‌గానీ, శానిటైజర్ గానీ లేవు' –ఒక ఆశా కార్యకర్త, ఒడిషా.

'శానిటైజర్లకు బదులు మాకు సబ్బులు ఇచ్చారు. ప్రజలు మమ్మల్నసలు లోపలికే రానివ్వనప్పుడు, ప్రతి యింటినీ సందర్శించిన తర్వాత సబ్బును ఎలా వాడగలం?' –ఒక ఆశా కార్యకర్త, ఉత్తర్‌ప్రదేశ్

'ఎటువంటి రక్షణా పరికరాలు గానీ, మాస్క్‌గానీ లేకుండా మేము క్షేత్రస్థాయిలో పని చేస్తున్నాము. మా భద్రత కోసం మేమే శానిటైజర్ తెచ్చుకుంటున్నాము. యిటువంటి కనీస సదుపాయాల్ని కల్పించడం ప్రభుత్వ ప్రాథమిక విధి' –ఒక ఆశావర్కర్, బీహార్.

*పనిభారం మరియు విధి నిర్వహణ*

ఒకవైపు కోవిడ్-19 బాధ్యతలు, మరొకవైపు సాధారణంగా అందించే గర్భిణీ స్త్రీల కోసం సేవలు, శిశు సంరక్షణా సేవలు మరియు అత్యవసర సేవలూ నిర్వహించాల్సి రావడంతో పనిభారం ఎక్కువైనట్లు ఆశా వర్కర్లు తెలిపారు. పై నుంచి వచ్చే అనేక ఆదేశాలు, వాటిలో పదేపదే జరిగే మార్పులూ గందరగోళానికి గురి చేశాయి. దీనివల్ల ఆశావర్కర్లు చేయాల్సిన పని గురించి, అందించాల్సి సేవల గురించీ స్పష్టత కరువైంది.

*ప్రోత్సాహకాలు అందడంలో ఆలస్యం*

సర్వే చేసిన వారిలో ఝార్ఖండ్ లో 87 శాతం మంది ఆశా కార్యకర్తలు, ఉత్తర్‌ప్రదేశ్‌లో 30 శాతం మంది, రాజస్థాన్‌లో 89 శాతం మంది, మరియు బీహార్‌లో 45 శాతం మంది కార్యకర్తలు తమకు ముందు నెల (అంటే, ఏప్రిల్ 2020) ప్రోత్సాహకాల బకాయిలు అందలేదని తెలిపారు. ఈ ప్రోత్సాహకాలు ఆలస్యంగా అందడం పరిపాటిగా మారినప్పటికీ ప్రస్తుత ఆర్థిక సంక్షోభ సమయంలో దీని పర్యవసానాలు మాత్రం భయంకరంగా పరిణమించాయి.

పరిమిత వనరులతో, మద్దతు లభించని వాతావరణంలో పని చేయాల్సి రావడం వల్ల తాము ఒత్తిడి, ఆదుర్దా వంటి లక్షణాలతో బాధపడుతున్నట్లు సర్వే చేసిన రాష్ట్రాల్లోని ఆశా వర్కర్లు తెలిపారు (పైన పేర్కొన్న రచన). తమ పని తమ కుటుంబాల్ని, ప్రత్యేకించి తమ పిల్లల్ని వైరస్ ప్రమాదంలోకి నెట్టి వేస్తుండటం వారు చాలా భయపడుతున్నారు. ఈ భయాలకు తోడు, కొన్ని సందర్భాలలో వీరు ప్రతికూల మనస్తత్వం ఉండే ప్రజలతో వ్యవహరించాల్సి వచ్చింది, అది కూడా ఎలాంటి శిక్షణా లేకుండానే! వీరు ఈ పనులన్నింటినీ చేయాలని ఆరోగ్య వ్యవస్థ ఆశించింది. తమ యిబ్బందుల్ని చెప్పుకున్నప్పుడు వారిని ఎగతాళి చేయడం కూడా కొన్ని సందర్భాలలో జరిగింది.[26] తమ గౌరవానికి, హుందాతనానికి భంగం

వాటిల్లిన భావం కలిగిందని చాలా మంది ఆశా వర్కర్లు తెలిపారు.

'నేను నా భర్తనుంచి, పిల్లల నుంచి మరియు నా కుటుంబం నుంచి దూరంగా వేరే స్థలంలో నిద్రపోతాను. యిది కష్టతరమే అయినప్పటికీ వారిని ప్రమాదంలోకి నెట్టడం నాకు యిష్టం లేదు' -ఒక ఆశా కార్యకర్త, ఝార్ఖండ్.

**ఆరోగ్య మరియు పోషణ సంబంధ సేవలు విభజించబడటం: ఫ్రంట్‌లైన్ కార్మికుల మధ్య స్పర్థలు**

పైన చెప్పినట్లు, ఆరోగ్యరంగ నిర్వహణలో ప్రజల్ని భాగస్వాముల్ని చేయడంలో భాగంగా ఆశావర్కర్ల నియామకం జరిగింది. అయితే, ఈ తొమ్మిది లక్షల మంది అసంఘటిత కార్మికుల నియామకం రెండు ఫలితాల్ని సాధించింది. అవి, జీతాలకయ్యే వ్యయంలో చెప్పుకోదగ్గ పెరుగుదల లేకుండానే శ్రామిక శక్తిని పెంచడం.

ఆశావర్కర్ల నియామకం వల్ల సాధారణ ఆరోగ్య మరియు పోషణ సంబంధ సేవలు విభజించబడటం జరిగింది. ఆశావర్కర్ల నియామకానికి ముందు ఏఎన్ఎంలు ప్రజల్ని చేరడానికి అంగన్వాడీల మీద ఆధారపడేవారు. ఆశావర్కర్ల పాత్ర విస్తరిస్తున్న కొద్దీ ఏఎన్ఎంలు మరియు అంగన్వాడీల పాత్ర క్రమంగా తగ్గుతూ వస్తోంది. యిది, ఈ ముగ్గురి మధ్య స్పర్థకూ, ఒక రకమైన శతృత్వ భావనకూ దారి తీసింది. మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన ఒక సర్వేలో, అంగన్వాడీలు తమకు సహకరించడంలేదని 36 శాతం మంది ఆశా వర్కర్లూ, తమకు సమాచారం యివ్వకుండానే అంగన్వాడీలు జననీ సురక్షా యోజన(జెఎస్‌వై) కేసుల్ని తీసేసుకున్నారని 35 శాతం మంది ఆశా వర్కర్లూ తెలిపారు. ఆశా వర్కర్లకు అందాల్సిన ప్రోత్సాహక నగదు చెల్లింపుల్ని ఏఎన్ఎంలు ధృవీకరించడం లేదని కూడా ఈ సర్వే వెల్లడించింది.[27] రాజస్థాన్‌లో జరిపిన ఒక పరిశోధన ప్రకారం, ఏఎన్ఎంలు మరియు ఆశా వర్కర్ల మధ్య నెలకొని ఉండే సంక్లిష్ట సంబంధ బాంధవ్యాలలో తరచూ ఏఎన్ఎంలదే పైచేయి. ఒకే గ్రామంలో ఉండే ఆశావర్కర్ మరియు అంగన్వాడీల మధ్య సంపాదనకు సంబంధించి స్పర్థలు ఉండటం కూడా చాలా సందర్భాలలో జరుగుతోంది.[28]

ఆశా వర్కర్లు మరియు అంగన్వాడీలు యిద్దరూ అసంఘటిత కార్మికులే. ఆశా వర్కర్లకు ప్రోత్సాహక నగదు లభిస్తుండగా అంగన్వాడీలకు గౌరవ వేతనం లభిస్తోంది. ఆరోగ్య మరియు పోషణ సంబంధ సేవల్ని విభజించడం ద్వారా ప్రభుత్వం వీరిని సంఘటితం కాకుండా చేయగలిగింది. వీళ్ళిద్దరి మధ్యా నెలకొని ఉండే స్పర్థా, శతృత్వ వైఖరి, బహుశా, హక్కుల సాధన కోసం వీరిని ఏకం కాకుండా చేస్తుంది కూడా. ఏఎన్ఎంలు సంఘటిత రంగ కార్మికులైనప్పటికీ, ఆశావర్కర్ల చేతనే ఎక్కువ పనులు చేయిస్తుండటం వల్ల వీరి యొక్క బేరమాడే శక్తి తగ్గిపోతోంది.

**ముగింపు**

ఆరోగ్య సేవల్లో ప్రజల్ని భాగస్వాముల్ని చేసే ప్రయత్నాల్లో భాగంగా ఆశా వర్కర్ల నియామకం జరిగింది. ఆరోగ్య వ్యవస్థ యొక్క జవాబుదారీతనంలో పారదర్శకత లోపించడం వల్ల, చాలా తక్కువ ఖర్చుతోనే ఆశా వర్కర్ల చేత పనిచేయించుకుంటూ అది తన అవసరాలు తీర్చుకుంటోంది. యిది కోవిడ్-19 మహమ్మారి నేపథ్యంలో మరింత ఎక్కువైంది. ఈ మహమ్మారి కాలంలోనే కాకుండా మామూలుగా కూడా ఆశావర్కర్ల నుండి ప్రభుత్వం భారీ మూల్యాన్ని రాబట్టింది. యింకోవైపు, ఆశావర్కర్ల నియామకం ద్వారా ఆరోగ్య మరియు పోషణ సంబంధ సేవల్ని విభజించి ముప్పైమూడు లక్షల మంది మహిళా కార్మికుల్ని (9 లక్షల మంది ఆశా వర్కర్లు, 12.8 లక్షల అంగన్వాడీలు మరియు 1.16 లక్షల మంది సహాయకులు) అసంఘటితంగానే ఉంచేసింది. వీరినిలా అసంఘటితంగానే ఉంచడం ద్వారా ప్రభుత్వం, తక్కువ ఖర్చుతో సేవల్ని కింది స్థాయి వరకూ విస్తరించడమనే జంట లక్ష్యాలని సులభంగా సాధించగలిగింది. ఈ రకంగా ప్రభుత్వం పొదుపు చేస్తుండగా ఈ మూల్యం చెల్లిస్తున్నది మాత్రం మహిళా కార్మికులే. ఆశావర్కర్లనే తీసుకుంటే, వారి నగదు ప్రోత్సాహకాల్ని సంపాదించేందుకు కుటుంబాలతో, తోటి వ్యక్తులతో, ప్రజలతో మరియు పై అధికారులతో సర్దుకుపోతూ ఒత్తిడిని భరిస్తున్నారు. ఈ క్రమంలో వారు చెల్లిస్తోన్న మూల్యంతో పోలిస్తే వారికి దక్కుతోన్న ప్రోత్సాహకాలు ఏమాత్రం సరిపోవు.

అనువాదం: **కె నవీన్ కుమార్**

**కె నవీన్ కుమార్** యువ కవి, అనువాదకుడు, వృత్తిరీత్యా సెరికల్చర్ ఆఫీసర్, అనంతపూర్

**ఎస్ రామనాథన్** ఢిల్లీలోని 'డెవలప్‌మెంట్ సొల్యూషన్స్' రీసెర్చ్ మరియు కన్సల్టింగ్ సంస్థ సహ వ్యవస్థాపకులు.
ఈ మెయిల్:sramanathan@devsolutions.org)

**వసుధా చక్రవర్తి** ఢిల్లీలోని 'డెవలప్‌మెంట్ సొల్యూషన్స్' రీసెర్చ్ మరియు కన్సల్టింగ్ సంస్థ సహ వ్యవస్థాపకులు.
ఈ మెయిల్:vasudha@devsolutions.org

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*

**నోట్సు:**

1. సామూహిక పర్యవేక్షణలో గ్రామ ఆరోగ్య కమిటీలు మరియు పోషణ కమిటీలు ఏర్పరచడమే అందుకు సాక్ష్యం.

2. గ్రామంలోంచే ఎంపిక చేసి, గ్రామానికే జవాబుదారీగా ఉంటూ ప్రజలకు మరియు ప్రజారోగ్య వ్యవస్థకు మధ్య అనుసంధానంగా ఉండేలా ఆశా వర్కర్లకు శిక్షణ ఇస్తారు. ఆశా వ్యవస్థ గురించి ఇక్కడ చదవండి:

https://nhm.gov.in/index1.php?lang=1&level=1&sublinkid=150&lid=226 (accessed on June 19, 2020)

3. ఆశాల గురించిన సమాచారం ఇక్కడ పొందవచ్చు

https://nhm.gov.in/indes1.php?lang=1&level=1&sublinkid=150&lid=226, accessed on June 22, 2020

4. జనవరి 2019 వరకు ఉన్న సమాచారం మేరకు, ఆశా వర్కర్లు – మాతా, శిశు మరి కౌమార ఆరోగ్యము, కుటుంబ నియంత్రణ, క్షయ, కుష్టు వ్యాధి, వాహకాల ద్వారా సంక్రమించే వ్యాధులు, సంక్రమించని వ్యాధులు, ప్రాథమిక ఆరోగ్య రక్షణ, తాగునీరు మరియు పారిశుధ్యం పనులలో పాలు పంచుకుంటారు. ఇవేకాక, ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ వివిధ కార్యక్రమాల్ని నిర్వహించాలి మరియు గ్రామ స్థాయిలోనూ, మండల స్థాయిలోనూ జరిగే సమావేశాలకు హాజరు కావాలి.

5. ఆశాల గురించిన లేటెస్టు సమాచారం ఇక్కడ పొందవచ్చు

http://nhsrcindia.org/sites/default/files/update%20on%20ASHA%20Programme_2019_for%20Web.pdf; accessed on June 23, 2020

6. ఆశాల పని వివరాల కోసం ఇది చూడండి

ttps://nhm.gov.in/New_Updates_2018/communization/Aasha/Orders_and_guidelines/Official_orders/ASHA_Incentives.pdf (accessed on June 25, 2020)

7. సర్వే చేసిన అయిదు రాష్ట్రాలలో ఈ విధంగా ఉంది. అయితే, అన్ని రాష్ట్రాలలోనూ ఇదే విధంగా ఉందన్న విషయం పత్రికలు మరియు యితర మాధ్యమాల ద్వారా తెలుస్తున్నది.

8. అయిదు రాష్ట్రాలలో (బీహార్, ఝార్ఖండ్, ఒడిషా, రాజస్థాన్ మరియు ఉత్తరప్రదేశ్) గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య మరియు పోషణ సేవల లభ్యత అన్న అంశంపై పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా అనే సంస్థ సహకారంతో "డెవలప్‌మెంట్ సొల్యూషన్స్" సంస్థ చేపట్టిన విశ్లేషణ.

9. పశ్చిమాఫ్రికాలో ఎబోలా మహమ్మారి ప్రబలినప్పుడు ఇలాగే జరిగింది. 2017 ఇఎల్ఓ రిపోర్టు చూడండి

# ఆశావర్కర్లు: పేద మహిళల స్వచ్ఛంధ సేవ ద్వారా భారం తగ్గించుకుంటున్న ప్రభుత్వం

■ వృందా మార్వా

**పరిచయం**

ప్రపంచ వ్యాప్తంగా జనాభాకున్న సంరక్షణ అవసరాలు పెరిగేకొద్దీ సమాజంలో సంరక్షణ-కార్మికుల (కేర్ వర్కర్స్) సంఖ్య, వారి ప్రాముఖ్యత కూడా పెరుగుతోంది. భారతదేశంతో సహా అనేక దేశాలలో ప్రభుత్వరంగ సామాజిక సేవలు ఈ కార్మికులపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి (రజావి మరియు స్టాబ్ 2010). ఇక్కడ మనం ప్రస్తావించబోయే ఫ్రంట్ లైన్ ఆరోగ్య కార్యకర్తలు ఒక రకమైన సంరక్షణ కార్మికులు. వీరు కమ్యూనిటీ ఆరోగ్య సేవలను అందిస్తారు లేదా కమ్యూనిటీల ఆరోగ్యావసరాలనూ, వాటికి సంబంధించిన ఆరోగ్య సేవలనూ అనుసంధానిస్తారు. కోవిడ్19 నివారణ మరియు నిర్వహణ ద్వారా వారి పని ప్రజారోగ్యానికి కేంద్రబిందువై ఉన్నదని గుర్తించబడినప్పటికీ వారికి ఆరోగ్య కార్మికులుగా గుర్తింపు అన్నిసార్లు లభించదు. దీనికి భారతదేశంలో 'సామాజిక ఆరోగ్య కార్యకర్తలు' లేదా ఆశా (అక్రెడిటెడ్ సోషల్ హెల్త్ ఆక్టివిస్ట్) లు ఒక మంచి ఉదాహరణ.

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) లో భాగంగా 2005 నుండి నియమించబడిన 'ఆశా'లు, కమ్యూనిటీ హెల్త్ 'వాలంటీర్లు'గా వర్గీకరించబడ్డారు. దాదాపు పదిలక్షల మంది దాకా ఉన్న ఈ పూర్తి మహిళా శ్రామిక శక్తికి, నెలవారీ జీతాలు కాక ఒక్కో కేసుకు ప్రోత్సాహకాలు చెల్లించబడతాయి. పైగా వీరికి ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే, 'సెలవు' వంటి వెసులుబాట్లు లేవు. 'ఆశా'లు అయిన మహిళలను 'ప్రోత్సాహక వాలంటీర్' స్థితి ఎలా ప్రభావితం చేస్తుంది? స్త్రీలు మంచి ఉపాధిని పొందటానికి వీలు కల్పించే అభివృద్ధికి బదులు, అభివృద్ధి కోసం స్త్రీలపై బాధ్యత మోపే ధోరణిని స్త్రీవాద మేధావులు గుర్తించారు (చాంట్ 2008; స్వామినాథన్ 2015). ఇక్కడ, భారతదేశంలో 'ఆశా'లుగా ఉన్న మహిళలకు ఈ ధోరణి వల్ల కలిగే రోజువారీ పర్యవసానాలు ఏమిటో నేను అన్వేషిస్తున్నాను.

**పరిశోధనా పద్ధతులు**

నేను 2017 మరియు 2019 మధ్య, మొత్తం 14 నెలల ఎథ్నోగ్రాఫిక్ ఫీల్డ్ వర్క్‌ను ఉత్తర భారత దేశంలో నిర్వహించాను. ఇందులో పంజాబ్‌లోని ముక్త్సర్ జిల్లాలోని ఒక గ్రామీణ మరియు పట్టణ బ్లాక్‌లోని 'ఆశా'లతో క్షేత్ర పరిశీలనలు ఉన్నాయి. అలాగే 'ఆశా'లతో 60 ఇంటర్వ్యూలు, ఇంకా 'ఆశా' ప్రోగ్రామ్ నిపుణులతో 20 ఇంటర్వ్యూలు ఉన్నాయి. 'ఆశా'లు వారి కమ్యూనిటీలు, ఆరోగ్య వ్యవస్థకు మధ్య అనుసంధానంగా ఉన్నందున, ఈ ఇద్దరితో సంభాషణలు జరిగేటప్పుడు నేను 'ఆశా'లతోనే ఉన్నాను. వారితో పాటుగా ఉండి నేను వారు చేసే హోమ్ విజిట్‌లు, కమ్యూనిటీ స్థాయి ప్రచారాలు మరియు సమావేశాలు, వారపు రోగనిరోధకత డ్రైవ్‌లు, అలాగే 'ఆశా' శిక్షణలు, ఆరోగ్య శాఖ సమావేశాలు, ఆసుపత్రులలో రోగులకు సేవలను అందించడం, ఇంకా 'ఆశా' యూనియన్ నిరసనలను గమనించాను. గ్రామీణ మరియు పట్టణ బ్లాక్‌లోని అన్ని 'ఆశా'ల జాబితా నుండి, నా ఇంటర్వ్యూల కోసం సమాన సంఖ్యలో దళిత మరియు ఆధిపత్య కుల 'ఆశా'లను నేను ఎంచుకున్నాను. ఇంటర్వ్యూలలో సెమీ స్ట్రక్చర్డ్ (ఊహించగలిగిన చిన్న సమాధానాలను రాబట్టే కొన్ని ప్రశ్నలతో బాటు వివరంగా మాట్లాడి స్పందనలు వచ్చే మరికొన్ని ప్రశ్నలను కలిపి ఇంటర్వ్యూ చెయ్యటం) ప్రశ్నా పత్రాన్ని ఉపయోగించాను. ఇవి 30 నుండి 90 నిమిషాల వరకు కొనసాగాయి.

**సందర్భం**

కనీసం 8 సంవత్సరాల విద్య కలిగిన కమ్యూనిటీ మహిళలు 'ఆశా'లుగా అర్హులవుతారు. వారు 23 రోజుల ప్రారంభ శిక్షణ పొందుతారు. ఇవే కాక వారి బాధ్యతలలో ఐదు ముఖ్య కార్యకలాపాలు ఉంటాయి: హోమ్ విజిట్‌లు, కమ్యూనిటీ సమావేశాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నెలవారీ సమావేశాలు, ఔట్రీచ్‌లలో (సేవలను అందుకోలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి సేవలు అందించటం) సేవలు మరియు రికార్డుల నిర్వహణ. నా ఫీల్డ్ సైట్లో (పరిశీలనా క్షేత్రంలో) 'ఆశా'ల మొట్టమొదటి నియామకాలు 2007 (గ్రామీణ) మరియు 2014 (పట్టణ) లో జరిగాయి. చాలా మంది మహిళలు సోషల్ నెట్‌వర్క్‌ల ద్వారా, అంటే సర్పంచ్, ఏఎన్ఎమ్ (ఆక్సిలరీ నర్స్ మిడ్‌వైఫ్), అంగన్‌వాడీ వర్కర్స్ ఇతర 'ఆశా'లు లేదా వారికి దగ్గరగా ఉన్న ఒక రాష్ట్ర కార్యకర్త ద్వారా ఈ పోస్ట్ గురించి తెలుసుకున్నారు. కార్యక్రమం యొక్క ప్రారంభ సంవత్సరాల్లో టర్నోవర్ ఎక్కువగా ఉండేదని ముక్త్సర్ 'ఆశా' సమన్వయకర్త నాకు చెప్పారు. ఆధిపత్య కుల మహిళలు ఈ పదవులను సాధారణ ప్రభుత్వ ఉద్యోగాలు అని భావించి చేరి, చేయాల్సింది ఏమిటో తెలుసుకున్న తర్వాత తప్పుకోవడం ప్రారంభించారు.

1000 మంది జనాభాకు ఒక 'ఆశా' నిష్పత్తిలో, 'ఆశా'లు పెరుగుతున్న అట్టడుగు పట్టణ బస్తీలతో కలిపి గ్రామీణ భారతదేశం అంతటా నియమించబడుతున్నారు. (వేద్ మరియు ఇతరులు 2019). నా అధ్యయన నమూనాలో, గ్రామీణ 'ఆశా'లచే సేవలు అందుకుంటున్న జనాభా సగటున 1275. అదే పట్టణ 'ఆశా'లచే సేవలు అందుకుంటున్న జనాభా సగటున 280. అందరు 'ఆశా'లు అర్హతకు అవసరమయిన 10వ తరగతి పూర్తి చేశారు. కాని గ్రామీణ ఆశాలలో అందరూ 8వ తరగతి పూర్తి చేసినవారు కాదు. కానీ పై అర్హతలు ఉన్నవారు కూడా రిజిస్టర్లను నిర్వహించడానికి మళ్లీ చదవడం, రాయడం స్వంతంగా నేర్చుకోవలసి వస్తుంది. ఇది కాలక్రమేణా వారి పనిలో ఒక భాగంగా మారింది. వారు 3 ఉద్యోగాలు చేస్తున్నారని 'ఆశా'లు తరచూ నాకు ఫిర్యాదు చేశారు. ఇంట్లోపని, ఇంటి వెలుపల పని, అదీగాక రికార్డులు రాయడానికి చదువుకోవలసి రావడం.

'ఆశా'లు కేంద్ర ప్రభుత్వం నుండి స్థిర నెలవారీ గౌరవ వేతనం అందుకుంటారు (2018లో రూ.1000 నుండి రూ.2000కు పెంచబడింది). ఈ వేతనం రిజిస్టర్‌ను నిర్వహించడం వంటి ప్రాథమిక పనులు చేయడం కోసం చెల్లించబడుతుంది. ఇది కాకుండా, 'ఆశా'లకు పని ఆధారిత ప్రోత్సాహకాల (టాస్క్ బేస్డ్ ఇన్‌సెంటివ్స్) ద్వారా చెల్లిస్తారు. 'ఆశా'లు ప్రోత్సాహకాలను పొందే పనుల జాబితా 2005లో ఐదుతో ప్రారంభమై 2017లో 38కి పెరిగింది (వేద్ మరియు ఇతరులు. 2019). ఈ పనులలో కొన్ని నెలవారీ పునరావృతమయే కార్యకలాపాలైతే, మరికొన్ని ఒక్కసారి మాత్రమే నిర్వహించే ప్రచార కార్యక్రమాలు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బట్టి ఆశాలకు ఇచ్చే స్థిర లేదా ప్రోత్సాహక ఆదాయాలు మారుతూ ఉంటాయి. నేను ముక్త్సర్‌లో నా ఫీల్డ్ వర్క్ ప్రారంభించినప్పుడు, సగటు 'ఆశా' నెలకు 2700 రూపాయలు సంపాదించింది. ఇది పంజాబ్‌లోని నైపుణ్యం కలిగిన కార్మికుడి నెలవారీ వేతనంలో నాలుగింట ఒక వంతు.

**పరిశోధనలో వెలువడ్డ విషయాలు**

'ఆశా'లు మాత్రమే భారత ప్రభుత్వ ఆరోగ్య విభాగంలో 'పారితోషికం పొందిన వాలంటీర్లు' అనే ఒక ప్రత్యేక వృత్తిపరమైన హెూదాను కలిగి ఉన్నారు. కానీ ఈ హెూదా 'ఆశా'లకు వారి పని-వేతనం మధ్య అసమతుల్యతను సృష్టిస్తోంది. ఈ క్రింది మూడు మార్గాల ద్వారా ఇది జరుగుతుంది.

*1. ప్రోత్సాహక చెల్లింపు విధానం 'ఆశా'లు చేస్తున్న వేతనం లేని, తక్కువ వేతనం వచ్చే శ్రమను దాచిపెడుతుంది.*

'ఆశా'లు చేసే అధికారిక పనులకు ప్రోత్సాహకాలు ఉన్నాయి. ఇవి 'ఆశా'లు చేసే శ్రమకు ఒక కొన మాత్రమే. కానీ 'ఆశా'లు తమ అధికారిక పనులను పూర్తి చేయటానికి అనధికారిక శ్రమను చాలా ఎక్కువ చేయవలసి ఉంటుంది. ఏదేమైనా, ఈ అనధికారిక శ్రమ కనబడకుండా వారికి ఇవ్వబడింది. ఎందుకంటే ఇది పనిగా గుర్తించబడని వేతనం లేని పని. నా ఫీల్డ్ నోట్సు నుండి ఒక ఉదాహరణ ఇక్కడ ఇస్తున్నాను.

ఉక్కగా ఉన్న ఒక సెప్టెంబర్ రోజున, నేను ముక్త్సర్ జిల్లాలోని ఒక గ్రామ పాఠశాలలో డిపిటి మరియు టిటి టీకాల కార్యక్రమానికి వెళ్లి అక్కడ జరిగే పనిని గమనిస్తున్నాను. మొదటి, ఐదవ మరియు పదవ తరగతి విద్యార్థులను కవర్ చేయడానికి ఒక 'ఆశా' (జస్ప్రీత్), మరియు ఇద్దరు ఎఎన్ఎమ్‌లకు ఉదయం 10 నుండి 2 గంటల వరకు పట్టింది. జస్ప్రీత్, చిన్న పిల్లలను ఊరుకోబెట్టడం, పట్టుకోవడం, ఎత్తడం వంటి పనులను చాలా వరకు చేయడమే కాక ఎఎన్ఎమ్‌లు ఇంజెక్షన్లు చేస్తున్నపుడు, గదిని పలుమార్లు శుభ్రం కూడా చేసింది. మేము స్కూల్ కాంపౌండ్ నుండి తిరిగి బయలుదేరినపుడు, ఆమె విధి ఎప్పటికీ ముగియదని జస్ప్రీత్ నాతో చమత్కరించింది. ఆమె 10 సంవత్సరాలుగా గ్రామీణ 'ఆశా'గా పని చేస్తోంది. అంతకు ముందు రోజు కూడా పాఠశాలకు వెళ్ళి, కొత్త రిజిస్టర్లను పెట్టి వచ్చింది. దీనిలో ఎఎన్ఎమ్‌లు తమ ఎంట్రీలు రాస్తారు. మరుసటి రోజు కూడా ఆమె ఐరన్ మాత్రల కొత్త సరఫరాతో పాఠశాలలో ఉండాలి. పాఠశాల విద్యార్థుల గురించి జస్ప్రీత్ ఇలా అన్నది. "కొంత మంది తల్లిదండ్రులు ఈ సాయంత్రం వారిని నాదగ్గరకు తీసుకువస్తారు. డిపిటి తర్వాత కాలును కదిలించడం కష్టం. అలానే టెటనస్ తర్వాత దద్దుర్లు ఉండవచ్చు. కాబట్టి, వారు సాధారణంగా ఇంటికి వస్తారు. ఈ ఇంజక్షన్ ఎందుకు బాధిస్తుందని అడుగుతారు. నేను వివరిస్తాను. అవసరమైతే నేను వారికి పారాసిటమాల్ ఇస్తాను". ఈ 'ఆశా' అదే గ్రామంలో నివసిస్తున్నందున ఇది పర్లేదు. అయితే ఎఎన్ఎమ్‌లు నగరంలో నివసిస్తారు. కానీ అనేక గ్రామాలకు బాధ్యత వహిస్తారు. జస్ప్రీత్ పాఠశాల టీకాల కోసం కనీసం ఒకటిన్నర రోజులు గడిపింది. కానీ వీటిలో ఏదీ ప్రోత్సాహకాలకు అర్హత ఉన్నది కాదు కాబట్టి దాని కోసం ఆమెకు డబ్బు చెల్లించబడదు.

అయితే ప్రోత్సాహకరంగా ఉన్న ఈ అధికారిక పనుల చెల్లింపులు కూడా తక్కువగానూ, అస్థిరంగాను ఉంటాయి. ప్రోత్సాహకాలు తక్కువగా ఉండటం వలన, ఈ చెల్లింపులు సంరక్షణ పని యొక్క విలువను కూడా తగ్గిస్తాయి. అంతేకాకుండా, ఆశాలకు రావలసిన చెల్లింపులు ప్రతీసారి రావు. ఉదాహరణకు, స్త్రీలు ప్రసూతి సంరక్షణను పొందేలా చూడటం ఒక సాధారణ 'ఆశా' పని. గర్భధారణ సమయంలో మూడుసార్లు గర్భిణీ స్త్రీలను పరీక్షల కోసం, అంటే అల్ట్రాసౌండ్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షల కోసం సివిల్ ఆసుపత్రికి తీసుకురావలసిన పని ఉంటుంది. ఈ రోగులలో చాలా మంది పేదలు, అణగారిన కులం వారు, రోజువారీ కూలీ చేసుకునే వారు ఉంటారు. అందుకని ఈ మహిళలను ఆసుపత్రిని రమ్మని ఒప్పించటానికి 'ఆశా'లు వారి ఇళ్లకు పదే పదే వెళ్తారు. వారిని ఒప్పించినా కూడా గర్భిణీ స్త్రీలతో పాటు ప్రయాణించే వారు, లేదా వారి ప్రయాణానికి చెల్లించగల వారు ఎవరూ ఉండకపోవచ్చు. కాబట్టి 'ఆశా'లు ఈ రెండు పనులూ చేయటానికి ముందుకొస్తారు. టోకెన్ తీసుకోవడం నుండి వరుసలో నిలబడటం వరకు ఆసుపత్రిలో ప్రతి అడుగుకు 'ఆశా' గర్భిణీ స్త్రీ పక్కనే ఉండి ఆమెను తీసుకెళుతుంది. ఉదాహరణకు రోగి రక్తం పరీక్షలకు ఇచ్చిన తరువాత, తన కూలి పని చేయడానికి బయలుదేరవచ్చు. కాబట్టి 'ఆశా' ఆ సాయంత్రం రక్తం పరీక్ష రిపోర్టులను సేకరించడానికి తిరిగి ఆసుపత్రికి వెళుతుంది, లేదా రిపోర్టులు రావడానికి ఎక్కువ సమయం పడితే మరొక రోజు వెళ్లి తీసుకువస్తుంది. ఇలా ఎన్నిసార్లు పరీక్షలైనా రిపోర్టుల కోసం తిరగవలసి వస్తుంది. రిపోర్టులు వచ్చాక 'ఆశా' వాటిని రోగి ఇంటి గుమ్మం వరకు చేరవేస్తుంది. దీనికోసం ఆమె గర్భిణీ స్త్రీ కానుపుకు ముందుగా, "ఆశా యాంటినాటల్ చెకప్" ప్రోత్సాహకంగా మొత్తం రూ.200ను అందుకుంటుంది.

ఇలాంటి చిన్న చెల్లింపులు కూడా ఎప్పుడూ సమయానికి అందవు. ఉదాహరణకు, ఒక గర్భిణీ స్త్రీకి మృతశిశువు జన్మించినందుకు ఆమెను తీసుకు వచ్చిన 'ఆశా'కు పూర్వపు చెకప్ ప్రోత్సాహకం చెల్లించబడలేదు. మరొకరికి ప్రసవానంతర చెకప్ ప్రోత్సాహకం రాలేదు. ఎందుకంటే ఆ తల్లి బిడ్డను పబ్లిక్ ఆసుపత్రికి బదులుగా ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసవించారు. చెల్లింపులను తిరస్కరించడానికి ఇవి చట్టబద్ధమైన కారణాలు కావు, కాని జిల్లా 'ఆశా' సమన్వయకర్త నాకు ఎత్తి చూపినట్టుగా, ఎఎన్ఎమ్‌లు కొన్నిసార్లు చెల్లింపు వివరాల గురించి గందరగోళానికి గురవుతారు. ప్రోత్సాహకాలు ఉన్న పనుల జాబితా, ఆరోగ్య శాఖ యొక్క ప్రాధాన్యతలను బట్టి మారుతుంటుంది. కొత్త కార్యకలాపాలు జోడించబడతాయి లేదా ఉన్నవాటిలో కొన్ని తొలగించబడతాయి.

ప్రోత్సాహక చెల్లింపు విధానం-రూపకల్పన మరియు అమలు-ఈ రెండింటి ద్వారా, 'ఆశా'లు చేసే శ్రమలో ఎక్కువ భాగాన్ని విస్మరిస్తుందని, వారి పనిలో కొంత భాగానికి మాత్రమే పరిహారం ఇస్తుందని ఈ వృత్తాంతాలు తెలియజేస్తున్నాయి.

*2. ప్రోత్సాహక చెల్లింపు విధానం 'ఆశా'లపై ఆరోగ్య శాఖకు పరపతి ఇస్తుంది.*

'ఆశా'లకు వారి పర్యవేక్షకులు అయిన ఎఎన్ఎమ్‌లతో కలిసి దాఖలు చేయబడిన నెలవారీ వివరాల ఆధారంగా వారి ప్రోత్సాహకాలు చెల్లించబడతాయి. నెలలో 'ఆశా' పూర్తి చేసిన పనులపై ఎఎన్ఎమ్‌లు సంతకం చేస్తారు. అలానే 'ఆశా' చేసిన ప్రతి పనికి ప్రోత్సాహకాన్ని సమకూర్చడం ద్వారా ఆ నెలకు 'ఆశా' ఎంత చెల్లించబడుతుందో లెక్కించబడుతుంది. ఈ పనులను ధృవీకరించి, ఆమె నెలవారీ వేతనాన్ని నిర్ణయించే తాహతు, ఎఎన్ఎమ్‌లకు తమకింద పనిచేసే 'ఆశా'లపై అధికారం ఇస్తుంది. ఈ అధికారం వలన లభించే పరపతి, ఆరోగ్య శాఖకు, 'ఆశా'లతో వారికి కేటాయించిన పనులు మాత్రమే కాక వేరే పనులు చేయించుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది.

నా క్షేత్ర పరిశీలనా సమయంలో, పెద్దస్థాయి నుండి చిన్న విషయాల వరకు ఈ పరపతి ఎట్లా పని చేస్తుందో చాలాసార్లు చూశాను. 'ఆశా'లు వారి ఎఎన్ఎమ్‌లను తిరస్కరించడం చాలా కష్టం. ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నప్పుడు ప్రతిసారీ 'ఆశా'లు వారి ఎఎన్ఎమ్‌ల కోసం టీ తెచ్చిపెట్టడం లేదా తమ ద్విచక్ర వాహనం పై తన ఎఎన్ఎమ్‌ను ఎటు తీసుకువెళ్ళమంటే అటు తీసుకువెళ్ళడం వంటివి జరుగుతాయి. లేదంటే 'ఆశా'లు కష్టపడి సంపాదించిన ప్రోత్సాహకాలు వారి నుండి నిలిపివేయబడవచ్చని కూడా అర్థం చేసుకోవచ్చు. తద్వారా వారి డ్యూటీ బయట పని చేయమని వారిని ఇబ్బందిపెడతారు. ముక్త్సర్‌లోని సివిల్ హాస్పిటల్ వ్యాసెక్టమీ క్యాంప్ నిర్వహించినప్పుడు, 'ఆశా'లకు వారి ఎఎన్ఎమ్‌లు మరియు సీనియర్ సిబ్బంది (జిల్లా కుటుంబ నియంత్రణ అధికారితో సహా), ఆపరేషన్ కోసం వారి ప్రాంతం నుండి ఒకరు లేదా ఇద్దరు పురుషులను తీసుకురాలేక పోతే ఆరు నెలల పాటు రిజిస్టర్లను రాసే ప్రోత్సాహకం తగ్గిస్తామని చెప్పారు. కొన్ని ప్రదేశాలల్లో, 'ఆశా' యూనియన్ నిరసన తెలిపేంతవరకు ఈ బెదిరింపులు జరిగాయి. నేను (ఎఎన్ఎమ్‌లను పర్యవేక్షించే) లేడీ హెల్త్ విజిటర్ తో మాట్లాడినప్పుడు, ఆమె నాకు ఇలా చెప్పింది. 'ఒత్తిడి అంతా నోటి మాట ద్వారానే, వ్రాతపూర్వకంగా ఏమీ లేదు. కానీ ఈ విధంగానే పనులు జరుగుతాయి'.

*3. వాలంటీర్లుగా 'ఆశా'లు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థలో ఎటూకాని స్థానంలో ఉంచబడ్డారు!*

వాలంటీర్లుగా, 'ఆశా'లను ఆరోగ్యశాఖ సిబ్బందిలో ఒకరిగా పరిగణించరు. చెల్లింపుల ఆలస్యం గురించి వారు ఫిర్యాదు చేస్తే, వారు "సేవ" చేస్తున్నారని వారికి గుర్తు చేయబడుతుంది. వారు స్వచ్ఛంద సేవకులు కాబట్టి, చాలా మంది సిబ్బంది ఈ చెల్లింపులు 'ఆశా'లకు జీవనభృతి లేదా వేతనం కాదనీ, ఒక రకమైన చిన్న,

అదనపు నగదు అని భావిస్తారు. కానీ ముక్కుర్లో చాలా మంది 'ఆశా'లు పేదలు, ఎస్సీ లేదా ఓబిసి మహిళలు, తక్కువ విద్య కలిగిన వారు. వారి భర్తల నిరుద్యోగం లేదా వ్యసనం కారణంగా, వారు తమ కుటుంబాల అవసరాల కోసం కష్టపడుతున్నారు. కానీ ఈ 'అవసరం' సాకుతో రాజ్యం వారిని మరింత దోపిడీకి గురిచేస్తోంది.

'ఆశా'ల ఎటూకాని స్థితిని నేను ఇతర విధానాల్లో కూడా స్పష్టంగా గమనించాను. ఉదాహరణకు ఆసుపత్రిలో కానుపు కొరకు వచ్చిన మహిళలని 'ఆశా'లు తీసుకువచ్చినప్పుడు, ఆసుపత్రిలో విశ్రాంతి కొరకు లేదా నిద్రించడానికి 'ఆశా'లకు ఏ స్థలమూ కేటాయించలేదు. ఫలితంగా, వారు రోగితో పాటు లేదా రోగి మంచం పక్కన నేలపై పడుకోవాలి. కమల అనే పట్టణ 'ఆశా' నాతో మాట్లాడుతూ, వారిలో ఒక బృందం ఆసుపత్రిలో ఒక గదిని అడిగినప్పుడు, ఇన్‌ఛార్జ్ వారితో ఇలా అన్నారని చెప్పారు. "మీ కోసం మా ఆసుపత్రి గదుల్లో స్థలం ఉండకపోవచ్చు. కానీ మా హృదయాలలో మీ కోసం ఎల్లప్పుడూ స్థలం ఉంటుంది". 'ఆశా'ల ఎటూకాని స్థితి 'స్త్రీలు సేవాతత్పరుల'నే జండర్ పరమైన మూసపోసిన భావనను ఉపయోగించి సమర్థింపబడుతుంది. 'ఆశా'లు ఆరోగ్య శాఖ యొక్క "వెన్నెముక"అని సమావేశాలలో తరచుగా చెబుతారు. కానీ ఆరోగ్య శాఖ ఆచరణలో ఎక్కడా ఈ భావం కన్పించదు, పైగా 'స్వచ్ఛంద సేవ' అనే హోదా 'ఆశా'లు కార్మికులుగా తమ హక్కులను పొందడాన్ని కష్టతరం చేస్తుంది.

**ముగింపు**

ప్రోత్సాహక వాలంటీర్ అనే వృత్తి పరమైన గుర్తింపు 'ఆశా'ల పరిస్థితులను నిర్వచించి శాసిస్తోంది. వారందించే సంరక్షణా సేవని జండర్ పరమైన ఆచరణగా సహజీకరించి, వారి శ్రమ విలువని తగ్గించి ఆ తగ్గింపును సంస్థాగతీకరిస్తోంది. లింగ సమానత్వం, కార్మికుల హక్కులు, మన ప్రజలు పొందే సంరక్షణ నాణ్యత గురించి మనకు నిజంగా శ్రద్ధ ఉంటే వ్యవస్థాపరంగా 'కార్మికులనే గుర్తింపు తిరస్కరించబడిన' ఈ కార్మికుల మనం పట్టించుకు తీరాలి.

అనువాదం : **అపర్ణ తోట**


**అపర్ణ తోట** తెలుగు రచయిత్రి

**వృందా మార్వా** టెక్సాస్ విశ్వవిద్యాలయంలో సోషియాలజీలో పిహెచ్‌డీ చేస్తున్నారు

ఈమెయిల్ *vrinda.marwah@gmail.com*


*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*

**పదాల సూచిక :**

**1. అనధికారిక కార్మికులు** ప్రభుత్వం నుండి ఏ గుర్తింపు, ప్రయోజనాలు పొందని శ్రామికులు. పని గంటలు, ఒత్తిడి, ఓవర్ టైం, వేతనాలకు సంబంధించిన చట్టాలు గానీ, ఏ బీమాగానీ, రిటైర్ అయిన తరువాత పెన్షన్‌గానీ వీరికి లభించదు.

**2. అసంఘటిత కార్మికులు** ఏ యూనియన్‌లో భాగం కాని కార్మికులు, సంఘటిత సంప్రదింపులు జరపలేని వాళ్ళు.

**3. ఫోర్డిస్టు నమూనా** పెద్ద ఎత్తున, కేంద్రీకృతంగా, మెకానికల్‌గా జరిగే వస్తూత్పత్తి నిర్వహణ. దీనిని మొదట హెన్రీ ఫోర్డ్ అనే పారిశ్రామిక వేత్త ప్రవేశపెట్టారు.

4. **ఫ్లెక్సిబిలైజేషన్** అవసరం బట్టి కార్మికులని తీసుకుని, కావల్సిన పనివేళలు కల్పించి, పని కింత అని పరిహారం చెల్లించటం. ఎనిమిది గంటల పనికి శాశ్వత కార్మికులని తీసుకుని నెలవారి జీతం ఇవ్వకుండా.

**5. కుటుంబ వేతనం** మొదట్లో పురుషులని కుటుంబ పెద్దగా భావించి, వారి పనికి పరిహారంతోపాటు, కుటుంబాన్ని పోషించటాని క్కూడా సరిపోయే వేతనాన్ని వారికి చెల్లించే పద్ధతి.

**6. సబ్సిస్టెన్స్ ఎకానమీ** తమ జీవనం కోసం మాత్రమే ఉత్పత్తి చేసుకోవటం. దీనిలో డబ్బు కూడుకుని, పెట్టుబడిగా మారే అవకాశం ఉండదు.

**7. డెవలప్‌మెంట్ స్టేట్** ఆర్థిక రంగంలో చురుగ్గా పాత్ర తీసుకుని, ప్రణాళికలు, ఇతర విధానాల ద్వారా ఆర్థిక రంగాన్ని నడిపించే రాజ్యం. అభివృద్ధి చోదక రాజ్యం లేదా అభివృద్ధి శీల రాజ్యం.

**8. సోషల్ డెమోక్రసీ** ప్రపంచ యుద్ధాల తర్వాత, కార్మికులకి సామాజిక భద్రత అంటే ప్రభుత్వమే విద్య, ఆరోగ్యం, ఇతర సదుపాయాలు కల్పించి, వారి హక్కులను, ప్రయోజనాలకి గ్యారంటీ ఇచ్చిన ప్రజాస్వామ్య నమూనానే సామాజిక ప్రజాస్వామ్యం అంటారు. స్వీడన్ దీనికి అత్యున్నత ఉదాహరణ.

**9. కీన్స్ వాదం లేదా కీన్స్ విధానాలు** జాన్ మేనార్డ్ కీన్స్ 1929లో వచ్చిన ప్రపంచ ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ప్రతిపాదించిన మాక్రో ఎకనామిక్ విధానాలు. మాంద్యం సమయంలో ప్రభుత్వాలు మామూలు కంటే ఎక్కువగా డబ్బు ఖర్చు పెట్టి, ఉద్యోగాలు సృష్టించి, ప్రజల కొనుగోలు శక్తిని పెంచాలనేది ఈ ప్రతిపాదనల సారాంశం.

**10. గ్రేడెడ్ ఇనీక్వాలిటీ** దొంతరలుగా పేర్చబడిన భారతీయ కుల సమాజంలో ప్రతి కుల సమూహం తన కింది సమూహం కంటే తనని తాను ఎక్కువగా భావించుకుంటుందని అంబేద్కర్ చేసిన సూత్రీకరణ. 'శ్రేణీకరించిన అసమానత' ఎలీట్-సబాల్టర్న్ సమూహాలు రెండు స్పష్టమైన సమూహాలుగా ఏర్పడకుండా చేసి, కుల వ్యవస్థలో వివిధ సమూహాలకి అంతరాలతో కూడిన భాగస్వామ్యం కల్పిస్తుంది.

**11. సామాజిక పునరుత్పత్తి** కుటుంబ వ్యవస్థ ద్వారా మనుషులని శ్రామికులుగా సిద్ధపరిచే ప్రక్రియ. ఇంటిపని, పిల్లల సంరక్షణ, పెద్దవారిని, ఆరోగ్యం బాగాలేని వారిని చూసుకునే వేతనం లేని శ్రమ. ప్రపంచ వ్యాప్తంగా ఈ పనిని ప్రధానంగా స్త్రీలకే కేటాయించటం జరుగుతోంది. ఈ శ్రమ లేకుండా ఆర్థిక రంగం పని చెయ్యదు. ప్రభుత్వం తన విధానాల ద్వారా – మంచినీటి సదుపాయం నుండి పిల్లల సంరక్షణకి అంగన్వాడీల వరకు మహిళల శ్రమని తగ్గించ గలుగుతుంది. కానీ ప్రధానంగా స్త్రీలు మాత్రమే ఈ శ్రమ చెయ్యాలనే భావజాలాన్ని అందరితో పాటు పెంచి పోషిస్తుంది.

**12. పీస్ వర్క్** కేంద్రీకృత ఉత్పత్తి వ్యవస్థ ద్వారా కాక వికేంద్రీకృత వ్యవస్థ ద్వారా ఉత్పత్తిని నిర్వహించే వ్యవస్థీకృత ప్రక్రియ. పనిగంటల బట్టి కాక, పూర్తి చేసిన పని బట్టి చెల్లింపులు చేసే విధానం.

**13. లేబర్ మార్కెట్** వేతనం కోసం శ్రమించటానికి సిద్ధమయిన శ్రామికుల సప్లై, వారి కోసం ఉండే డిమాండు. ఈ రెండూ కలిసి వేతనాలని నిర్ణయిస్తాయని మెయిన్ స్ట్రీమ్ ఎకనామిక్స్ ప్రతిపాదిస్తుంది.

**14. పోస్ట్‌కొలోనియల్ స్టేట్ / వలస పాలనానంతర దేశాలు / రాజ్యాలు** ఐరోపా దేశాల సామ్రాజ్యవాద పాలన నుండి 20వ శతాబ్దంలో విడుదలయిన దేశాలు. ఈ పద బంధం, ఆయా దేశాలు పూర్తి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు సంపాదించుకోలేదని, పాలకులు మాత్రమే మారారు తప్ప, ప్రభుత్వ తీరు విధానాలు, సంస్కృతి, ఆర్థిక విధానాలు ఆయా ఆలోచనా రీతులు పెద్దగా మారలేదని ప్రతిపాదిస్తుంది.

**15. ఫినాన్షియలైజేషన్ లేదా ద్రవ్యీకరణ** మొత్తం ఆర్థిక రంగంలో బ్యాంకులు, ఇతర ద్రవ్య సంస్థలు, స్టాక్ మార్కెట్ల వాటా, ప్రభావం బాగా పెరగటం. 1980లలో మొదలయిన నయా ఉదారవాద విధానాల వల్ల ఈ పరిణామం జరిగిందని విశ్లేషకులు అంటారు.

**16. సంరక్షణ రంగం, సంరక్షణ కార్మికులు** ఇంటిపని, ఆరోగ్యం బాగాలేనివాళ్ళు, పిల్లలు, ముసలి వాళ్ళని వేతనం తీసుకొని చూసుకోవటాన్ని 'సంరక్షణ' పనులు లేదా కేర్ వర్క్ అంటారు. వేతనం లేకుండా ఇంట్లో స్త్రీలు చేసే ఈ పనులని ఇప్పుడు ఆర్థిక రంగంలో తక్కువ వేతనాలకి స్త్రీలని తీసుకుని చేయిస్తున్నారు.

**17. జస్ట్ ఇన్‌టైమ్ ప్రొడక్షన్** వస్తూత్పత్తి కోసం ఫ్యాక్టరీలు నడపకుండా, కావల్సిన భాగాలని గోడౌన్‌లలో పెట్టి, ఆర్డర్ వచ్చినపుడు వాటిని తయారుచేసి ఇవ్వడం. దీన్ని జపాన్‌లో ప్రవేశపెట్టారు.

# క్రమబద్ధమైన అనధికారిత: దుర్గాపూర్ కార్మిక నియమకాలు

**■ శ్రీమోయీ ఘోష్**

అది 2010 వేసవి కాలం, నేను నా పి.హెచ్.డి కోసం పశ్చిమ బెంగాల్‌లోని పారిశ్రామిక ప్రాంతమైన దుర్గాపూర్‌లో ఫీల్డ్ వర్క్ చేస్తున్న రోజులు. ఆ సమయంలో ఒకసారి నేను కొంతమంది మహిళా కార్మికులని కలవడం జరిగింది. మాటల్లో మీరేం పని చేస్తుంటారు అని వారిని అడిగాను. దానికి వాళ్ళు కోపంగా బ్రతకడానికి ప్రతి పేదవాడు చేసే పనే మేము చేస్తామని జవాబిచ్చారు. వారిచ్చిన సమాధానం అసంఘటిత కార్మిక వ్యవస్థలో ఉన్న కార్మికుల పరిస్థితిని తెలియచెప్పడమే కాకుండా క్రమబద్ధీకరణ లేని ఉపాధి, పేదరికం మరియు కనీస సౌకర్యాలను నోచుకోని వారి జీవితాల గురించి మరింతగా తెలుసుకోవలసిన అవసరాన్ని నాకు గుర్తు చేసింది. ఈ విషయం పైన 2009–2013 మధ్యలో నేను జరిపిన పరిశోధన ఆధారంగా ఈ వ్యాసం రాయడం జరిగింది. క్రమబద్ధీకరణ లేని ఉపాధిని కేవలం ఆర్థికపరమైన అంశంగానే కాకుండా దానిని రాజకీయ కోణం నుంచి కూడా చూడాలని నా అభిప్రాయం. కాబట్టి, దుర్గాపూర్‌లో విస్తరించిన పారిశ్రామికత మరియు అభివృద్ధి వెనుక వున్న రాజకీయాల వల్ల అక్కడి కార్మికులు ఎలాంటి న్యాయపరమైన హక్కులు లేక ఎంత వంచనకు గురవుతున్నారో తెలియ చెప్పడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**ముఖ్యాంశం**

డేవిడ్ హార్వే ప్రతిపాదించిన 'పెట్టుబడిదారీ సమీకరణ ద్వారా ఉద్వాసన' సిద్ధాంతాన్ని అనుసరించి, దుర్గాపూర్‌లో చిన్న పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇన్ఫార్మల్ వర్కర్స్ పరిస్థితి పట్ల అవగాహన పొందడంపై ఈ పేపర్ దృష్టి పెట్టింది. అధికారిక అనుమతులు పొందిన ఈ పరిశ్రమలకు అనధికారిక, అసంఘటిత కార్మిక వ్యవస్థ పెద్ద బలం. ఈ దురాచారాన్ని అప్పటి సిపిఐ(ఎం) ప్రభుత్వం వ్యవస్థీకరిస్తే దానిని శాశ్వతంగా ఆచరణలో పెట్టింది ప్రస్తుత తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం.

అనుమతి పొందిన పరిశ్రమలు తమ దగ్గర పని చేయడానికి కార్మికులను నియమించేటప్పుడు మాత్రం ఎలాంటి అధికారిక నియమాలు పాటించకుండా లేబర్ కాంట్రాక్టర్‌లపై ఆధారపడటం జరుగుతుంది. చిన్న మరియు సూక్ష్మ పరిశ్రమలను నడిపే పారిశ్రామికవేత్తలకు, ప్రబలమైన రాజకీయ పార్టీలకు చెందిన పరిశ్రమలకు, ట్రేడ్ యూనియన్లు, ఇంకా రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని తెలియచెప్పడమే నా థీసిస్ యొక్క ముఖ్య లక్ష్యం. కాబట్టి, వీళ్లంతా కలిసి ఉత్పత్తిని, కార్మికుల నియామకాలను, వారికిచ్చే వేతనాలను ఎలా నిర్ణయిస్తారో ముందు తెలుసుకోవాలనుకున్నాను. వీళ్లంతా కలిసికట్టుగా అల్లిన వలలో పేద కార్మికులు చాలా సులువుగా పడిపోతారు. ఇక్కడ స్థానిక అధికారులు అంటే నా ఉద్దేశ్యం దుర్గాపూర్ డిప్యూటీ లేబర్ కమీషనర్, పొలిటికల్ పార్టీ అంటే 2009లో నేను ఫీల్డ్ వర్క్ మొదలు పెట్టినప్పుడు అధికారంలో ఉన్న సిపిఐ(ఎం) దాని ట్రేడ్ యూనియన్‌లు, తర్వాత 2011లో అధికారంలోకి వచ్చిన త్రిణమూల్ కాంగ్రెస్ పార్టీ.

**ఈ వ్యాస సిద్ధాంతం**

మార్కెట్ వ్యవస్థను పటిష్టపరచడంలోను మరియు కార్మికులకు ఎలాంటి హక్కులు లేకుండా చేసి వారు రాజకీయ ప్రతిఘటనకు పాల్పడకుండా నిరోధించడంలో రాజ్యం పాత్ర తక్కువేమి కాదని వాదించిన కార్ల్ పోలాన్యి (1957) అభిప్రాయం ప్రకారం 19వ శతాబ్దంలో యూరప్‌లో మొదలైన సేచ్ఛా వాణిజ్య వ్యవస్థ రాజకీయ ఉద్దేశ్యంతో మొదలైనదే తప్ప సామాజికంగా ఏర్పడింది కాదు.

**దుర్గాపూర్ అసంఘటిత/అనధికారిక కార్మిక నియామక ప్రక్రియ**

అసంఘటిత వ్యవస్థలో కార్మికులుగా నియమింపబడాలంటే ఒకప్పుడు వ్యక్తిగత పరిచయాల ద్వారా అవకాశం పొందేవారని, తరువాత ఏర్పడిన లేబర్ కాంట్రాక్టర్ వ్యవస్థ కార్మిక నియామక ప్రక్రియను స్థిరీకరించిందని, కార్మిక జీవితాలపై విస్తృతంగా అధ్యయనం చేసిన యాన్ బ్రిమెన్ (1967) అభిప్రాయం నిజమేనని నా అధ్యయనంలో కూడా రుజువయ్యింది. ఈ వ్యక్తిగత పరిచయాల వ్యవస్థీకరణ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి కాంట్రాక్టర్లు; రెండు లేదా సి.పి.ఐ (ఎం) లేదా సి.ఐ.టి.యూ, వారి స్థానిక సంఘాల ద్వారా జరుగుతాయి. కార్మికుల నియామక ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా జరగడానికి రెండు పార్టీలు కలిసి పనిచేస్తాయి. అవి స్థానిక ప్రజలను నియమించేలా యాజమాన్యాలతో లాబీ చేస్తాయి.

గ్రామీణ ప్రాంతాలలో సిపిఐ (ఎం) జోనల్ కమిటీలు నైపుణ్యత ఆధారంగా కార్మికుల రిజిస్ట్రేషన్‌ను తమ పార్టీ ఆఫీస్‌లో జరిపిస్తాయి. ఇదో రకమైన ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్. ఇంకా చెప్పాలంటే ఒక లేబర్ కాంట్రాక్టర్ పనిని ఈ పార్టీ సంఘాలు చేస్తుంటాయి. లేబర్ కాంట్రాక్టర్లు నిపుణత కలిగిన కార్మికులను పక్క రాష్ట్రాలైనటువంటి బీహార్, ఝార్ఖండ్, ఒరిస్సా నుండి వలస తీసుకువస్తే ఈ సి.ఐ.టి.యు లాంటివి నిపుణతతో సంబంధం లేకుండా కార్మికులను సరఫరా చేస్తాయి. అంతేకాకుండా ఒక నైపుణ్యం కలిగిన కార్మికుణ్ని తీసుకుంటే ఖచ్చితంగా అతనికి సహాయకునిగా ఒక నైపుణ్యం లేని కార్మికున్ని తీసుకోవాలని నిబంధన పెడతాయి. నా ఫీల్డ్ వర్క్ (క్షేత్రస్థాయి అధ్యయనం)లో చాలామంది కార్మికులు పార్టీ తమకు చేసిన సహాయాన్ని గుర్తు చేసుకున్నారు. అలాగే పార్టీ కార్యకర్తలు యజమానులతో చర్చలు జరపడం, ఫోన్‌లో కార్మికులకు వారు పని చేయవలసిన విభాగాలకు చేరుకోవడానికి డైరెక్షన్స్ ఇవ్వడం నేను ప్రత్యక్షంగా చూసాను. ఇలా ఒక స్వేచ్ఛా పద్ధతిలో ఉండవలసిన మార్కెట్ వ్యవస్థ కాస్తా పార్టీ మరియు కార్మికుల మధ్య ఉన్న బంధంతో రక్షకులు– పీడితుల వ్యవస్థగా మారిపోవడం మనకు దుర్గాపూర్‌లో కనిపిస్తుంది.

స్థానిక అధికారుల అభిప్రాయం ప్రకారం మొత్తం నియామక వ్యవస్థ చాలా ప్రణాళికా బద్ధమైన కోటా పద్ధతి ద్వారా జరుగుతుంది. తమ తమ అభ్యర్థుల కొరకు ప్రతి పార్టీకి కొంత కోటా ఉంటుంది. అయితే ఈ కోటాలో రాష్ట్రంలో, అధికారంలో ఉన్న పార్టీకి సహజంగానే కొంత ఎక్కువ కేటాయించబడుతుంది. ఇంతకు ముందు సిపిఐ(ఎం) కి అయితే ఇప్పుడు టీ.ఎం.సికి ఎక్కువ కోటా ఉంది..

**కార్మిక నియామకాల్లో రాజకీయాలు**

తక్కువ జీతాలకే కార్మికులను పొందడానికి రాజకీయ పార్టీలు మరియు యాజమాన్యాలు కలిసికట్టుగా పనిచేసే దుర్గాపూర్‌లో నిర్బంధపు లేబర్ మార్కెట్‌ని సృష్టించారు. స్థానికులకు ఉద్యోగాలు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించే పార్టీలకు ఎన్నికలప్పుడు ఇది చాలా లాభదాయకంగా ఉంటుంది. వివరంగా చెప్పాలంటే ఒకప్పుడు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వపు నయా ఉదారవాద పారిశ్రామిక విధానానికి క్షేత్ర స్థాయిలో పట్టు కలిగిన సిపిఐ (ఎం) పార్టీ అందించిన తోడ్పాటు కొత్త విధానం రూపుదాల్చడంలో ముఖ్యపాత్ర పోషించింది. ఇది ఒక పక్క ఇన్ ఫార్మల్ లేబర్ మార్కెట్‌ని పెంచడంతో పాటు

మరోవైపు దీనివల్ల చాలామందికి జీవనాధారం కూడా కల్పించింది. ఇలా చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలలో కార్మిక నియామక వ్యవస్థను అడ్డు పెట్టుకుని రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే ఎన్నికలలో లాభపడుతున్నాయి.

దుర్గాపూర్‌లో అసంఘటిత కార్మికులు రెండు రకాలు – ఒకటి యూనియన్ వర్కర్లు అనగా యూనియన్ల ద్వారా సప్లై చేయబడిన వారు. ఇంకొకటి ఓనర్స్ వర్కర్స్ అంటే లేబర్ కాంట్రాక్టర్ ద్వారా వలస వచ్చిన కార్మికులు. వీరి మధ్య సంబంధాలు కొన్నిసార్లు క్లిష్టంగాను, కొన్నిసార్లు సహకార పూరితంగాను ఉంటాయి. కార్మికులు తమలో తాము ఒక క్రమపద్ధతిలో పనిని విభజించు కోవడంలో సహకరించుకున్నప్పటికీ ఇదే విషయం కొన్నిసార్లు వారి మధ్య ఉద్రిక్తతకు దారి తీస్తుంది. కొన్నిసార్లు కాంట్రాక్టర్లు యాజమాన్యంతో కుమ్ముక్కయి కార్మికుల సప్లైకి సంబంధించిన నియమాలని ఉల్లంఘించడం వల్ల సమస్యలు రావడమే కాక, 'ఇది ఒక అనారోగ్య పరిస్థితికి దారి తీస్తుందని, దానివల్ల పార్టీకి సంబంధించిన లేబర్ మార్కెట్ తమ చేయి జారిపోతుందని, దాని ప్రభావం నియామక వ్యవస్థపై పడుతుందనేది స్థానిక నాయకుల వాదన'. ఇదే విషయంపై ట్రేడ్ యూనియన్లు కాంట్రాక్టర్లతోను, యాజమాన్యంతోను గొడవ పడుతుంటాయి. ఈ సమస్యని యాజమాన్యం తనకు అనువుగా మలచుకొని కార్మికుల రాజకీయ చైతన్యాన్ని అణచివేసే ప్రయత్నాలు చేస్తోంది. ఒక పారిశ్రామిక వేత్త మాట్లాడుతూ, ఒక్కోసారి ఓనర్స్ వర్కర్స్‌ని తగ్గించి మరీ యూనియన్ వర్కర్లని పెంచాలని యూనియన్లు డిమాండ్ చేస్తూ రాజకీయ ఒత్తిడి తీసుకొస్తాయని, దీని ప్రభావం ఉత్పాదనతోపాటు ఓనర్స్ వర్కర్ల పనికి అంతరాయం కలగడము, యూనియన్ వర్కర్లు పనిలోకి రాకపోవడంతో, ఆ భారం వలస కార్మికులపై పడడంలాంటి అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. పార్టీ ద్వారా జరిగే నియామకాలను అడ్డుకునే క్రమంలో దుర్గాపూర్ పరిశ్రమలలో వలస కార్మికులకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. రాజకీయ ఆర్థిక భాగస్వాముల స్వార్థం వల్ల, స్థానిక మరియు వలస కార్మికుల మధ్య విభేదాలు చెలరేగి వారి జీవితాలు మరింత దుర్భరంగా తయారవడం మనం ఇక్కడ చూస్తాము.

ధనార్జనే ధ్యేయంగా జరిగే అనధికారిక కార్మిక నియామక ప్రక్రియకు దుర్గాపూర్ డిప్యూటీ లేబర్ కమీషనర్ ఆఫీస్ నుండి సంపూర్ణ మద్దతు లభిస్తుంది. పరిశ్రమల కార్యకలాపాలలో ఏ మాత్రం కలగ చేసుకోకుండా డి.ఎల్.సి అఫీస్ దుర్గాపూర్‌లోని శాంతి భద్రతలను, సుస్థిర ఉపాధి ప్రక్రియని పర్యవేక్షిస్తుంది. కాంట్రాక్ట్ లేబర్ చట్టం 1970, అంతర్రాష్ట్ర వలస చట్టం 1979 ప్రకారం ప్రతి కాంట్రాక్టు మరియు వలస కార్మికుల వివరాలు స్థానిక ప్రభుత్వ ఆఫీసుల్లో నమోదు చేయాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఈ చట్టాలను పట్టించుకున్న వాళ్ళు లేరు. యజమానులు, కాంట్రాక్టర్ల పేర్లు డి.ఎల్.సి ఆఫీస్‌లో నమోదు అయినప్పటికీ వారి పని తీరుని గమనించడంలో ఏ మాత్రం శ్రద్ధ చూపించకపోవడం ఇక్కడ ఉన్న పెద్ద సమస్య. ఉదాహరణకి స్థానిక పార్టీలు వాటికి చెందిన యూనియన్ లేబర్ కాంట్రాక్టర్ ఉండడంతో అనుమతులకు సంబంధించిన ప్రశ్నలు ఇక్కడ ఉత్పన్నం కావు. ఈ రకంగా ప్రభుత్వ బాధ్యతలపై రాజకీయ శక్తుల పెత్తనం కొనసాగుతుంది.

అదేవిధంగా, అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం ప్రకారం కార్మికులను ఒక రాష్ట్రం నుండి ఇంకొక రాష్ట్రానికి తీసుకువెళ్ళేటప్పుడు కాంట్రాక్టర్లు రెండు రాష్ట్రాల్లోనూ లైసెన్స్ తీసుకోవాలి. కానీ దుర్గాపూర్‌కి కార్మికులను సప్లై చేసేవారు రిజిస్టర్డ్ కాంట్రాక్టర్లు కారు. దానితో ఈ చట్టం కింద అందవలసిన పథకాలు ఏవి కూడా ఈ కార్మికులకు అందడం లేదు. ఇది కాంట్రాక్టర్ నుండి వర్కర్ వరకు ప్రతిదీ ఒక క్రమపద్ధతి లేని అనధికారిక, అసంఘటిత వ్యవస్థ. లైసెన్స్‌కు సంబంధించిన విషయాలను పూర్తిగా కార్మికుల స్వంత రాష్ట్రాలకే వదిలేసి, ఉన్న చట్టాలను అమలు పరచడంలో స్థానిక ప్రభుత్వాలు ఉదాసీనత కనపరచడంతో కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా తయారయింది.

**ముగింపు**

పరిశ్రమలలో అసంఘటిత కార్మికుల నియామకాలపై నేను చేసిన పరిశోధనలో తేలిందేమిటంటే ఇక్కడ ఉద్యోగం పొందాలంటే సామాజిక, రాజకీయ మార్గాలే దిక్కు. ఉద్యోగాల పేరుతో ఈ వ్యవస్థ కార్మికుల్ని బానిసలుగా మార్చేసింది. యాజమాన్యానికి, అధికారంలో ఉన్న పార్టీకి, అలాగే ప్రభుత్వానికి ఉన్న అవినాభావ సంబంధం ఈ వ్యవస్థను మరింత బలపడేటట్టు చేసింది. ఉద్యోగం దొరుకుతుందన్న ఆశతో ఎలాంటి షరతులకైనా ఒప్పుకుని ఈ సాలెగూడులో చిక్కుకుపోయిన కార్మికులు మరింత అణచివేతకు, దోపిడీకి గురవుతున్నారు. అయినప్పటికీ కార్మికులపై ఎక్కి సవారీ చేస్తూ ఆర్థికంగాను రాజకీయంగాను లాభపడటమే ఇక్కడ ముఖ్యం.


అనువాదం: **డి సుజాత**


**డి సుజాత** టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబయిలో అసిస్టెంట్ ప్రొఫెసర్

**శ్రీమోయీ ఘోష్** బెంగాల్‌లోని బరసాత్ గవర్నమెంట్ కాలేజీలో రాజనీతి శాస్త్రంలో అసిస్టెంట్ ప్రొఫెసర్

ఈమెయిల్ *ghoshsreemoyee11@gmail.com*

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*



# శక్తిని కోల్పోతున్నాయా లేక ప్రాసంగికతనా? నయా ఉదారవాదంలో కార్మిక సంఘాలు

■ దీపితా చక్రవర్తి

వర్ధమాన దేశాల్లో సంఘటిత, అసంఘటిత పారిశ్రామిక రంగాల పనితీరు గూర్చి సైద్ధాంతికంగానూ, ప్రత్యక్ష పరిశీలనల దృష్ట్యానూ చర్చించేటప్పుడు ప్రధానంగా ప్రస్తావించేది కార్మిక మార్కెట్ వ్యవస్థల గూర్చి. నయా ఉదారవాద యుగంలో, అంటే 'ధరలను క్రమబద్ధీకరించే' లక్ష్యంతో వర్ధమాన ప్రపంచ దేశాలలోని రక్షిత ఆర్థిక వ్యవస్థలను (అంతర్జాతీయ పోటీకి) తెరచిపెట్టే క్రమంలో వీటిపై మరింత శ్రద్ధ పెరిగింది. సమర్ధవంతమైన ఫలితాల రాబడికి కావలసిన కార్మిక సరళీకరణకు అడ్డం పడుతున్న ప్రధాన కార్మిక మార్కెట్ వ్యవస్థగా ట్రేడ్ యూనియనిజం కనిపిస్తోంది. ఇందుకు విరుద్ధంగా, ఉత్పత్తి నిర్వహణకు కావలసిన సరళీకరణకు ట్రేడ్ యూనియన్లు కొంతవరకు దోహదం చేస్తాయని క్షేత్రస్థాయి వాస్తవాలు సూచిస్తున్నాయి. 1985లో వచ్చిన ఒక ముఖ్యమైన పరిశోధనలో, ఉత్పత్తి నిర్వహణకు అంతిమంగా దోహదం చేసే పెట్టుబడిదారీ వ్యవస్థలలో ట్రేడ్ యూనియన్లను ఒక ప్రధాన వ్యవస్థగా, ఆలివర్ ఇ.విలియంసన్ గుర్తించాడు. 1940ల నాటికి రాస్, వ్యవస్థ లోపల వున్న వారి ప్రయోజనాలని బాగా పెంచడం ద్వారా తమ ప్రయోజనాలను పెంచుకునే సాధనాలుగా ట్రేడ్ యూనియన్లను సిద్ధాంతీకరించాడు. మిలిటెంట్ ట్రేడ్ యూనియనిజానికే కాక, 34 సంవత్సరాల సుదీర్ఘ లెఫ్ట్ పరిపాలనకు (1977–2011) పేరొందిన పశ్చిమబెంగాల్ నేపథ్యంలో కొన్ని క్షేత్రస్థాయి ప్రశ్నలను పరిశీలించడం ఈ వ్యాసం ఉద్దేశ్యం.

2009లో నిర్వహించిన ఒక సర్వేలో సేకరించిన సమాచారం ఈ వ్యాసానికి ఆధారం. సీనియర్ ప్రభుత్వాధికారులు, యాజమాన్యాలు, వివిధ పార్టీలకు అనుబంధంగా ఉన్న రాష్ట్రస్థాయి, యూనిట్ స్థాయి ట్రేడ్ యూనియన్ నాయకులను, వివిధ రకాల పారిశ్రామిక సంస్థలకు చెందిన కార్మికులను, ఈ సర్వేలో ఇంటర్వ్యూ చేశాం. ఇంకా, వివిధ రంగాలు, వివిధ పరిమాణాలకు చెందిన 13 సంస్థల సమగ్ర సమాచారాన్ని సేకరించాం.

**పశ్చిమ బెంగాల్లో ఉత్పత్తి రంగం పతనావస్థ**

స్వాతంత్ర్యం వచ్చేనాటికి పారిశ్రామికంగా అగ్రగామిగా ఉన్న పశ్చిమ బెంగాల్ 1947లో బ్రిటిష్ ఇండియా విభజన తరువాత, తూర్పు, పశ్చిమ బెంగాల్ మధ్య జరిగిన జనాభా స్థాన మార్పులు (డిస్‌ప్లేస్‌మెంట్) వ్యాపార సంబంధాలు దెబ్బతిన్న కారణంగా, పతనమవడం మొదలైంది. ప్రధాన పరిశ్రమలైన జనపనార, తేయాకు బాగా దెబ్బతిన్నాయి. స్వాతంత్ర్యం తరువాత రెండు రకాల కేంద్ర ప్రభుత్వ విధానాలు – బొగ్గు, ఉక్కుల రవాణా సుంకాలను సమానం చేయడం, దిగుమతులకు ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం – బెంగాల్ పారిశ్రామిక రంగాన్ని చావు దెబ్బతీశాయి. దీనికి తోడు కాంగ్రెస్ పరిపాలనతో వామపక్ష కూటమి ప్రభుత్వం కొనసాగించిన ధిక్కార విధానం కారణంగా, వాస్తవిక దృష్టితో తెలివిగా లైసెన్సులు, పరిశ్రమలకు పెట్టుబడులు సాధించుకోవలేకపోవడం వల్ల పరిస్థితి మరింత దిగజారింది. ఎదుగుదలకు ఒక అడ్డంకి వామపక్ష మేధావుల మద్దతుతో ఎదిగిన రాడికల్ ట్రేడ్ యూనియనిజమైతే, మరొకటి 1960లలో కేంద్రప్రభుత్వం అవలంబించిన మౌలిక వనరుల రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ విధానం. ఈ పరిస్థితుల్లో, పశ్చిమబెంగాల్ ఉత్పత్తి సంస్థలు, ముఖ్యంగా చిన్న సంస్థలు తక్కువ ఉత్పాదన–తక్కువ వేతనాలు అనే చట్రానికి పరిమితమయి పోయాయి. భారీ వ్యాపారవేత్తలు ఉత్పత్తిని చిన్నకారు యూనిట్లకు, అసంఘటిత రంగానికి కాంట్రాక్టుకివ్వడం మొదలైంది. ఈ విధంగా వారు మిలిటెంట్ ట్రేడ్ యూనియన్ల బెడదను తప్పించుకోవడంతో పాటు చిన్న సంస్థల లాభాలను కూడా గుంజుకోగలిగారు. ఫలితంగా, రాష్ట్రంలో అసంఘటిత ఉత్పత్తిరంగం ఒక ముఖ్యమైన రంగంగా అవతరించింది. ఈ పారిశ్రామిక పతనం నేపథ్యంగా, 1977లో వామపక్ష కూటమి ప్రభుత్వమేర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదలై, 1973 పంచాయత్‌రాజ్ చట్టం దన్ను పొందిన ముఖ్యమైన వ్యవసాయరంగ సంస్కరణలను అది కొనసాగించింది.

సుదీర్ఘ నిర్లక్ష్యం కారణంగా, 1980ల చివరికి భారీ సంఘటిత ఉత్పత్తి రంగం ఇంచుమించు స్తబ్ధతకి చేరుకుంది. సంప్రదాయ పరిశ్రమలు కూడా పతనమవుతూండడంతో ఉద్యోగాలు గణనీయంగా పడిపోయాయి. సంఘటిత రంగంలో కొత్త పరిశ్రమలకు అవకాశాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు శూన్యమయ్యాయి. ఫలితంగా, పారిశ్రామికుల చేతిలో కార్మికులు బలహీనపడడం, తద్వారా 1980లలో ఇంతకు ముందు ఊహించని విధంగా ట్రేడ్ యూనియన్లు వారి షరతులకు తలొగ్గవలసి రావడం జరిగిందని ఒక వాదన వుంది (దాస్ గుప్తా 1998). వామపక్ష ప్రభుత్వం అధికారంలో కొచ్చాక సమ్మెలు గణనీయంగా పడిపోవడం, లాకౌట్లు విపరీతంగా పెరిగిపోవడం, అదే సమయంలో ఇతర అన్ని రాష్ట్రాల్లో ఈ రెండూ తగ్గుముఖం పట్టడం, ఇక్కడ కార్మికులు బలహీనపడ్డారన్న వాదనకు బలాన్నిస్తోంది. రెండో విషయం, పట్టణ ప్రాంతాల్లో వామపక్షకూటమి వరుస అపజయాల నెదుర్కోవడం, దానికి పట్టణప్రాంత మధ్యతరగతిలో, ముఖ్యంగా పరిశ్రమల్లో ఉద్యోగాలపై ఆశ పెట్టుకున్న విద్యావంతులైన యువతలో, పట్టుపోవడాన్ని సూచించింది(చక్రబొర్తి 2008). ఈ సందర్భంలో అప్పటికే సరళీకృతమవుతున్న భారతదేశ ఆర్థిక వ్యవస్థ మరింత స్పష్టమైన మలుపు తీసుకుని ఒక కొత్త స్థూల ఆర్థిక హయాముకు నాంది పలికింది. లైసెన్సు రాజ్‌ను రద్దు చేసి, ప్రపంచ మార్కెట్‌కు భారతదేశ ఆర్థిక వ్యవస్థ గేట్లను బార్లా తెరిచింది. అప్పటికి రాష్ట్రాన్ని పాలిస్తున్న పార్టీలో మొదట్లో కొంత తడబాటు కనిపించినా, పార్టీలోని మితవాద పంథాకు, రాష్ట్రానికి, పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి (ఎ) లైసెన్సుల రద్దు, (బి) రవాణా సుంకాల సరళీకరణలో కొన్ని ప్రయోజనాలు కనిపించాయి. ప్రైవేటు పెట్టుబడికి సంబంధించి తమ పూర్వ విరోధాన్ని మరిచిపోయి, రాష్ట్రం తన కొత్త పారిశ్రామిక విధానం (1994) ద్వారా విదేశీ సాంకేతికతకు, పెట్టుబడులకు స్వాగతం పలికింది. విధానపరమైన చర్యల్లో ఎన్ని మార్పులొచ్చినా, కార్మికవర్గం ఎంత నీరసపడ్డా, సంఘటిత ఉత్పత్తి రంగంలో చెప్పుకోదగ్గ మెరుగుదల చోటు చేసుకోలేదు.

**వ్యవస్థాగత ఇబ్బంది: ట్రేడ్ యూనియన్ ప్రవర్తన**

భారీ పరిశ్రమల అనుత్పాదకత క్రమేపీ అసంఘటిత పారిశ్రామిక రంగానికి దారి తీయడంలో 'బలహీనపడ్డ కార్మికవర్గం' పాత్ర ఏంత? అహసాన్ మొ॥ వారు (2008) దేశవ్యాప్తంగా సంఘటిత ఉత్పత్తి రంగంలో కాంట్రాక్ట్ కార్మికులను వినియోగించడం పెరుగుతోందని తేల్చారు. పశ్చిమ బెంగాల్ ఇందుకు మినహాయింపు కాదు. ప్రస్తుత అధ్యయనానికి ఎంచుకున్న పారిశ్రామిక సంస్థల్లో అత్యధిక భాగం కాంట్రాక్ట్ కార్మికులే వున్నారు. అంతేకాక, ఈ సంస్థల్లో రెండేళ్ళ అతితక్కువ వ్యవధిలో వీరి శాతం గణనీయంగా పెరిగిపోయింది. కాంట్రాక్టు

కార్మికులని అత్యధికంగా పెంచుకున్న ఒక సంస్థ యాజమాన్యం చెప్పినదాన్నిబట్టి, 2007-08, 2008-09 సంవత్సరాల్లో, రెగ్యులర్ ఉద్యోగుల్లో ఎక్కువ మంది స్వచ్ఛంద పదవీ విరమణ పథకం క్రింద పదవీ విరమణ చేశారు. ఉత్పత్తి బాధ్యతలను తక్కువ వేతనాలకు సులభంగా దొరికే కాంట్రాక్ట్/క్యాజువల్ కార్మికులకు బదిలీ చేయడం సులువైపోవడం వల్ల, ఈ రెగ్యులర్ ఉద్యోగ ఖాళీలను యాజమాన్యాలు ఇంక భర్తీ చేయలేదు. సంఘటిత పారిశ్రామిక యూనిట్లలో శాశ్వత ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయకపోవడం 1980ల నుంచే మొదలైందని కొన్ని పాత సంస్థల కార్మికులు మా సర్వేలో తెలిపారు. ఆ తరువాత, దిగువ శ్రామిక వర్గ జాబితాలో కొత్తగా సృష్టించిన రెగ్యులర్ ఉద్యోగాలు ఇంచుమించు లేనేలేవు. ముఖ్యంగా జనపనార వంటి వివిధ పారిశ్రామిక రంగాల్లో తరచుగా లాకౌట్లు ప్రకటిస్తూండడం కూడా రాష్ట్రంలో సంఘటిత కార్మికరంగ పతనానికి దారి తీసింది.

భారీ, మధ్యతరహా పారిశ్రామిక సంస్థలు తమ ఉత్పత్తిని ఎక్కువగా కాంట్రాక్టుకిస్తున్నాయని మా క్షేత్రస్థాయి సమాచారం కూడా సూచిస్తోంది. కలకత్తా కేంద్రంగా పనిచేస్తూ అధిక లాభాలార్జిస్తున్న ఒక సంప్రదాయ బెంగాలీ చేనేత వస్త్రాల తయారీ, ఎగుమతి మరియు అమ్మకం సంస్థ ఇందుకు ఒక ఉదాహరణ. ఈ సంస్థ ఉత్పత్తుల్లో 60 శాతం బెంగాల్లోని వివిధ గ్రామీణ ప్రాంతాల నేత కార్మికుల నుంచి సేకరించినవే. సంప్రదాయ చేనేత రంగంలో ఉత్పత్తిని కాంట్రాక్టుకి ఇవ్వడం మిగతా రంగాలతో పోలిస్తే సులువు, ఎందుకంటే బెంగాల్ మారుమూల ప్రాంతాల్లో సంప్రదాయ చేనేత కార్మికులు విరివిగా ఉన్నారు. మరి ఈ ఉత్పత్తి నిర్వహణా విధానానికి ట్రేడ్ యూనియన్లు ఎలా స్పందిస్తున్నాయి, మరీ ముఖ్యంగా కలకత్తా కేంద్రంగా పనిచేస్తున్న సంస్థలో, అన్న ప్రశ్నకు - 1997 నుండీ ట్రేడ్ యూనియన్లని దూరం పెట్టగలిగామని, ముఖ్యంగా రెగ్యులర్ కార్మికుల సంఖ్యను వీలైనంత తగ్గించుకోవడం వల్ల ఇది సాధ్యమయిందని ఆ యాజమాన్యం బదులిచ్చింది. పాలకపార్టీ విధానంలో 1990ల మధ్య నుండీ వచ్చిన మార్పు వల్ల దాని అనుబంధ ట్రేడ్ యూనియన్‌కు ప్రభుత్వ మద్దతు లభించకపోవడం కూడా ఇందుకు తోడ్పడింది. ఉత్పత్తిలో కొంత భాగాన్ని పారిశ్రామిక సంస్థలకు కాంట్రాక్టుకివ్వడం బెంగాల్ పారిశ్రామిక రంగానికి కొత్త కాకపోయినప్పటికీ, ప్రధానంగా ఎగుమతుల నిమిత్తం, క్రమపద్ధతిలో, భారీ ఎత్తున సంప్రదాయ బెంగాలీ చేనేతలను కొనుగోలు చేయడం 1990లలో సరళీకరణ విధానాలతో వచ్చిన పరిణామం. పైగా 1994-95 తరువాత రోడ్లు మెరుగుపడడంతో సుదూర గ్రామాలు కూడా అందుబాటులోకొచ్చి, ఇంతకు ముందు సాధ్యంకానివి ఇప్పుడు సాధ్యమయ్యాయి.

ఈ వాస్తవాలను ట్రేడ్ యూనియన్లు ఎలా చూస్తాయి? కాంట్రాక్టు కార్మికులు కూడా అవే యూనియన్లలో సభ్యులవడం వల్ల ఈ ప్రశ్నకు ప్రాసంగిత వస్తుంది. తమ ఉత్పాదక సామర్థ్యాన్ని నూరుశాతం వాడుకోకుండా పెద్ద పారిశ్రామిక సంస్థలు ఉత్పత్తిలో గణనీయ భాగాన్ని కాంట్రాక్టుకివ్వడం ఎలా సాధ్యమయింది? దీనర్థం ఈ పరిస్థితిని ఆమోదించే నిస్సహాయతలో కార్మిక యూనియన్లు కూరుకుపోయాయనా? 1994-95 తరువాత వ్యాపారానికి అనువుగా రాష్ట్ర వైఖరిలో వచ్చిన మార్పు ఇందుకు దోహదపడినట్టు కనిపిస్తుంది. కానీ, పారిశ్రామిక సంస్థలు తమకున్న ఉత్పాదక సామర్థ్యాన్ని ఉపయోగించుకొని రెగ్యులర్ కార్మికులతో పనిచేయించుకోవడం ఎందుకు సాధ్యం కాలేదు? మౌలిక వసతుల కొరతే ఫలితాన్ని నిర్దేశిస్తుందా లేక వేరే ఏదైనా కారణముందా? రాష్ట్రంలో పరిశ్రమల నియంత్రణకు సంబంధించి అన్ని అంశాలూ మెరుగయినా, పని దగ్గర కార్మికుల మొండితనం సమస్యలో మాత్రం మార్పు లేదని పెద్ద పారిశ్రామిక సంస్థల అభిప్రాయం. ఇది ఆసక్తికరమయిన అంశం. ఎందుకంటే, ఇ.ఎ.రామస్వామి మాటల్లో:

"రాజకీయ అధికారం చేజిక్కించుకోవడంతో మార్క్సిస్టు యూనియన్లలో సమూలంగా మార్పు తేవాలనే ఇచ్ఛా అవశేషాలు కూడా అంతరించినట్టు కనిపిస్తుంది. బెంగాల్లో సి.ఐ.టి.యు అయితే రాష్ట్రంలో వారి పార్టీ అధికారంలోకి వచ్చిన 1977 నుండీ పూర్తిగా రూపాంతరం చెందింది. 1980లో జరిగిన ఒక యూనియన్ సదస్సులో మితవాదం, బాధ్యతల ప్రాతిపదికగా రూపొందిన కొత్త విధానానికి పార్టీ, యూనియన్ సిద్ధాంతవేత్తల నుండి అధికారికంగా ఆశీస్సులు లభించాయి. అరవైలలో, డెబ్భైలలో మేనేజర్లను భయభ్రాంతులను చేసిన 'ఘెరావ్' మచ్చుకు కూడా కనిపించదు. సమ్మెల సంఖ్య బాగా పడిపోయింది" (రామస్వామి 1999:5).

యాజమాన్యాలు చెప్పేదాన్ని బట్టి, చర్చల సందర్భంలో కార్మిక సంఘాల మిలిటెన్సీ కూడా గణనీయంగా తగ్గింది. ఇందుకు కారణం రాష్ట్ర నాయకత్వం నుంచి యాజమాన్యాలపై వత్తిడి తగ్గిపోవడమే. అయినా యూనియన్లు వేతనాలు పెంచమని మొండిగా పట్టుపడుతూనే వుండేవి. అయితే ఖాళీ అయిన ఉద్యోగాలు భర్తీ చేయమని, కాంట్రాక్టు కార్మికులను పర్మనెంటు చేయమని వత్తిడి చేసేవి కావు. స్పష్టంగా, కార్మిక సంఘాల ప్రాధాన్యత సంస్థలోని శాశ్వత కార్మికుల ప్రయోజనాలే, తాత్కాలిక కార్మికులవి కావు.

ముఖ్యంగా ప్రైవేటు పారిశ్రామిక సంస్థల్లో పనిభారం ఏమాత్రం పెరిగినా, తాత్కాలికంగానైనా, అత్యవసర పరిస్థితుల్లోనైనా, సంఘాల నాయకులు నిరసించేవారని యాజమాన్యాలు చెబుతాయి. శాశ్వత కార్మికులకు, యాజమాన్యానికి మధ్య ఉండే ఉద్యోగ ఒప్పందాలు ఎప్పుడూ లిఖితపూర్వకంగానే ఉన్నా, యాజమాన్యం అందులోని షరతులను తు.చ.తప్పకుండా అమలుపరిచే పరిస్థితిలో ఉండదు. ఈ బలహీనతను తరచూ పర్మనెంటు కార్మికులు వాడుకునేవారు. తత్ఫలితంగా, ఇటువంటి పర్మనెంటు కార్మికులను నమ్ముకుని పెద్ద ఎత్తున సాంకేతిక ఆధునికీకరణ చేపట్టే ధైర్యం చేయలేకపోయామని పెద్ద పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలన్నీ చెప్పాయి. 1994-95 పారిశ్రామిక విధానం తరువాత వచ్చిన మార్పుల దృష్ట్యా, పాలకపార్టీ అనుబంధ ట్రేడ్ యూనియన్ సి.ఐ.టి.యులోని సీనియర్ నాయకులు పర్మనెంట్ కార్మికుల పనితీరును మెరుగుపరిచే ప్రయత్నం చేశారు. కానీ, పర్మనెంట్ కార్మికులు పనిచేయకపోవడానికి, ఓవర్ టైం చెల్లిస్తేనే పనిచేయడానికీ, అలవడ్డారని యాజమాన్యాల భావన. బెంగాల్లో 'ఓవర్ టైం' అంటే అదనపు గంటలు లేకుండానే అదనపు చెల్లింపు అని అర్థం. 1994-95 తరువాత కాలంలో పని ప్రదేశాల్లో యాజమాన్యాలకు సహకరించమని రాష్ట్రస్థాయి నాయకత్వం క్రింది స్థాయి బాధ్యులను, యూనిట్ స్థాయి నాయకత్వాన్నీ కోరినప్పటికీ, కార్మికులు ఈ ప్రయత్నాలను లోపాయికారీగా ప్రతిఘటిస్తూనే వున్నారు. తరువాతి సంవత్సరాల్లో, పర్మనెంట్ కార్మికుల్లో గైర్హాజరీ గణనీయంగా పెరిగిపోవడాన్ని యాజమాన్యాలు నమోదుచేశాయి. పార్టీ ఆదేశించినంత మాత్రాన పనిచేయకుండా వేతనాలు తీసుకోవడానికి అలవడిన పర్మనెంట్ కార్మికులు నిజాయితీగా పనిచేయడం మొదలుపెడతారా?

ఇక్కడ ఇంకో విషయం చెప్పుకోవాలి. కొన్ని వాణిజ్య సంఘాలు చెప్పినదాన్నిబట్టి, వామపక్ష వైఖరిలో మార్పువచ్చిన తరువాత కూడా, కార్మికవర్గం ఒక కొత్తరకమైన, ప్రత్యక్షంగా కనిపించని వత్తిడి మొదలుపెట్టింది.'చేసేపని నెమ్మదిగా చెయ్యి' అనేది వారి కొత్త నినాదం అయి సెలవు తిరస్కరించే అధికారం కూడా తరచూ యాజమాన్యాలకు లేకుండా పోయింది. ఈ సర్వేలో పాల్గొన్న పెద్ద పారిశ్రామిక సంస్థలన్నీ వేరే రాష్ట్రాల్లో యూనిట్లు పెట్టేసుకోవడమో, పెట్టుకునే ప్రయత్నంలో ఉండడమో చేశాయని ఇక్కడ మనం గుర్తుంచుకోవాలి. కార్మికుల అప్రకటిత వ్యతిరేకత వల్ల సాంకేతికంగా ఉన్నతస్థాయికి చెందిన యూనిట్లను రాష్ట్రంలో నెలకొల్పడం లాభదాయకం కాదని వారి భావన. దానికన్నా, తక్కువస్థాయి సాంకేతికత, ఎక్కువ శ్రమ అవసరమైన పని కొనసాగించి, ఉత్పత్తిని అసంఘటిత రంగానికి కాంట్రాక్టుకివ్వడం, అవసరమైతే తక్కువ వేతనాలకు కాంట్రాక్టు కార్మికులను తీసుకోవడం సులభమైన పనిగా వారికి తోచింది.

కాంట్రాక్టు కార్మికులను తీసుకోవడం ద్వారానూ, పాక్షికంగా ఉత్పత్తిని అసంఘటిత రంగానికి కాంట్రాక్టుకివ్వడం ద్వారానూ, యాజమాన్యాలు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోగలుగుతుంటే, వారి నుంచి ఎక్కువ వేతనాలు రాబట్టవచ్చని సంస్థస్థాయి శాశ్వత కార్మికులు, యూనిట్ స్థాయి నాయకులు అర్థం చేసుకున్నారు. ఈ వాస్తవానికి "బలహీనమైన సంఘటిత కార్మికులు" అనే వాదనతో ప్రత్యక్ష వైరుధ్యమొస్తుంది. ఇంకా చూస్తే, సంస్థలో ఉద్యోగం పర్మనెంట్ కావాలంటే కొన్నాళ్ళు తాత్కాలిక ప్రాతిపదికపై పని చేయాల్సి ఉంటుంది. ఈ

ఉద్యోగ ధృవీకరణలో ట్రేడ్ యూనియన్లు కీలకపాత్ర పోషిస్తాయి. కార్మికులు కాంట్రాక్టు/క్యాజువల్ ప్రాతిపదికపై ఉన్నంత కాలం తమ చెప్పు చేతుల్లో ఉంటారని యూనియన్ నాయకులు అర్థం చేసుకున్నారని యాజమాన్యాలు చెబుతాయి. దీనికి సంబంధించి ఇంకో విషయం చెప్పుకోవాలి. పశ్చిమబెంగాల్ ప్రజలు చాలా మౌలికంగా తమ ఉపాధికోసం రాజకీయ పార్టీలమీద ఆధారపడతారని సర్కార్ (2006) ప్రతిపాదించారు. వారి నిస్సహాయతే వారినీ స్థితికి నెడుతుంది. కొన్నిచోట్ల పర్మనెంట్ కార్మికులు (యూనిట్ స్థాయి నాయకులు కూడా) తమ పనిని కాంట్రాక్టుకిచ్చి, పనిగంటల్లోనే వేరే వ్యాపారం చేసుకుని, తమ యూనియన్ రక్షణ పొందుతూ ఉంటారని ఒక స్వతంత్ర యూనియన్ నాయకుడు వెల్లడించారు. కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులు కూడా యూనియన్ సభ్యులే కాబట్టి యూనియన్ సభ్యత్వం, సభ్యత్వ రుసుము లాంటివి యూనియన్‌కి సమస్యే కావు. ఎందుకంటే, కాంట్రాక్టు పద్ధతి కొనసాగుతూనే వుంటుంది కాబట్టి.

మరి కాంట్రాక్ట్ కార్మికుల వైపు నుండి ఈ వ్యవస్థకు సమర్థనేమిటి? మార్కెట్ పట్ల వాళ్ళ వైఖరి ఏమైనప్పటికీ, పెద్ద పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలు చెప్పేదేమంటే, కాంట్రాక్ట్ కార్మికులను వాళ్ళు నేరుగా పనిలోకి తీసుకోలేరు. యూనియన్ల ద్వారానే వారికి కాంట్రాక్టు కార్మికులు దొరుకుతారు. కొంతమంది స్వతంత్ర యూనియన్ నాయకులు, మాజీ ఉద్యోగులు చెప్పినదాన్ని బట్టి, కార్మికుల కాంట్రాక్టు పొడిగింపులో కూడా యూనియన్ల పాత్ర వుంటుంది. ఈ ప్రత్యక్ష కారణాలు కాకుండా, మరొక సూక్ష్మమైన కారణం కూడా వుంది. స్థానిక రాజకీయ పార్టీతో సన్నిహితంగా ఉండే ట్రేడ్ యూనియన్ నాయకులు పని కోల్పోయిన కార్మికులకు రిక్షానో, ఆటోరిక్షా లైసెన్సో, నిర్మాణ రంగంలో ఏదైనా పనో ఇప్పిస్తారు. ముఖ్యంగా నిరుద్యోగ కార్మికుల సంఖ్య పెరగడంతో ఈ పోషకులు–పోషితులు సంబంధం బలపడింది. అసంఘటిత రంగమైన నిర్మాణ రంగంలో సి.ఐ.టి.యుకు అత్యధిక సభ్యత్వం ఉండడం యాదృచ్ఛికం కాదు. ఈ పోషకులు–పోషితులు సంబంధం ఇటీవల వరకు సి.పి.ఐ.(ఎం)ను గ్రామీణ బెంగాల్‌లో ఏ విధంగా బలంగా ఉంచిందో బర్దన్ మొదలగువారు (2009) చెప్పారు.

అయితే, ఒక మౌలిక ప్రశ్న మిగిలిపోతుంది: అత్యంత కేంద్రీకృత సి.పి.ఐ(ఎం) లాంటి పార్టీగానీ, దాని ప్రజా సంస్థ అయిన సి.ఐ.టి.యు గానీ తమ యూనిట్ స్థాయి బాధ్యులను ఇంతకాలం ఇలా ఎలా ప్రవర్తించ నిచ్చారు? మొదటిగా, యూనియన్ నాయకుల మద్దతు, ఫలితంగా ఓటుబ్యాంక్ కోల్పోతామన్న భయంతో సంస్థ స్థాయి యూనిట్లపై వత్తిడిపెట్టరు. తమ ఓటర్ల మద్దతుని పణంగా పెట్టే పరిస్థితిలో సిపిఐ(ఎం) లేదని ఇటీవలి రాజకీయ పరిణామాలు నిర్ధారించాయి. రెండోకారణం కూడా వుంది. భారీ ఎత్తున రాష్ట్రంలో సంఘటిత కార్మికుల ఉద్యోగాలు పోవడం, పెరుగుతున్న లాకౌట్ల కారణంగా కార్మికుల్లో సి.ఐ.టి.యు నాయకత్వం పట్ల అపనమ్మకం ఏర్పడిందని రిటైరైన ఒక సంస్థ పర్సనల్ మేనేజర్ చెప్పారు. 1990ల మధ్య నుండి వామపక్ష కూటమికి ప్రధాన ప్రతిపక్షమైన తృణమూల్ కాంగ్రెస్ (టి.ఎం.సి)కి పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెంటిలోనూ ప్రాబల్యం ఎందుకు పెరుగుతుందో దీనివల్ల కొంత అర్థమవుతుంది.

టి.ఎం.సి 2011లో అధికారంలోకి వచ్చింది. దురదృష్టవశాత్తూ, పారిశ్రామిక రంగంలో ఏమంత మార్పురాలేదు. పెద్ద యూనియన్లు చాలామటుకు ప్రాధాన్యత కోల్పోయేసరికి, పరిశ్రమల వారీగా సిండికేట్లు ఏర్పడ్డాయి. వీటిని పాలకపార్టీ ప్రాపకంతో స్థానిక గూండాలు నడుపుతూ మామూళ్ళు వసూలు చేస్తున్నారు. గత కొన్నేళ్ళుగా ఉత్పత్తి రంగంలోకి కొత్త పెట్టుబడులేమీ రాలేదు.


అనువాదం: **పి చంద్రశేఖర్**


**పి చంద్రశేఖర్** గీతమ్ యూనివర్సిటీలో ఇంగ్లీషు డిపార్ట్‌మెంట్‌లో అసెసియేట్ ప్రొఫెసర్

**దీపితా చక్రవర్తి** ఢిల్లీలోని అంబేద్కర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్

ఈ మెయిల్ *deepita@gmail.com*

*ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.*



# తమిళనాడులో అనధికారిక కార్మికుల పోరాటాలు: బాధ్యులెవరు?

■ కె కల్పన

1980ల నుండి నయా ఉదారవాద పెట్టుబడిదారి వ్యవస్థలో, రాజ్యం, పెట్టుబడి, శ్రమల మధ్య మారుతున్న సంబంధాలను అర్థం చేసుకోవటానికి పరిశోధకులు ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామిక ఉత్పత్తిలో, ఫోర్డిస్టు నమూనా బదులుగా, ఫోర్డిస్టు అనంతర నమూనాను స్వీకరించాయి. ఈ ప్రక్రియలో, ఉత్పత్తి సాధనాల యజమానులైన వర్గానికి, అది లేని వర్గానికీ మధ్య రాజ్యం మధ్యవర్తిగా ఏర్పాటు చేసే సామాజిక ఒప్పందాలకు అంతరాయం ఏర్పడింది. ప్రపంచ వ్యాప్తంగా, కార్మిక సంబంధాలు అసంఘటితీకృతం కావడం వలన శ్రామిక మార్కెట్‌లు చట్టబద్ధంగా నియంత్రించబడటానికి బదులు, మార్కెట్ నియంత్రణకు గురికావటం; కంపెనీలు పనులను సబ్ కాంట్రాక్టింగ్ పద్ధతిలోగానీ, తాత్కాలిక, స్వల్పకాలిక (పార్ట్‌టైమ్) కార్మికులను, గృహ కార్మికులను నియమించటం ద్వారా గానీ, సరళీకరణను కోరుకోవటం గురించి పరిశోధకులు రాస్తూనే ఉన్నారు (స్టాండింగ్ 1999, ప్రూగ్ 1999). భారతదేశంలో జరిగిన అధ్యయనాలు కూడా అధికారం, గుర్తింపు ఉన్న సంఘటిత రంగం నుంచి ఉపాధి అవకాశాలు ఏగుర్తింపు లేని అసంఘటిత రంగానికీ, సంఘటిత రంగంలో అంతర్లీనంగా ఉండే అసంఘటిత రంగానికి, ఫ్యాక్టరీల ఆధారంగా జరిగే ఉత్పత్తికి బదులు ఫాక్టరీల బయట కానీ, లేక కుటీర పరిశ్రమలకు లేదా కమిషన్ ఆధారిత ఉత్పత్తి విధానాలకు మారుతున్నట్లు సూచిస్తున్నాయి (బ్రెమన్ 2001; శ్రీవత్సవ 2012, స్వామినాథన్ 2012). సామూహిక బేరమాడే శక్తి ఉన్న సంఘటితమైన కార్మిక వర్గానికి కూడ అధికారం దూరమయ్యే రాజకీయ, ఆర్థిక తరుణంలో, తమ ఆర్థిక హక్కులను కోల్పోయిన కార్మికులు, ఏ రకంగా తమ హక్కులను తిరిగి సంపాదించుకునే ప్రయత్నం చేసారన్నది, ఈ వ్యాసంలో అధ్యయనం చేసే ప్రయత్నం జరుగుతుంది.

అగర్‌వాలా (2013), భారతదేశంలోని వర్గ వ్యవస్థలో అట్టడుగున ఉన్నవారిని 'అనియత లేదా అనధికారిక శ్రామికులు' గా నిర్వచిస్తారు. వీరిలో ఒప్పంద కార్మికులు (కాంట్రాక్ట్ కార్మికులు), అనియత (ఇన్‌ఫార్మల్) సంస్థల్లో పనిచేసే క్రమబద్ధంగా నియమితులైన కార్మికులు (రెగ్యులర్), క్రమానుసారంగా పనిచేసే సంస్థల్లో (ఫార్మల్) నియమితులైన ఒప్పంద కార్మికులు కనిపిస్తారు. వీరికి ప్రత్యేక నిపుణతలు లేకపోవటం, క్రమబద్ధమైన ఒప్పందాలు లేకపోవటం వలన పని పరిస్థితులు అభద్రతతోను, నియంత్రణ లేనివిగా ఉండి, దోపిడీకి గురికావటానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ పరిశోధనా వ్యాసం, తమిళనాడు శ్రామిక మార్కెట్ అట్టడుగు స్థాయిలో అనియత శ్రామికులైన రెండు వృత్తి సమూహాలకు సంబంధించిన అంశాలను చర్చిస్తుంది. వీరు (ఎ) ఆహార ఉత్పత్తి పరిశ్రమలో పనిచేసే మహిళా కార్మికులు (బి) ఉప్పు తయారీ పరిశ్రమలో పనిచేసే స్త్రీ, పురుష కార్మికులు,[1] ఉప ఒప్పందాలపైన (సబ్ కాంట్రాక్టింగ్) ఆధారపడి చేయటం ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గించుకోవటం, కార్మికుల బాగోగులకు బాధ్యత వహించాల్సిన అవసరం లేకపోవటం అనేవి ఈ రెండు పరిశ్రమల ప్రత్యేక లక్షణాలు.

**'గుప్తంగా ఉండే' యజమానులు, 'అదృశ్య కార్మికులు: అప్పడాల తయారీ పరిశ్రమ అధ్యయనం**

చెన్నై ఉత్తర భాగంలో ఉండే ఒత్తెరీ, పెరంబూర్‌లలో, తక్కువ ఆదాయం పొందే కార్మిక వర్గం నివాస ముండే ప్రాంతాలలో అప్పడాల తయారీ పరిశ్రమ స్థాపించబడి ఉంది. ఈ పరిశ్రమలో అప్పడాలు తయారు చేసే 75 యూనిట్లు, సుమారు 1500–2000 వరకు కార్మికులను (ఎక్కువ శాతం మహిళలు), ఒక్కొక్క యూనిట్‌లో సగటున 5 నుంచి 20 మందిని నియమిస్తాయి. 1950లలో కేరళ నుంచి వచ్చిన వ్యవస్థాపకులు, ఉత్తర చెన్నైలో అప్పడాల వ్యాపారం ప్రారంభించి, స్థానిక దుకాణాలకు అమ్మకాలు చేయటం మొదలుపెట్టారు. గడిచిన కొన్ని దశాబ్దాలుగా బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యకలాపాలు వృద్ధి చెంది, బిందు, అంబిక, మాన్ మార్క్, పాపులర్ అప్పడమ్ వంటివి తమ ఉత్పత్తులు ఎగుమతి చేస్తూ మార్కెట్‌లో ప్రధాన సంస్థలుగా స్థిరపడ్డాయి. 1950ల నుంచి, 1980ల ప్రారంభం వరకు కంపెనీలు నేరుగా స్వంత వ్యాపారం చేసేవి. పురుష కార్మికులను నియమించి, వారికి నెలసరి వేతనాలు చెల్లించేవి. 1981లో వేతనాలు పెంచాలనే డిమాండ్‌తో కార్మిక సంఘాలు చేసిన సమ్మెను పురస్కరించుకుని, ఈ పరిశ్రమలో ముఖ్యమైన మార్పు జరిగింది. సమ్మె ముగిసిన తరువాత, కంపెనీలు వేతన చెల్లింపులలో పీస్ రేటు (తయారైన వస్తువుల బట్టి చేసే చెల్లింపులు) పద్ధతిని అవలంబించి, కార్మిక చట్టాలు, కనీస వేతన చట్టాల అమలు నుండి తప్పించుకోవటం కోసం, క్రమంగా మహిళలను నియమించటం మొదలుపెట్టారు. పరిశ్రమలో మహిళా కార్మికులను నియమించటం, పీస్‌రేట్ పద్ధతిలో వేతనాలు చెల్లించటం, పరిశ్రమను పురుష కార్మికులు వదలి వెళ్ళటం, వారికి ఎక్కువ వేతనాలకి ఉపాధి అవకాశాలుండడం వంటి పరిణామాలతో పాటు, అసలు కంపెనీకీ, కార్మికులకు మధ్య యూనిట్ యజమానులు అనే ఒక కొత్త వర్గం ఏర్పడింది.

పరిశ్రమలో కార్మికులు అధిక శాతం మహిళలైతే, యూనిట్ యజమానులు సాధారణంగా పురుషులుగానీ, భార్యాభర్తలు గాని ఉండటం చూడవచ్చు. యూనిట్ యజమాని అప్పడాల కంపెనీ నుంచి, ముడిపదార్థం (పిండి బస్తాలు) సేకరించి, అద్దెకు తీసుకున్న ఇంట్లో (వారి ఇల్లు కూడా అయి వుంటుంది), ఇరుగు పొరుగు కాలనీల నుండి స్త్రీలను నియమించి, అప్పడాల తయారీని పర్యవేక్షిస్తూ, ఉత్పత్తి అయిన వాటిని కంపెనీకి డెలివర్ చేస్తాడు. ఉపాధి కోరుకున్న స్త్రీలకు, తమ ఇంటి పనులు, పిల్లల పోషణ చేసుకుంటూ ఇది చేసుకోగలిగే పనిగా కన్పించింది. ఇంటికి సమీపంలో ఉండే పని స్థలాలు, అనుకూలమైన పని సమయాలు, యూనిట్‌లలో ఏర్పడే బంధుత్వాలతో కూడిన సామాజిక సంబంధాలు కలిసి తమ కుటుంబాలలో పురుషులను, కుల పెద్దలను ఒప్పించి వేతనంతో కూడిన పనిలో ఈ స్త్రీలు కొనసాగటానికి సహకరించాయి. ఈ యూనిట్‌లలో పని చేసే స్త్రీలు పిండి కలుపుతూ తగిన పరిమాణంలో తీసుకుని అప్పడాలు వత్తటం, పొడి పిండి సహాయంతో వాటిని వెడల్పుగా చేయ్యటం, ఆరటానికి పరచిపెట్టటం, ఈ పనులన్నింటినీ, తమ వెంట తీసుకుని వచ్చిన పసి పిల్లలను చీరతో చేసిన ఉయ్యాలలో పడుకోబెట్టి చూసుకుంటూ చేస్తారు.

ఉద్యోగావకాశాలు స్థానికంగా దొరకటం ముఖ్యమైన విషయం అయినప్పటికీ, వారికి ఎగుమతి వ్యాపారం ద్వారా లాభాలు సంపాదించుకుంటున్న తమ ప్రాథమిక యజమానులైన అప్పడం కంపెనీలని బాధ్యులుగా చేయటానికి, సామూహికంగా బేరమాడటానికి, ఇది ప్రతిబంధకం కాలేదు. 2013లో సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు)[2] కు అనుబంధంగా పనిచేసే అప్పడం కార్మిక సంఘం, అప్పడం కంపెనీ పైన, ముడి పదార్థాలు ఇచ్చి, తయారైన అప్పడాలను స్వీకరించే సంస్థ అయి ఉండీ ఉప కాంట్రాక్టుల ద్వారా కార్మికులని నియమిస్తోందనీ, కాబట్టి వారిని కార్మికులుగా

గుర్తించి, తగిన కార్మిక ప్రయోజనాలను చెల్లించవలసిందిగా, కార్మిక న్యాయస్థానంలో కేసు వేసింది. దీనికి సమాధానంగా తాము అప్పడాల 'వాస్తవమైన' ఉత్పత్తిదార్ల నుంచి, టోకున అప్పడాలు కొనుగోలు చేసే కంపెనీలమనీ, కార్మిక సంక్షేమం తమ బాధ్యత కాదనీ వాదించాయి. ఈ కేసు కార్మిక న్యాయస్థానంలో స్తబ్దంగా ఉండి పోయింది. అయినప్పటికీ, కార్మిక సంఘం కార్మికులకు సంవత్సరానికొకసారి వేతన వృద్ధిని సాధించ గలిగింది. అప్పడం కార్మిక సంఘం, ప్రతి సంవత్సర ప్రారంభంలో వేతన పెంపుదలకు పిటిషను వేసేది, అంతర్లీనంగా ఈ ప్రతిపాదన స్వీకరించబడకపోతే, సమ్మె చేస్తామనే హెచ్చరికతో. 1981, 2013, 2014 సంవత్సరాలలో పెద్ద స్థాయిలో సమ్మెలు నిర్వహించబడ్డాయి. కార్మిక సంఘం ఇచ్చిన సమ్మె పిలుపుకు, రోజువారి వేతనాలు లేకపోతే గడవని వారు మినహాయించి 75-90 శాతం స్త్రీ కార్మికులు స్పందించేవారు. ఆసక్తికరంగా, చిన్న యూనిట్లు ఈ ప్రతిపాదనకు అనుకూలంగా స్పందించటం వలన, పెద్ద యూనిట్లకు స్పందించటం తప్పనిసరి అయ్యింది. సమ్మె వలన పెద్ద యూనిట్లతో పోటీ పడలేని చిన్న యూనిట్లు, తమ వ్యాపారం దెబ్బ తింటుందేమోననే భయంతో ముందుగా స్పందించేవి. సమ్మె కాలంలో, పెద్ద యూనిట్లు తమ వద్ద గోదాములలో నిల్వ ఉన్న సరుకుతో వ్యాపారం కొనసాగించేవి. చిన్న యూనిట్లకు, పెద్ద యూనిట్లకు మధ్య ఉన్న పోటీ వలన అప్పడం పరిశ్రమలోని కార్మికులకు అనుకూలంగా కార్మిక సంఘాలు వేతన చర్చలు చేయటానికి అవకాశం దొరికింది.

**నిజమైన యజమాని ఎవరో చెప్తారా? ఉప్పు బట్టీలలో కార్మిక సంబంధాలు**

తమిళనాడు ఉడల్ ఉజైప్పు తొజిలాలర్ సంఘం (మాన్యువల్ కార్మికుల లేదా శారీరక శ్రమ చేసే కార్మికుల సంఘం) రాజకీయ పక్షాలకు అనుబంధం కాని స్వతంత్ర కార్మిక సంఘం. ఈ సంఘం, 1990ల నుండి, అట్టడుగున ఉండే అసంఘటిత కార్మికులను సంఘటితం చేయటంలో నిమగ్నమై ఉంది. తమిళనాడు విరుపురం జిల్లాలోని మరక్కణం పంచాయతీలో సముద్రతీరంలో ఉప్పు బట్టీలలో పనిచేసే 5000 మంది కార్మికులలో సుమారు 1000 మందిని ఈ సంఘం సంఘటితం చేయగలిగింది. బట్టీలలో అధిక శాతం కార్మికులు షెడ్యూల్డు కులాలకు చెందిన వారు. ఈ సంఘంలో 75 శాతం మంది మహిళలు. మరక్కణంలోని ఉప్పు బట్టీలు కేంద్ర ఉప్పు కమిషన్‌కు అనుబంధంగా ఉన్నప్పటికీ, ఉప్పు తయారీ మొత్తం ప్రైవేటు కంపెనీలకు కౌలుకు ఇవ్వబడింది. ఈ కంపెనీలు పనిని సబ్ కాంట్రాక్టర్లకు అప్పచెప్పే, వీరు కార్మికుల వేతనాలను నిర్ణయిస్తారు. వీరు నియమించే బ్రోకర్లు (వీరిని కంగానీ అని పిలుస్తారు) కార్మికులను నియమించటం, పర్యవేక్షించటం, వేతనాలు చెల్లించటం వంటి పనులు చేస్తారు. ప్రతి కంగానీ ఆధ్వర్యంలో సుమారు 200 మంది కార్మికులు (వారి కుటుంబాలతో కలిసి) పనిచేస్తారు. ఇన్ని రకాల స్థాయిలలో వ్యవహరించాల్సి రావటం వలన, కార్మికుల ప్రయోజనాల కోసం గానీ, సౌకర్యాల విషయంలోగానీ, ప్రైవేటు కౌలు కంపెనీలతో బేరమాడటం వలన పెద్ద ఉపయోగం లేదని, మాన్యువల్ కార్మిక సంఘం భావించింది. వీరి విషయంలో తమకేమీ బాధ్యత లేదనీ, వీరికి సంబంధించిన బాధ్యత కేంద్ర ఉప్పు కమిషన్ దేననీ రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది.

ఈ పరిస్థితులలో, వేసవి కాలంలో దాహం తీర్చుకోవటానికి కార్మికులు ఉప్పు నీరు తాగుతున్నారనే విషయాన్ని గమనించి, మంచి నీటి సరఫరా కావాలని కోరుతూ ఉప్పు కమిషన్‌కు మాన్యువల్ కార్మికుల సంఘం ప్రతిపాదన తీసుకుని వెళ్ళింది. కార్మిక సంఘం చాలాసార్లు ఆందోళన చేసి, పిటిషన్లు పెట్టిన తరువాత, ఉప్పు కమిషన్ మంచి నీటి సరఫరా నిమిత్తం నిధులు జారీ చేసింది. ఉప్పు బట్టీలకు చిన్న నీళ్ళ టాంకుల ద్వారా, గొట్టాల ద్వారా, మంచి నీరు సరఫరా చేయటం స్థానిక పంచాయతీ బాధ్యత. నీళ్ళ గొట్టాలు నిర్మించిన తరువాత, ఒక పంచాయితీ వార్డు సభ్యుడు ఈ పథకం అమలును అడ్డుకున్నాడని ప్రతీతి. కేంద్ర ఉప్పు కమిషన్ ముందు, కార్మిక సంఘం ఉంచిన ఇతర డిమాండ్లు

సంవత్సరంలో ఆరు నెలల కాలం కార్మికులకు పని ఉండదు కాబట్టి (వర్షా కాలంలో, ఉప్పు బట్టీలలో నీళ్ళు నిల్వ ఉండటం వలన) వీరికి నిరుద్యోగ భీమా ఇవ్వటం, ఉప్పు బట్టీలలో పనిచేసే వారికి విశ్రాంతి గదులు, క్రెష్‌లు ఏర్పాటు చేయటం, కార్మికుల వైద్యానికయ్యే ఖర్చులు, వారి పిల్లల విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం చెయ్యటం. మాన్యువల్ కార్మిక సంఘం మరక్కణం పట్టణ పంచాయతీని, కార్మికులకు షెడ్యూల్డు కులాల కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన పథకాల కింద నివాస గృహ సౌకర్యాలు కల్పించమని పదే పదే అభ్యర్థించింది. ఉప్పు బట్టీ కార్మికులు వారి కుటుంబాలతో కలిసి నివాసం ఏర్పరుచుకున్న ఒక దేవాలయానికి చెందిన స్థలంపైన వారికి హక్కుపత్రాలు ఇచ్చినట్లయితే వారు ఆ హక్కును వినియోగించుకుని వారి తదనంతరం వారి వారసులకు బదిలీ చేయటానికి అవకాశం ఉంటుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే, మాన్యువల్ కార్మికుల సంఘం, కార్మికుల పని పరిస్థితులు మెరుగుపరచడానికి చేస్తున్న ప్రయత్నం దీర్ఘ కాలికమయిందే కాక, స్థానిక పంచాయతీ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో, ప్రైవేటు యజమానులతో వ్యవహరించాల్సి రావటం వలన, సంక్లిష్టమయ్యింది కూడా. గుర్తించాల్సిన విషయం ఏమిటంటే ఈ వ్యవస్థలలో ఏవీ కార్మికుల సంక్షేమానికి బాధ్యత స్వీకరించటానికి ఇష్టపడలేదు. ఒక్కొక్కసారి కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, అవి కార్మిక సంఘాలు క్షేత్రస్థాయిలో కార్మికుల ద్వారా వత్తిడి చేసినప్పుడు మాత్రమే.

**ముందున్నది ముళ్ళబాట**

ఉద్యోగాలకు హామీలేని తాత్కాలిక కార్మికుల సంక్షేమం, పని పరిస్థితులు మెరుగు పరచే చర్యలు చేపట్టమని డిమాండు చేయటం, ముఖ్యంగా, ఉప ఒప్పందాలతో కూడుకుని ఉండే పని స్థలాల విషయంలో, కార్మికులకి, వారి సంఘాలకి అత్యంత కఠినమైనదని చెప్పటానికి రెండు క్షేత్రస్థాయి అధ్యయనాలని చర్చించాము. అప్పడం పరిశ్రమలోని కార్మికులు వేతనాల పెంపు సాధించుకోవటానికి కారణం మార్కెట్‌లో ఉండే పోటీయేగానీ, ప్రభుత్వం జోక్యం చేసుకోవటం వలన కాదు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే కార్మిక న్యాయస్థానాలు, కార్మికులూ కూడ వనరులు లేక నిరుత్సాహ పడిపోయిన ఈ తరుణంలో, సమ్మెలు, పోరాటాల ద్వారా మాత్రమే ఏదైనా సాధించగలమనేది, కార్మిక సంఘాల అభిప్రాయం. అయితే సంఘంలో పనిచేసే మహిళ మాటల్లో 'మేము ఒక నెలరోజులు సమ్మె చేస్తే 100 అప్పడాలకు 50 పైసలు వేతనం పెరుగుదల సాధించాము. ఆ సమయంలో మేము, మా కుటుంబాలు చాలా అవస్థ పడాల్సివచ్చింది.' మాన్యువల్ కార్మికుల సంఘం సమావేశాలకు ఉప్పు బట్టీల కార్మికులు ఆలస్యంగా రావటం, ఒక్కోసారి రాకపోవటం వంటివి జరుగుతున్నప్పుడు, రాష్ట్ర స్థాయి నాయకులకు స్థానిక నాయకులను ప్రేరేపించటం సవాలుగా మారింది. మరక్కణంలోని కార్మిక సంఘానికి చెందిన 15 స్థానిక బ్రాంచిలలో కార్యకర్తలందరు మహిళలే. పోరాటాలలో పురుషులు చాలా తక్కువ సంఖ్యలో పాల్గొనేవారు. కార్మికుల డిమాండ్ల పట్ల స్థానిక అధికారుల నిర్లిప్త వైఖరి, అసలు బాధ్యులెవరో తెలుసుకుని వారిపైన కార్మిక సంఘాలు బాధ్యత పెట్టలేక పోవటం వలన పరిస్థితి అలాగే కొనసాగింది.

భద్రత లేని, అనిశ్చితమైన ఉపాధి ఒప్పందాలతో పని చేస్తున్నప్పటికీ, సంఘటితంగా ఉంటూ పోరాట కార్యాచరణ ద్వారా కార్మికులు కొన్ని రాయితీలు సాధించుకోగలరని పైన వివరించిన అధ్యయనాల ద్వారా తెలుస్తోంది. అయితే నయా ఉదారవాద పాలకులు, 'అదృశ్యంగా' ఉండి వ్యవహరించే యజమాని (వారు ప్రభుత్వమైనా, ప్రైవేటు యజమాని అయినా) బాధ్యత లేకుండా వ్యవహరించినప్పుడు, వారిని జవాబుదారుగా నిలబెట్టడానికి సిద్ధంగా లేరు. రాజ్యమూ, పెట్టుబడిదారూ ఒకటై ఉత్పత్తి సంబంధాలను భంగం చేయటానికి కానీ, సవాలు చేయటానికి గానీ సిద్ధంగా లేని సందర్భంలో ప్రతికూలమైన ఉత్పత్తి సంబంధాలలో చిక్కుకున్న అనధికారిక కార్మికులు, వారితో అనుబంధం కలిగిన వారి భవిష్యత్తూ ముళ్ళబాటే.

అనువాదం: **పి మాధవి**

**పి మాధవి** ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత కామర్స్ అధ్యాపకులు

**కె కల్పన** చెన్నైలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో హ్యుమానిటీస్ మరియు సోషల్ సైన్సెస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్

ఈమెయిల్ *mythkalpa@gmail.com*


ఈ వ్యాసంలో పేర్కొన్న పుస్తకాలు, పరిశోధనా పత్రాలు, ఇతర డాక్యుమెంట్ల వివరాలు ఇదే బ్రాడ్‌షీట్‌లో ఇంగ్లీషులో ఉన్న వ్యాసం చివర లభిస్తాయి.




Work 1 Collage: printed images and water colours. Artist: Lekha Narayanan (na.lekha@gmail.com)



Work 2 Collage: printed images and water colours. Artist: Lekha Narayanan (na.lekha@gmail.com)


OXFORD INDIA PAPERBACKS
Women Writing in India
Volume II
The Twentieth Century
edited by
Susie Tharu and K. Lalita


OXFORD
INDIA PAPERBACKS
Women Writing in India
Volume I
600 BC to the Early Twentieth Century
edited by
Susie Tharu and K. Lalita